


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 289

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

గురువారం 9-1-2025



స్పృహ కోల్పోయిన మహిళకు సీపీఆర్ చేస్తున్న దృశ్యం

ఏడుకొండలవాడా..

ఎంత ఘోరం.. ఎంత ఘోరం



ఎవరి నేరమిది.. ఎంతటి పాపమిది?

వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో తొక్కిసలాట

ఆరుగురి మృతి

పదుల సంఖ్యలో భక్తులకు గాయాలు

- తిరుపతిలో టోకెన్ల కేంద్రాల వద్ద ఉదయం నుంచే పోటెత్తిన లక్షలాది భక్తులు
- రాత్రి 8.35 గంటలకు ఒక్కసారిగా గేట్లు ఓపెన్.. దూసుకెళ్లిన భక్తజనం
- క్యూలైన్ల నిర్వహణలో చేతులెత్తేసిన అధికారులు.. అడుగడుగునా నిర్లక్ష్యం
- ఫలితంగా తోపులాట.. నలిగిపోయిన వృద్ధులు, చిన్నారులు, మహిళలు
- రుయా, స్విమ్స్ ఆసుపత్రులకు క్షతగాత్రుల తరలింపు
- భక్తుల ఆర్తనాదాలతో దద్దరిల్లిన ఆధ్యాత్మిక నగరం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందంటున్న వైద్యులు

2లో

గోవింద నామాలతో ప్రతిధ్వనించాల్సిన చోట మృత్యు ఘోష వినిపించింది.. ఏడుకొండలవాడి సాక్షిగా భక్తుల ఆర్తనాదాలతో ఆధ్యాత్మిక నగరి దద్దరిల్లింది.. అరుపులు, కేకలు, ఆర్తనాదాలతో తిరుపతి భీతిల్లింది.. చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరయ్యారు.. మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. కిందపడ్డ వాళ్లను తొక్కుకుంటూ వెళ్తున్న వారు కొందరు.. ప్రాణ భీతితో తోసుకొచ్చేసిన వారు మరికొందరు.. వెరసి కనీవినీ ఎరుగని రీతిలో తొక్కిసలాటకు కారణమైంది.. పడిపోయిన వారిని బతికించుకోవాలని ఆయా కుటుంబాల తాపత్రయం గుండెలు పిండేసింది.. ఆ దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి.

గతంలో గోదావరి పుష్కరాలు.. ఇప్పుడు వైకుంఠ ఏకాదశి..! నాడు పబ్లిసిటీ పిచ్చి.. నేడు అలవిమాలిన అలసత్వం! సందర్భం ఏదైనప్పటికీ ప్రభుత్వం నిలువెత్తు నిర్లక్ష్యానికి అమాయకులు బలి అవుతున్నారు! కోట్లాది మంది తమ జీవిత కాలంలో ఒక్క అవకాశం కోసం ఆరాట పడే వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల జారీ ఏర్పాట్లలో సర్కారు వైఫల్యం కారణంగా పెను తొక్కిసలాట చోటు చేసుకుని ఆరుగురు ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో భక్తులు తీవ్రంగా గాయపడ్డారు.



తోపులాటలో భక్తుల మధ్య చిక్కుకుపోయి తీవ్ర భయాందోళనకు గురై విలపిస్తున్న చిన్నారి

తిరుపతి ఘటనపై ప్రధాని మోదీ, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

ఒక్కసారిగా గేటు తెరవగానే వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ కోసం కౌంటర్ వద్దకు దూసుకెళ్తున్న భక్తులు.. తోపులాటతో పడిపోతున్న మహిళ



తోపులాట నుంచి బయట పడడానికి విఫలయత్నం చేస్తున్న ఓ యువకుడు, మహిళలు



కార్చిచ్చు గుప్పిట్లో లాస్ ఏంజెలెస్

వాడీవేడీగా 'జమిలి' జేపీసీ భేటీ

నేనొచ్చేలోపే బందీలను వదిలేయండి

హమాస్‌కు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

- వివరాలు 6లో ▶

మరో 20 ఏళ్లు పవర్‌లో ఉండాలి

సీఎం సహా అంతా బాగా పనిచేస్తేనే అది సాధ్యమవుతుంది

నేతలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ దిశా నిర్దేశం

మంత్రులందరూ నెలకోసారి జిల్లాలకు వెళ్లాలి

- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ
- త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, కేసీ వేణుగోపాల్, దీపాదాస్‌మున్షీ, మహేశ్‌కుమార్‌గౌడ్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఈ ఐదేళ్ళే కాకుండా మరో 20 ఏళ్ల పాటు అధికారంలో ఉండేలా పనిచేయాలని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించారు. సీఎంతో సహా రాష్ట్ర కేబినెట్, టీపీసీసీ అధ్యక్షుడు, అన్ని స్థాయిల్లోని పార్టీ నేతలు కలసికట్టుగా పనిచేసినప్పుడే ఇది సాధ్యమవుతుందని చెప్పారు. బుధవారం సాయంత్రం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అధ్యక్షతన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాలు, కార్యకలాపాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పనితీరును అభినందించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ప్రశంసించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కొంతమేర వెనుకబడ్డామని చెప్పారు. ప్రజలను విస్తృతంగా కలవడం ద్వారా ప్రభుత్వం చేస్తున్న మంచిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లవచ్చునని సూచించారు. రాష్ట్ర మంత్రులు విధిగా నెలకోసారి జిల్లాలకు వెళ్లి ప్రజాదర్బార్ నిర్వహించి, పార్టీ కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడాలని, వారి అభిప్రాయాలు తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వ పనితీరును, కార్యక్రమాలను వివరించాలని సూచించారు, పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయం ఉండాలని అన్నారు. కార్యకర్తలను, క్షేత్రస్థాయి నాయకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను పీఏసీ సభ్యులందరూ తీసుకోవాలని కోరారు. గ్రామ, మండల, బ్లాక్, జిల్లా,

మిగతా 12వ పేజీలో ▶



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

హరిత హబ్‌గా విశాఖ..

ఏయూ బహిరంగ సభలో ప్రధాని మోదీ

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రంగా వైజాగ్

- దేశంలో నెలకొల్పే 2 ప్లాంట్లలో ఒకటి ఏపీలో..
- రైల్వే జోన్ కల నెరవేరుతోంది
- ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తో కలిసి రోడ్ షో

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: 'గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో విశాఖ ప్రపంచంలోనే కీలక ప్రాంతంగా మారనుంది. ఇక దేశంలో నెలకొల్పుతున్న మూడు బల్క్ డ్రగ్ పార్కుల్లో ఒకటి ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటు కానుంది. తద్వారా ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయి. ఈ రోజు రూ.2 లక్షల కోట్లకుపైగా విలువైన పెట్టుబడులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నాం. రైల్వే జోన్ ఏర్పాటు కల కూడా నెరవేరుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నా అభిమానాన్ని చూపించే అవకాశం వచ్చింది..'అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బుధవారం విశాఖలోని ఏయూలో జరిగిన ప్రజా వేదిక బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. అంతకుముందు వెంకటాద్రి వంటిల్లు నుంచి ఏయూ గ్రౌండ్స్ వరకూ ఓపెన్ టాప్ వాహనంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో కలసి ప్రజలకు అభివాదం చేస్తూ రోడ్ షో నిర్వహించారు. ''ఆంధ్రా ప్రజల ప్రేమ,

మిగతా 12వ పేజీలో ▶

కేఎఫ్ బీర్లు బంద్

- బేసిక్ ధరలు పెంచనందున తెలంగాణకు కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు యూబీ కంపెనీ ప్రకటన
- స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన సమాచారంతో ఎక్సైజ్ వర్గాల్లో అలజడి

72% తెలంగాణ మార్కెట్‌లో కింగ్‌ఫిషర్ బీర్ల బ్రాండ్ వాటా


ధరల పెంపుపై ఒత్తిడి తేవడం పద్ధతి కాదు

మంత్రి జూపల్లి

16లో




ఇదండీ సంగతి



ఎన్ని ఫిర్యాదులొచ్చినా మిమ్మల్ని వెతకడానికి ఎవరూ సాహసించరు సార్!!

న్యాయవాది వెళ్లొచ్చు

అయితే ఎలాంటి జోక్యం చేసుకోవద్దు!



- విచారణ సమయంలో తన వెంట న్యాయవాదిని కూర్చోనివ్వాలని కోరిన కేటీఆర్
- దర్యాప్తు చేసే గదిలో పిటిషనర్, అధికారి మాత్రమే ఉండాలన్న న్యాయమూర్తి
- పక్కనే ఉన్న లైబ్రరీ గది నుంచి న్యాయవాది దర్యాప్తును వీక్షించవచ్చని వెసులుబాటు
- అధికారుల తీరు సరిగా లేకుంటే మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని వెల్లడి.. గురువారం కేటీఆర్ వెంట రామచందర్‌రావును అనుమతించాలని ఆదేశం
- విచారణ 20వ తేదీకి వాయిదా

ఫార్ములా–ఈ రేసు కేసులో కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్

ఫార్ములా–ఈ కార్ల రేస్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు హైకోర్టులో మరోసారి నిరాశే మిగిలింది. ఏసీబీ విచారణ సమయంలో తన వెంట న్యాయవాదిని అనుమతించాలని కేటీఆర్ పిటిషన్ దాఖలు చేయగా.. న్యాయస్థానం పాక్షికంగా అనుమతించింది. కేటీఆర్ వెంట న్యాయవాది రామచందర్‌రావు విచారణకు వెళ్లవచ్చని, కానీ కేటీఆర్ పక్కన కూర్చోవద్దని పేర్కొంది. పక్కనే ఉన్న మరో గదిలో నుంచి న్యాయవాది వీక్షించవచ్చని స్పష్టం చేసింది. పిటిషనర్ (కేటీఆర్)కు తన న్యాయవాది కనిపించకుంటే మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది. ఏసీబీ అధికారుల దర్యాప్తును ఆడియో, వీడియో

మిగతా 3వ పేజీలో ▶

నా విధులు నిర్వర్తించా..

- ఫార్ములా–ఈ కేసు ఏసీబీ విచారణలో ఐఏఎస్ అర్వింద్‌కుమార్
- ఎలాంటి అవకతవకలకు పాల్పడ లేదని వివరణ
- ఒప్పందం మొదలు స్పాన్సర్ తప్పుకోవడం వరకు ప్రశ్నలు గుప్పించిన అధికారులు.. విచారణ వీడియో రికార్డింగ్.. వాంగ్మూలం నమోదు

నిధుల బదిలీపైనే ప్రశ్నల వర్షం!


- ఫార్ములా–ఈ కేసులో హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిని విచారించిన ఈడీ అధికారులు

- వివరాలు 3లో

చంద్రయాన్-4, గగన్‌యాన్‌పై ప్రత్యేక దృష్టి

త్వరలో మరిన్ని ముఖ్యమైన మిషన్‌లు

ప్రముఖ రాకెట్ సైంటిస్టు డాక్టర్ వి.నారాయణన్



ఇస్రో నూతన చైర్మన్‌గా నియమితులైన నారాయణన్

చంద్రయాన్-4, గగన్‌యాన్ వంటి ప్రయోగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు ఇస్రో నూతన చైర్మన్‌గా నియమితులైన ప్రముఖ రాకెట్ సైంటిస్టు డాక్టర్ వి.నారాయణన్ చెప్పారు. స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ ప్రయోగం గురువారం జరగబోతోందన్నారు. ప్రస్తుతం ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రయోగం గగన్‌యాన్ అని వెల్లడించారు. చంద్రయాన్-4లో భాగంగా చంద్రుడి దక్షిణ ధ్రువం నుంచి నమూనాలు సేకరించి తీసుకురావాలని సంకల్పించామని చెప్పారు.

6లో






తొక్కిసలాటలో గాయపడిన వారికి సపర్యలు.. చికిత్స నిమిత్తం తరలిస్తున్న దృశ్యాలు

ఏడు కొండలవాడా.. ఎంత ఘోరం.. ఎంత ఘోరం

వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో తొక్కిసలాట.. ఆరుగురి మృతి, పదుల సంఖ్యలో భక్తులకు గాయాలు

సాక్షి తిరుపతి నెట్‌వర్క్: చంద్రబాబు ప్రభుత్వ పెనునిర్లక్ష్యం మరోసారి అమాయక భక్తుల ప్రాణాలను బలిగొంది. పవిత్ర తిరుమల–తిరుపతి క్షేత్రాన్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం భ్రష్టుపట్టించిన చంద్రబాబు దుర్మార్గం ఆరుగురు భక్తుల ప్రాణాలను హరించింది. 30 మందికిపైగా తీవ్రంగా గాయపడేలా చేసింది. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వ బాధ్యతారాహిత్యం శ్రీవారి పుణ్యక్షేత్రం తిరుపతిలో భక్తుల ప్రాణాలతో చెలగాటమాడింది. చెల్లాచెదురుగా పడిన అమాయక భక్తుల మృతదేహాలు.. తీవ్రగాయాలపాలైన భక్తుల ఆర్తనాదాలు.. వేలాది మంది భక్తుల హాహాకారాలతో తిరుపతి నగరం హృదయ విదారకంగా మారిపోయింది. రాజకీయ ప్రచారం కోసం, నిరాధార ఆరోపణలతో ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యల కోసం చంద్రబాబు తిరుమల–తిరుపతి దేవస్థానాలు(టీటీడీ) వ్యవస్థను భ్రష్టు పట్టించడమే ఇంతటి పెను విషాదానికి దారితీసింది. ఏటా భారీగా భక్తులు తరలివచ్చే వైకుంఠ ఏకాదశికి టికెట్ల జారీ కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం కనీస మార్గదర్శకాలను గాలికొదిలేయడంతో భక్తులు బలైపోయారు. రోజుకు 75 వేల మందికిపైగా భక్తులు తరలివస్తున్నా.. ఏటా వైకుంఠ ఏకాదశి సందర్భంగా దాదాపు ఆరేడు లక్షల మంది వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటున్నా.. ఏనాడూ ఇటువంటి విషాదం సంభవించ లేదు. కేవలం చంద్రబాబు ప్రభుత్వ బాధ్యతారహిత్యంతోనే తిరుమల–తిరుపతి చరిత్రలో తొలిసారిగా తొక్కిసలాట సంభవించి మాటలకందని పెను విషాదానికి దారితీసింది.

ముమ్మాటికీ ఇది నిర్లక్ష్యమే

వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని టీటీడీ తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం కల్పించటం ఆనవాయితీ. పది రోజుల పాటు కొనసాగనున్న వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా భక్తులకు టీటీడీ టోకెన్ల జారీ ప్రక్రియ ఏర్పాటు చేసింది. తిరుపతిలో తొమ్మిది, తిరుమలలో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. పది రోజుల పాటు ఈ టోకెన్ల జారీ ప్రక్రియ కొనసాగనుంది. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం శుక్రవారం నుంచి 10 రోజుల పాటు ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరుపతి నగరంలో బైరాగిపట్టెడ ఎంజీఎం స్కూల్, ఎంఆర్‌పల్లి, శ్రీనివాసం, విష్ణునివాసం, రెండో చౌల్ట్రీ, ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, సత్యనారాయణపురం (జీవకోన) ప్రాంతాల్లో టీటీడీ టోకన్ల కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ టోకెన్లను గురువారం ఉదయం 5 గంటల నుంచి పంపిణీ చేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ విషయాన్ని భక్తులకు చేరవేయంలో టీటీడీ విఫలమైంది. దీంతో భక్తులు మంగళవారం రాత్రే తిరుపతికి పయనమయ్యారు. బుధవారం ఉదయం నుంచే తండోపతండాలుగా టోకెన్లు జారీ చేసే కేంద్రాలకు చేరుకున్నారు. ముఖ్యంగా తిరుపతి బైరాగిపట్టెడ ప్రాంతంలోని ఎంజీఎం స్కూల్‌కు చేరుకున్న భక్తులను క్యూలైన్‌లోకి అనుమతించలేదు. దీంతో సాయంత్రానికి భారీగా భక్తులు పెరిగిపోయారు. వచ్చిన వారిని వచ్చినట్లు క్యూలైన్లోకి పంపమని సూచించినా, డీఎస్పీ ఒకరు నిరాకరించినట్లు పోలీసులు చెబుతున్నారు. రాత్రి 8.35 గంటల ప్రాంతంలో అందరినీ ఒకేసారి విడిచి పెట్టమని డీఎస్పీ ఆదేశించటంతో పోలీసులు గేట్లు తెరిచారు. భక్తులు పెద్ద సంఖ్యలో క్యూలైన్లోకి ప్రవేశించటంతో తీవ్ర స్థాయిలో తొక్కిసలాట చోటు చేసుకుంది. దీంతో కింద పడిపోయిన వారిని పైకి లేపే అవకాశం లేక.. ఊపిరి ఆడక ఆరుగురు మృతి చెందారు. కింద పడిపోయిన వారిని బతికించేందుకు భక్తులు, పోలీసులు కొందరు తీవ్ర ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అదే విధంగా శ్రీనివాసం, ఇందిరా మైదానం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ కేంద్రాలకు వచ్చిన వారిని వచ్చినట్లే క్యూలైన్లోకి అనుమతించారు. సాయంత్రం అయ్యే సరికి ఒక్కసారిగా భక్తులు పోటెత్తడంతో తొక్కిసలాట ప్రారంభమైంది. శ్రీనివాసం వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందింది. మరి కొందరు గాయాలపాలయ్యారు. మృతి చెందిన వారిని, తీవ్ర గాయాలపాలైన వారిని రుయా, సిమ్స్ ఆస్పత్రులకు తరలించారు. మరణించిన వారు, తీవ్ర గాయాలైన వారిలో ఎక్కువ మంది మదనపల్లి, తమిళనాడుకు చెందిన వారు ఉన్నట్లు తెలుస్తోంది.

అన్ని కౌంటర్ల వద్ద తొక్కిసలాట

అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద బుధవారం ఉదయం నుంచి భక్తులు పడిగాపులు కాశారు. రామచంద్ర పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద భక్తులను క్యూలైన్లోకి అనుమతించే క్రమంలో తోపులాట జరిగింది. దీంతో పోలీసులు భక్తులపై లాఠీ చార్జ్ చేశారు. క్యూ లైన్‌లోకి వెళ్లే క్రమంలో జరిగిన తొక్కిసలాటలో అనేక మంది భక్తులు కిందపడిపోయారు. ఈ తోపులాటలో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నారులు ఆర్తనాదాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. తోపులాట చోటు చేసుకోవటంతో భక్తుల అరుపులు, రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.

టీటీడీ వైఫల్యం..

వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం భారీగా భక్తులు వస్తారని తెలిసినా అందుకు తగ్గ ఏర్పాట్లు చేయటంలో ప్రభుత్వం, టీటీడీ పూర్తిగా విఫలమైంది. క్యూలైన్ల వద్ద టాయిలెట్లు లేవు. దీంతో మహిళలు, చిన్నారులు నరకం అనుభవించారు. అనేక ప్రాంతాల్లో కనీసం తాగు నీరు కూడా ఏర్పాటు చేయలేదు. అన్న ప్రసాద వితరణ ఎక్కడా కనిపించలేదు. కొన్ని ప్రాంతాల్లో మాత్రం మంచి నీరు అందించి చేతులు దులుపుకున్నారు. తిరుపతిలోని రామానాయుడు స్కూల్‌లో ఒకసారిగా గేట్లు తెరవడంతో జనాలు తోసుకోవడంతో తొక్కిసలాట జరిగి 40 మంది స్పృహ తప్పి పడిపోయారు. ఇందులో అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం నరసాపురం నుంచి 360 మంది గోవిందమాల భక్తులు కాలి నడకన తిరుపతికి చేరుకున్నారు. వీరిలో ఆరుగురి పరిస్థితి సీరియస్‌గా ఉంది. వీరితో పాటు వచ్చిన బంధువులు బాధితులకు ఏమి జరిగిందోనని ఆందోళన చెందుతున్నారు. ఎటు వెళ్లాలో.. ఎక్కడికి వెళ్లాలో తెలియక స్కూల్‌కు దగ్గరలో ఉన్న పద్మావతి పార్కులో వేచి చూస్తున్నారు. ఈ స్కూల్‌లో జరిగిన తొక్కిసలాటలో మదనపల్లె, పుంగనూరు, నరసాపురం, చిత్తూరు, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు చెందిన వారు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. దారుణం జరిగిపోయాక పోలీసు బలగాలు రంగంలోకి దిగడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అప్పుడు, ఇప్పుడు ప్రచారార్భాటమే

2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా చంద్రబాబు ప్రచారార్భాటం కోసం చేసిన షూటింగ్ గిమ్మిక్కుతో 29 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం చంద్రబాబు తన రాజకీయ కక్ష సాధింపు చర్యలకు టీటీడీ వ్యవస్థను భ్రష్టు పట్టించడం అడుగడుగునా కనిపిస్తోంది. బాబుకు తోడుగా అభినవ సనాతన ధర్మ పరిరక్షకుడిగా బ్రాండ్ ఇమేజ్ కోసం తిరుపతిలో సినీ తరహాలో గిమ్మిక్కులు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా టీటీడీ వ్యవస్థను దెబ్బ తీయడంలో తానో చేయి వేశారు. దీంతో అధికార టీడీపీ కూటమి సేవలో తరిస్తే చాలు.. సామాన్య భక్తులు ఏమైపోయినా పర్వాలేదన్నట్లుగా టీటీడీ యంత్రాంగం నిర్లిప్తంగా మారిపోయింది. టీటీడీ చైర్మన్, ఈవో, తిరుమల అదనపు జేఈవో వైఖరి భక్తుల పాలిట యమపాశమైంది. వైకుంఠ ఏకాదశినాడు తిరుమలలో శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం చేసుకోవాలని ఆశించిన భక్తుల జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. ఈ ఘోరం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది శ్రీవారి భక్తులను కలచివేస్తోంది.



40 మంది వరకు అపస్మారక స్థితిలోకి..

వీరిలో ఆరుగురి పరిస్థితి విషమం.. రామానాయుడు స్కూల్‌లో దారుణం

తిరుపతి అర్బన్: తిరుపతిలోని రామానాయుడు స్కూల్‌లో బుధవారం రాత్రి ఒక్కసారిగా గేట్లు తెరవడంతో తొక్కిసలాట సంభవించి 40 మంది వరకు స్పృహ తప్పి పడిపోయారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. మొత్తం 360 మంది గోవిందమాల భక్తులు మూడ్రోజులపాటు నడిచి తిరుపతికి చేరుకున్నారు. వీరంతా అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండల నరసాపురం నుంచి వచ్చారు. వీరితో పాటు వచ్చిన బంధువులు తమ వారికి ఏం జరిగిందోనని ఆందోళన చెందుతున్నారు. ఎటు వెళ్లాలో.. ఎక్కడికి వెళ్లాలో తెలియక స్కూల్‌కు దగ్గరలో ఉన్న పద్మావతి పార్కులో తల్లడిల్లిపోతున్నారు. ముఖ్యంగా ఈ స్కూల్‌లో జరిగిన తొక్కిసలాటలో మదనపల్లె, పుంగనూరు, నరసాపురం, చిత్తూరు, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు చెందిన వారున్నట్లు సమాచారం. భక్తజనాన్ని అదుపుచేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. అయితే, ఈ చీకట్లోనే దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. పెద్దఎత్తున పర్సులు, సెల్‌ఫోన్లు, జేబులు కొల్లగొట్టారు. దారుణం జరిగిపోయాక పోలీసు రావడంతో భక్తులు మండిపడుతున్నారు.

నాడు కట్టుదిట్టంగా.. నేడు నిర్లక్ష్యంగా..

తిరుపతి సిటీ: వైకుంఠ ఏకాదశి రోజు నుంచి పదిరోజుల పాటు సామాన్య భక్తులను వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీటీడీ పటిష్ట ఏర్పాట్లుచేసింది. కానీ, నేడు కూటమి ప్రభుత్వంగానీ, టీటీడీ గానీ సామాన్య భక్తులను పట్టించుకోలేదని శ్రీవారి భక్తులు దుమ్మెత్తిపోస్తూ గత ప్రభుత్వంలో చేపట్టిన చర్యలను గుర్తుచేస్తున్నారు.

నాడు 2023 డిసెంబరు 23వ తేదీ వైకుంఠ ఏకాదశి, 2024 జనవరి 1వ తేదీ వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. 22వ తేదీ వేకువజాము 5 గంటల నుంచి టోకెన్ల జారీ ప్రారంభించారు. తిరుపతిలోని ఎనిమిది ప్రాంతాల్లో వీటిని జారీచేశారు. ఒక్కో కేంద్రంలో రోజుకు 10వేల చొప్పున పంపిణీ చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. మొత్తం పది రోజుల్లో లక్ష టోకెన్లు జారీచేశారు. ప్రతి కౌంటర్ దగ్గర సింగిల్ లైన్ క్యూలు ఏర్పాటుచేశారు. కౌంటర్ వద్ద ఒకే వ్యక్తి టోకెన్ తీసుకునేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ మేరకు కౌంటర్ల వద్ద రద్దీలేకుండా చర్యలు చేపట్టారు. అలాగే.. జారీచేసిన టోకెన్లు, మిగిలినవి పారదర్శకంగా తెలిసేలా డిస్‌ప్లే బోర్డులు పెట్టారు. దీంతో భక్తులకు సక్రమంగా సమాచారం అందేది. అలాగే.. ఒక్కో కౌంటర్ వద్ద టీటీడీ సెక్యూరిటీతోపాటు పోలీసులు సుమారు 25 మంది భద్రతా విధులు నిర్వర్తించేవారు. గంట గంటకూ టీటీడీ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించే వారు.

నేడు.. వైకుంఠ ద్వార దర్శన టోకెన్లకు తిరుపతిలోని తొమ్మిది కేంద్రాలు ఏర్పాటుచేశారు. గురువారం వేకువజాము 5 గంటలకు టోకెన్ల జారీ ప్రారంభించాల్సి ఉంది. అయితే, భక్తుల రద్దీ కారణంగా బుధవారం రాత్రి 9 గంటలకే పంపిణీ మొదలుపెట్టారు. దీనికితోడు అపరిమితంగా టోకెన్ల జారీకి టీటీడీ సన్నద్ధం కావడంతో కౌంటర్ల వద్దకు పెద్దసంఖ్యలో భక్తులు చేరుకున్నారు. అదుపు చేయలేని పరిస్థితుల్లో పోలీసులు దురుసుగా ప్రవర్తించడంతో భక్తుల మధ్య తీవ్రమైన తొక్కిసలాట జరిగింది. శ్రీనివాసం దగ్గర ఏర్పాటుచేసిన కౌంటర్ల వద్దకు భక్తులను ఒక్కసారి గుంపులుగా వదలడమే తొక్కిసలాటకు కారణంగా భావిస్తున్నారు. ఒక్కో కౌంటర్ వద్ద కేవలం ఇద్దరు ముగ్గురు పోలీసులు మాత్రమే విధులు నిర్వర్తించారు. తొక్కిసలాట జరిగాక అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకున్నారు.

చనిపోయిన వారు వీరే..

- లావణ్య స్వాతి(37) తాటిచెట్లపాలెం, విశాఖపట్నం
- శాంతి (35) కంచరపాలెం, విశాఖపట్నం
- రజని (47), మద్దిలపాలెం, విశాఖపట్నం
- మల్లిగ(50), మేచారి గ్రామం, సేలం జిల్లా, తమిళనాడు
- బాబు నాయుడు(51), రామచంద్రపురం, నరసరావుపేట
- నిర్మల (45), పొల్లచ్చి, తమిళనాడు



చికిత్స పొందుతున్న మహిళలు



ఆస్పత్రిలో హాహాకారాలు

సినిమా టికెట్ల కోసం విడిచిపెట్టినట్లు..

అందుకే తొక్కిసలాట జరిగిందంటున్న పోలీసులు..

పోలీసుల వైఫల్యమేనన్న టీటీడీ చైర్మన్

వివరాలు, వార్తలకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

తిరుపతి ఘటన కలిచి వేసింది: మోదీ



న్యూఢిల్లీ: తిరుపతిలో తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన వార్త తెలిసి ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ‘‘ తొక్కిసలాట ఘటన నన్నెంతో బాధించింది. ఆప్తులను కోల్పోయిన వారందరికీ నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు ఏపీ ప్రభుత్వం అన్ని రకాలుగా కృషిచేస్తోంది’’ అని ప్రధాని మోదీ సంతాప సందేశాన్ని ప్రధాని కార్యాలయం తన ‘ఎక్స్’ ఖాతాలో బుధవారం అర్ధరాత్రి పోస్ట్‌చేసింది.

పెను విషాదకరం: లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ సైతం స్పందించారు. ‘‘ తిరుపతిలో తొక్కిసలాట ఘటన నిజంగా పెను విషాదకరం. తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలుపుతున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి. ఈ కష్టకాలంలో అక్కడి భక్తులను శాయశక్తులా ఆదుకోవాలని, సహాయ సహకారాలు అందించాలని అక్కడి కాంగ్రెస్ కార్యకర్తలు, శ్రేణులకు సూచిస్తున్నా’’ అని రాహుల్ గాంధీ ‘ఎక్స్’ ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. తిరుపతిలో దుర్ఘటన చాలా బాధాకరమని ‘ఎక్స్’లో ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ పోస్ట్‌చేశారు.

ఏపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే దారుణం

డ్రామా గురువు చంద్రబాబు, పవన్ పాలనపై దృష్టి పెట్టాలి: మాణిక్కం ఠాగూర్

ఏపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే తిరుపతి తొక్కిసలాట ఘటన జరిగిందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘‘ప్రతిష్టాత్మకమైన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో బాధ్యతాయుతమైన నిర్వహణ ఎంతటి అత్యావశ్యకమో ఈ ఘటన నిరూపిస్తోంది. డ్రామా గురువు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు నాటకీయతపై కంటే పరిపాలనపై దృష్టి పెడితే చాలా బాగుంటుంది’’ అని ఠాకూర్ ఆగ్రహంగా మాట్లాడారు.

తొక్కిసలాటపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



సాక్షి, అమరావతి: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుపతిలో టోకెన్లు జారీ చేస్తున్న కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు మరణించడంపై మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతా పం తెలియజేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇలా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని అన్నారు. అక్కడి పరిస్థితు లను చక్కదిద్దడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సీఎం రేవంత్ విచారం



సాక్షి, హైదరాబాద్: తిరుపతిలో తొక్కిసలాట జరిగి భక్తులు మరణించిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు సాను భూతి ప్రకటించారు. గాయపడ్డ వారికి మెరుగైన సాయం అందించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. తిరుపతి తొక్కిసలాట ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ఎప్పుడేం జరిగిందంటే..

8వ తేదీ బుధవారం ఉ.5 గంటలకు..

- తిరుపతిలోని తొమ్మిది కౌంటర్లలో భక్తుల రాక ప్రారంభం
- ఉ.7.30కు 60 శాతం భక్తులతో నిండిన క్యూలైన్లు
- ఉ.8.30కు క్యూలైన్ల వద్దకు చేరుకున్న పోలీసులు
- ఉ.9.30కు పూర్తిస్థాయిలో క్యూలైన్లు నిండి ప్రవేశద్వారాల వద్ద పెద్ద సంఖ్యలో గుమికూడిన భక్తులు
- ఉ.10.30కు టీటీడీ అధికారులు మొక్కుబడిగా పర్యవేక్షించి వెళ్లిపోయారు.
- ఉ.11.30కు భక్తులు టాయిలెట్స్ కోసం, తాగునీరు, భోజనం కోసం ఇబ్బందులు పడుతూ అధికారులను నిలదీశారు.
- మ.12.30కు.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో చేరుకున్న భక్తులు
- మ.1.30కు భక్తుల తాకిడి తారాస్థాయికి చేరుకుంది.
- మ.2.30 అవుతున్నా కౌంటర్ కేంద్రాల వద్ద భక్తులను అప్రమత్తం చేయని అధికారులు
- మ.3.30కు క్యూలైన్‌లో వేచి ఉండలేక.. టికెట్లు ఎప్పుడిస్తారంటూ భక్తుల నిలదీత.. ప్రశ్నించినా పట్టించుకోని అధికారులు
- సా.4.30కు శ్రీనివాసం, బైరాగిపట్టెడి రామానాయుడు స్కూల్స్ వద్ద రాత్రి 9 గంటలకు టోకెన్లు ఇస్తారని ప్రకటన
- సా.5.30కు రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల నుంచి శ్రీనివాసం, రామానాయుడు స్కూల్ వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో కౌంటర్ వద్దకు చేరిక.
- సా.6.30కు కౌంటర్ కేంద్రాల వద్ద టీటీడీ సిబ్బంది కంప్యూటర్ల పనితీరును పరిశీలిస్తుండడంతో టోకెట్లు ఇస్తారని భక్తుల్లో ఉత్సాహం.
- రాత్రి 7.30 గంటలకు ఒక్కసారిగా కేకలు వేస్తూ భక్తులు ముందుకు సాగడంతో శ్రీనివాసం కౌంటర్ వద్ద తమిళనాడుకు చెందిన మల్లిక అనే మహిళా క్యూలైన్‌లో కిందపడిపోయింది.
- రాత్రి 7.45కు కిందపడిన మహిళపై నుంచి భక్తులు తొక్కుకుంటూ వెళ్లిపోయారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది.
- రాత్రి 8 గంటలకు మరో పదిమంది భక్తులు కింది పడిపోయారు. వారంతా గాయపడ్డారు. అప్పుడు అప్రమత్తమైన అధికారులు గాయపడ్డ భక్తులను రుయా, స్విమ్స్ అస్పత్రులకు తరలించే ప్రయత్నాలు చేశారు.
- రాత్రి 8.30కు స్పృహ కోల్పోయిన మహిళ ఆస్పత్రికి వెళ్లే మార్గం మధ్యలోనే మృతిచెందింది. అదే సమయంలో బైరాగిపట్టెడి రామానాయుడు స్కూల్ వద్ద తోపులాటలో 40 మంది కిందపడి స్పృహ కోల్పోయారు. వెనుక ఉన్న భక్తులు వీరిని తొక్కుకుంటూ వెళ్లిపోయారు.
- రాత్రి 9.10కు కిందిపడిపోయిన భక్తులను రుయా అస్పత్రికి తరలించారు. వీరిలో ఐదుగురు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గుర్తించారు.
- 9.20కు అధికారులు ఇదేమీ పట్టించుకోకుండా టోకెన్ల జారీని కొనసాగించే పనిలో పడ్డారు.

ఒక్కసారిగా తోపులాట.. కాళ్ల కింద నలిగిపోయిన భక్తులు

1


వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

ప్రాణాలు పోతున్నాయి.. లేపండంటూ హాహాకారాలు

2


వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

స్పృహ కోల్పోయినవారికి సీపీఆర్ చేసే ప్రయత్నాలు

3


వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

మీ వల్లే చనిపోయారు.. పోలీసులపై భక్తుల ఆగ్రహం

4


వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

‘రుయా’లో పట్టించుకోవట్లేదు.. తీసుకెళ్తున్నాం

5


వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

చంపేయాలనే ప్లాన్ చేసినట్టుంది..

6


వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి..

క్లుప్తంగా...

సింగరేణికి స్పెషల్ క్యాంపెయిన్ 4.0 పురస్కారం

సాక్షి, న్యూఢిల్లీ: పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఎక్కువ సంఖ్యలో ప్రదేశాలను పరిశుభ్రం చేసినందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్పెషల్ క్యాంపెయిన్ 4.0లో ఎక్కువ ప్రాంతాలను పరిశుభ్ర పరిచిన (మ్యాగ్జిమమ్ నంబర్ ఆఫ్ సైట్స్ క్లీన్డ్) విభాగంలో అవార్డు వరించింది. ఢిల్లీలో బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చింతన్ శివిర్‌లో భాగంగా మంగళవారం రాత్రి కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ బలరామ్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఇంధన అవసరాలకు బొగ్గు ఎంత అవసరమో, ఆరోగ్య భారతావనికి పరిశుభ్రత అంతే అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్, బొగ్గు శాఖ అదనపు కార్యదర్శులు రూపేందర్ బ్రార్, విస్మితా తేజ్, సింగరేణి జీఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం

- పనులు సరిగా చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఆవాసం నుంచి గ్రామపంచాయతీ.. అక్కడ నుంచి మండలానికి, జిల్లా కేంద్రానికి రహదారులు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. దీనికి సంబంధించి రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణంతో పాటు రోడ్ల నిర్వహణకు రూ.1,600 కోట్లు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. 30 మెట్రిక్ టన్నుల వాహనాలు కూడా నడిచేలా రోడ్ల సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఇంజనీర్లు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. బుధవారం ఎర్రమంజిల్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో మంత్రి.. గ్రామీణ ప్రాంత ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యతపై రాజీ పడొద్దని, పనులు సరిగా చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని, నాసిరకం పనులకు ఎన్‌ఓసీలిచ్చే అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బిల్లులు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటాం

రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ

సాక్షి, హైదరాబాద్: తమ పెండింగ్ బిల్లులు చెల్లించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ హెచ్చరించింది. ఈ బిల్లుల కోసం మాజీ సర్పంచులు, వారి కుటుంబాలు తల్లడిల్లుతున్నందున.. వీటిని చెల్లించాకే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గ్రామ పంచాయతీలకు నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలని, కులగణాంకాలు పూర్తయ్యాకే రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు నిర్వహించాలని కోరింది. బుధవారం ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్‌కు జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అంతకుముందు మాజీ సర్పంచులు అక్కడే నిరసన తెలిపి, తమ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాంపాక నాగయ్య, కేశబోయిన మల్లయ్య, మేడబోయిన గణేశ్, బిల్లం శారద, షానబోయిన శ్రీనివాస్, పూర్ణచందర్ గౌడ్, బట్కీర్ బీరప్ప పాల్గొన్నారు.

ఎస్ఆర్టీఆర్ఐలో స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ



భూదాన్ పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్టీఆర్ఐ)లో కేంద్ర ప్రభుత్వ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడున్నర నెలల కాల వ్యవధి కలిగిన బేసిక్ కంప్యూటర్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఇంటర్మీడియట్, అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ టూవీలర్ కోర్సుకు పదో తరగతి పాసై ఉండాలని సూచించారు. అభ్యర్థులు 18–30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 16న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరుకావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీల్లో కొలువుల భర్తీ!

టీచర్లు, హెల్పర్ల ఖాళీలపై అధికారుల కసరత్తు

- క్షేత్రస్థాయి నుంచి వివరాలు సేకరిస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ
- ప్రాజెక్టుల వారీగా సమాచారాన్ని సమర్పించాలని సీడీపీఓలకు ఆదేశం
- ఈ ఏడాది పదవీ విరమణ పొందేవారి లెక్కలపైనా ఆరా
- పూర్తి స్పష్టత వచ్చాక భర్తీ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టం చేసే దిశగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ చర్యలకు ఉపక్రమించింది. పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) విద్యను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకంపై దృష్టిపెట్టింది. ఈ మేరకు అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీలు, రిటైర్మెంట్ల వివరాల సేకరణ చేపట్టింది. లెక్కలపై స్పష్టత వచ్చాక భర్తీకి చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.

పనిచేస్తున్నది ఎందరు.. ఖాళీలెన్ని?

రాష్ట్రంలో 149 సమీకృత శిశు అభివృద్ధి ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 31,711 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. వీటన్నింటిలో పనిచేస్తున్న సిబ్బందికి సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ తాజాగా క్షేత్రస్థాయిలో శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారు(సీడీపీఓ)లను ఆదేశించింది. ఆయా ప్రాజెక్టుల వారీగా వివరాలను సమర్పించాలని సూచించింది. ప్రస్తుతం పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల వివరాలు, ఖాళీలు, సెంటర్‌లోని రిజర్వేషన్లు, ఈ ఏడాదిలో పదవీ విరమణ పొందుతున్న వారు, ఇప్పటికే పదవీ విరమణకు అర్హత సాధించి విధుల్లో కొనసాగుతున్న వారి వివరాలన్నీ సమర్పించాలని ఆదేశించింది. ఇప్పటికే పలు ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారం జిల్లా సంక్షేమాధికారులకు చేరగా.. త్వరలో కమిషనరేట్‌కు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఖాళీల లెక్కలు తేలితే.. అక్కడున్న రిజర్వేషన్లకు అనుగుణంగా టీచర్, హెల్పర్ ఖాళీల భర్తీకి చర్యలు వేగవంతం చేయవచ్చని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 3,800 అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ ఖాళీలు ఉన్నట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌తో..

రాష్ట్రంలో 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిని ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపింది. కేంద్రం నుంచి ఇంకా ఎలాంటి సమాచారం అందలేదు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో ఒక టీచర్, ఒక హెల్పర్ పనిచేస్తుంటే... మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఒక టీచర్ మాత్రమే ఉంటారు. ఈ మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేశాక హెల్పర్ పోస్టు కూడా ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ఈ పోస్టుల లెక్కలు తేలలేదు. అప్‌గ్రెడేషన్ ప్రక్రియ పూర్తయితే మొత్తంగా హెల్పర్ పోస్టుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.

రిటైర్మెంట్ల వివరాలపైనా..

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణకు సంబంధించిన ప్యాకేజీ పెంచనున్నట్లు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పలు సందర్భాల్లో వెల్లడించారు. ఆ ఫైలు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉంది. దీనితో గడువు తీరినా చాలా మంది పదవీ విరమణ తీసుకోలేదు. ఈ క్రమంలో పదవీ విరమణ పొందాల్సినవారి వివరాలను కూడా సమర్పించాలని, ఇప్పటికే రిటైర్ అయినవారి వివరాలను అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

న్యాయవాది వెళ్లొచ్చు..

▶ మొదటి పేజీ తరువాయి

రికార్డింగ్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కేటీఆర్ కోరగా.. దీనికి న్యాయస్థానం నిరాకరించింది.

తనతోపాటు న్యాయవాదిని కూర్చోనివ్వాలంటూ..

గురువారం ఏసీబీ విచారణకు హాజరుకావాల్సి ఉన్న నేపథ్యంలో... దర్యాప్తు అధికారులకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని, తనతోపాటు కూర్చొనేందుకు న్యాయవాదిని అనుమతించాలని కోరుతూ కేటీఆర్ బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 6న తాను విచారణకు హాజరయ్యేందుకు వెళ్లగా.. వెంట న్యాయవాదిని అనుమతించలేదని వివరించారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ మధ్యాహ్నం 2.15 సమయంలో విచారణ చేపట్టారు. న్యాయవాదిని అనుమతించేందుకు సర్కార్‌కు ఉన్న అభ్యంతరమేమిటో చెప్పాలని అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) తేరా రజనీకాంత్‌రెడ్డిని అడిగారు. వివరాలు తెలుసుకుని చెప్పాలంటూ విచారణను సాయంత్రం 4.15కు వాయిదా వేశారు. సాయంత్రం మరోసారి విచారణ చేపట్టారు. కేటీఆర్ తరఫున న్యాయవాది ప్రభాకర్‌రావు వాదనలు వినిపిస్తూ.. కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతించాలని, విచారించే సమయంలో ఏసీబీ అధికారులు ఆడియో, వీడియో రికార్డు చేసేలా ఆదేశించాలని న్యాయమూర్తిని కోరారు.

న్యాయవాది లైబ్రరీ గది నుంచి వీక్షించొచ్చు..

వాదనలు విన్న న్యాయమూర్తి.. అత్యంత క్లిష్టమైన క్రిమినల్ నేరాల విచారణలో మాత్రమే ఆడియో, వీడియో రికార్డింగ్‌కు ఆదేశాలు ఇవ్వగలమని పేర్కొన్నారు. అయితే న్యాయవాదిని అనుమతించవద్దన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను తోసిపుచ్చారు. విచారణలో జోక్యం చేసుకోనప్పుడు న్యాయవాదిని అనుమతిస్తే వచ్చే నష్టమేమిటని ప్రశ్నించారు. అయితే విచారణ సమయంలో పిటిషనర్ (కేటీఆర్), దర్యాప్తు అధికారి మాత్రమే గదిలో ఉండాలని స్పష్టం చేశారు. విచారించే సమయంలో న్యాయవాదికి కనబడేలా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. ఏసీబీ ఆఫీస్ దర్యాప్తు గదిని ఆనుకుని ఉన్న లైబ్రరీ గది కిటికీ నుంచి విచారణను వీక్షించే వీలు ఉందని ఏఏజీ వివరించారు. దీనికి న్యాయమూర్తి అంగీకరించారు. ఆ లైబ్రరీ గదిలో న్యాయవాది కూర్చొని కిటికీలోంచి వీక్షించవచ్చని తెలిపారు.

కేటీఆర్ వెంట న్యాయవాది రామచందర్‌రావు

పిటిషనర్ వెంట విచారణకు ఎవరు హాజరవుతారో ముగ్గురు న్యాయవాదుల పేర్లు ఇవ్వాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. అలా పిటిషనర్ (కేటీఆర్) ముగ్గురు న్యాయవాదుల పేర్లు ఇవ్వగా.. అందులో రామచందర్‌రావు ఏసీబీ ఆఫీసులోకి వెళ్లవచ్చని న్యాయమూర్తి తెలిపారు. అయితే సదరు న్యాయవాది ఆ విచారణలో ఎలాంటి జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేశారు. ఆ సమయంలో విచారణాధికారులు వ్యవహరించే తీరును బట్టి మళ్లీ హైకోర్టుకు రావచ్చని తెలిపారు. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు.

రావిర్యాలలో విజయ డెయిరీ కొత్త ప్లాంట్

పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ అమిత్‌రెడ్డి

నల్లగొండ: హైదరాబాద్ నగర శివారు రావిర్యాలలో విజయ డెయిరీ కొత్త ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి చెప్పారు. బుధవారం నల్లగొండలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విజయ డెయిరీకి ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తూ అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో డెయిరీకి ప్రభుత్వం రూ.100 కోట్లు విడుదల చేయడంతో వాటిని రైతులకు చెల్లించామన్నారు. ప్రస్తుతం విజయ డెయిరీలో లీటర్ ఆవు పాలకు రూ.41, గేదె పాలకు రూ.47తో రోజుకు 4.10 లక్షల లీటర్లు సేకరిస్తుండగా.. అమ్మకాలు మాత్రం 3.10 లక్షల లీటర్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. రోజుకు లక్షన్నర లీ టర్లు మిగులుతున్నాయని, దీంతో రెండేళ్లుగా రైతులకు చెల్లింపులు ఆగిపోయాయని సీఎం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ప్రభుత్వ సంస్థలన్నీ విజయ డెయిరీ పాలనే వాడాలని జీఓ ఇచ్చారని తెలిపారు.

నా విధులు నేను నిర్వర్తించా..

- ఫార్ములా–ఈ కేసు ఏసీబీ విచారణలో ఐఏఎస్ అర్వింద్‌కుమార్
- తాను ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని వివరణ
- ఒప్పందం నుంచి స్పాన్సర్ తప్పుకోవడం వరకు ప్రశ్నలు గుప్పించిన అధికారులు
- విచారణ వీడియో రికార్డింగ్.. చివరిగా వాంగ్మూలం నమోదు



సాక్షి, హైదరాబాద్: తన విధులను తాను నిర్వర్తించానని.. ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని ఫార్ములా–ఈ రేసు కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ స్పష్టం చేసినట్టు తెలిసింది. విధి నిర్వహణలో భాగంగానే నిర్ణయాలు తీసుకున్నానని, ఎలాంటి ఇతర ప్రయోజనాలకు తావులేదని పేర్కొన్నట్టు సమాచారం. ఫార్ములా–ఈ రేసు కేసులో ఏసీబీ అధికారులు అర్వింద్‌కుమార్‌ను ఏ–2గా నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఏసీబీ నోటీసుల మేరకు అర్వింద్ కుమార్ బుధవారం ఉదయం 9.45 గంటల సమయంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఏసీబీ హెడ్ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సహా ముగ్గురు అధికారుల బృందం ఆయనను విచారించింది.

వీడియో రికార్డింగ్ మధ్య..

రేసు నిర్వహణ ఒప్పందం, ఆయా కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు, నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాలు, వాటికి సంబంధించి తేదీలు, తొలి విడత రేసు నిర్వహణ, సీజన్ 10 ప్రారంభానికి నిలిచిపోవడం, స్పాన్సర్ తప్పుకొన్న తర్వాత ప్రభుత్వమే ఆ బాధ్యత తీసుకోవడం.. తదితర అంశాలపై అర్వింద్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. ఏసీబీ అధికారులు ఈ విచారణను మొత్తం వీడియో రికార్డింగ్ చేశారు. చివరిగా అర్వింద్ కుమార్ స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. ఇప్పటికే ఈ అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తాను ఇచ్చిన వివరణ గురించి కూడా అర్వింద్‌కుమార్ ప్రస్తావించినట్టు తెలిసింది. ఆ అంశాలను సైతం తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నట్టు సమాచారం. సాయంత్రం 4–45 గంటలకు అర్వింద్‌కుమార్ ఏసీబీ కార్యాలయం నుంచి తిరిగి వెళ్లారు. మిగతా వారిని విచారించిన అనంతరం ఆయనను మరోమారు పిలిచి ప్రశ్నించే అవకాశం ఉందని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి.

నేడు ఏసీబీ విచారణకు కేటీఆర్

ఫార్ములా–ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరుకానున్నారు. నిజానికి ఆయన సోమవారమే విచారణకు హాజరయ్యేందుకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి వెళ్లారు. కానీ తన వెంట న్యాయవాదులను అనుమతించక పోవడంతో.. కేటీఆర్ లిఖిత పూర్వక సమాధానాన్ని ఏసీబీ అధికారికి ఇచ్చి వెనుదిరిగారు. దీనితో ఏసీబీ అధికారులు గురువారం విచారణకు రావాలంటూ కేటీఆర్‌కు మరోమారు నోటీసులు జారీ చేశారు. దీనితో ఉత్కంఠ నెలకొంది. కేవలం కేటీఆర్‌ను ప్రశ్నించి పంపిస్తారా, లేదా ఇంకేమైనా చర్యలు తీసుకుంటారా? అన్న చర్చ తీవ్రంగా జరుగుతోంది.

గ్రూప్–3 పరీక్షల ప్రాథమిక 'కీ'ల విడుదల

ఈ నెల 12 వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–3 ఉద్యోగ అర్హత పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక 'కీ'లు విడుదలయ్యాయి. వీటిని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–3 ఉద్యోగాల భర్తీలో భాగంగా గతేడాది నవంబర్ 17వ తేదీ ఉదయం, మధ్యాహ్నం, 18న ఉదయం అర్హత పరీక్షలు జరిగాయి. మూడు సెషన్లలో జరిగిన ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల మూడు ప్రాథమిక కీలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. మాస్టర్ క్వశ్చన్ పేపర్లు కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాథమిక కీలపై అభ్యంతరాలుంటే ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల కల్లా అభ్యర్థి లాగిన్ ద్వారా సరైన ఆధారాలు సమర్పించాలని కమిషన్ తెలిపింది. అభ్యంతరాలను కేవలం ఇంగ్లిష్‌లో మాత్రమే సమర్పించాలని, సంబంధిత ఆధారాలను కూడా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ–మెయిల్ లేదా వ్యక్తిగత వినతులు, ఇతర రూపాల్లో అభ్యంతరాలను స్వీకరించబోమని కమిషన్ కార్యదర్శి తెలిపారు. నిర్దేశించిన సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చే అభ్యంతరాలను పరిగణించబోమన్నారు. మరిన్ని వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నిధుల బదిలీపైనే ప్రశ్నల వర్షం!

ఫార్ములా-ఈ కేసులో హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిని విచారించిన ఈడీ అధికారులు

- ఎవరి ఆదేశాల మేరకు నిధులు బదిలీ చేశారంటూ ఆరా
- నేడు ఈడీ విచారణకు సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్



విచారణకు హాజరై వెళ్తున్న బీఎల్ఎన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ రేసు అంశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిని విచారించింది. బ్రిటన్‌లోని ఫార్ములా–ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈఓ) ఖాతాల్లోకి డబ్బులు ఎందుకు మళ్లించారు? ఇందుకు మిమ్మల్ని ఎవరు ఆదేశించారు? నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు ఎందుకు చేయాల్సి వచ్చిందనే అంశాలపై ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నించారు. దాదాపు తొమ్మిది గంటలపాటు విచారించారు. ఈ కేసుకు సంబంధించి ఈడీ ఆదేశాల మేరకు బీఎల్ఎన్ రెడ్డి బుధవారం ఉదయం 9.40 గంటలకే బషీర్‌బాగ్‌లోని ఈడీ ఆఫీసుకు వచ్చారు. ముగ్గురు ఈడీ అధికారుల బృందం ఉదయం 10 గంటల నుంచి ఆయనను విచారించడం ప్రారంభించింది. హెచ్ఎండీఏ సాధారణ నిధులను విదేశీ కంపెనీ ఖాతాలకు బదిలీ చేసిన అంశంపైనే సుదీర్ఘంగా ప్రశ్నించినట్టు తెలిసింది. హెచ్ఎండీఏ బోర్డ్ బ్యాంకు ఖాతాల నిర్వహణపైనా ఆరా తీసినట్టు సమాచారం. దర్యాప్తులో భాగంగా తాము సేకరించిన డాక్యుమెంట్లను, లావాదేవీల రికార్డులను ముందు పెట్టి ఆయా అంశాలపై ప్రశ్నించినట్టు తెలిసింది. ఇక ఈడీ అధికారులు ముందస్తుగా కోరిన విధంగా బీఎల్ఎన్ రెడ్డి కొన్ని పత్రాలను వారికి సమర్పించారు. మొత్తంగా సాయంత్రం 7 గంటల వరకు ఈ విచారణ కొనసాగింది. అవసరమైతే మరోమారు విచారణకు రావాల్సి ఉంటుందని ఆయన ఈడీ అధికారులు సూచించినట్టు సమాచారం. కాగా, ఈడీ అధికారులు ముందుగా ఇచ్చిన సమన్ల ప్రకారం సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ గురువారం ఉదయం ఈడీ ముందు విచారణకు రానున్నారు.

టీపీబీఓ ఎంపిక జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరేట్ విభాగంలో టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీపీబీఓ) ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన 171 మంది అభ్యర్థుల జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం విడుదల చేసింది. అభ్యర్థుల ఫైనల్ జాబితా, ఇతర సమాచారం కోసం కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు.



నిరంకుశుడు చనిపోతే అతడి పాలన అంతమవుతుంది,
అమరుడు చనిపోతే అతడి పాలన మొదలవుతుంది.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 9 జనవరి 2025

గౌరవం నిలపాలి!

తమిళనాడు సర్కారుకూ, ఆ రాష్ట్ర గవర్నర్‌కూ పొసగడం లేదన్నది కొన్నేళ్ళుగా జగమెరిగిన సత్యమే. ఆ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. నూతన సంవత్సరంలో తమిళనాడు శాసనసభ తొలిసారి సమావేశమైనప్పుడు సభను ఉద్దేశించి గవర్నర్ చేయాల్సిన ప్రారంభ ప్రసంగం వరుసగా మూడో ఏడాది సైతం రచ్చ రాజేసింది. శాసనసభలో ప్రసంగించకుండానే గవర్నర్ ఆర్.ఎన్. రవి నిష్క్రమించడం వివాదాస్పదమైంది. రాష్ట్రాల యూనియనైన భారత సమాఖ్య వ్యవస్థలో గవర్నర్ల పాత్రపై ఇది మళ్ళీ చర్చకు తావిచ్చింది. అత్యంత గౌరవాస్పదమైనదైన గవర్నర్ పదవి, ఇటీవల గవర్నర్లు కొందరు వ్యవహరిస్తున్న తీరు దురదృష్టవశాత్తూ చర్చనీయాంశమవుతోంది. రాజ్యాంగబద్ధ పదవిని చేపట్టాక రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాల్సిన వ్యక్తులు పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలతో కయ్యానికి కాలుదువ్వుతూ, రాజ్యాంగ పరిధిని మించి ప్రవర్తిస్తున్నారన్నదీ నిష్ఠురసత్యమే.

గవర్నర్ హోదా దుర్వినియోగం కావడం కొత్త ఏమీ కాదు. అదో సుదీర్ఘ చరిత్ర. ఒకప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ చక్రం తిప్పిన రోజుల్లో గవర్నర్లు వట్టి రబ్బరు స్టాంపులనే పేరుండేది. కేంద్రం పనుపున రాష్ట్రాల్లో ప్రతిపక్ష ప్రభుత్వాలను ఒక్క కలం పోటుతో బర్తరఫ్ చేశారనే దుష్కీర్తికీ కొదవ లేదు. ఢిల్లీ గద్దెపై పార్టీ జెండా మారినా... ఇప్పుడూ అదే రకమైన దుర్వినియోగం వేరొక పద్ధతిలో కొనసాగుతోందని వాపోవాల్సి వస్తోంది. గతంలో కాంగ్రెస్ పాలకులు చేశారు కాబట్టి ఇప్పుడు మేమూ ఆ రకంగానే ప్రవర్తిస్తామని ప్రస్తుత పాలకులనుకుంటే అది సమర్థనీయం కాదు. రాజ్యాంగ విధినిర్వాహక పదవుల దుర్వినియోగం వ్యక్తులకే కాక, వ్యవస్థకూ మాయని మచ్చవుతుంది. 'టీమ్ ఇండియా' అంటూ కేంద్ర పాలకులు తరచూ ఆదర్శాలు పైకి వల్లె వేస్తున్నా, ఆచరణలో జరుగుతున్నది వేరు. బీజేపీయేతర ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకొని, రాజ్‌భవన్‌ను రాజకీయ అస్త్రంగా వాడుతున్నారనే ఆరోపణ... కొన్నేళ్ళుగా కేరళ నుంచి కశ్మీర్ దాకా అనేకచోట్ల వినిపిస్తున్నది.

తమిళనాట డీఎంకే సర్కారుతో గవర్నర్ రవికి మొదటి నుంచీ ఉప్పూ నిప్పే! ఏళ్ళ తరబడి పాటిస్తూ వస్తున్న వ్యవస్థీకృత సభా సంప్రదాయాలను తోసిరాజనడమే కాదు... లౌకికవాదం సహా పలు అంశాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. సాక్షాత్తూ రాజ్యాంగమే లౌకికవాదాన్ని ఔదలదాల్చిన దేశంలో... రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన గవర్నరే... అది వట్టి యూరోపియన్ సిద్ధాంతమనీ, భారతదేశంలో దానికి చోటులేదనీ వ్యాఖ్యానించారు. అది తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఆ మధ్య ప్రసారభారతి కార్యక్రమంలో, ఇప్పుడు చట్టసభలో జాతీయ గీతాలాపనపై ఆయన రగడ చేశారు. నిజానికి, తమిళనాట అధికారిక కార్యక్రమాలన్నిటా 'తమిళతల్లి స్తుతి' (తమిళ్‌తాయ్ వాళ్తు)ని ప్రార్థనా గీతంగా పాడడం 1970 నుంచి ఉన్నదే. 2021 డిసెంబర్‌లో దాన్ని రాష్ట్ర గీతంగానూ ప్రకటించారు. తమిళ ప్రభుత్వ కార్యక్రమాలన్నిటినీ తమిళ్‌తాయ్ వాళ్తుతో ఆరంభించి, జాతీయ గీతాలాపనతో ముగించడం దశాబ్దాల సంప్రదాయం. ఆ సంగతే ముందుగానే ప్రభుత్వం చెప్పినప్పటికీ, దాన్ని గౌరవించాల్సిన గవర్నర్ పదేపదే విభేదించడం, అంతటితో ఆగక 'ద్రావిడనాడు' భావనపైనే అభ్యంతరాలు చెప్పడం, ఒక కార్యక్రమంలో అధికారిక గీతం నుంచి ద్రావిడనాడు ప్రస్తావన అనుమానాస్పద రీతిలో తొలగింపునకు గురికావడం... అన్నీ వివాదాలే.

సభాసమావేశాల ప్రారంభ ప్రసంగంలో ప్రభుత్వ విధానప్రకటనను సభ్యుల ముంగిట ప్రతిపాదించడం గవర్నర్ రాజ్యాంగ విధి. కానీ, 2023లోనూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రసంగ పాఠంలో 'ద్రావిడ నమూనా పాలన' సహా కొన్ని అంశాలను రవి ఉద్దేశపూర్వకంగానే వదిలేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయన్నదీ చదవలేదు. అదేమంటే, ప్రసంగపాఠంలో కొన్ని అంశాలు తప్పుదోవ పట్టిస్తున్నాయంటూ తీవ్రమైన వ్యాఖ్యే చేశారు. పెరియార్ రామసామి, కామరాజ్, అణ్ణాదురై, కరుణానిధి, అంబేడ్కర్ లాంటి పేర్లను చదవడానికి నిరాకరించడం, 'తమిళనాడు' బదులు 'తమిళగం' అనాలనడం రవిపై గతంలోనే విమర్శల వేడి పెంచాయి. ఇలా రాజ్యాంగ పరిధిని పదేపదే ఉల్లంఘించి, వివాదాలకు కేంద్రమవడం సరికాదు. ఆ మాటకొస్తే ప్రజలెన్నుకున్న ప్రభుత్వంతో కేంద్ర పాలకులు కూర్చోబెట్టిన గవర్నర్లు తలపడడం, ప్రభుత్వ అధికారిక బిల్లుల్ని ఆమోదించకుండా తాత్సారం చేయడం, వైస్ ఛాన్సలర్ల నియామకానికి మోకాలడ్డడం, బాహాటంగా పాలనను విమర్శించడం... ఇవన్నీ పశ్చిమ బెంగాల్, పంజాబ్, కర్ణాటక సహా పలుచోట్ల కొద్దికాలంగా చూస్తున్నదే. రాజ్‌భవన్లు రాజకీయ కేంద్రాలవుతున్నాయన్న విమర్శకు ఇలాంటివే కారణం.

ప్రాథమిక హక్కుల్లో భాగంగా వ్యక్తిగత హోదాలో ఎవరికి ఎలాంటి అభిప్రాయాలున్నా తప్పు లేదు. భావప్రకటన స్వేచ్ఛను తప్పుపట్టనూ లేము. కానీ, రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న వ్యక్తుల నుంచి ఆశించేది వేరు. సదరు హోదా తాలూకు గౌరవానికి భిన్నమైన అభిప్రాయాల్ని వ్యక్తీకరించినా, ప్రజా ప్రభుత్వ పాలనకు రాజ్యాంగహోదాతో అభ్యంతరం చెప్పినా అది హర్షణీయం కాదు. ఒక విధంగా అది రాజ్యాంగ విధులకే ఉల్లంఘన. రాష్ట్ర మంత్రిమండలి సలహా సూచనల మేరకే గవర్నర్ వ్యవహరించాలంటూ 1974లోనే ఏడుగురు సభ్యుల సుప్రీమ్ కోర్ట్ ధర్మాసనం చెప్పిన మాట శిరోధార్యం కావాలి. కేంద్రంలో రాష్ట్రపతి లాగా, రాష్ట్రంలో ప్రభుత్వ ఆలోచనకు అద్దం పట్టాల్సిన గవర్నర్లు ఆ రాజ్యాంగ విధిని విస్మరించ లేరు. వన్నె తగ్గించే పనుల్ని మానుకుంటేనే ప్రజాస్వామ్య స్ఫూర్తి గెలుస్తుంది. రాజ్యాంగ రూపకర్తల సదాశయం నిలుస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** శు.దశమి ఉ.11.54 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** భరణి ప.3.08 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.2.25 నుండి 3.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.16 నుండి 11.02 వరకు, తదుపరి ప.2.42 నుండి 3.26 వరకు, **అమృతఘడియలు:** ఉ10.40 నుండి 12.10 వరకు.

సూర్యోదయం : 6.37
సూర్యాస్తమయం: 5.37
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ఒకే ఒరలో రెండు కత్తులు!

విశ్లేషణ



అలీ బ్రెలాండ్

అమెరికా రిపబ్లికన్ పార్టీలో టెక్ మితవాదులు, జాతీయ మితవాదులు వేర్వేరు వర్గాలు. ఇరువురూ ఒక్కటై డోనాల్డ్ ట్రంప్ మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు తోడ్పడ్డారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ట్రంప్ విజయం తర్వాత మొదటిసారి ఈ రెండు వర్గాలూ పరస్పరం కత్తులు దూసుకున్నాయి. అమెరికా జనాభాలో తెల్లవాళ్ల స్థానాన్ని ఇతర దేశాల శ్వేతేతరులతో భర్తీ చేయడానికి ఉద్దేశపూర్వకంగా కుట్ర జరుగుతోందన్నది జాతీయవాద మితవాదుల ఆరోపణ. అందివచ్చే ఎలాంటి అవకాశాలైనా సరే వాడుకుని అమెరికా యావత్ ప్రపంచాన్ని జయించాలని టెక్ రైటిస్టులు అనుకుంటారు. అయితే ట్రంప్ దగ్గర టెక్ రైటిస్టులకే ప్రాధాన్యత లభిస్తోంది. కలసికట్టుగా ఎన్నికలు గెలిచినా, ఇప్పుడు ఒక వర్గం ఓడిపోబోతోంది.

మొన్న క్రిస్మస్ రోజు అమెరికా సోషల్ మీడియా భగ్గుమంది. ప్రపంచ అపర కుబేరుడు ఎలాన్ మస్క్ కేంద్రబిందువుగా సంస్కృతి పరమైన విష పోరాటం మొదలైంది. విమర్శకులు ఆయనపై విద్వేషంతో బుసలు కొట్టారు. అసభ్య వ్యాఖ్యలతో దాడి చేశారు. మస్క్ కూడా వారితో ఢీ అంటే ఢీ అన్నాడు.

అసలేమిటి ఈ వివాదం? వెంచర్ క్యాపిటలిస్ట్ శ్రీరామ్ కృష్ణన్‌ను డొనాల్డ్ ట్రంప్ తన ఏఐ-పాలసీ సీనియర్ సలహాదారుగా నియమించుకోడంతో అమెరికాలో అగ్గి రాజుకుంది. 'మాగా' (ఎంఏజీఏ- మేక్ అమెరికా గ్రేట్ అగైన్) వాదానికి గట్టి మద్దతుదారు, ఇంటర్నెట్ ట్రోలింగ్ సుప్రసిద్ధుడు అయిన లారా లూమర్ పెట్టిన పోస్టు తీవ్ర మితవాదులను అట్టుడికించింది. 'అమెరికా ఫస్ట్' ఉద్యమానికి ట్రంప్ వెన్నుపోటు పొడిచాడంటూ రగిలిపోయారు.

కృష్ణన్ భారతీయ వలసదారు. అమెరికా పౌరుడు. ఆయన భారతీయ మూలాలను 'మాగా' మితవాద శిబిరం సహించలేక పోయింది. హెచ్-1బి వీసా విధానంపై మండిపడింది. అమెరికన్ కంపెనీలు నిపుణులైన వలసదారులను నియమించుకోడానికి ఇది వీలు కల్పిస్తోంది. ఇలా వచ్చి పనిచేస్తున్న వారిలో మూడొంతుల మంది ఇండియన్లే. ఈ నేపథ్యంలో శ్రీరామ్ కృష్ణన్ నియామకానికి స్పందనగా ఇంటర్నెట్‌లో జాత్యహంకారం జడలు విప్పింది. జాతీయవాదులు భారతీయ టెక్ వర్కర్లపై విద్వేషపూరితమైన మీమ్స్‌తో సోషల్ మీడియాను ముంచెత్తారు. వారిని 'మూడో ప్రపంచ ఆక్రమణదారులు'గా లూమర్ అభివర్ణించాడు. అంతేకాదు, అతడో సిద్ధాంతం లేవనెత్తాడు. దాని పేరు 'గ్రేట్ రీప్లేస్‌మెంట్ థియరీ'. అమెరికా జనాభాలో తెల్లవాళ్ల స్థానాన్ని ఇతర దేశాల శ్వేతే తరులతో భర్తీ చేయడానికి ఉద్దేశపూర్వకంగా కుట్ర జరుగుతోందన్నది లూమర్ సిద్ధాంతం.

హెచ్-1బి వీసా విధానానికి మస్క్ మద్దతు

నిజానికి శ్వేత ఆధిక్యానికి మస్క్ వ్యతిరేకం ఏమీ కాదు. తన సొంతమైన 'ఎక్స్' వేదిక మీద దాన్ని సమర్థించినట్లే కనిపించేవాడు. అయినా, తనకు విశేషమైన అవకాశాలు అందించిన, అపార సంపద కట్టబెట్టిన ప్రభుత్వ విధానం (హెచ్-1బి) మీద ఇప్పుడు జరుగుతున్న దాడిని సహించలేక పోయాడు. అమెరికా పౌరుడిగా మారక ముందు మస్క్ కూడా వలస వచ్చినవాడే. దక్షిణాఫ్రికా నుంచి హెచ్-1బి వీసా మీద వచ్చి స్థిరపడ్డాడు. ఆయన కూడా తన కంపెనీల్లో అలాంటి వారిని నియమించుకున్నాడు. ఈ హెచ్-1బి వీసా విధానానికి మద్దతు ఇస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టాడు. ఈ విధానం వల్ల అమెరికా గొప్ప ప్రతిభావంతులను సమకూర్చుకుంది అని అతడి వాదన. ఐటీ కేంద్రమైన సిలికాన్ వ్యాలీకి ఈ దృక్పథం ఇబ్బందికరమైంది కానప్పటికీ, రిపబ్లికన్ పార్టీలోని తిరోగమన, జాతీయవాద వర్గాలకు మస్క్ అభిప్రాయం అసంతృప్తి కలిగించింది 'అమెరికా ప్రజలు ఎప్పటికీ అమెరికాను ఒక స్పోర్ట్స్ టీమ్ లేదా కంపెనీ అనుకోరు' అంటూ జాక్ పోసాబిక్ బదులిచ్చాడు. వీటన్నిటికీ బదులిస్తూ, 'ఈ అంశం మీద నేను యుద్ధానికి సిద్ధం, దాని పర్యవసానాలు మీ ఊహక్కూడా అందవు' అంటూ మస్క్ తన విమర్శకులను హెచ్చరించాడు. దీంతో ట్రంప్ మాజీ సలహాదారు స్టీవ్ బానన్ రంగంలోకి దిగాడు. హెచ్-1బి వీసాలు పెద్ద స్కామ్ అనీ, వాటిని సమర్థించి మస్క్ తన 'నిజ స్వరూపం' బయట పెట్టుకున్నాడని ప్రతి దాడికి దిగాడు.



దోనాల్డ్ ట్రంప్‌తో టెక్ మితవాదుల ప్రతినిధి ఎలాన్ మస్క్

నిజానికి హెచ్-1బి వీసాలను వ్యతిరేకించడం 'మాగా' పంథా కాదు. ఈ విధానంలో లోపాలు ఉన్నాయి కాబట్టి దీని పట్ల వ్యతిరేకత వచ్చింది. ఇండిపెండెంట్ సెనెటర్ బెర్నీ శాండర్స్ గతంలో మాట్లాడిన ప్రకారం, వ్యాపారవేత్తలు అత్యంత నిపుణులైన వలస ఉద్యోగులను నియమించుకుని సిబ్బంది వ్యయాలు గణనీయంగా తగ్గించుకోడానికి హెచ్-1బి పదునైన ఆయుధంలా ఉపకరిస్తుంది. మస్క్ సమ్మిళిత వలసవాదంగా పేర్కొంటూ అత్యంత నిపుణులైన విదేశీ ఉద్యోగులకు ఇప్పుడు మద్దతు ఇస్తున్నాడు. అయితే, ఎక్స్ వేదిక మీద జాతివివక్ష అంశంలో దొంగాటలు ఆడాడు. నియో నాజీలతో సంబంధాలు నెరిపే జర్మన్ తీవ్ర మితవాద పార్టీకి గట్టి మద్దతు ఇచ్చాడు.

సయోధ్య కుదిరేనా?

రిపబ్లికన్ పార్టీలోని ఈ రెండు మితవాద వర్గాల ఐక్యత ప్రశ్నార్థకంగా మారింది. ఏమైనా ఇవి తమ విభేదాలు పరిష్కరించుకున్నాయని ఒక దశలో అనిపించింది. జాతీయ మితవాదులకు, టెక్ మితవాదులకు మధ్య సయోధ్యకు కాబోయే ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఒక ఉదాహరణ. పీటర్ థియల్ అనే మితవాద టెక్ బిలియనీర్ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న కంపెనీలో వాన్స్ పనిచేశాడు. అడ్డూ ఆపూ లేని స్వేచ్ఛావిపణులను ఈ కాబోయే ఉపాధ్యక్షుడు విమర్శించాడు. తద్వారా మంచి పలుకుబడి ఉన్న జాతీయ మితవాద నేతలను ఆకట్టుకున్నాడు. హెచ్-1బి వీసా ఉద్యోగులను నియమించుకునే కంపెనీల్లో పెట్టుబడులు ఉన్నప్పటికీ వాన్స్ హెచ్-1బి వీసాలను వ్యతిరేకించాడు. పార్టీని ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా సమైక్యం చేయడం ఆయన బాధ్యత కావడం ఇందుకు కారణం కావచ్చు. అయితే ఎన్నికల తరువాత దాన్ని పక్కన పెట్టారు.

ట్రంప్ పదవి చేపట్టిన తర్వాత టెక్ రైట్-నేషనలిస్ట్ రైట్ మధ్య ఉద్రిక్తతలు ఎలా ఉండబోతున్నాయన్న దానికి తాజా ఘర్షణ ఒక ప్రివ్యూ లాంటిది. జాతీయవాదులు వారు కోరుకున్నది చాలావరకు సాధించుకుంటారు. మూకుమ్మడి దేశ బహిష్కరణలు ఉంటాయని ట్రంప్ ఇప్పటికే ప్రకటించాడు. ఇది వారికి ఆనందం కలిగించి తీరుతుంది. సిలికాన్ వ్యాలీతో వారి పోరు విషయాన్ని ప్రస్తుతానికి ఆయన పట్టించుకోడు. ట్రంప్ గత హయాంలోనూ ఇదే జరిగింది. బడా కార్పొరేట్ల ప్రయోజనాలు పక్కన పెట్టి సామాన్యులకు మేలు చేసే ఆర్థిక వ్యవస్థను సృష్టిస్తానని 2016లో చేసిన వాగ్దానాన్ని ఆయన పూర్తిగా విస్మరించాడు. ఇది జాతీయ మితవాదులు కోరుకున్నదానికి విరుద్ధం. భారీ వ్యాపార సంస్థలకు, ధనికులకు ట్రంప్ అప్పట్లో పన్నులు తగ్గించాడు. మరోవంక, 'ముస్లిం బ్యాన్', అక్రమ వలసదారుల పిల్లలను వారి తల్లిదండ్రుల నుంచి వేరుచేయడం వంటి కఠిన చర్యలను టెక్ అధిపతులు, సిబ్బంది తీవ్రంగా వ్యతిరేకించారు.

టెక్ రైటికే ప్రాధాన్యం?

ఈసారి టెక్ మితవాద వర్గానికి పాలనలో ప్రాధాన్యం లభిస్తోంది. మస్క్, టెక్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ సామర్థ్య విభాగం (డోజ్-డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ) నిర్వహించబోతున్నారు. బిలియనీర్ వెంచర్ క్యాపిటలిస్ట్ మార్క్ ఆండ్రీసెన్ ఈ విభాగం సిబ్బంది నియామకంలో తోడ్పడతాడు. ఇక శ్రీరామ్ కృష్ణన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధాన రూపకల్పనలో అధ్యక్షుడికి సలహాలు ఇస్తాడు. ట్రంప్ ఇతర నియామకాల్లో సైతం ధనికవర్గాలకు, శక్తిమంతులకు ప్రాధాన్యం ఇచ్చాడు. ప్రభుత్వం వారితో స్నేహపూర్వకంగా ఉంటుందని ఆయన చెప్పకనే చెప్పారు. ఇక జాతీయ మితవాదుల్లోని కొద్దిమంది ముఖ్యులకూ ట్రంప్ క్యాబినెట్‌లో చోటు లభించనుంది.

ట్రంప్ 'న్యూయార్క్ పోస్ట్'తో మాట్లాడుతూ, 'నేనెప్పుడూ వీసాలను ఇష్టపడ్డాను. వీసాలకు నేను ఎప్పుడూ అనుకూలమే. అందుకే వాటిని అమలు చేశాను'' అన్నాడు. ఈ ప్రకటన ద్వారా మస్క్‌కు ఆయన పూర్తి మద్దతు పలికాడు. చిట్టచివరిగా ఇంకో విషయం ప్రస్తావించాలి. సంపన్నుల చేతిలో ముఖ్యంగా క్రితంసారి కంటే ఈసారి మరింత ఎక్కువ అధికారం ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ పత్రికా రచయిత
('ది అట్లాంటిక్' సౌజన్యంతో)



సోషల్ మీడియా

అక్కడా అదే!



గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికా అని మార్చుతారట ట్రంప్. ఉత్తర్ అఫ్రీకాకు(ఉత్తర ప్రదేశ్ తరహాలో) స్వాగతం.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

ఈ కాలం!



పొరుగాయన కేకలేస్తుంటే చెవిన పడింది. "నాకు చెప్పకుండా ఇంట్లోంచి అడుగు బయటపెడితే కాళ్లు విరగ్గొడతాను. నీలాంటి పిల్లలకు ఎలా బుద్ధి చెప్పాలో నాకు బాగా తెలుసు"– పిల్లాడిని ఏం చేస్తాడోనని నేను వెళ్లి చూద్దునుకదా– ఆయన అరుస్తున్నది పిల్లి మీద. అది గోడ మీద కూర్చుని ఆవలింతలు తీస్తోంది.

– సాయంతన్ ఘోష్, కాలమిస్ట్

ఎలా కాగలం?



మహిళల వాష్‌రూములు కేవలం కోర్టుల వద్ద మాత్రమే దారుణంగా లేవు; మార్కెట్ స్థలాలు, ఆఫీసు కాంప్లెక్సులు అంతటా అదే సమస్య. ఇలాంటి మౌలిక సదుపాయాలతోనే మహిళలను శ్రామికశక్తిలో భాగం కావాలంటారు.

– మోనికా వర్మ, పరిశోధకురాలు

వివేక వాక్యాలు



జపనీయుల వివేకం: అది నీది కాకపోతే, తీసుకోవద్దు; సరైనది కాకపోతే, చేయొద్దు; సత్యం కాకపోతే, చెప్పొద్దు; నీకు తెలియకపోతే, మౌనంగా ఉండు. ఇవి సాధారణ నియమాలుగానే కనిపిస్తాయి కానీ చాలా ప్రభావం చూపిస్తాయి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఎక్కడున్నాం?



ట్రంప్ ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచీ ఆయనతో జిన్‌పింగ్ టచ్‌లో ఉన్నారని చైనా నిర్ధారించింది. జిన్‌పింగ్‌ను ట్రంప్ తన పదవీ స్వీకారోత్సవానికి ఎందుకు ఆహ్వానించారో ఇది తెలియజేస్తోంది. అయితే, అర్థం చేసుకోదగిన కారణాల వల్ల జిన్‌పింగ్ దాన్ని తిరస్కరించారు. ఇండియా, చైనా సంబంధాల గురించి మన మెదడులేని విదేశాంగ నిపుణులు కొత్తగా ఆలోచించాలి.

– ప్రవీణ్ సహానీ, ఆర్మీ మాజీ అధికారి

మారాల్సిన విషయం



ఒక సూచన: మారుతున్న కాలానికి అనుగుణంగా ముస్లింలు మారాలి, ముఖ్యంగా వివాహాల్లో! జనానా (మహిళల విభాగం), మర్దానా (పురుషుల విభాగం) అనేవి ఇంకా ఆచరణాత్మకం కాదు. యువతీ యువకులు కలసి కలబోసుకోవడమే లేదు. సామాజీకీకరణకూ, తగిన జీవిత భాగస్వాములను వెతుక్కోవడానికీ వివాహ వేడుకలు మంచి కార్యస్థలాలు.

– దారాబ్ ఫారూఖీ, సినిమా రచయిత

గొప్ప విషయం

ఆస్కార్ ఉత్తమ చిత్రం లాంగ్ లిస్టులోని 207 చిత్రాల్లో 7 ఇండియన్ సినిమాలున్నాయి. వీటిల్లో కని కుశ్రుతీ రెండింటిలోనూ ప్రధాన పాత్ర పోషించారు. 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్', 'గర్ల్స్ విల్ బి గర్ల్స్'. ఇది కని కుశ్రుతీ ప్రపంచం. మనం కేవలం అందులో జీవిస్తున్నాం. (ఈ రెండింటికీ దర్శకత్వం వహించింది మహిళలే – వరుసగా పాయల్ కపాడియా, శుచీ తలాటీ.)

– సిద్ధార్థ్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

చీకట్లను చీల్చిన జ్ఞానకిరణం

దేశంలో మహిళా విద్యకోసం కృషిచేసిన మొదటి తరానికి చెందినవారిలో ఫాతిమా షేక్ ఒకరు. ఈమె సావిత్రీబాయి స్నేహితురాలూ, సహోద్యోగి కూడా. భర్త సహకారంతో సావిత్రీబాయీ, సోదరుని సహకారంతో ఫాతిమా విద్యార్జన చేశారు. సావిత్రీబాయితో కలిసి జ్యోతీరావు పూలే దగ్గరే ఆమె చదువు నేర్చుకున్నారు. సోదరుడు ఉస్మాన్ షేక్ ప్రోత్సాహంతో ఉన్నత చదువులూ అభ్యసించారు. పూలే దంపతులు గృహ బహిష్కరణకు గురైనప్పుడు వారికి ఆశ్రయం కల్పించి ఆదుకున్నారు. తమ హవేలీనే పాఠశాల నిర్వహణ కోసం పూలే దంపతులకు ఇచ్చి అండగా నిలిచారు. 1851లో ఆమె స్వయంగా ముంబైలో రెండు పాఠశాలలు స్థాపించారు. దళితుల ఇళ్ళకు వెళ్ళి పిల్లల చదువు విషయంలో వారిని చైతన్య పరిచారు. ఆరోజుల్లో మనువాదులు మహిళా విద్యను తీవ్రంగా వ్యతిరేకించేవారు. దుమ్మెత్తి పోసినా, పేడనీళ్ళు కుమ్మరించినా, రాళ్ళు విసిరినా చలించకుండా ఆమె తన కృషిని కొనసాగించారు.



ఫాతిమా షేక్

'ఫాతిమా నాకు ఎంతగానో సహకరించారు. ఆమె సహకారంతోనే నేను అనేక సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను' అంటూ సావిత్రీబాయి తన భర్త జ్యోతిబా పూలేకు రాసిన లేఖలలో పేర్కొన్నారు. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకీర్ హుస్సేన్, అబుల్ కలాం ఆజాద్ లాంటి వారితో పాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్ని 'బాల్ భారతి'లో పాఠ్యాంశంగా చేర్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఫాతిమా షేక్ సేవలను గుర్తించి, 8వ తరగతి పాఠ్య పుస్తకాలలో ఆమె రచనలపై పాఠాన్ని ప్రవేశపెట్టింది. ఆమె కేవలం ముస్లిం సమాజం కోసమే పనిచేయలేదు. సమాజంలో వివక్షకు, అన్యాయానికి, అణచివేతకు, అవిద్యకు గురైన అన్ని వర్గాల ప్రజల కోసమూ పాటుపడ్డారు. ఫాతిమా కృషిని గుర్తించి, సావిత్రిబాయితో సమానంగా గౌరవిస్తూ ఆమె త్యాగాలను స్మరించుకోవలసిన అవసరం ఉంది. ఈ ఇద్దరు మహిళామణుల స్ఫూర్తితో బహుజనులంతా తమ హక్కులకోసం సమష్టి పోరాటాలు చేయవలసిన అవసరం ఉంది.

– యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్
(నేడు ఫాతిమా షేక్ జయంతి)

ఓబీసీల వర్గీకరణతో సమన్యాయం

అభిప్రాయం



కోడెపాక కుమార స్వామి

ఓబీసీ కులాల వర్గీకరణ ఆవశ్యకతను గుర్తించి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2017 అక్టోబర్ 2న ముగ్గురు సభ్యులతో జస్టిస్ రోహిణి అధ్యక్షతన ఒక జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దానికి దేశంలో ఓబీసీ కోటాలో విద్యా–ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు అనుభవిస్తున్న సుమారు 2,640 కులాలను వర్గీకరించి రిజర్వేషన్లు అమలు చేయడంలోని సాధ్యా సాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించడానికి 12 వారాల గడువు ఇచ్చింది. నాటి నుండి కేంద్ర ప్రభుత్వం కమిషన్ పదవీ కాలాన్ని ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి పెంచింది. ఎట్టకేలకు కమిషన్ తన నివేదికను జూలై 2023లో సమర్పించింది. కానీ దాని అమలుకు ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశం అయ్యింది. మరోవైపు దేశవ్యాప్తంగా సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన ఓబీసీ కులాల వారు వర్గీకరణను వ్యతిరేకిస్తున్న వైనం కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో రాజకీయంగా నష్టం కలుగుతుందనే ఆలోచనతో బీజేపీ ప్రభుత్వం ఓబీసీలను వర్గీకరించక పోవచ్చని రాజకీయ విశ్లేషకులు వాదిస్తున్నారు. 2023 ఆగస్టులో సుప్రీం కోర్టు ఏడుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం... 'స్టేట్ అఫ్ పంజాబ్ వర్సెస్ దావీందర్ సింగ్' కేసు తీర్పులో ఆర్టికల్ 341 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లను వర్గీకరణ ద్వారా అమలు చేసుకోవచ్చని తేల్చి చెప్పింది.

ఇప్పటికే దేశంలోని 11 రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లను విద్యా, ఉద్యోగాల్లో వర్గీకరణ ద్వారా అమలు చేస్తున్నారు. బీసీ/ఓబీసీ కులాల మధ్య సామాజిక, విద్య, ఆర్థికపరమైన వ్యత్యాసాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే కేంద్రం 27 శాతం రిజర్వేషన్లను



ఓబీసీలకు అమలు చేస్తున్నప్పటికీ, నేటికీ కేంద్రంలో 1,600 కులాలకు పైగా ఎలాంటి రిజర్వేషన్ల ఫలాలూ పొందలేదని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అధిక జనసంఖ్య కలిగి సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలంగా ఉన్న కులాల వారే అధిక ప్రయోజనం పొందుతున్నారు. కేంద్ర ఓబీసీ జాబితాలోని బీసీ కులాలు నేటి వరకు కేంద్ర ప్రభుత్వంలో రిజర్వేషన్ల ఫలాలను ఏ మేరకు అనుభవించాయనే లెక్కలను, వారి జనసంఖ్యను పరిగణలోకి తీసుకొని శాస్త్రీయంగా జస్టిస్ రోహిణి కమిషన్ ఓబీసీలను 4 గ్రూపులుగా వర్గీకరించి గ్రూప్–ఏలో 1,654 కులాలకు 2 శాతం, గ్రూప్–బీలో 534 కులాలకు 6 శాతం, గ్రూప్–సీలో 328 కులాలకు 9 శాతం, గ్రూప్–డీలో 104 కులాలకు 10 శాతం రిజర్వేషన్లను కేటాయిస్తున్నట్లు ప్రచారం జరిగింది. నిజమేమిటో తెలియదు.


మండల్ కమిషన్‌లోని సభ్యులు ఎల్ఆర్ నాయక్ ఆనాడే (1978–80) ఓబీసీ కులాల మధ్య అసమానతలను గమనించి ఆ కులాలను రెండు గ్రూపులుగా వర్గీకరించి 27 శాతం కోటాను అమలు పరచాలని డిసెంట్ నివేదికను కేంద్రానికి సమర్పించారు. అందులో అణిచివేయబడిన బీసీ కులాలకు 15%, మధ్యస్థ బీసీ కులాలకు 12% రిజర్వేషన్లు కేటాయించారు. కానీ, నాటి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. 1993 నుండి ఉద్యోగాల్లో, 2008 నుండి విద్యాసంస్థల్లో వర్గీకరణ ద్వారా రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే ఓబీసీల్లోని అత్యంత వెనుకబడిన కులాలకు న్యాయం జరిగి ఉండేది. మండల్ కమిషన్‌కు సంబంధించిన తీర్పులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం... బీసీల వర్గీకరణకు ఆమోదం తెలిపింది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఓబీసీ కులాల మధ్య సమన్యాయం కోసం వెంటనే జస్టిస్ రోహిణి కమిషన్ నివేదికను అమలు పరచాలి.

వ్యాసకర్త బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు

జ్ఞాని– జిజ్ఞాసాపరుడు

మానవుడు తన నిజ స్వరూపాన్ని తెలుసుకోవడమే జీవితంలోని వాస్తవమైన చరమ లక్ష్యం. దేనినైతే తప్పనిసరిగా తెలుసుకోవాలో 'దానిని' తెలుసుకొనక పోవడం వలన విలువైన జీవిత కాలం వృథా అవుతుంది. దీన్ని తెలుసుకోవడానికి మనకు సహాయం చేసేవారు ఒక్కరే ఒక్కరు: సద్గురువు!

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

జిజ్ఞాసాపరులు తమ నిజ స్వరూపాన్ని తెలుసుకొనేలా చేయడానికి గురువు అనుసరించు పద్ధతులు వేరు వేరుగా ఉంటాయి. ఈ విషయంలో కచ్చితమైన నియమం లేదు. ఒక అన్వేషకునికి (సాధకునకు) గురువు కేవలం మాటల ద్వారా సూచనలు ఇచ్చి అతని నిజ స్వరూపాన్ని తెలుసుకునేట్లు చేస్తాడు. వేరొక విద్యార్థికి తన క్రియల ద్వారా సహాయం చేస్తాడు. మరొకరి విషయంలో గురువు కేవలం తన కను చూపుల ద్వారా సహాయం చేస్తాడు. అన్వేషకుని యోగ్యతను అనుసరించి పద్ధతి మారుతూ ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ, జిజ్ఞాసాపరుడు వినమ్రతతో ఆత్మను అన్వేషించాలి. అందుకు గురుకృప తోడైతే అది సాఫల్య మవుతుంది.

నా మనస్సును నేను ఏ విధంగా స్వాధీనంలో ఉంచుకోవాలి? అని సాధకుడు బహుశా ప్రశ్నించవచ్చు. ధ్యానం చేయడానికి కూర్చోగానే అనేక ఆలోచనలు వస్తాయి. అనేకమంది సాధకులకు ఇది అనుభవమే. నీవు కలవరపాటు చెందవలసిన అవసరం లేదు. మనస్సు ఉన్నంత కాలమూ మంచి–చెడు ఆలోచనలు ఉండనే ఉంటాయి. సచ్చిదానందాన్ని పొందడానికి నీ నిజ స్వరూపాన్ని తెలుసుకోడానికి ఆలోచనలే అడ్డు అని నిస్సంశయంగా చెప్పవచ్చు. ఆలోచనలు, మనస్సు అనేవి లేనే లేవు అని నీ వివేకాన్ని ఉపయోగించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అవి కేవలం నీడల లాంటివి. తమకు తాముగా వాటికి ఉనికి లేదు. నీ దృష్టి వలన వాటి ఉనికికి కావలసిన శక్తి లభిస్తుంది. చెట్టు ప్రాణం దానికిగల అనేక శాఖలు, వేలకొలది ఆకుల్లో ఉండదు. దాని వేళ్ళలో ఉంటుంది. అదే విధంగా మనస్సు, దాని నుండి జనించు ఆలోచనలకు మూలం ఆత్మలోనే ఉంటుంది. నీవు మనస్సుపై కాక ఆత్మపై దృష్టిని కేంద్రీకరించ చేయాలి. నిరంతరం ఈ విధంగా చేయడం వలన క్రమంగా మనస్సు, ఆలోచనలు వాడిపోతాయి.

కూల్చివేతలు లేని హైవే!

గోపాల్‌పేటకు ముప్పు తప్పించిన ముందుచూపు

- 40 ఏళ్ల క్రితమే రోడ్డుకు 50 అడుగుల అవతల ఇళ్ల నిర్మాణం
- నేడు జాతీయ రహదారిగా మారినా భద్రంగా ఆస్తులు


నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో కొనసాగుతున్న హైవే పనులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: రోడ్డు విస్తరణ అంటేనే జనం గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి. ముఖ్యంగా ప్రధాన రోడ్ల వెంట ఇళ్లు ఉన్నవారైతే తమ నివాసాలకు ఎక్కడ ఎసరు వస్తుందోనని ఆందోళన చెందుతుంటారు. కానీ, ఒక ఊళ్లో మాత్రం జాతీయ రహదారి విస్తరణ చేపట్టినా ఇళ్ల కూల్చివేసే అవసరం ఏర్పడలేదు. 40 ఏళ్ల క్రితం స్థానిక ప్రజాప్రతినిధులు ముందుచూపుతో తీసుకున్న నిర్ణయమే నేడు వారిని కాపాడింది. ఆ గ్రామమే కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల కేంద్రమైన గోపాల్‌పేట. హైదరాబాద్ నుంచి మెదక్, ఎల్లారెడ్డి మీదుగా బాన్సువాడ, రుద్రూర్, బోధన్ వరకు రహదారిని ఎన్‌హెచ్–765 డీగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ రహదారి గోపాల్‌పేట మీదుగా వెళ్తోంది. విస్తరణలో కొన్ని షెడ్లు, కోకాలు మాత్రమే తొలగించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లేవీ పోవడం లేదు.

నాటి సర్పంచ్ ముందుచూపుతోనే..

నాగిరెడ్డిపేట గ్రామ పంచాయతీలో నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట, బంజెర గ్రామాలు ఉండేవి. పంచాయతీ నాగిరెడ్డి పేటలో ఉండగా, మండల కార్యాలయాలన్నీ ప్రధాన రహదారిపై ఉన్న గోపాల్‌పేటలో ఉంటాయి. అందుకే నాగిరెడ్డిపేట మండల కేంద్రంగా గోపాల్ పేటను వ్యవహరిస్తారు. ఈ మధ్యే గోపాల్‌పేట, బంజెర గ్రామాలు పంచాయతీలుగా ఏర్పడ్డాయి. 1981లో ఇక్కడ సర్పంచ్‌గా గెలుపొందిన వి.కిషన్‌రెడ్డి 1992 వరకూ పదవిలో కొనసాగారు. ఆ సమయంలోనే ఈ రోడ్డు ఎప్పటికైనా కీలకంగా మారుతుందని ఆలోచించిన కిషన్‌రెడ్డి.. గ్రామస్తులతో చర్చించి రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 50 ఫీట్లు వదలి తేనే అనుమతులు ఇచ్చే పద్ధతి మొదలుపెట్టారు. దీంతో గ్రామస్తులు రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల అవతలే ఇళ్లు నిర్మించుకున్నారు. అంటే రోడ్డు వెడల్పు వంద ఫీట్లు ఉందన్న మాట. ఇప్పుడు రెండు వరుసల జాతీయ రహదారి, ఇరువైపులా డ్రైనేజీ, సర్వీసు రోడ్లు నిర్మిస్తున్నారు. అయినా ఇళ్లు కూల్చే అవసరం ఏర్పడలేదు. అక్కడక్కడా చిన్న చిన్న అరుగులు, మెట్లు కొంత భాగం మాత్రమే పోతున్నాయి.

వేగంగా రోడ్డు నిర్మాణ పనులు

మెదక్ నుంచి ఎల్లారెడ్డి వరకు 43 కిలోమీటర్ల రోడ్డుకు రూ.399.01 కోట్లు, దీనికి కొనసాగింపుగా ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడ మీదుగా రుద్రూర్ వరకు 51 కిలోమీటర్ల రోడ్డుకు రూ.499.88 కోట్ల వ్యయంతో విస్తరణ పనులు మొదలయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి.


నవజాత శిశువును తండ్రి చితిపై నుంచి దాటిస్తున్న కుటుంబసభ్యులు, కులపెద్దలు

నువ్వూ వీరుడివి కావాలి కన్నా..

- అమర జవాన్ చితికి నవజాత శిశువుతో అంత్యక్రియలు

చర్ల: అమరుడైన వీర జవాన్ చితికి.. అతని రెండు నెలల నవజాత శిశువుతో నిప్పంటించి అంత్యక్రియలు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కుట్రు – బెద్రి మార్గంలోని అంబేలి గ్రామం వద్ద ఈనెల 6న మావోయిస్టుల మందుపాతర పేలుడులో.. తొమ్మిది మంది మృతి చెందడం తెలిసిందే. వారిలో దంతెవాడ జిల్లా గుమల్నార్ గ్రామానికి చెందిన బస్తర్ ఫైటర్స్ జవాన్ సుదర్శన్ వెట్టి కూడా ఉన్నాడు. పోలీసు ఉన్నతాధికారులు జవాన్ మృతదేహాన్ని మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించగా.. స్వగ్రామంలో బుధవారం పోలీసు లాంఛనాలు, ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. సుదర్శన్‌కు రెండేళ్ల క్రితమే వివాహం కాగా, ప్రస్తుతం రెండు నెలల బాబు ఉన్నాడు. హిందూ, ఆదివాసీల సంప్రదాయం ప్రకారం శిశువును చితిపై నుంచి రెండుసార్లు అటూ ఇటూ దాటించి.. దహన సంస్కారాలు నిర్వహించారు. 'తండ్రిలాగే నువ్వూ వీరుడివి కావాలి కన్నా'.. అని ఆకాంక్షించారు.

భద్రగిరికి ముక్కోటి శోభ

- నేడు తెప్పోత్సవం, రేపు ఉత్తర ద్వార దర్శనం
- శ్రీకృష్ణావతారంతో ముగిసిన అలంకరణలు


శ్రీకృష్ణావతారంలో భద్రాద్రి రామయ్య

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం పుణ్యక్షేత్రం ముక్కోటి శోభ సంతరించుకుంది. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం తెప్పోత్సవం, శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, వివిధ రకాల పూలు, చలువ పందిళ్లు, షామియానాలతో అందంగా ముస్తాబు చేశారు. గోదావరి ఒడ్డున స్వామి వారికి తెప్పోత్సవం జరిపే హంస వాహనాన్ని అందంగా తీర్చిదిద్ది ట్రయల్ రన్ నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం టికెట్లు, వసతి గృహాల బుకింగ్‌ను భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం భద్రాద్రి రామయ్య చివరిదైన శ్రీకృష్ణావతారంలో దర్శనమిచ్చారు.

ఏరు ఉత్సవంతో పర్యాటక శోభ..

ఈ ఏడాది ప్రభుత్వం ఏరు ఉత్సవం పేరుతో ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న భద్రాచలంలో పర్యాటకులకు కొత్త అనుభూతిని ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయడంతో పర్యాటక శోభ సైతం సంతరించుకుంది. భద్రాచలంలో రాత్రి బస, ఆదివాసీ వంటకాల ఆతిథ్యం, మరుసటి రోజు బొజ్జిగుప్ప, కిన్నెరసాని, బెండాలపాడు, ఐటీడీఏలో గిరిజన మ్యూజియంలో గిరి పల్లె సందర్శనలు ఉంటాయి. దీనికిగాను అధికారులు రూ. 6 వేలు ప్యాకేజీగా నిర్ణయించారు.

2023లో 31,428
2024లో 41,138

తెలంగాణ జైళ్లలో పెరిగిన ఖైదీల సంఖ్య

- వార్షిక నివేదిక విడుదలలో జైళ్లశాఖ డీజీ సౌమ్యామిశ్రా



జైళ్ల శాఖ వార్షిక నివేదిక విడుదల కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీ సౌమ్య మిశ్రా. చిత్రంలో ఐజీలు రాజేశ్, మురళిబాబు, డీఐజీలు సంపత్, శ్రీనివాస్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జైళ్లలో 2023తో పోలిస్తే 2024లో ఖైదీల సంఖ్య పెరిగినట్టు జైళ్ల శాఖ డీజీ సౌమ్యామిశ్రా తెలిపారు. 2023లో మొత్తం 31,428 మంది ఖైదీలు ఉండగా.. 2024లో ఖైదీల సంఖ్య 41,138 మందికి చేరిందన్నారు. ప్రధానంగా ఎన్‌డీపీఎస్ కేసులలో నిందితుల సంఖ్యలో పెరు గుదల ఉందన్నారు. 2023లో 3,688 ఖైదీలు ఎన్‌డీ పీఎస్ కేసులలో రాగా, 2024లో ఈ సంఖ్య 6,311కి చేరినట్టు తెలిపారు. తెలంగాణ జైళ్లశాఖ ఇతర రాష్ట్రాల జైళ్లతో పోలిస్తే సంస్కరణలు, ప్రత్యేక శిక్షణలు, ఖైదీల సంక్షేమం, సాంకేతికత వినియోగంలో ఎంతో ముందంజలో ఉందని సౌమ్యామిశ్రా తెలిపారు. ఈ మేరకు బుధవారం చంచల్‌గూడలోని సికా (స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరక్షనల్ అడ్మినిస్ట్రేషన్)లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ జైళ్లశాఖ 2024 వార్షిక నివేదికను ఐజీలు రాజేశ్, మురళీబాబు ఇతర ఉన్నతాధికారులతో కలిసి సౌమ్యా మిశ్రా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జైళ్లలో తీవ్రవాదుల సంఖ్య తగ్గినట్టు తెలిపారు. 2023లో 52 మంది ఈ తరహా ఖైదీలు ఉండగా, 2024లో ఆ సంఖ్య 36కి తగ్గినట్టు చెప్పారు. హత్యకేసులలో ఖైదీల సంఖ్య 2023లో 2,511 ఉండగా, 2024కు అది 2,754కు చేరిందన్నారు. ఖైదీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. 2024లో 1,045 మంది ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం అందించినట్టు తెలిపారు. అదేవిధంగా అర్హులైన 552 మంది ఖైదీలకు రూ.1,73,08,500 రుణాలు మంజూరు చేశామన్నారు. తెలంగాణ జైళ్లలో ఇప్పటివరకు 12,650 మంది ఖైదీలను అక్షరాస్యులుగా మార్చామని తెలిపారు. తెలంగాణ జైళ్లశాఖ చరిత్రను పౌరులకు తెలియజెప్పేలా త్వరలోనే జైల్ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్టు సౌమ్యా మిశ్రా తెలిపారు. సమావేశంలో ఐజీలు రాజేశ్, మురళీబాబు, డీఐజీలు శ్రీనివాస్, సంపత్, సూప రింటెండెంట్లు నవాబ్ శివకుమార్ గౌడ్, రామచంద్రం, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాకు అంతా సమానమే..

జైళ్లశాఖ నిబంధనల మేరకే ఏ ఖైదీ విషయంలోనైనా చర్యలు తీసుకుంటున్నామని, చట్టానికి ఎవరూ అతీతులు కారని డీజీ సౌమ్యామిశ్రా స్పష్టం చేశారు. నటుడు అల్లు అర్జున్ విషయంలోనూ తాము జైల్ మాన్యువల్ ప్రకారమే నడుచుకున్నామని వెల్లడించారు. జైలు అధికారులుగా తాము ఎవరినీ వీఐపీలుగా భావించబోమని, అందరు ఖైదీలతో సమానంగా చూస్తామన్నారు. కోర్టు నుంచి ప్రత్యేక ఆదేశాలున్న వారి విషయంలో కోర్టు ఆదేశాల మేరకే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెలంగాణ జైళ్లలో ఖైదీల సంఖ్య ఇలా...

ఏడాది	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
2023	29,059	2,332	37	31,428
2024	38,239	2,875	24	41,138

పరిహారం కోసం మహిళ ఆత్మహత్యాయత్నం

- 'చిన్న కాళేశ్వరం' కెనాల్ పనులు అడ్డుకున్న ఎలికేశ్వరం వాసులు


పురుగు మందు తాగిన కమలను ఆస్పత్రికి తీసుకువస్తున్న దృశ్యం

కాళేశ్వరం: జయశంకర్ భూపాల పల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించతలపెట్టిన చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కెనాల్ పనుల వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఈ ప్రాజెక్టు కింద భూమి కోల్పో తున్న ఓ మహిళ బుధవారం పురుగు మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఎలికేశ్వరం గ్రామ శివారులో తమ భూమికి న్యాయమైన పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు కెనాల్ పనులను అడ్డుకున్నారు. అయితే అధికారులు దీనిపై స్పందించక పోవడంతో నిర్వాసిత రైతులు ఆందోళనకు దిగారు. జేసీబీని, పోలీసు వాహనాన్ని, ఇతర యంత్రాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ఎలికేశ్వరం గ్రామానికి చెందిన రాళ్లబండి కమల అనే మహిళ మనస్తాపానికి గురై పురుగు మందు తాగింది. వెంటనే పక్కన ఉన్నవారు ఆమెను నిలువరించి, మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమెను వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ ఆస్పత్రికి చేరుకొని కమల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమల కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అరగంట పాటు నిరసన ప్రదర్శన చేశారు. తమకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. దీంతో పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. ఎలికేశ్వరంలో నిర్వాసిత రైతులను హౌస్ అరెస్టు చేసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

10 నుంచి యాదగిరి గుట్టలో అధ్యయనోత్సవాలు

- 6 రోజుల పాటు పూజలు రద్దు


వైకుంఠ ఏకాదశికి ఏర్పాటు చేస్తున్న గ్యాలరీలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీ నుంచి 15 తేదీ వరకు శ్రీ స్వామి వారి అధ్యయనోత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల పాటు జరిగే అధ్యయన ఉత్సవాలలో.. మొదటి రోజు శ్రీ స్వామి వారు గరుడ వాహనంపై వైకుంఠనాథుడిగా దర్శనం ఇస్తారని పేర్కొన్నారు. చివరి రోజు 15వ తేదీన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి అలంకారంలో దర్శనం ఇస్తారని వెల్లడించారు. ఆరు రోజుల పాటు ఆలయంలో శ్రీ స్వామి వారి అలంకార తిరు, మాడవీధి సేవలు ఉంటాయన్నారు. భక్తులతో నిర్వహించే శ్రీ సుదర్శన నారసింహ హోమం, నిత్య శాశ్వత కల్యాణం, నిత్య శాశ్వత బ్రహ్మోత్సవాలు, జోడు సేవలను రద్దు చేసినట్లు ఈవో చెప్పారు. 10వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఆలయంలో నిర్వహించే లక్ష పుష్పార్చన కైంకర్య, ఆర్జిత నిజాభిషేకం, సహస్రనామార్చన పూజలను సైతం రద్దు చేశామని వెల్లడించారు. 10వ తేదీన వైకుంఠ (ముక్కోటి) ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ స్వామి వారి ఆలయాన్ని వేకువజామున 2 గంటలకే తెరవనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

తెలంగాణకు ప్రత్యేక విత్తన చట్టం తేవాలి

- 'విత్తన సమస్యలు–రైతు ప్రయోజనాలు'సదస్సులో రైతు నాయకులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతాంగానికి వ్యవసాయంపై భరోసా ఇచ్చేలా తెలంగాణలో విత్తన చట్టం తేవాల్సిన అవసరముందని పలువురు రైతు నాయకులు అభిప్రాయపడ్డారు. జన్యుమార్పిడి విత్తనాల వల్ల భూసారం నశించిపోయిందని, అనారోగ్య పంటలతో సమాజాన్ని వినాశనం వైపు నడిపించే పరిస్థితులు ఎదురయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. హాకా భవన్‌లోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో బుధవారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'విత్తన సమస్యలు–రైతు ప్రయోజనాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకేట అన్వేశ్‌రెడ్డి అధ్యక్షత వహించగా, పలు పార్టీల రైతు సంఘాల నేతలు పశ్య పద్మ (సీపీఐ), సారంపల్లి మల్లారెడ్డి, సాగర్ (సీపీఎం), శ్రీధర్ రెడ్డి, రాజారెడ్డి (భారతీయ కిసాన్ సంఘ్), అయ్యంగారి సురేందర్ రెడ్డి (భారతీయ ఆగ్రో ఎకనమిక్ సొసైటీ), కృష్ణవేణి (డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ), నరసింహారెడ్డి దొంతి (వ్యవసాయ విధాన విశ్లేషకులు) తదితరులు హాజరై మార్కెట్లో లభిస్తున్న విత్తనాలతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి చర్చించారు. ఈ మేరకు 21 తీర్మానాలను అఖిలపక్ష సమావేశం ఆమోదించినట్లు సమావేశం అనంతరం కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి తెలిపారు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడానికి జిల్లాస్థాయిలో నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలని సమావేశం అభిప్రాయపడిందని వివరించారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల సంఘం తరఫున ఎం.వెంకటయ్య, నరసింహ, విశ్రాంత వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ తరఫున ఆదిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విషాహారం

- ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విషాహారంతో ఆరుగురు విద్యార్థులు అస్వస్థులయ్యారు. మంగళవారం రాత్రి గుడాలు, బుధవారం ఉదయం కిచిడీ తిన్న విద్యార్థులు సాయంత్రం వాంతులు విరోచనాలతో బాధపడ్డారు. విషయం సిబ్బందికి చెప్పడంతో వార్డెన్ రేవా స్థానికంగా వైద్యం చేయించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో విద్యార్థినులు అరణ్య, పి.నందిని, జి.కల్యాణి, సిరివల్లిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బుధవారం రాత్రి హాస్టల్‌కు చేరుకున్నారు. నాసిరకం భోజనం పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


లాస్ ఏంజెలెస్ దగ్గర్లోని పసిఫిక్ పాలిసేడ్స్ పట్టణ జనావాసాలను కార్చిచ్చు దహించివేస్తున్న దృశ్యం


చీకట్లో ప్రాణభయంతో పరుగులు తీస్తున్న స్థానికులు

కార్చిచ్చు గుప్పిట్లో లాస్ ఏంజెలెస్

వందలాది నివాస గృహాలు, చెట్లు దహనం

- సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న వేలాది మంది జనం
- మంటల్లో కాలి బూడిదైన వాహనాలు
- 5,700 ఎకరాల భూమిపై కార్చిచ్చు ప్రభావం
- ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న అమెరికా అధ్యక్షుడు బైడెన్

లాస్ ఏంజెలెస్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో కార్చిచ్చు రగలింది. వేగంగా విరుచుకు పడిన దావానలం ధాటికి వందలాది నివాస గృహాలు కాలి బూడిదయ్యాయి. ఇద్దరు మృత్యువాత పడ్డారు. నాలుగు వైపుల నుంచి మంటలు దూసుకొస్తున్నాయి. వేలాది మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. మంగళవారం సాయంత్రం లాస్‌ఏంజెలెస్‌కు ఈశాన్య ప్రాంతంలోని ఇన్‌లాండ్ ఫూట్‌హిల్స్‌లో ఉన్న చిట్టడవిలో మంటలు చెలరేగాయి. క్రమంగా నగరం వైపు దూసుకొచ్చాయి. బలమైన ఈదురు గాలులు వీచడంతో మంటల తీవ్రత మరింత పెరిగినట్లు తెలిసింది. బుధవారం ఉదయం కల్లా పరిస్థితి విషమించింది. మరికొన్ని ప్రాంతాల నుంచి మంటలు వ్యాప్తి చెందాయి. సముద్ర తీరం వెంబడి హాలీవుడ్ నటులు, సంపన్నులు నివాసం ఉండే పసిఫిక్ పాలీసేడ్స్ ఏరియాలోనూ మంటలు వ్యాపించాయి. ఈటాన్ కెన్యాన్ సమీపంలోని అల్టాడెనా, సిల్మార్ సబర్బ్ వరకు విస్తరించాయి. మొత్తానికి లాస్‌ఏంజెలెస్ సిటీని మంటలు చుట్టుముట్టాయి. 5,700 ఎకరాలకుపైగా భూమిపై కార్చిచ్చు ప్రభావం ఉండడం గమనార్హం. 1,400 మంది అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలు ఆర్పివేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఆసుపత్రుల్లోని రోగులను బయటకు తరలించారు. నగరంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెద్ద సంఖ్యలో చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మరోవైపు జనమంతా ఒక్కసారిగా బయటకు రావడంతో రోడ్లపై రాకపోకలు స్తంభించాయి. వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఎమర్జెన్సీ వాహనాలు, అంబులెన్స్‌లకు దారి లేకపోవడంతో బుల్డోజర్ల సాయంతో కార్లను పక్కకు తప్పించారు. గంటకు 97 కిలోమీటర్ల వేగంతో మంటలు వ్యాపించడం గమనార్హం. పరిస్థితి ఇంకా అదుపులోకి రాలేదని అగ్ని మాపక సిబ్బంది చెప్పారు. కొండల దిగువ ప్రాంతాల్లో మంటలు మరింత చెలరేగే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ చాలారోజులుగా వర్షాలు పడకపోవడంతో గడ్డి, చెట్లు ఎండిపోయాయి. దాంతో మంటల తీవ్రత అధికంగా ఉంది. లాస్ ఏంజెలెస్ కార్చిచ్చుపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్‌లాండ్ రివర్‌సైడ్ కౌంటీ పర్యటనను రద్దు చేసుకొని, కార్చిచ్చుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఆయన లాస్ ఏంజెలెస్‌లోని ఓ హోటల్‌లో మకాం వేశారు. హోటల్ గది నుంచి పొగలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పరిస్థితిని ఆయన ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. కార్చిచ్చు వల్ల ఎంతమేరకు నష్టం వాటిల్లిందన్న సంగతి ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. 13 వేలకుపైగా నివాసాలకు ముప్పు ఉన్నట్లు తెలుస్తోంది. 30 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటూ అధికారులకు ఆదేశాలు అందాయి. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. కార్చిచ్చును స్వయంగా పరిశీలించారు. చాలా ఇళ్లు దహనమయ్యాయని ప్రకటించారు. హాలీవుడ్ థీమ్ పార్క్, యూనివర్సల్ సిటీవాక్‌ను మూసివేసినట్లు యూనివర్సల్ స్టూడియో ప్రకటించింది.

మంటల్లో చార్టర్ హైస్కూల్

లాస్ ఏంజెలెస్‌లోని పసిఫిక్ పాలీసేడ్స్ ప్రాంతంలోని ప్రఖ్యాత చార్టర్ హైస్కూల్ వరకు మంటలు వ్యాపించాయి. ధనవంతుల బిడ్డలు ఈ పాఠశాలలో విద్య అభ్యసిస్తుంటారు. పలు హాలీవుడ్ చిత్రాల్లోనూ ఈ స్కూల్‌ను చూడొచ్చు. కార్చిచ్చు కారణంగా పాఠశాలల్లో కొంత భాగానికి మంటలు అంటుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఆ సమయంలో స్కూల్‌లో కొందరు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. మంటలు వ్యాపించగానే వారిని బయటకు పంపించారు. స్కూల్‌ను వెంటనే మూసివేశారు. ఇటువైపు రావొద్దని పిల్లలకు, వారి తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం సూచించింది. ఇక్కడ క్రీడాపరికరాలు, బోధనా పరికరాలు కాలిపోయాయి. చార్టర్ హైస్కూల్‌కు సమీపంలోనే ఉన్న పాలీసేడ్స్ చార్టర్ ఎలిమెంటరీ స్కూల్ సైతం మంటల్లో చిక్కుకున్నట్లు తెలిసింది. లాస్ ఏంజెలెస్‌కు శివారు లాంటి పసిఫిక్ పాలీసేడ్స్ ప్రాంతంలో టామ్ హాంక్స్, జెన్నీఫర్ అనిస్టన్ వంటి హాలీవుడ్ ప్రముఖుల నివాసాలు ఉన్నాయి. లాస్‌ఏంజెలెస్ సిటీ కాలిఫోర్నియా రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతంలో ఉంది. ఈ ప్రాంతంలో ప్రతిఏటా జనవరిలో బలమైన ఈదురు గాలులు వీస్తుంటాయి. అగ్నికి ఆజ్యం తోడైనట్లు ఈ గాలులకు నిప్పు తోడైతే కార్చిచ్చుగా మారుతూ ఉంటుంది.

కళ్ల ముందే విధ్వంసం

లాస్ ఏంజెలెస్‌లో మంటల ధాటికి నిమిషాల వ్యవధిలోనే ఇళ్లు కుప్పకూలాయి. కళ్ల ముందే జరుగుతున్న విధ్వంసాన్ని చూసి జనం భయంతో వణికిపోయారు. ప్రాణాలు దక్కించుకొనేందుకు పరుగులు తీశారు. తరుముకొస్తున్న మంటల నుంచి తప్పించుకోవడానికి కాలినడకనే ముందుకు కదిలారు. ఇళ్లలో ఉన్న కార్లు బయటకు తీసే వీల్లేకుండాపోయిందని బాధితులు చెప్పారు. చేతికందిన వస్తువులు తీసుకొని బయటకు వచ్చామని అన్నారు. వందలాది కార్లకు నిప్పంటుకుంది. అవి బూడిద కుప్పలుగా మారిపోయాయి. ఇళ్లలోని పెంపుడు జంతువులు సైతం మరణించాయి. దట్టమైన పొగ అలుముకుంది. లాస్ ఏంజెలెస్‌లో గవర్నర్ గవిన్‌న్యూసమ్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి అగ్ని మాపక యంత్రాలు, సిబ్బందిని రప్పిస్తున్నారు.


పసిఫిక్ పాలిసేడ్స్‌లో కాలిపోయిన ఓ ఇల్లు

కార్చిచ్చు	ప్రభావం (ఎకరాలు)
పాలీసేడ్స్ ఫైర్	2,925
ఈటాన్ ఫైర్	2,227
హర్స్ట్ ఫైర్	505
వుడ్లీ ఫైర్	75
టైలర్ ఫైర్	15

నేనొచ్చేలోపే బందీలను వదిలేయండి

లేదంటే తీవ్ర పరిణామాలుంటాయి ● హమాస్ సాయుధులకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: హమాస్– ఇజ్రాయెల్ యుద్ధంలో బందీలుగా మారిన ఇజ్రాయెల్, అమెరికన్ పౌరుల విడుదలపై కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్ శివారు ప్రాంతాలపై దాడిచేసి అపహరించుకుపోయిన అమాయకులను జనవరి 20వ తేదీలోపు విడుదలచేయకుంటే దారుణ పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హమాస్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీచేశారు. ఫ్లోరిడాలోని మార్–ఏ–లాగో రిసార్ట్‌లో జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఇప్పటికే ఖతార్ వేదికగా హమాస్ ప్రతినిధులు, ఇజ్రాయెల్ ఉన్నతాధికారులకు మధ్య కాల్పుల విరమణ, బందీల విడుదలపై చర్చలు జరుగుతున్న విషయం తెల్సిందే. ఈ అంశాన్ని ట్రంప్ ప్రస్తావించారు.



అంత అమానుషంగా ప్రవర్తిస్తారా?

''ఇప్పుడు జరుగుతున్న సంప్రదింపుల ప్రక్రియకు నేను భంగం కల్గించదల్చుకోలేదు. నేను అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టడానికి ఇంకా రెండు వారాల సమయం ఉంది. ఈలోపు కాల్పుల విరమణ ఒప్పందం కుదరాల్సిందే. బందీలను క్షేమంగా తిరిగి పంపకపోతే హమాస్ తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోక తప్పదు. నేను అధ్యక్షుడిని అయ్యాక పశ్చిమాసియా దారుణ పరిస్థితులను చవిచూస్తుంది. ఇంతకు మించి హమాస్‌కు నేనేం చెప్పను. అసలు వాళ్లు అలా దాడి చేయకుండా ఉండాల్సింది. వాళ్లను కిడ్నాప్ చేయకుండా ఉండాల్సింది. వాళ్లు ఇంకా బందీలుగా ఉండకూడదు. బందీలను విడిచి తీసుకురావాలని అమెరికా, ఇజ్రాయెల్ ప్రజలు నన్ను వేడుకున్నారు. కనీసం మా అబ్బాయి మృతదేహమైనా మాకు అప్పగిస్తారా? అని కొందరు తల్లులు, తండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కిడ్నాప్ చేసి తీసుకెళ్తూ అమ్మాయిలను జడలు పట్టి వాహనాల్లో పడేశారు. ఆ రోజు కిడ్నాప్‌కు గురైన అమ్మాయి చనిపోయింది. అసలు అమ్మాయిలతో అంత అమానుషంగా ప్రవర్తిస్తారా?'' అని ట్రంప్ ఆగ్రహంగా మాట్లాడారు.

చివరి దశలో చర్చలు

పశ్చిమాసియా పర్యటన ముగించుకుని వచ్చిన ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవెన్ చార్లెస్ విట్కోఫ్ సైతం మాట్లాడారు.'' చర్చలు చివరి దశలో ఉన్నాయి. దోహాలో చర్చలు ఇంకా ఎందుకు ముగింపునకు రాలేదనేది నేను ఇప్పుడే వెల్లడించలేను. కాబోయే అధ్యక్షుడి హెచ్చరికలను హమాస్ దృష్టిలో పెట్టుకోవాలి'' అని విట్కోఫ్ అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలైతే ఇద్దరు అమెరికన్లుసహా 34 మంది బందీలను విడుదలచేసేందుకు సుముఖంగా ఉన్నట్లు ఖతార్ చర్చల్లో హమాస్ ప్రతినిధులు చెప్పారు. జో బైడెన్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వం 2023 అక్టోబర్ ఏడున దాడి జరిగిన కొద్దివారాలకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని దాదాపు ఓ కొలిక్కి తెచ్చింది. ఆ సమయంలో డజన్ల మంది బందీలను హమాస్ విడుదల చేసింది. తర్వాత హమాస్, ఇజ్రాయెల్ పరస్పర దాడులు అధికమవడంతో బందీల విడుదల ప్రక్రియ హఠాత్తుగా ఆగిపోయింది. ఆ తర్వాత కాల్పుల విరమణ, బందీల విడుదలపై చర్చల్లో పీఠముడి పడి ఇంతవరకు ఓ కొలిక్కిరాలేదు. బందీలను విడిచించాలని ట్రంప్ హెచ్చరించిన వేళ గాజాలో ఒక బందీ మృతదేహాన్ని ఇజ్రాయెల్ బలగాలు గుర్తించాయి. మరో మృతదేహం లభించినా అది ఎవరిది అనేది ఇంకా తెలియాల్సి ఉంది. మృతిచెందిన బందీని యూసెఫ్ అల్ జైదానీగా గుర్తించారు.

స్పేడెక్స్ ఉపగ్రహాల డాకింగ్ ప్రక్రియ వాయిదా

బెంగళూరు: స్పేడెక్స్ ప్రయోగంలో భాగంగా గురువారం జరగాల్సిన డాకింగ్ ప్రక్రియను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) వాయిదా వేసింది. ఈ విషయం బుధవారం వెల్లడించింది. గత ఏడాది డిసెంబర్ 30న ప్రయోగించిన ఎస్‌డీఎక్స్01(ఛేజర్), ఎస్‌డీఎక్స్02(టార్గెట్) ఉప గ్రహాల అనుసంధానమే ఈ డాకింగ్ ప్రక్రియ. ఒకే కక్ష్యలోని ఈ రెండు శాటిలైట్లు పరస్పరం అనుసంధానం కానున్నాయి. కొద్దిసేపటి తర్వాత విడిపోతాయి. వాస్తవానికి ఈ డాకింగ్ ప్రక్రియ ఈ నెల 7వ తేదీన జరగాల్సి ఉండగా, అనివార్య కారణాలతో 9వ తేదీకి వాయిదా వేశారు. చివరి నిమిషంలో మరోసారి వాయిదా పడింది. రెండు ఉపగ్రహాలు ప్రస్తుతం సురక్షితంగా ఉన్నాయని, డాకింగ్ ఎప్పుడు చేపడతామన్నది తర్వాత వెల్లడిస్తామని ఇస్రో పేర్కొంది.

నగదు రహిత చికిత్స పథకం తీసుకురావాలి

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్స అందించే విషయంలో సుప్రీంకోర్టు కీలకమైన తీర్పు వెలువరించింది. ప్రమాదం జరిగిన తర్వాత గోల్డెన్ అవర్ కాలంలో బాధితులకు నగదు రహిత వైద్య చికిత్స అందించేలా ఒక పథకాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మోటార్ వాహనాల చట్టం–1988లోని సెక్షన్ 162(2) ప్రకారం ఈ పథకం అమల్లోకి తేవాలని పేర్కొంది. ఈ ఏడాది మార్చి 14వ తేదీలోగా పథకాన్ని రూపొందించి, అమలు చేయాలని స్పష్టంచేసింది. దీనివల్ల విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొంది. సెక్షన్ 2(12–ఎ) ప్రకారం గోల్డెన్ అవర్ అంటే ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంట. రోడ్ ప్రమాదంలో క్షతగాత్రులుగా మారిన వారికి తొలి గంటలో చికిత్స అందిస్తే వారి ప్రాణాలు కాపాడే అవకాశాలు అధికంగా ఉంటాయని డాక్టర్లు చెబుతున్నారు. చికిత్స ఆలస్యమవుతున్న కొద్దీ ప్రాణాలు కాపాడడం కష్టమవుతుందని పేర్కొంటున్నారు. చట్టప్రకారం గోల్డెన్ అవర్‌లో బాధితులకు నగదు రహిత చికిత్స అందించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ ఏడాది మార్చి 14వ తేదీలోగా పథకాన్ని తీసుకురావాల్సిందేనని, ఈ గడువును పొడిగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది.

చంద్రయాన్-4, గగన్‌యాన్‌పై ప్రత్యేక దృష్టి

- ప్రముఖ రాకెట్ సైంటిస్టు డాక్టర్ వి.నారాయణన్ వెల్లడి
- ఇస్రో నూతన చైర్మన్‌గా నియమితులైన నారాయణన్

తిరువనంతపురం/చెన్నై: చంద్రయాన్-4, గగన్‌యాన్ వంటి ప్రయోగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నూతన చైర్మన్‌గా నియమితులైన ప్రముఖ రాకెట్ సైంటిస్టు డాక్టర్ వి.నారాయణన్ చెప్పారు. ఇస్రో ఇప్పటికే ఎన్నో విజయాలు సాధించిందని అన్నారు. రాబోయే కాలంలో ఎన్నో ముఖ్యమైన మిషన్లు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. తనను ఇస్రో చైర్మన్‌గా, 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్' కార్యదర్శిగా కేంద్ర ప్రభుత్వం నియమించడం పట్ల ఆనందం వ్యక్తంచేశారు. ఇస్రోకు గతంలో ఎంతోమంది ప్రఖ్యాత సైంటిస్టులు నేతృత్వం వహించారని, అలాంటి ప్రతిష్టాత్మక సంస్థలో తాను భాగస్వామి కావడం పట్ల చాలా సంతోషంగా ఉందని, ఇదొక గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఇస్రో చైర్మన్‌గా తన నియామకంపై తొలుత ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) నుంచి తనకు సమాచారం అందిందని తెలిపారు. అన్ని విషయాలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయిస్తారని, పీఎంఓ సమాచారం చేరవేస్తుందని అన్నారు. ఇటీవలి కాలంలో ఇస్రో చేపడుతున్న ప్రయోగాలన్నీ విజయవంతం అవుతున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రయోగం గగన్‌యాన్ అని వెల్లడించారు. శ్రీహరికోట నుంచి నావిగేషన్ శాటిలైట్ ఎన్‌వీఎస్-02ను ప్రయోగించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. అమెరికాకు చెందిన వాణిజ్యపరమైన ఉపగ్రహాన్ని ఇస్రో మార్క్-3 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపించబోతున్నామని, అలాగే గగన్‌యాన్‌లో భాగంగా రాకెట్ తయారీ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. చంద్రయాన్-4లో భాగంగా చంద్రుడి దక్షిణ ధ్రువం నుంచి నమూనాలు సేకరించి తీసుకురావాలని సంకల్పించామని చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే కార్యాచరణ మొదలైందని తెలిపారు. అంతరిక్షంలో సొంతంగా స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేసుకోవడం మన లక్ష్యమని, ఇందుకు ప్రధాని మోదీ ఇప్పటికే అనుమతి మంజూరు చేశారని వి.నారాయణన్ చెప్పారు. ఈ స్పేస్ స్టేషన్‌లో ఐదు మాడ్యూల్స్ ఉంటాయని, ఇందులో మొదటి మాడ్యూల్‌ను 2028లో ప్రయోగించడానికి ఆమోదం లభించిందని పేర్కొన్నారు.

నారాయణన్‌కు అభినందనల వెల్లువ

ఇస్రో చైర్మన్‌గా నియమితులైన వి.నారాయణన్‌కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు. ఆయన నియామకం పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ తదితరులు హర్షం వ్యక్తంచేశారు. తమిళనాడులో సాధారణ కుటుంబంలో జన్మించిన నారాయణన్ ఇస్రోకు చైర్మన్ కావడం సంతోషంగా ఉందన్నారు. నారాయణన్ నేతృత్వంలో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



నాలుగు దశాబ్దాల అనుభవం

తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపంలోని మేలకట్టు గ్రామంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో వి.నారాయణన్ జన్మించారు. తొమ్మిదో తరగతి వరకు ఆయనకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రాలేదు. ఇబ్బందులు ఎదుర్కొంటూనే చదువులో రాణించారు. తమిళనాడులో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. డిప్లొమో ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో మొదటి ర్యాంక్ సాధించారు. ఏఎంఐఈ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. 1989లో ఐఐటీ–ఖరగ్‌పూర్‌లో క్రయోజెనిక్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చదివారు. 2021లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పొందారు. 1984లో ఇస్రోలో అడుగుపెట్టారు. విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్‌లో సేవలందించారు. ప్రొపల్షన్ సిస్టమ్స్ అభివృద్ధికి కృషి చేశారు. ఎన్నో రాకెట్ ప్రయోగాల్లో కీలక పాత్ర పోషించారు. రాకెట్, స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్ రంగంలో నారాయణన్‌కు నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. చంద్రయాన్–3 విజయానికి దోహదపడిన జాతీయ స్థాయి నిపుణుల కమిటీకి ఆయన అధ్యక్షత వహించారు. ద్రవ, ఘన ఇంధన మోటార్‌లను రూపొందించడంలో నిపుణుడిగా పేరుగాంచారు. ప్రస్తుతం ఆయన ఇస్రోకు చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్(ఎల్‌పీఎస్సీ) డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 14న ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు.

16 లక్షల ఓట్లు ఎక్కువ నమోదు చేశారు

మహారాష్ట్ర ఎన్నికలపై కాంగ్రెస్ ఆరోపణ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఉన్న వయోజనుల సంఖ్య కంటే ఎన్నికల కమిషన్ (ఈసీ) 16 లక్షల ఎక్కువ ఓట్లను నమోదు చేసిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కేవలం నాలుగు నెలల్లో 50 లక్షల ఓట్లు పెరిగిపోయాయని కాంగ్రెస్ డేటా అనలటిక్స్ డిపార్ట్‌మెంట్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి బుధవారం ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న వయోజనుల కంటే మొత్తం 16 లక్షల ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయన్నారు. కవిత్వం చెప్పి తప్పించుకునే బదులు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) తమ ప్రశ్నలకు నేరుగా సమాధానాలు చెప్పాలన్నారు. బాధ్యత కలిగిన అధికారిగా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 2019 నవంబరులో నేషనల్ కమిషన్ ఫర్ పాపులేషన్ మహారాష్ట్రలో 9.54 కోట్ల వయోజనులు ఉండవచ్చని అంచనా వేసిందని, ఎన్నికల కమిషన్ అసెంబ్లీకి తయారుచేసిన ఓటర్ల జాబితాలో మొత్తం 9.70 కోట్ల ఓటర్లు ఉన్నారని చక్రవర్తి ఎత్తిచూపారు. అంటే 16 లక్షల ఓటర్లను అధికంగా నమోదు చేసినట్లు తేలుతోందన్నారు.

జర్నలిస్టు ప్రీతిష్ నంది కన్నుమూత

ముంబై: జర్నలిస్టు, కవి, సినీ నిర్మాత ప్రీతిష్ నంది (73) కన్నుమూశారు. దక్షిణ ముంబైలోని తన గృహంలో నంది గుండెపోటుకు గురై చనిపోయారు. బుధవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వర్తించారు. నంది మరణవార్త తనను తీవ్ర విషాదంలో ముంచెత్తిందని ప్రముఖ నటుడు, ఆయన సన్నిహితుడు అనుపమ్ ఖేర్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రీతిష్ నంది శివసేన నుంచి రాజ్యసభ సభ్యునిగా కూడా పనిచేశారు. ప్రీతిష్ నంది కమ్యూనికేషన్ బ్యానర్ కింద సుర్, కాంటే, ఝంకార్ బీట్స్, చమేలీ, హజారో క్వాయిషే ఐసే, ప్యార్ కే సైడ్ ఎఫెక్ట్స్ చిత్రాలను నిర్మించారు. ఆంగ్లంలో 40 పుస్తకాలు రాశారు. బెంగాలీ, ఉర్దూ, పంజాబీల నుంచి కవిత్వాన్ని ఇంగ్లిష్‌లోకి అనువదించారు.

అస్సాం బొగ్గు గనిలో ఒకరి మృతదేహం లభ్యం

ఇంకా లభించని 8మంది కార్మికుల ఆచూకీ

గౌహతి: అస్సాంలోని దిమా హసావో జిల్లాలో బొగ్గు గనిలోకి వరద నీరు పోటెత్తిన ఘటనలో ఒకరు మరణించారు. మరో ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ ఇంకా లభించలేదు. బొగ్గు గనిలో సహాయక చర్యలు బుధవారం మూడో రోజుకి చేరుకున్నాయి. ఒక కార్మికుడి మృతదేహం సహాయక సిబ్బందికి లభించింది. ఉపరితలం నుంచి 85 అడుగుల దిగువన మృతదేహం లభ్యమైంది. మిగిలిన కార్మికులు ప్రాణాలతో ఉన్నారా? లేదా? అనేది తెలియరావడం లేదు. సైన్యం, నావికాదళం తోపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.

వాడీవేడిగా జేపీసీ తొలి భేటీ

- తీవ్రంగా విమర్శించిన విపక్ష పార్టీల సభ్యులు
- జమిలి బిల్లులకు మద్దతు పలికిన అధికార కూటమి సభ్యులు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో లోక్‌సభ, రాష్ట్రాల్లో శాసనసభలకు జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును సమీక్షిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ తొలి సమావేశమే వాడీవేడి చర్చకు వేదికగా మారింది. బిల్లులపై చర్చ సందర్భంగా రాజ్యాంగం మౌలిక రూపాన్ని మార్చే కుట్ర జరిగిందని, ఈ బిల్లుకు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని విపక్ష పార్టీల సభ్యులు గట్టిగా వ్యతిరేకించారు. ప్రజాభీష్టం మేరకే ఈ బిల్లులను తెచ్చామని మూడోసారి పీఠంపై కూర్చున్న ఎన్‌డీఏ కూటమి సభ్యులు తేల్చి చెప్పారు. దీంతో 39 మంది సభ్యులతో కొలువైన జేపీసీ తొలి భేటీ ఆద్యంతం తీవ్రస్థాయిలో వాదోపవాదాలతో కొనసాగింది. బుధవారం ఢిల్లీలో జేపీసీ సమావేశం తొలిరోజు సందర్భంగా సభ్యులందరికీ కేంద్ర న్యాయ శాఖ ఉన్నతాధికారులు సంబంధిత బిల్లుల్లోని కీలక అంశాలు, నియమనిబంధనలను పూర్తిగా విడమరచి చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా మాట్లాడారు. జమిలి ఎన్నికలు ఎలా ఎన్నికల ఖర్చుగా భారీగా తగ్గించగల్గుతాయని నిలదీశారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 543 స్థానాల్లో తొలిసారిగా ఈవీఎంలను వాడినప్పుడు ఖర్చు భారీగా తగ్గిందనడానికి ఆధారాలున్నాయా? అని ప్రశ్నించారు.

దీటుగా బదులిచ్చిన ఎన్‌డీఏ కూటమి

దీనిపై బీజేపీ సభ్యులు సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు. '' 1957లో ఇలాగే ఏకకాల ఎన్నికల కోసం అప్పుడు ఏడు రాష్ట్రాల అసెంబ్లీలను కాలపరిమితి ముగిసేలోపే కుదించారు. అప్పుడు రాష్ట్రపతిగా రాజేంద్రప్రసాద్ ఉన్నారు. ఆయనే నాడు రాజ్యాంగ పరిషత్‌కు చైర్మన్ కూడా. ఆనాడు ఇలాంటి నిర్ణయం తీసుకున్న దిగ్గజ ఎంపీలంతా నాడు నెహ్రూ హయాంలో పనిచేసిన వాళ్లే. ఆ లెక్కన వీళ్లంతా ఆనాడు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లా? అని బీజేపీ సభ్యుడు సంజయ్ జైస్వాల్ ఎదురు ప్రశ్న వేశారు.

తీవ్రంగా తప్పుబట్టిన విపక్షాలు

బిల్లులను విపక్ష పార్టీల సభ్యులు తప్పుబట్టారు. '' విస్తృతమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించాలి. బిల్లులపై చర్చించేందుకు కనీసం ఏడాదిపాటు సమయం ఇవ్వాలి'' అని కమిటీకి సారథ్యం వహిస్తున్న మాజీ కేంద్ర మంత్రి పీపీ చౌదరిని విపక్ష సభ్యులు కోరారు. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్ విధానం తేవాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు వి.విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు.

శరీరాకృతిపై వ్యాఖ్యలూ

లైంగిక వేధింపులే

తేల్చిచెప్పిన కేరళ హైకోర్టు

కొచ్చి: మహిళ రూపురేఖలను వర్ణిస్తూ ద్వంద్వార్థం ధ్వనించేలా వ్యాఖ్యలు చేసినా, ఎస్ఎంఎస్ సందేశాలు పంపినా లైంగిక వేధింపుల సెక్షన్ల కింద అవి నేరంగా పరిగణించబడతాయని కేరళ హైకోర్టు స్పష్టంచేసింది. ఒకే కార్యాలయంలో పనిచేసిన కాలంలో తోటి మహిళా ఉద్యోగిపై తాను చేసిన వ్యాఖ్యలకుగాను నమోదైన లైంగిక వేధింపుల కేసులను కొట్టేయాలంటూ కేరళ రాష్ట్ర విద్యుత్ బోర్డ్ మాజీ ఉద్యోగి చేసిన అభ్యర్థనను జస్టిస్ ఏ.బధారుద్దీన్ సారథ్యంలోని ధర్మాసనం కొట్టేసింది. ఎర్నాకులం జిల్లాలో కేఎస్ఈబీ ఆఫీస్‌లో పనిచేసిన కాలంలో 2013 ఏడాది నుంచి తనతో అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని, 2016–17 కాలంలో మొబైల్ ఫోన్‌కు తన రూపురేఖలను వర్ణిస్తూ ఎస్ఎంఎస్‌లు పంపారని, వాయిస్ కాల్స్ చేశారని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆ తర్వాత సైతం అతని నుంచి ఎస్ఎంఎస్‌లు, ఫోన్‌కాల్స్ ఆగలేదు. దీంతో భారత శిక్షాస్మృతిలోని 354(ఎ)(1)(4), 509 సెక్షన్లతోపాటు కేరళ పోలీస్ చట్టంలోని 120(ఓ) సెక్షన్ కింద సదరు ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదైంది. అందంగా ఉందని మాత్రమే ఎస్ఎంఎస్‌లు పంపానని, ఆ సందేశాల్లో ఎలాంటి తప్పుడు ఉద్దేశంలేదని అతని తరఫు న్యాయవాది చేసిన వాదనలను కోర్టు తిరస్కరించింది. లైంగిక వేధింపుల సెక్షన్లను తొలగించాలంటూ ఆ ఉద్యోగి వేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

మీది శీష్ మహల్.. మీది రాజమహల్

ఆప్, బీజేపీ పరస్పరం ఆరోపణలు

న్యూఢిల్లీ: అద్దాల మేడ(శీష్ మహల్)లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ నివసించారని బీజేపీ నేతలు ఆరోపిస్తుండగా, ప్రధాని నరేంద్ర మోదీ రాజ మహల్‌లో విలాస జీవితం గడుపుతున్నారని ఆప్ నేతలు మండిపడ్డారు. ఈ బంగ్లాల వ్యవహారంలో బుధవారం ఢిల్లీలో హైడ్రామా నెలకొంది. ప్రజల సొమ్ముతో అద్దాల మేడలో కేజ్రీవాల్ ఖరీదైన ఏర్పాట్లు చేసుకున్నారని బీజేపీ విమర్శిస్తున్న నేపథ్యంలో నిజానిజాలను ప్రజలకు తెలియజేయడానికి ఆప్ అగ్రనేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ తమ అనుచరులతో కలిసి మీడియాను వెంటబెట్టుకొని 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని ఈ బంగ్లాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దాంతో వారు అక్కడే బైఠాయించి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన తెలిపారు. బీజేపీ అబద్ధాలు బయటపడ్డాయని చెప్పారు. శీష్ మహల్ లోపల ఏముందో చూసేందుకు బీజేపీ నాయకులు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బంగారు మరుగుదొడ్డి, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ ఎక్కడున్నాయో చూపించాలని నిలదీశారు. ప్రధాని మోదీ అధికార నివాసం ఒక రాజమహల్ అని ఆప్ నేతలు ధ్వజమెత్తారు. దీని కోసం రూ.2,700 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ఈ రాజ మహల్‌లోకి మీడియాను అనుమతించే దమ్ముందా? అని బీజేపీ నాయకులకు సవాలు విసిరారు. సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ తదితరులు ప్రధాని నివాసం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో వారు తుగ్లక్ రోడ్ పోలీసు స్టేషన్ సమీపంలో బైఠాయించారు. మరోవైపు బీజేపీ నాయకులు ఢిల్లీ సీఎం ఆతిశీకి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఏబీ 17 మథుర రోడ్‌లోని బంగ్లాను మీడియాకు చూపించారు. ఇప్పటికే అధికారిక బంగ్లాను కేటాయించగా, మరో బంగ్లా ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించారు. బంగ్లాల సందర్శన పేరిట ఆప్ నాయకులు అసెంబ్లీ ఎన్నికల ముందు డ్రామాలాడుతున్నారని ధ్వజమెత్తారు.


సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్‌లను అడ్డుకుంటున్న పోలీసులు



మాసబ్ చెరువుపై శాస్త్రీయ అధ్యయనం

మాసబ్ చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్‌ను శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిర్ధారించాలని హైడ్రా నిర్ణయించింది.

-8లో



దొన్నె బిర్యానీ.. ఈ డిష్ వెరీ స్పెషల్

బెంగళూరు స్పెషల్ డిష్ 'దొన్నె బిర్యానీ' ఇటీవల మన నగరానికి చేరువైంది. ఈ నేపథ్యంలో సిటీలో మరో కొత్త రుచి చేరింది.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29.0/15.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 29, కనిష్ఠంగా 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



డబ్బా ఏర్పాటు చేసుకోని దుకాణదారుకు జరిమానా విధిస్తున్న ఏఎంహెచ్‌ఓ హేమలత

'ఫైన్' సిటీ!

పెనాల్టీలతోనే స్వచ్ఛ నగరం

- దుకాణాల ముందు డస్ట్‌బిన్ తప్పనిసరి
- చర్యలకు సిద్ధమవుతున్న జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పారిశుద్ధ్యం మెరుగయ్యేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. త్వరలో ఈ సంవత్సరానికి సంబంధించి స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలకు సిద్ధం కావాల్సి ఉండటంతో మెరుగైన పారిశుద్ధ్యానికి పెనాల్టీలు తప్పనిసరి అనే నిర్ణయానికి అధికారులొచ్చారు. ఇప్పటికే పెనాల్టీలు విధిస్తున్నప్పటికీ, ఆ చర్యలు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. ఇకపై పెనాల్టీలను కచ్చితం చేయాలని భావిస్తున్నారు. అంతకంటే ముందు తగిన అవగాహన కల్పించి, అనంతరం పకడ్బందీగా అమలు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. చెత్తను ఉత్పత్తి స్థానంలోనే కట్టడి చేసే చర్యల్లో భాగంగా ఇందుకు సిద్ధమయ్యారు.

అధికారులకు ఆదేశాలు జారీ..

తొలిదశలో అన్ని దుకాణాల వారు తమ దుకాణాల ముందు పెద్దసైజు చెత్త డబ్బాలను ఏర్పాటు చేయాల్సిందిగా అవగాహన కల్పిస్తారు. చెత్తను డబ్బాల్లో కాకుండా బయట వేస్తున్నవారిని గుర్తించి పెనాల్టీలు విధించాల్సిందిగా బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఎన్. రఘుప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతేకాదు.. ఉత్పత్తి అవుతున్న చెత్తను వ్యాపారులు డబ్బాల్లో వేయడమే కాకుండా, దాన్ని వాహనాలు తరలించకపోయినా సంబంధీకులపై చర్యలు తీసుకోనున్నారు. ఇవి పకడ్బందీగా అమలు చేసేందుకు తమ పరిధిలోని వాణిజ్య ప్రాంతాలను ఏఎంఓహెచ్‌లు తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు.పెనాల్టీల వల్ల ఓవైపు పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని, మరోవైపు జీహెచ్ఎంసీకి ఆదాయమూ వస్తుందని ఈ చర్యలకు సిద్ధమవుతున్నారు.

గత ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు ఆయా అంశాల వారీగా విధించిన పెనాల్టీలు ఇలా ఉన్నాయి.

- రోడ్లు సవ్యంగా ఊడ్వని 61 స్వీపింగ్ మెషిన్ల కాంట్రాక్టర్లకు: రూ.10,56,500
- 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ వినియోగించిన 414దుకాణాలకు: రూ.4,92,200
- నిర్మాణ కూల్చివేతల వ్యర్థాలు బహిరంగంగా వేసిన 384 మంది నిర్మాణదారులకు : రూ.18,06,000
- చెత్త, చిత్తు కాగితాలు రోడ్లపై వేసిన 759 మందికి: రూ.8, 75,100
- ఆరు ప్రాంతాల్లో బహిరంగంగా చెత్త కాల్చిన వారికి : రూ.11,500
- నాలాల్లో చెత్త వేసినట్లు గుర్తించిన అయిదుగురికి: రూ.13,000
- ఇలా పెనాల్టీల రూపంలో మొత్తం రూ.42,54,300 వసూలు చేశారు.
- పకడ్బందీ చర్యలతో పెనాల్టీలు పెరగనున్నాయి.

స్వచ్ఛతకు అందరూ సహకరించాలి

వ్యాపార సంస్థల ముందు చెత్త డబ్బాలు లేకపోవడంతో రోడ్లపైనే పడేస్తుండడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. నెల రోజులుగా సర్కిల్ పరిధిలోనే 90 శాతం వ్యాపార సంస్థల ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేయించాం. స్వచ్ఛతకు అందరూ సహకరించాల్సిన అవసరముంది.

– డాక్టర్ హేమలత, ఏఎంహెచ్ఓ సర్కిల్– 16



అంబర్‌పేటలోని ఓ దుకాణం ఎదుట ఏర్పాటు చేసిన డబ్బాను పరిశీలిస్తున్న ఏఎంహెచ్ఓ

డబ్బాలు పెట్టకపోతే.. డబ్బులు కట్టాల్సిందే

స్వచ్ఛత వైపు అంబర్‌పేట అడుగులు

అంబర్‌పేట: స్వచ్ఛతపై జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్లపై చెత్త నివారించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో జీహెచ్ఎంసీ అధికారులు బహిరంగంగా చెత్త లేకుండా నివారించేందుకు వ్యాపార సంస్థల ముందు చెత్త కోసం విధిగా 32 కిలోల సామర్థ్యం ఉన్న చెత్త డబ్బాను ఏర్పాటు చేయాలని ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా సర్కిల్ పరిధిలో ఉన్న 3,685 దుకాణాల ముందు చెత్త డబ్బాలను దగ్గరుండి మరీ ఏర్పాటు చేయించారు. మరో 324 దుకాణాలు మిగిలి ఉన్నాయని వాటి వద్ద కూడా చెత్త డబ్బాలను ఏర్పాటు చేయిస్తామంటున్నారు. వ్యాపార సంస్థలు చెత్త డబ్బా ఏర్పాటు చేసుకువాల్సిందిగా అధికారులు తొలుత సూచిస్తున్నారు. వారి మాట వినకుంటే రూ.5 వేల జరిమానాను విధిస్తున్నారు.

నిర్మాణ వ్యర్థాలు సైతం..

నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడవేస్తున్నవారికి సైతం భారీ పెనాల్టీలు విధించనున్నారు. వాటిని తప్పనిసరిగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోని రీసైక్లింగ్ ప్లాంట్స్‌కు తరలించేలా చర్యలు తీసుకోనున్నారు. ప్లాంట్స్ నిర్వాహకులు సైతం ఇకనుంచి అన్‌క్లెయిమ్డ్‌గా పేర్కొన్నా, తరలింపు చార్జీలను జీహెచ్ఎంసీ చెల్లించదని స్పష్టం చేశారు. నిర్మాణ ప్రాంతాల్లో నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు వేసే వారిని గుర్తించి, చర్యలు తీసుకునే పనిని టౌన్ ప్లానింగ్ అధికారులకు అప్పగించారు. రోడ్లను శుభ్రం చేయని స్వీపింగ్ మెషిన్ల ఏజెన్సీలకూ పెనాల్టీలు విధించనున్నారు.

మీ పిల్లలకు ఇలాగే వండి పెడుతున్నారా?

కనీసం టమాటాలను ముక్కలు చేయలేదు

- కోయకుండానే అలా మసాలాలో వేసేశారు
- విద్యార్థుల ఆరోగ్యాలు దెబ్బ తింటే ఎవరు బాధ్యులు?
- హాస్టళ్ల మెస్ చార్జీలు పెంచినా మెనూ పాటించరా?
- స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బందిపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం
- ఇబ్రహీంబాగ్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల ఆకస్మిక సందర్శన
- విద్యార్థులతో కలిసి.. భోజనం చేసి నాణ్యతను పరిశీలించిన వైనం



ఉడకని టమాటాలు, మసాలా కూరను చూపిస్తూ మంత్రి పొన్నం ఆగ్రహం

లంగర్‌హౌస్: ఇంట్లో మీరు తినే భోజనం ఇలాగే వండుకుంటారా? మీ పిల్లలకు ఇలాగే వండి పెడుతున్నారా? ఉడకని కూరగాయలకు తోడు అధికంగా మసాలాలు వేస్తే పిల్లల ఆరోగ్యాలు దెబ్బ తినవా? నాణ్యమైన భోజనం కోసం ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచినా సరైన మెనూ అందివ్వడానికి మీకు వచ్చిన కష్టం ఏమిటి? అంటూ పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్ నిలదీశారు. పిల్లల భోజనంపై ఇంత నిర్లక్ష్యమా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం లంగర్‌హౌస్ ఇబ్రహీంబాగ్‌లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సొసైటీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. దుస్తులు, పాఠ్య పుస్తకాలు, ప్లేట్లు, ఇతర వస్తువులు సరిగా అందుతున్నాయా.. లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బోధనపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం భోజనశాలను సందర్శించి విద్యార్థులకు అన్నం వడ్డించారు. విద్యార్థులతో కలిసి మంత్రి పొన్నం సైతం భోజనం పెట్టించుకున్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, గోల్కొండ తహసీల్దార్ అహల్యతో పాటు ఇతర అధికారులను కూడా విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని తినాలని సూచించారు. ఈ క్రమంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి పొన్నం.. కూరలు నాణ్యతగా లేకపోవడాన్ని గుర్తించి నిర్వాహకులపై మండిపడ్డారు. టమాటాలు ముక్కలు చేయకుండా.. కనీసం కోయకుండా అలా మసాలాలో నేరుగా వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భోజనం విషయంలో నాణ్యత పాటించకపోయినా.. నిర్లక్ష్యం వహించినా అందరూ బాధ్యులే అవుతారని ఆయన హెచ్చరించారు.

మంచినీళ్లు కరువేనా..?

ఈ క్రమంలోనే మంత్రి మంచినీళ్లు కావాలని అడగడంతో అక్కడ ఉన్న గ్లాసులలోని నీరు ముట్టుకోనీయకుండా సిబ్బంది కాస్త ఆలస్యంగా బాటిళ్లు తెచ్చి ఇచ్చారు. ఇదేంటని మంత్రి అడగగా.. వాటర్ ఫిల్టర్ పని చేయడంలేదని నిర్వాహకులు తెలిపారు. అదే నీరు చిన్నారులకు ఇస్తున్నారంటే వారి ఆరోగ్యం, వారి ప్రాణాలపై మీకు బాధ్యత లేదా? అంటూ మరోసారి మండిపడ్డారు. వెంటనే ఫిల్టర్‌కు మరమ్మతులు చేయించాలని, భోజనాలలో కూడా మార్పులు రాకపోతే ఒక్కరు తప్పు చేసినా అందరినీ బాధ్యుల్ని చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

11న నీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: హిమాయత్ సాగర్ రిజర్వాయర్ ఫోర్ బే, మీరాలం ఫిల్టర్ బెడ్స్ సెట్లింగ్ ట్యాంకులు, ఇన్‌లెట్ చానళ్లను శుభ్రపరుస్తున్న నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. హసన్ నగర్, కిషన్ బాగ్, దూద్‌బౌలి, మిస్రీ గంజ్, పత్తర్‌గట్టి, దారుల్ షిఫా, మొఘల్ పురా, జహానుమా, చందూలాల్ బరాదరి, ఫలక్‌నుమా, జంగంమెట్ ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వివాహమైన 3 వారాలకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం



అరుణ్ మృతదేహం

రాజేంద్రనగర్: పెళ్లయిన 3 వారాలకే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన అరుణ్ (28) ఇదే ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని (21)తో 21 రోజుల క్రితం వివాహం జరిగింది. అనంతరం వీరు హైదర్‌గూడలో అద్దె ఇంట్లోకి వచ్చారు. అరుణ్‌కు నైట్ షిఫ్ట్ కాగా.. ఆయన భార్య ఉదయం షిఫ్ట్ ముగించుకుని మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా.. గది తలుపులు మూసి ఉన్నాయి. ఎంత పిలిచినా లోపలి నుంచి సమాధానం రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు ఘటన స్థలానికి చేరుకొని డోర్ తెరిచి చూడగా అరుణ్ ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాప్యం ఖరీదు రూ. 100 కోట్లు!

నల్లగొండ క్రాస్‌రోడ్స్- ఒవైసీ జంక్షన్ ఫ్లై ఓవర్

- అయిదేళ్లు కావస్తున్నా పూర్తి కాని పనులు
- అంచనా వ్యయం కంటే పెరగనున్న ఖర్చు

ఫ్లై ఓవర్ ఇలా..

పొడవు : 3.382 కి.మీ
ప్రయాణం: రెండు వైపులా
క్యారేజ్‌వే: 4 లేన్లు (16.60 మీటర్లు)



సాక్షి, సిటీబ్యూరో: రెండేళ్లలో పూర్తి కావాల్సిన ఫ్లై ఓవర్ పనులు అయిదేళ్లు కావస్తున్నా ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంగా మారాయి. నత్తనడకన సాగుతున్న పనులతో ప్రాజెక్టు కుంటుతోంది. దీంతో అంచనా వ్యయం కంటే పనులు పూర్తి చేసేందుకయ్యే ఖర్చు దాదాపు రూ.100 కోట్లు పెరిగింది. ఎస్సార్‌డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం)లో భాగంగా నల్లగొండ క్రాస్‌రోడ్స్– ఒవైసీ జంక్షన్ వరకు నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు ఎంతో కాలంగా సాగుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. తొలుత భూసేకరణలో జాప్యం జరిగింది. అనంతరం ఇతరత్రా సమస్యలు ఎదురైనట్లు అధికారులు చెబుతున్నారు. వాటితోపాటు అన్నింటికంటే ముఖ్య కారణం సకాలంలో నిధులు విడుదల కాకపోవడం.

పెరిగిన వ్యయం..

ప్రాజెక్టు చేపట్టినప్పుడు 2020లో దీని అంచనా వ్యయం రూ.523.37 కోట్లు కాగా, తాజాగా దాన్ని సవరించి రూ.620 కోట్లకు పెంచారు. అంటే దాదాపు రూ. 100 కోట్ల వ్యయం పెరిగింది. పెరిగిన వ్యయ భారాన్ని పేర్కొంటూ నిర్మాణ వ్యయం పెంచాల్సిందిగా జీహెచ్ఎంసీ అధికారులు రాసిన లేఖకు స్పందిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్ బుధవారం జీవో జారీ చేశారు. నల్లగొండ క్రాస్‌రోడ్స్ నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్‌ల మీదుగా ఒవైసీ జంక్షన్ వరకు ఫ్లై ఓవర్ పొడవు 3.38 కిలోమీటర్లు. దాదాపు అయిదేళ్ల క్రితం పనులు ప్రారంభమైనప్పటికీ, ఇప్పటికీ పూర్తి కాలేదు. ఎస్సార్‌డీపీ పనుల్లో ఎక్కువ సమయం తీసుకుంటున్న ఫ్లై ఓవర్ బహుశా ఇదే.

గతంలో ఎస్సార్‌డీపీ పనులపై రెగ్యులర్ సమీక్షలుండేవి. దాంతో ఎప్పటికప్పుడు తగిన నిర్ణయాలు తీసుకుంటూ, ఎదురయ్యే ఇబ్బందుల్ని పరిష్కరిస్తూ త్వరితంగా పనులయ్యేలా చర్యలు తీసుకునేవారు. కొంతకాలంగా అలాంటి కార్యక్రమాలు లేకపోవడంతో ప్రాజెక్టులు కుంటుతున్నా పట్టింపులేకుండా పోయింది. నిధుల లేమితో అధికారులు కాంట్రాక్టర్లను ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయింది. ఈ ఫ్లై ఓవర్ పూర్తయితే చంచల్‌గూడ, సైదాబాద్, దోబీఘాట్, ఐఎస్ సదన్ జంక్షన్లలో ప్రజలకు ప్రయాణ కష్టాలు తగ్గుతాయి. నల్లగొండ క్రాస్‌రోడ్స్ నుంచి ఒవైసీ హాస్పిటల్ వైపు సిగ్నల్ ఫ్రీగా ఆగకుండా సాగిపోవచ్చు. చంపాపేట, చాంద్రాయణగుట్ట వైపు వెళ్లే వారికి ఎంతో సదుపాయం. ప్రయాణ సమయం, ఇంధన వ్యయం తగ్గుతాయి. ఐఎస్ సదన్ జంక్షన్ వద్ద ప్రస్తుతం ఎదురవుతున్న ట్రాఫిక్ కష్టాలుండవు.

హెచ్‌ఎంపీవీ వైరస్ అంత ప్రమాదకరమైనదేమీ కాదు

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్ వెల్లడి



రవీంద్ర నాయక్

సుల్తాన్‌బజార్: హ్యూమన్ మెటాన్యుమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వైరస్ ఒక ఫ్లూ వంటిదని, సాధారణ నియమాలు పాటిస్తే తగ్గిపోతుందని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్ పేర్కొన్నారు. ఈ వైరస్ చిన్నపాటి లక్షణాలతో వచ్చే వైరస్ అన్నారు. దానిని నియంత్రిస్తే ఎలాంటి ప్రమాదం లేదన్నారు. శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం చూపే ఒక రకమైన వైరస్ అన్నారు. హెచ్‌ఎంపీవీని మొదట 2001లోనే గుర్తించారని, ఇదేమీ కొత్త వైరస్ కాదన్నారు. అధిక జనాభా ఉన్న ప్రాంతాలలో ఇది సోకుతుందని.. మన రాష్ట్రంలో ఈ లక్షణాలు ఏమీ లేవన్నారు. హెచ్‌ఎంపీవీ లక్షణాలు తేలికపాటి జలుబు నుంచి తీవ్రమైన శ్వాసకోశ వ్యాధుల వరకు ఉంటాయని రవీంద్ర నాయక్ పేర్కొన్నారు. జ్వరం, దగ్గు, ముక్కుదిబ్బడ, గొంతునొప్పి, శ్వాసలో ఇబ్బందుల్లాంటి సాధారణ లక్షణాలు ఉంటాయని ఆయన వివరించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే వారు కొద్దిగా అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్‌ఎంపీవీని గుర్తించడానికి పీసీఆర్ పరీక్ష, యాంటిజెన్ డిటెక్షన్, సిరాలజికల్ పరీక్షలు చేయవచ్చన్నారు. దీని నివారణ కోసం తరచుగా చేతులు కడుక్కోవడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు రుమాలును ఉపయోగించడం, అస్వస్థతగా ఉన్న వారి నుంచి దూరంగా ఉండడం లాంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇప్పటికే తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ కోవిడ్ కాలంలో అన్ని వసతులు సౌకర్యాలతో సమర్థంగా ఉందన్నారు. ఈ వ్యాధి అంత ప్రమాదకరమైనది కాదని, చలికాలంలో వచ్చే చిన్నపాటి ఫ్లూగా ఉంటుందని, ప్రజలు భయాందోళనకు గురి కావద్దని రవీంద్ర నాయక్ సూచించారు.

జల ఘంటికలు!

గ్రేటర్‌లో భూగర్భ జలాలు పాతాళంలోకి..

- వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవా?
- గృహావసరాలకు పెరిగిన వినియోగం
- జలమండలి ట్యాంకర్లకు భారీ డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి పొంచి ఉందా? అనే ప్రశ్నకు ఔననే సమాధానమే వస్తోంది. మహా నగరం పరిధిలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు క్రమంగా పడిపోతున్నాయి. పక్షం రోజులు పరిధిలో అర మీటరు నుంచి మీటరుకు పైగా నీటి మట్టాలు అడుగంటడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వాస్తవంగా గతేడాది కంటే పరిస్థితి కొద్దిగా మెరుగ్గా ఉన్న నగరంలోని కోర్‌సిటీతో పాటు శివారు, ఓఆర్ఆర్ లోపల మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోని అర్బన్ పరిధిలో మాత్రం భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో వేసవి నాటికి నీటి సమస్య మరింత పెరిగే అవకాశాలున్నట్లు నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంకినవి ఇంకినట్టే తోడేస్తున్నారు..


గ్రేటర్ పరిధిలో గోదావరి, కృష్ణా, మంజీరా నదుల నుంచి ఉపరితల జలాలు సరఫరా అవుతున్నప్పటికీ.. ఇంటి అవసరాల కోసం నగర వాసులు భూగర్భ జలాలను విపరీతంగా ఉపయోగించుకున్నారు. భూమిలోకి ఇంకిన నీరు ఇంకినట్లే తోడేస్తుండటంతో భూగర్భ జలాలు పాతాళంలోకి పడిపోతున్నాయి. రెండేళ్ల క్రితం నేలలోకి ఇంకిన నీటి పరిమాణం, తోడివేతపై అధికారిక నివేదిక పరిశీలిస్తే.. తక్కువ నీరు ఇంకి, ఎక్కువ నీరు తోడిన ప్రాంతాల్లో హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలు మొదటి స్థానాల్లో నిలిచాయి. గతేడాది అతి తక్కువ నీరు ఇంకి, ఎక్కువ వినియోగించడంతో వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి తప్పలేదు. హైదరాబాద్ జిల్లాలో 5,808 కోట్ల లీటర్ల నీరు ఇంకగా, 5,438 కోట్ల లీటర్లను ఉపయోగించుకున్నారు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో 8,879 కోట్ల లీటర్ల నీరు ఇంకగా, 5,296 కోట్ల లీటర్లు తోడేశారని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

లోలోతుల్లోకి..

మహా నగర పరిధిలో భూగర్భ జల మట్టాలు గతేడాది కంటే పడిపోయినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నగరంతో పాటు శివారులోని రంగారెడ్డి జిల్లా అర్బన్ పరిధిలో మాత్రం 0.4 మీటర్లు భూగర్భజలాలు పడిపోయాయి. కేవలం నవంబర్ నుంచి పోలిస్తే డిసెంబర్ చివరి నాటికి హైదరాబాద్‌లో 0.47 మీటర్ల భూగర్భ జలమట్టాలు తగ్గగా, మేడ్చల్–మల్కాజిగిరి పరిధిలో 1.08 మీటర్లు అడుగంటాయి. హైదరాబాద్‌లో సాధారణం కంటే డిసెంబర్‌లో 18 శాతం అధిక వర్షపాతం నమోదైనా, ఆ మేరకు భూగర్భ జలాలు పెరగడం లేదు. శివారు పరిధిలోని శేరిలింగంపల్లి, మణికొండ, హయత్‌నగర్, సరూర్‌నగర్, అత్తాపూర్ తదితర ప్రాంతాల్లో బోర్ల నుంచి నీరు తగ్గుముఖం పట్టాయి.

ట్యాంకర్లకు పెరిగిన తాకిడి

వేసవికి ముందే ట్యాంకర్ల డిమాండ్ తారస్థాయికి చేరుతోంది. ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో తక్కువ లోతులో ఉన్న బోర్లలో నీరు రావడం లేదు. ఫలితంగా నీటి ట్యాంకులకు డిమాండ్ పెరిగిపోతోంది. ఇటీవల 15, 9 డివిజన్లలోని మారుతీనగర్, వైశాలీ నగర్, కొండాపూర్‌లో భూగర్భజల మట్టం పడిపోవడంతో ట్యాంకర్లకు ఒకేసారి డిమాండ్ పెరిగి వెయిటింగ్ లిస్ట్ 150కి చేరింది. జలమండలి పైపులైన్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా చేసే నీటి పరిమాణంలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేది తక్కువే అయినా దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తాగునీటికి పూర్తిగా జలమండలిపైనే ఆధారపడిన ప్రాంతాల్లో ట్యాంకర్లు వెళ్లకపోయినా, జాప్యం జరిగినా తీవ్ర ప్రభావం చూపుతోంది.



ప్రస్తుతం భూగర్భజల మట్టాలు ఇలా..

ప్రాంతాలు	భూగర్భజల మట్టం - 2024 (మీటర్లలో)	భూగర్భజల మట్టం -2023 (మీటర్లలో)
హైదరాబాద్	7.32	7.57
రంగారెడ్డి జిల్లా	9.08	8.68
మేడ్చల్-మల్కాజిగిరి	10.35	9.24
మారేడుపల్లి	12.95	10.16
సైదాబాద్	9.90	5.23
ఖైరతాబాద్	7.86	6.06
హస్మత్‌పేట	10.3	8.52
ఇబ్రహీంపట్నం	14.11	12.37

రూ.వందల్లో ఇచ్చి రూ.లక్షలు స్వాహా!

- పార్ట్ టైమ్ జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్ల వల
- నగర గృహిణికి రూ.11.92 లక్షలు టోకరా

సాక్షి, సిటీబ్యూరో: వర్క్ ఫ్రం హోమ్ విధానంలో పార్ట్ టైమ్ జాబ్స్ అంటూ నగరానికి చెందిన ఓ గృహిణికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.11.92 లక్షలు కాజేశారు. ఆమెకు నమ్మకం కలగడానికి మాత్రం తొలుత కొంత మొత్తం చెల్లించారు. బాధితురాలు బుధవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. సదరు గృహిణికి ఇటీవల వాట్సాప్ ద్వారా ఓ సందేశం వచ్చింది. అది 3ఐ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రిక్రూటర్ పంపినట్లు ఉంది. పార్ట్ టైమ్ జాబ్ అనడంతో బాధితురాలు ఆసక్తి చూపి సంప్రదించింది. దీంతో సైబర్ నేరగాళ్లు తాము పంపే గూగుల్ మ్యాప్స్ లింకుల్లో ఉన్న రెస్టారెంట్లకు రేటింగ్స్ ఇవ్వాలని, అలా చేస్తే నిర్ణీత మొత్తం చెల్లిస్తామని చెప్పారు. తొలుత రేటింగ్ ఇచ్చినందుకు రూ.200 ఫోన్ పే చేశారు. ఆపై తమకు రూ.3 వేలు చెల్లిస్తే తక్షణం రూ.3880 ఇస్తామంటూ చెప్పారు. బాధితురాలు బదిలీ చేయడం, తిరిగి పొందటంతో ఆమెకు నమ్మకం పెరిగింది. ఆపై స్టాక్స్‌లో పెట్టుబడులు అంటూ బాధితురాలి నుంచి రూ.7 వేలు బదిలీ చేయించుకున్న నేరగాళ్లు రూ.8400 చెల్లిస్తామన్నారు. సాంకేతిక కారణాలతో చెల్లింపు ఆలస్యం అవుతోందని చెప్పి మభ్య పెట్టారు. ఆపై బాధితురాలి నెంబర్‌ను టెలిగ్రామ్‌లో ఉన్న డేటా కిల్క్ 7000-బీ అనే గ్రూపులో చేర్చారు. వివిధ రకాలైన లింకులు పంపించి, భారీ లాభాలు వచ్చే పెట్టుబడుల పేరుతో మొత్తం రూ.11,92,930 బదిలీ చేయించుకున్నారు. చివరకు వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోస పోయినట్లు గుర్తించిన బాధితురాలు సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించారు.

యువతులను ఎరగా వేసి.. అధిక బిల్లులు

– బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు

సనత్‌నగర్: యువతులను ఎరగా వేసి..మందుబాబులకు కిక్కు పెంచి..అధిక బిల్లులు బాదుతున్న ఓ బార్ దోపిడీకి ఎస్‌ఓటీ పోలీసులు అడ్డుకట్ట వేశారు. 11 మంది యువతులతో పాటు 10 మంది బార్ సిబ్బంది, మందు బాబులను అదుపులోకి తీసుకుని సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే..మూసాపేట లక్ష్మీకళ థియేటర్ సమీపంలోని ఎవర్‌గ్రీన్ ఫ్యామిలీ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు కొంతమంది యువతులను ప్రత్యేకంగా నియమించుకుని..వారితో అశ్లీల నృత్యాలు చేయిస్తూ యువతను రెచ్చగొడుతున్నారు. మద్యం మత్తులో ఉన్న మందు బాబుల వద్ద అధిక బిల్లులు వసూలు చేస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. ఎటువంటి ఎంటర్‌టైన్‌మెంట్ కార్యకలాపాలకు అనుమతులు లేకున్నా యువతులతో నృత్యాలు చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో 11 మంది యువతులను, 10 మంది బార్ సిబ్బంది, మద్యం ప్రియులను అదుపులోకి తీసుకున్నారు. బార్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

మాసబ్ చెరువుపై శాస్త్రీయ అధ్యయనం

- ఫిర్యాదులపై స్పందించి పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- దీనిపై త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: మాసబ్ చెరువుకు సంబంధించిన ఫుల్ ట్యాంక్ లెవల్‌ను (ఎఫ్‌టీఎల్) శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిర్ధారించాలని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) నిర్ణయించింది. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్వహించిన ప్రజావాణిలో దీనికి సంబంధించి ఫిర్యాదు అందింది. దీంతో ఆయన బుధవారం అధికారులతో కలిసి అక్కడ పర్యటించారు. స్థానికులు రంగనాథ్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. చెరువుకు సంబంధించిన తూములు మూసేసి, అలుగు పెంచడంతో పైభాగంలో ఉన్న పంటపొలాలు, ఇళ్లు నీట మునుగుతున్నాయని స్థానికులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రాథమిక వివరాలు సేకరించడానికి రంగనాథ్ ఆ ప్రాంతానికి వెళ్లారు. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారించడానికి ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులతో చర్చిస్తామని, ఐఐటీ, బిట్స్ పిలానీ, జేఎన్టీయూలకు చెందిన ఇంజినీరింగ్ నిపుణులతో అధ్యయనం చేయిస్తామని రంగనాథ్ స్థానికులకు హామీ ఇచ్చారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) ఇమేజీలు, గ్రామాల మ్యాప్స్‌తో పరిశీలించి రెండు మూడు నెలల్లో శాస్త్రీయ పద్ధతుల్లో చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని నిర్ణయించారు. తుర్కయాంజాల్ చెరువులోకి మురుగు నీరు వచ్చి చేరుతోందని, ఆ నీరు కిందకు పోవడం లేదని స్థానికుల రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. తాము స్థలాలు ఖరీదు చేసినప్పుడు ఆ స్థలంలో నీరు నిలవ లేదని తుర్కయాంజాల్ చెరువు పైభాగంలో ఉన్న ఆదిత్యనగర్ వాసులు రంగనాథ్‌కు తెలిపారు. నివాసితులు ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పిన కమిషనర్ పేదలను హైడ్రా ఇబ్బంది పెట్టదని పునరుద్ఘాటించారు. ఎవరైనా హైడ్రా పేరు చెప్పి భయపెట్టే ప్రయత్నం చేస్తే నమ్మవద్దని సూచించారు. రికార్డుల ప్రకారం మాసబ్ చెరువు ప్రస్తుతం 495 ఎకరాల్లో ఉందని..అయితే మొత్తం విస్తీర్ణం 522 ఎకరాలనే లెక్కలు ఉన్నాయన్న రంగనాథ్ ఏ విషయాన్నైనా శాస్త్రీయంగా తేలుస్తామని చెప్పారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

అంబర్‌పేట: రాష్ట్రంలో ప్రజల మాట వినే ప్రభుత్వం ఉందని, సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తుండడంతో సామాన్యుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర కేలండర్‌ను కోదండరాం ఆవిష్కరించి మాట్లాడారు. పెన్షనర్లు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాలు, డీఏ, హెల్త్ కార్డుల వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కనకం కొమరెల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్‌రెడ్డి పెన్షనర్ల సమస్యలపై కోదండరాంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జయంతి ప్రకాశ్‌రావు, గోట్ల సుర్యకళ, టీఏఎస్ఆర్ గుప్త, ఎస్.వేణుగోపాల స్వామి, స్వర్ణకుమారి, కటకం జానకిబాయి, జి.శ్రీదేవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘శిశు సంరక్షణ’ పిల్లలకు గుర్తింపు

- 1,330 మందికి సర్టిఫికెట్ల ప్రదానం
- అధికారులను అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

సాక్షి,సిటీబ్యూరో: శిశు సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు భవిష్యత్తులో విద్య, ఉపాధి పరంగా ఇబ్బందులు కలగకుండా వారికి గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో వివిధ రకాల సర్టిఫికెట్లను అందించి హైదరాబాద్ ఆదర్శంగా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన శిశు సంరక్షణ సంస్థల పిల్లలకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాలోని 50 శిశు సంరక్షణ కేంద్రాల్లో 2,300 మందికిపైగా పిల్లలు ఉన్నారని తెలిపారు. శిశు కేంద్రాల్లో సంరక్షణ పొందుతున్న 1330 మందికిపైగా పిల్లలకు వివిధ రకాల గుర్తింపు, విద్యాపరమైన, కుల, నివాస, ఆధార్ సర్టిఫికెట్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టినందుకు జిల్లా కలెక్టర్, అధికారులకు అభినందనలు తెలిపారు. సర్టిఫికెట్ ద్వారా వచ్చే కోటాలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిల్లలకు సూచించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో 50 శిశు సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు హక్కు, గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రతి చిన్నారికి జనన, కుల, ఆధార్, ఆదాయం వంటి 8 రకాల ధ్రువీకరణ పత్రాల నిమిత్తం జీహెచ్ఎంసీ, రెవెన్యూ, వైద్య, శిశు సంక్షేమ శాఖల సహకారంతో వారంపాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్వో ఈ వెంకటాచారి, కార్పొరేటర్ విజయారెడ్డి ,సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ శైలజ, యూనిసెఫ్ ప్రతినిధి సోని జార్జ్ రెడ్డి, డీడబ్ల్యూఓ అక్కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాత మృతిని తట్టుకోలేక మనవడి ఆత్మహత్య



మనోహర్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: తాను ఎంతగానో ఇష్టపడే తాత మృతిని మనవడు తట్టుకోలేకపోయాడు. మూడు నెలల పాటు కుంగుబాటుకు గురయ్యాడు.. చివరికి తన తాత దగ్గరికి వెళ్లేందుకు ప్రాణం తీసుకున్నాడు. ‘అయామ్ సారీ మమ్మీ.. డాడీ.. నాకు తాత బాగా గుర్తుకువస్తున్నాడు.. అందుకే వెళ్లిపోతున్నాను..’ అంటూ ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొంపల్లి శివాలయం సమీపంలో నివాసముండే సిరిగాధ రమేశ్ కుమారుడు మనోహర్ (27) గత రెండు నెలలుగా ఉద్యోగం మానేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతను ఎంతో ఇష్టపడే తాత మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి మనోహర్ మనోవేదనకు గురయ్యాడు. అప్పటి నుంచి తాత తనను రమ్మంటున్నాడని, తన వద్దకు వెళ్తానని ఇంట్లో చెప్పి మదనపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో మనోహర్ భోజనం చేసి తన గదిలోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి విగత జీవిగా కనిపించాడు. తాత తనకు బాగా గుర్తుకు వస్తున్నాడని, అందుకే వెళ్లితున్నా అంటూ మనోహర్ సూసైడ్ నోట్ రాశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘరానా చైన్‌స్నాచర్ అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, సిఐ ముత్తు, డిఐ వెంకటేశం, తదితరులు



చైన్ స్నాచర్ కొట్టి సాయిరాం

మూసాపేట: చోరీ చేసిన బైక్‌పై తిరుగుతూ..చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని పోలీసులు పట్టుకుని రెస్టు చేశారు. ఇందుకోసం 180 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు బుధవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 4న స్వాతి అనే యువతి వివేకానందనగర్ బస్టాప్ నుంచి నడిచి వెళ్తుండగా..బైకుపై వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు బృందాలుగా ఏర్పడి శోధన సాగించారు. 180 సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించి దొంగకు హెల్మెట్ లేకపోవటంతో గుర్తించి పట్టుకున్నారు. నిందితుడు కొట్టి సాయిరాం (28) కృష్ణాజిల్లా, పామర్రు గ్రామానికి చెందిన వ్యక్తి. ఇతను నెల క్రితం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెంబర్ 5లో హాస్టల్‌లో ఉంటూ కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఓ కంపెనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. 3వ తేదీన కూకట్‌పల్లి ఓమ్నీ ఆసుపత్రి సమీపంలో పార్కు చేసిన బైక్‌ను దొంగతనం చేశాడు. అదే బైక్‌పై 4వ తేదీన చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. ఇతనిపై కృష్ణా జిల్లాలోని ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో 3 బైక్ దొంగతనాలు, ట్రాక్టర్ టైర్ల దొంగతనం, యాక్సిడెంట్ కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. దొంగతనం చేసిన చైన్‌ను తాకట్టు పెట్టి రూ.40 వేలు తీసుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి అతని నుంచి చైన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవం

మహేశ్వరం: భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదుతో పాటుగా రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా అడిషనల్ కోర్టు తీర్పునిచ్చింది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. కందుకూరు మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన అల్వాల నర్సింహకు మహేశ్వరం మండలం మాణిక్యమ్మగూడ గ్రామానికి చెందిన జెన్నపల్లి మంగమ్మతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులుంగా మహేశ్వరం హాస్టల్‌లో ఉంటూ చదవుకుంటున్నారు. మంగమ్మ జీవనోపాధి కోసం మాణిక్యమ్మగూడలో జెన్నపల్లి యాదయ్య ఇంట్లో అద్దెకుంటోంది. దంపతులు తరచూ గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో 2021 నవంబర్ 29న అద్దె ఇంట్లో భార్య మంగమ్మ మె డకు వైర్‌తో ఉచ్చు బిగించి హత్య చేశాడు. మృతురాలి తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు మహేశ్వరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి రంగారెడ్డి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు వాదనలు విన్న మెజిస్ట్రేట్ అల్వాల నర్సింహకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు.

వ్యాపారులే టార్గెట్!

- ఖరీదైన నరుకులు కొనుగోలు చేసి మోసాలు
- ఘరానా చీటర్‌ను అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు



వాసు

సాక్షి, సిటీబ్యూరో: వ్యాపారులనే టార్గెట్‌గా చేసుకుని వరుస మోసాలకు పాల్పడుతున్న ఘరానా మోసగాడిని సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇతడిపై గతంలో 19 కేసులు ఉండగా... తాజాగా మరో నాలుగు నమోదైనట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు బుధవారం వెల్లడించారు. రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రేమావతిపేటకు చెందిన మక్కం శ్రీనివాస్‌కు వాసు, అశోక్ వాసు అనే మారుపేర్లు ఉన్నాయి. వ్యాపారులనే టార్గెట్‌గా చేసుకుని మోసాలకు పాల్పడే ఇతగాడిపై తొలిసారిగా 2014లో రాజేంద్రనగర్ ఠాణాలోనే కేసు నమోదైంది. కొందరు వ్యాపారులను ఎంచుకునే ఇతగాడు కొన్నాళ్లు క్రమం తప్పకుండా వారి దుకాణాలకే వెళ్తాడు. ఆయా సందర్భాల్లో తక్కువ మొత్తం విలువ చేసే సరుకులు ఖరీదు చేస్తాడు. సూటు లేదా బ్లేజర్ ధరించి, చోరీ చేసిన వాహనంపై తిరుగుతూ పెద్ద మనిషిగా చెలామణి అవుతాడు. ఆయా వ్యాపారులకు రెగ్యులర్ కస్టమర్ మాదిరిగా వారి నమ్మకం చూరగొంటాడు. ఆపై అదును చూసుకుని ఆయా వ్యాపారుల నుంచి భారీ స్థాయిలో ఖరీదైన సరుకులు అరువుగా తీసుకుని ఉడాయిస్తాడు. వారికి ఇచ్చిన ఫోన్ నెంబర్ తీసి పడేసి మరోటి వినియోగిస్తుంటాడు. ఈ పంథాలో మోసాలకు పాల్పడిన ఇతడిపై 2014–24 మధ్య రాజేంద్రనగర్, కొత్తూరు, మాదన్నపేట, సరూర్‌నగర్, జీడిమెట్ల, మైలార్‌దేవ్‌పల్లి, ఆసిఫ్‌నగర్, వనస్థలిపురం, ఫలక్‌నుమ ఠాణాల్లో 19 కేసులు నమోదయ్యాయి. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా ఇతడి పంథా మారలేదు. తాజాగా చిలకలగూడ, మైలార్‌దేవ్‌పల్లి, వనస్థలిపురంల్లో ముగ్గురిని మోసం చేశాడు. వీటిలో రెండు కేసులు ఈ నెల్లోనే నమోదయ్యాయి. జీడిమెట్ల ఠాణా పరిధిలో 2018లో నమోదైన కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన ఇతగాడు కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో వాంటెడ్‌గా మారాడు. వాసు వ్యవహారాలపై సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదాబాబు నేతృత్వంలో ఎస్ఐలు పి.సాయిరాం, ఎస్కే కవియుద్దీన్, ఎం.మధు తమ బృందాలతో వలపన్ని వాసును పట్టుకున్నారు. ఇతడి నుంచి ఓ చోరీ వాహనం, నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం చిలకలగూడ పోలీసులకు అప్పగించారు.

ఆస్పత్రికి వెళ్తూ.. అనంత లోకాలకు

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

- తల్లీ కూతుళ్ల దుర్మరణం
- తండ్రికి తీవ్ర గాయాలు



లక్ష్మమ్మ, విజయ (ఫైల్)

పహాడీషరీఫ్: అనారోగ్యంతో ఉన్న కూతురుకు చికిత్స చేయించేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన తల్లీకూతుళ్లు చివరకు అదే ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం విగతజీవులుగా వెళ్లాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాసిపల్లికి చెందిన చిత్తారి గోపాల్(36), లక్ష్మమ్మ(34) దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం. వీరి పెద్ద కూతురు విజయ(14)కు రక్తకణాలు తక్కువగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఉదయం 7.30గంటలకు వారిబైక్‌పై హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి బయలుదేరారు. ఉదయం 9.45గంటల సమయంలో తుక్కుగూడ ఓఆర్ఆర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే వెనుక ఉంచి వస్తున్న టిప్పర్ డ్రైవర్ ఒక్కసారిగా శంషాబాద్ టోల్ వైపునకు వాహనాన్ని మళ్లించాడు. ఈ క్రమంలో టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో పడిపోయిన లక్ష్మమ్మ, విజయ తల మీదుగా లారీ వెనుక చక్రాలు వెళ్లడంతో తల్లీకూతురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గోపాల్ కాలు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నారు.

విద్యాజ్యోతి కళాశాలలో రూ.15.24 లక్షలు చోరీ

మొయినాబాద్: ఇంజనీరింగ్ కళాశాల ఆఫీస్‌రూం కిటికీలో నుంచి గుర్తు తెలియని దుండగుడు చొరబడి చోరీకి పాల్పడ్డాడు. లాకర్‌లో ఉన్న రూ.15.24లక్షలు దోచుకెళ్లాడు. ఈ సంఘటన మండల పరిధి అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆఫీస్‌రూంలోకి మంగళవారం రాత్రి ఓ గుర్తుతెలియని దుండగుడు కిటికీ గ్రిల్‌ను తొలగించి లోపలికి దూరాడు. ఆఫీస్‌లో ఉన్న తాళంచెవితో లాకర్ ఓపెన్ చేసి రూ.15.24 లక్షలు దోచుకుని వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం కళాశాలకు వచ్చిన సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొయినాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకని పరిశీలించారు. క్లూస్‌టీం, సీసీఎస్ పోలీసులను రప్పించి వేలిముద్రలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించి దుండగుడిని గుర్తించే ప్రయత్నం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కళాశాలలే టార్గెట్‌గా...

ఇంజనీరింగ్ కళాశాలలే టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోతున్నారు. మండల పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం చిలుకూరు రెవెన్యూ పరిధిలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన చోరీలో గుర్తుతెలియని దుండగుడు కళాశాల ఆఫీస్ గదిలోకి చొరబడి రూ.8 లక్షలు ఎత్తుకెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినా ఇంతవరకు దొంగను పట్టుకోలేదు.

‘పిడీకాన్-2025’ సదస్సు ప్రారంభం

పంజగుట్ట: ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ తెలంగాణ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో బుధవారం ‘పిడీకాన్-2025’ పేరిట 62వ జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సు ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని అకాడమీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెంకట్ ఎమ్.కళాత్కర్ తెలిపారు. సదస్సు వివరాలను బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాబోయే అధ్యక్షురాలు డాక్టర్ లీలా మోహన్, డాక్టర్ ఎమ్.రంగయ్యతో కలిసి వెల్లడించారు. సదస్సుకు దేశవ్యాప్తంగా 10 వేలమంది చిన్నపిల్లల వైద్య నిపుణులు హాజరవుతున్నారని, అంతర్జాతీయ ఫ్యాకల్టీ కూడా వారి అనుభవాలు వెల్లడిస్తారని తెలిపారు. చిన్నపిల్లల వైద్యంలో ఎన్నో కొత్త చికిత్సా పద్ధతులు వచ్చాయని, అవి ఒకరి అనుభవాలు మరొకరితో పంచుకుంటారన్నారు. కొత్తగా వస్తున్న హ్యూమన్ మెటాప్యూమో వైరస్ గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని, కరోనా అంత ప్రమాదకరమైన వైరస్ కాదని, అలా అని నిర్లక్ష్యం చెయ్యరాదని, పిల్లలకు శ్వాస తీసుకోవడంలో ఎదైనా ఇబ్బంది కలిగితే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 9వ తేదీన బై... బై అనీమియా పేరుతో ఒక బస్సును ప్రారంభిస్తున్నట్లు, ఇది మొదట తెలంగాణ రాష్ట్రం, తరువాత దేశం మొత్తం తిరిగి పిల్లల్లో రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. 10వ తేదీన ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖా మంత్రి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.యోగేష్, నీలి రాంచందర్, డాక్టర్ బసవరాజు, సూర్యనారాయణ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికుల ఆత్మహత్య కేసులో నిందితుడి రిమాండ్



మహేశ్

ఘట్‌కేసర్: ఘనాపూర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ఈ నెల 6న కారులో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఇద్దరు ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడు ముంత మహేష్‌ను ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. బీబీనగర్ మండలం జమీలాపేట్‌కు చెందిన పర్వతం శ్రీరాం, కొర్రెముల్ మక్తకు చెందిన ఓ మైనర్ బాలిక (16) ప్రేమించుకోగా..వీరిద్దరిని మహేష్ బెదిరించి నగదు తీసుకోవడంతోపాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొనడంతో నిందితుడిపై కేసు నమోదు చేసిన విషయం విదితమే.

నాణ్యమైన నోట్ బుక్స్ కొనండి

వాణిజ్య ప్రోత్సాహక సంస్థ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వరంగ సంస్థ ఎంతో నాణ్యంగా తయారు చేసిన నోట్‌బుక్స్ కొనుగోలు చేయాలని తెలంగాణ వాణిజ్య ప్రోత్సాహక సంస్థ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోల్కొండ నోట్ బుక్స్ స్టాల్‌ను చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సీజీఎం నగేష్, జీఎంలు గంగయ్య, వేణు, డీజీఎం శ్యాంసుందర్, రాజేశ్వరి, మల్లికార్జున్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోషిప్‌కు హెచ్‌సీయూ ప్రొఫెసర్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజగోపాల్ సుబ్రహ్మణ్యం ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్-2025 ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని ప్లాంట్ సైన్సెస్ విభాగంలో ఆయన ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కిరణజన్య సంయోగక్రియ, క్లోరోప్లాస్ట్‌ల నిర్మాణం, పనితీరుకు సంబంధించి ఆయన చేసిన గణనీయమైన కృషికి గుర్తింపుగా ఈ ఫెలోషిప్ లభించింది.

యూటీఎఫ్ కేలండర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్, డైరీ-2025లను జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథ్ గుప్తా, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, రాష్ట్ర మహిళా కమిటీ కన్వీనర్ శారద, జిల్లా అధ్యక్షులు రాజారావు, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షులు రేణు, నాగరాజు, జిల్లా కార్యదర్శులు రమేష్ బాబు, బాషా, మధుసూదన్ రావు, విశాలి, విద్య, రామస్వామి, ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ వంశీ, జిల్లా కమిటీ సభ్యులు షహనాజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : పీసీబీ 11 కేవీ ఫీడర్, ఆల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫాతిమానగర్ బ్రిడ్జి వెనుక, సనత్‌నగర్ బస్టాప్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

31 లోగా ట్రేడ్ లైసెన్స్ ఫీజు, బకాయిలు చెల్లించండి

బంజారాహిల్స్: ట్రేడ్ లైసెన్స్ ఫీజు, బకాయిలను ఈ నెల 31 లోగా చెల్లిస్తే జరిమానా ఉండదని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ యాప్, మీ సేవా కేంద్రాలు, జీహెచ్ఎంసీ సిటిజన్ సర్వీస్ సెంటర్ ద్వారా చెల్లించాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

చెక్కులు అందించాలని వినూత్న నిరసన



చంటి పిల్లలతో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

రహమత్‌నగర్ : లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు బుధవారం వినూత్న నిరసన తెలిపారు. చంటి పిల్లలను ఎత్తుకుని లబ్ధిదారులతో కలిసి బోరబండసైట్–3పై నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మోహన్‌రాథోడ్, శివమ్మ, మీరా, గోపాల్, గమ్మిబాయ్, సరోజ, లఖన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో తెలంగాణ రాష్ట్రం

లిబర్టీ: తెలంగాణ రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వి.సదానందు అన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఆదరణ కోల్పోయిన బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం, మంత్రులపై ఆరోపణలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. రూ. 18 వేల కోట్ల రైతు రుణమాఫీ, రూ.10 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు, 50 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, అలాగే స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, మూసీ పునర్జీవన వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

135 బస్తీలు, 90వేల నల్లా కనెక్షన్లు!

- క్షేత్రస్థాయిలో పరిశీలించనున్న జలమండలి అధికారులు, సిబ్బంది
- సంక్రాంతి తర్వాత మార్నింగ్ వాక్ పేరిట కార్యక్రమం
- తాగునీటి సరఫరా తీరుతెన్నుల పరిశీలన
- సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కారానికి చొరవ
- మరోవైపు వేసవి కార్యాచరణ అమలుకు శ్రీకారం
- జలమండలి డివిజన్–6 పరిధిలో ప్రణాళికలు సిద్ధం





బస్తీల్లో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న జలమండలి డివిజన్–6 జీఎం హరిశంకర్

బంజారాహిల్స్: తాగునీటి సమస్యలు ఇక నుంచి సత్వర పరిష్కారం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. బస్తీల్లో వేళల ప్రకారం తాగునీరు సరఫరా కావడం లేదని.. ఒకవేళ వచ్చినా తక్కువ సమయంతో సరిపోవడం లేదని.. మరోవైపు చైనా పంపులతో కొంతమంది నీరు తోడేస్తున్నారని ప్రజావాణిలో జలమండలి అధికారులకు సోమవారం పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, తట్టిఖానా, సోమాజీగూడ, ఎల్లారెడ్డిగూడ, ఎస్పీఆర్‌హిల్స్, బోరబండ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, ఎస్సార్‌నగర్, ఫతేనగర్ తదితర సెక్షన్ల పరిధి నుంచి పెద్ద ఎత్తున తాగునీటి సరఫరాపైనే ఫిర్యాదులు అందాయి. దీనిని దృష్టిలో పెట్టుకున్న అధికారులు సంక్రాంతి మరుసటి రోజు నుంచి బస్తీల్లోని క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో నీటి ఎద్దడి లేకుండా చూడడమే కాకుండా తాగునీటి సరఫరాలో లోపాలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించాలని నిర్ణయించారు. జలమండలి జీఎం హరిశంకర్‌తో పాటు ఆయా ప్రాంతాల సెక్షన్ మేనేజర్లు, డీజీఎంలు, లైన్‌మెన్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, మీటర్ రీడర్లు అందరూ టీమ్‌గా ప్రతిరోజూ బస్తీల్లో పర్యటించనున్నారు. డివిజన్–6 పరిధిలో 135 బస్తీలు ఉండగా 90,000 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో బస్తీల్లో పర్యటించడం వల్ల వినియోగదారులకు, సిబ్బందికి మధ్య సమస్యపై చర్చించుకునే అవకాశం ఉంటుందని, అందుకే సంక్రాంతి తర్వాత బస్తీల్లో మార్నింగ్ వాక్ పేరిట కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు జలమండలి డివిజన్–6 హరిశంకర్ తెలిపారు. చాలాచోట్ల చైనా పంపులతో పైపుల నుంచి నీళ్లు తోడేస్తున్నారని, తమదాకా నీళ్లు రావడం లేదని మరికొందరు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. మోటార్ల ద్వారా వాటర్ లాగే ఇళ్లను కూడా గుర్తించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మరోవైపు వేసవి రాకముందే నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నట్లు పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆ సమస్యను కూడా పరిష్కరించే యోచనలో ఉన్నామని ఆయన వెల్లడించారు. మొత్తం 135 బస్తీల్లో తిరిగి అక్కడి సమస్యలను బేరీజు వేసుకుని పైపుల్లో ఏమైనా సమస్య ఉంటే పరిష్కరించి వాల్వ్‌లు సరిగ్గా లేకపోతే వాటిని మార్చి సమస్యకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడి పర్యటన

రహమత్‌నగర్ : బ్రహ్మశంకర్‌నగర్ ఫేజ్–2 బస్తీలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సీఎన్ రెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫేజ్–2 బస్తీకి ఎమ్మెల్యే సహకారంతో సీసీ రోడ్డు వేయించామన్నారు. అలాగే ఫేజ్–2 మీదుగా సంజయ్‌నగర్, కేసీఆర్‌నగర్ బస్తీలకు అంతర్గత రోడ్ల నిర్మాణానికి అధికారులు నివేదికలు రూపొందించారని నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడుతామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మన్సూర్, వ్యవస్థాపక అధ్యక్షుడు ఓర్సు అడవయ్య, అధ్యక్షుడు వసంత్‌కుమార్, బొంగుల శ్రీను, రాజు, మహేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప దీక్షాపరులు

రహమత్‌నగర్ : ఎస్పీఆర్‌హిల్స్ నుంచి అయ్యప్ప దీక్షాపరులు బుధవారం శబరిమలకు బయలుదేరివెళ్లారు. కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ జాతీయ కార్యదర్శి డా.రవిశేఖర్‌రెడ్డి వారిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.



రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్

బంజారాహిల్స్: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని లీల హోటల్ సిబ్బందికి 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అనే అంశంపై బుధవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానాతో పాటు 3 నెలల జైలు శిక్ష కూడా విధిస్తారన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తే 6 నెలల వరకు జైలు శిక్ష లేదా రూ.1000 జరిమానా లేదా రెండూ విధిస్తారన్నారు. కార్యక్రమంలో హోటల్ మేనేజర్ నరేశ్, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాశ్‌గౌడ్, టీటీఐ బేగంపేట సిబ్బంది అయాన్, కృష్ణ, హీరో మోటో కార్ప్ మేనేజర్ సాదిక్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 'వాణిజ్య కదంబిని'



వంటల రుచి చూస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్

పంజగుట్ట: ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వాణిజ్య కదంబిని కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ రాజేంద్రకుమార్ ప్రారంభించగా.. ఎస్వీఎస్, రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభు, డాక్టర్ శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వీట్లు, సంప్రదాయ వంటలైన జొన్న రొట్టె, రాగిసంకటి, పేలాల లడ్డూ, వెజ్‌పులావ్, గారెలు, పులిహోర, మిర్చిలు, నాటుకోడి, మొదలైన వంటలు చేసి స్టాల్స్ పెట్టారు. మొత్తం 46 స్టాల్స్ ఏర్పాటు చేయగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, డబ్బులు ఇచ్చి వంటకాలు కొనుగోలు చేసి రుచిచూశారు.

నిరుద్యోగ భృతి అందించాలి

లిబర్టీ: విద్యావంతులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు నాగిళ్ల నవీన్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లిబర్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్య నభ్యసించినా ఉద్యోగాలు, ఉపాధి దొరకని పరిస్థితి నెలకొందని అలాంటివారికి ప్రతి నెల రూ. 25 వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్ : యువతి అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనులు చేసుకుని భార్యభర్తలు కార్మికనగర్‌లో నివాసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు ఇంటర్ పూర్తి చేసి ఖాళీగా ఉంటోంది. చిన్న కుమార్తె ఏడో తరగతి చదువుతోంది. ఈనెల 3 న భార్య కూలీపనికి వెళ్లగా రెండో కూతురు స్కూల్‌కి వెళ్లింది. తండ్రి సోదరుడి కుమారుడి బర్త్‌డే వేడుకల కోసం కేక్ ఆర్డర్ ఇచ్చేందుకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి పెద్ద కుమార్తె కనిపించలేదు. దీంతో చుట్టుపక్కలా గాలించినా ఆచూకీ తెలియలేదు. గతంలోనూ తమకు తెలిసిన సూర్యప్రకాశ్‌వర్మ మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని, ఇప్పుడు కూడా అతనిపైనే అనుమానం ఉందని ఆమె తండ్రి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న సర్కిల్–18 డీసీ ప్రశాంతి



సిబ్బందితో మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

బంజారాహిల్స్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతుందని సర్కిల్–18 డీసీ ప్రశాంతి పేర్కొన్నారు. సర్వేను తీరును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కిల్–18 పరిధిలో 63 మంది సర్వేయర్లు సర్వేను చేస్తున్నారని, పారదర్శకంగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లను ఆమె ఆదేశించారు. 5 శాతం దరఖాస్తులను పునః పరిశీలించాలని ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు.

గడువులోగా ఇందిరమ్మ సర్వే పూర్తి చేయాలి

రహమత్‌నగర్ : గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సూచించారు. తన కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో బుధవారం సర్వేపై తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ జాబితాలో పేరు ఉన్న ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న చాలామంది పేర్లు సర్వే లిస్టులో లేవని. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయాలి'

లిబర్టీ: ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసి చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని లోక్ దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతు భరోసా కింద డబ్బులు పడలేదని సంక్రాంతి ఇస్తానని చెప్పి మళ్లీ జనవరి 26న జమ చేస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమే అని అన్నారు. అలాగే మహిళలకు రూ. 2500 చెల్లించాలని, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు ఇస్తామన్న మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదస్సు

ఖైరతాబాద్: ఐఐఎంసీ కళాశాలలో ఈనెల 9,10న కళలు, సామాజిక శాస్త్రాలు, పరిశోధన, సాంకేతికలో డిజిటల్ ఆవిష్కరణలపై సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రఘువీర్ తెలిపారు. ప్రఖ్యాత పండితులను ఒకేచోట చేర్చడం లక్ష్యంగా, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు డిజిటల్ టెక్నాలజీల రూపాంతర ప్రభావంపై చర్చిస్తారన్నారు.



సేవాలాల్ ఆలయంలో పూజలు

రహమత్‌నగర్ : ఎస్పీఆర్‌హిల్స్‌లోని సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో రాష్ట్ర బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు డా.కల్యాణ్ నాయక్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15న జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ని ఆహ్వానిస్తామని తెలిపారు. ఆయన వెంట బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బర్మవత్ రమేశ్ నాయక్, నాయకులు జయేందర్ రాథోడ్, రమేశ్ రాథోడ్, గోవిందనాయక్, ప్రేమ్ నాయక్ ఉన్నారు.

'జైహనుమాన్ చిత్రం విడుదల కాకుండా చూడాలి'

అంబర్‌పేట: మైత్రీ మూవీస్ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో నిర్మించిన జైహనుమాన్ చిత్రం విడుదల కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ హైకోర్టు న్యాయవాది మామిడాల తిర్మల్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాదులు ఆరుంధతి, మాధవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మూవీలో మానవ మాత్రుడిగా రిషబ్‌శెట్టి హనుమంతుడి ఆకారంలో ఉన్నట్లు టీజర్ రిలీజ్ చేశారన్నారు. భవితరాలకు హనుమంతుడి అసలు స్వరూపం తెలియక రిషబ్‌శెట్టిలాగే హనుమంతుడు ఉంటాడనుకునే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నాంపల్లి కోర్టులో కేసు వేశానని ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం ఎస్ఐ రమ

బంజారాహిల్స్: వెంకటగిరిలోని గౌతమ్ విద్యానికేతన్ పాఠశాలలో జూబ్లీహిల్స్ సైబర్ క్రైం పోలీసులు సైబర్ నేరాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. 'సైబర్ జగరూకత దివస్'లో భాగంగా ఎస్ఐ రమ, కానిస్టేబుల్ సాయితులసీ సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దని, అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దని సూచించారు. దీంతో పాటు ఈవ్‌టీజింగ్, డ్రగ్స్, వ్యక్తిగత, సంస్థాగత డేటాను ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు తెలియజేశారు.



సంఘాల కేలండర్లు, డైరీల ఆవిష్కరణ

పంజగుట్ట: గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జనగామ జిల్లాకు పాపన్న పేరును పెట్టాలని కోరారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. సంఘం నాయకులు కులం గురించి పోరాడుతూనే రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీచేసి రాజకీయంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి, బాల్‌రాజ్ గౌడ్, బండి సాయన్న, ఐలి వెంకన్న గౌడ్, రమణ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

1535 యూనియన్ డైరీ..

విద్యుత్ ప్రధాన కార్యాలయం విద్యుత్‌సౌధాలో తెలంగాణ స్టేట్ పవర్ 1535 యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఏ.వజీర్ యూనియన్ నూతన సంవత్సర డైరీని ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్ సిబ్బందితో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో పనిభారం ఎక్కువ అయిందని ఉద్యోగ, కార్మిక సిబ్బందిని నియమించి పనిభారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో 1535 తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, టీజీఎస్‌పీడీసీఎల్ కర్ణం ప్రమోద్‌కుమార్, కీర్తి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, నగేశ్, మూర్తి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ కేలండర్, డైరీ..

ఖైరతాబాద్: విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ విద్యుత్‌బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 19వ రాష్ట్ర మహా సభను బుధవారం నిర్వహించారు. ఎంపీ ఈటల రాజేందర్ హాజరై కేలండర్, డైరీని ఆవిష్కరించారు. ముత్యం వెంకన్నగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. 19 ఏళ్ల వేడుకల సందర్భంగా వారిరి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు కుమార స్వామి మాట్లాడుతూ.. 2014 తర్వాత ఇచ్చిన పదోన్నతులపై రివ్యూ చేయాలని, ప్రధాన సమస్యల పరిష్కారానికి త్వరలోనే ఆందోళనలు చేపడుతామని తెలిపారు.



తెలంగాణ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే అధిక ఓటర్లు



రాజకీయ ప్రతినిధులతో సమావేశమైన డీఎంసీ జకియా సుల్తానా

వెంగళరావునగర్ : హైదరాబాద్ జిల్లాలోనే అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గం జూబ్లీహిల్స్ అని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జకియా సుల్తానా పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్–19 కార్యాలయంలో బుధవారం సాయంత్రం వివిధ రాజకీయ నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 3, 89, 954 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 2,03,137, మహిళలు 1,86,793, ఇతరులు 24 మంది ఉన్నారన్నారు. ఈనెల 25న ప్రత్యేక ఓటర్స్ డే సందర్భంగా అన్ని పోలింగ్ బూత్‌ల్లో బూత్‌లెవల్ ఆఫీసర్స్ అందుబాటులో ఉంటారని, 18 ఏళ్లు నండి ఓటు లేని వారందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీలు కమల్, బాల్‌రాజ్, జీహెచ్ఎంసీ అధికారులు ప్రసాద్, వైశాలి, సీపీఎం నేతలు సాయిశేషగిరిరావు, కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ నాయకులు రవీందర్, వినోద్, సుబ్బరాజు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పక్షవాతం రోగులకు మొదటి నాలుగు గంటలే కీలకం



కాంప్రహెన్సివ్‌స్ట్రోక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న స్టార్ ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్: పక్షవాతం లక్షణాలు కనిపించిన రోగిని ఆసుపత్రికి తరలించి మొదటి నాలుగంటల్లోపే వైద్యం అందిస్తే పక్షవాతం నుంచి బయటపడుతాడని స్టార్ ఆస్పత్రి న్యూరో వైద్యులు విశ్వక్‌సేనారెడ్డి, నిహారికా, దుశ్యంత్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్–10 లోని స్టార్ ఆస్పత్రిలో కాంప్రహెన్సివ్ స్ట్రోక్ కేర్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పక్షవాతం లక్షణాలతో బాధపడుతున్న వారికి కాంప్రహెన్సివ్ స్ట్రోక్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్యం అందించే అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు జయవర్ధన్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, సందీప్, బి.నర్మద, జంపాల వెంకటేశ్వర్లు, ఇమ్రాన్ షరీఫ్, హరి కుమార్‌రెడ్డి, ఆస్పత్రి సీవోవో వాక భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాను నివారించాలి



అధికారులతో కలిసి కలుషిత నీటి సరఫరాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని గాంధీనగర్‌లో కార్పొరేటర్ విజయారెడ్డి వాటర్ వర్క్స్ అధికారులు బుధవారం పర్యటించారు. కొంతకాలంగా కలుషిత నీటి సరఫరా అవుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు విజయారెడ్డి వాటర్‌వర్క్స్ డీజీఎం సరిత, మేనేజర్ నదీమ్‌తో కలిసి పరిశీలించారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునంబర్–14లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులు శ్రీగోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. గోదాదేవి కల్యాణానికి ముందు అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ ప్రధాన అర్చకుడు అద్దంకి శశికాంతాచార్యులు తెలిపారు. 24వ విశేష పాశురం, దీపాలంకరణ సేవ తదితర కార్యక్రమాలు కూడా ఘనంగా జరిగాయి.



గోదాదేవి అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

ఎలక్షన్ వాచ్ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ–2025 సంవత్సరం కేలండర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కేలండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యత నిస్తూ అభివృద్ధి చేస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్, సమితి సెక్రటరీ జనరల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.ధర్మరాజు, హైకోర్టు న్యాయవాది లుక్మాన్ అలీ, మెట్టు మధు, కలవాల హరికృష్ణ, గండెల నాగార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుల సలహాలు తీసుకుంటాం

- అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి



వీసీ ఘంటా చక్రపాణిని సన్మానించిన విశ్రాంత అధ్యాపకులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి విశ్రాంత అధ్యాపకుల సూచనలు, సలహాలు తీసుకుంటామని, వారి అమూల్యమైన అనుభవాన్ని ఉపయోగించుకుంటామని ఆ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. విశ్రాంత అధ్యాపకుల సంక్షేమ సంఘం బుధవారం చక్రపాణిని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత అధ్యాపకుల దగ్గర పరిశోధనలు చేసే విద్యార్థులకు ఉపయోగపడేలా వర్సిటీలో కార్యాలయం కేటాయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్, కృష్ణా విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి వెంకయ్య, సంఘం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి వెంకటయ్య, మాజీ రిజిస్ట్రార్లు నాగరాజునాయుడు, ఏవీఆర్ఎన్ రెడ్డి, మాజీ డైరెక్టర్లు పుష్పా రామకృష్ణ, జ్ఞాన ప్రసూన, గిరిజా నేతి, సతీష్‌రెడ్డి, హయత్, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గుంటి రవి, సరస్వతీరావు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విజయాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ కోర్టుకు గైర్హాజర్

తదుపరి విచారణ ఈ నెల 16కి వాయిదా

సిటీ కోర్టు: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన పలు కేసుల విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఎమ్మెల్యే రాజాసింగ్ గైర్హాజర్ కావడంతో విచారణ ఈ నెల 16కు వాయిదా పడింది. ఎమ్మెల్యే గైర్హాజర్ కావడంతో ఆయన తరఫు న్యాయవాది కరుణ సాగర్ పిటిషన్ దాఖలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియమావళిని ఉల్లంఘించారని సిటీలోని పలు పోలీస్‌స్టేషన్లో రాజాసింగ్‌పై కేసులు నమోదయ్యాయి. మహమ్మద్ ప్రవక్తపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులు అందడంతో బహదూర్‌పూర, మంగళ్‌హాట్ తదితర పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

బండి సంజయ్ గైర్హాజర్..

హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నియమావళిని ఉల్లంఘిస్తూ రోడ్‌షో నిర్వహించి ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందికలిగేలా వ్యవహరించారని అందిన ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదైంది. బుధవారం ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగిన విచారణకు బండి సంజయ్ గైర్హాజర్ కావడంతో ఆయన తరఫు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణను వచ్చే నెలకు వాయిదా వేస్తున్నట్లు జడ్జి శ్రీదేవి తెలిపారు.

సమస్యల్ని గుర్తిస్తే పరిష్కారం చూపుతా..

- ప్రజలకు మంచి పనులు చేస్తే అధికారులకు గుర్తింపు
- 'దిశ' సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

రెక్కాడితేగాని డొక్కాడని పేదలకు సేవ చేస్తే ఎంతో సంతృప్తి



సాక్షి, సిటీబ్యూరో: మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గంలోని జిల్లాస్థాయి అధికారులు తమ శాఖల పరిధిలో వివిధ వర్గాల సమస్యలను గుర్తించి, కలెక్టర్‌కు నివేదిస్తే, వాటిని పరిశీలించి పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి, ప్రజలు, వివిధ వర్గాల వారికి కావలసిన వసతుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులుసహా సీఎస్ఆర్ ఫండ్స్, ఎంపీ ల్యాడ్స్, స్వచ్ఛంద సంస్థలు, ప్రతినిధుల సహకారం తీసుకుంటామని పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశంలో ఈటల మాట్లాడారు. విద్యా, వైద్యం, సంక్షేమం, అంగన్‌వాడీ, గ్రామీణ అభివృద్ధి, పరిశ్రమలు, ఉపాధి కల్పన తదితర 30 ప్రభుత్వ శాఖల జిల్లాస్థాయి అధికారులు తమ పరిధిలోని ఐదారు రకాల సమస్యలను తక్షణమే గుర్తించి కలెక్టర్ ద్వారా తనకు నివేదించాలన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని పేదలకు మేలు చేసేలా కలెక్టర్‌సహా ఇతర అధికారులు వ్యవహరిస్తే, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవటమే కాకుండా, విధి నిర్వహణలో సంతృప్తి మిగులుతుందని ఈటల పేర్కొన్నారు.

ఉపాధి కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మినీ ఇండియాగా పిలువబడే మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి అంతా పరిశ్రమలకు కేంద్రంగా ఉందని, యువతతోసహా వివిధ వర్గాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి జాబ్‌మేళా నిర్వహించాలని ఎంపీ రాజేందర్ సూచించారు. పేదలు, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.4 లక్షల కోట్లు కేటాయించిందని, ఇక్కడ ఉన్న అవకాశాలకు అనుగుణంగా నిరంతరంగా జాబ్‌మేళా నిర్వహించటంతోపాటు యువతకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేదలకు దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవటంతోపాటు అమలు తీరును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు, మత్స్యశాఖ, పశుసంవర్థక శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలు, యువతకు అవగాహన కల్పించి వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. కేంద్రం నుంచి మన వాటా ప్రకారం అవసరమైన నిధులను తీసుకుచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

వచ్చే 'దిశ'కు అధికారులందరూ రావాలి..

వచ్చే 'దిశ' సమావేశానికి జీహెచ్ఎంసీ అధికారులుసహా హాజరు కావాల్సిన ఇతర అధికారులందరూ ఖచ్చితంగా రావాలని 'దిశ' ఎంపీ రాజేందర్ అన్నారు. లేని పక్షంలో శాఖరమైన చర్యలు తప్పవన్నారు. ఈటల రాజేందర్ అధ్యక్షతన జరిగిన దిశ సమావేశంలో కమిటీ సభ్యులు, ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ(శేరి లింగంపల్లి ఎమ్మెల్యే) ఎమ్మెల్యేలు సీహెచ్ మల్లారెడ్డి(మేడ్చల్), మర్రి రాజశేఖర్‌రెడ్డి(మల్కాజిగిరి), బండారి లక్ష్మారెడ్డి(ఉప్పల్), వివేకానంద(కుత్బుల్లాపూర్) మెంబర్ సెక్రెటరీ, జిల్లా కలెక్టర్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, 30 ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతకే అత్యంత ప్రాధాన్యం

జేఎన్‌టీయూహెచ్ వర్క్‌షాప్‌లో వీసీ బాలకిష్టారెడ్డి



జేఎన్‌టీయూహెచ్‌లో వర్క్‌షాప్‌ను ప్రారంభించిన వీసీ బాలకిష్టారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: గ్లోబలైజేషన్ ప్రపంచవ్యాప్తంగా విద్యావ్యవస్థలను ప్రభావితం చేస్తోందని, సమాచార మార్పిడి మొదలు అన్నిరంగాల్లోనూ ఆధునిక సాంకేతికతకే అత్యంత ప్రాధాన్యత లభిస్తోందని జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో బుధవారం 'అండర్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ పాఠ్యాంశాలు–కోర్సు నిర్మాణ రూపకల్పన'అనే అంశంపై జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ ఉన్నత విద్యామండలి సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ భారత జనాభాలో 65 శాతం మంది 30 ఏళ్లలోపు లోపు ఉన్నారని, ఇలాంటి యువతతో కూడిన దేశానికి గుణాత్మక విద్య అందించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఖర్చులు తగ్గించి, ఆధునిక సాంకేతికతను వినియోగించి, ఐఐటీ మద్రాస్ వంటి ప్రఖ్యాత సంస్థలతో భాగస్వామ్యం చేసి, ఉన్నత విద్యాప్రమాణాలను మరింత మెరుగుపర్చటం అనివార్యమన్నారు. కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డీన్ ప్రొఫెసర్ ప్రతాప్ హరిదాస్, సెంటర్ ఆఫ్ అవుట్ రీచ్ అండ్ డిజిటల్ ఎడ్యుకేషన్, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ ఆండ్రూ తంగరాజ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఐటీ–ఐటీ–స్కిల్స్ కౌన్సిల్, నాస్కం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శాండీస్ చింతల, పీవీఎస్ఎమ్, నేషనల్ క్వాంటమ్ మిషన్ టెక్నికల్ మేనేజర్ సాయి శంకర్, జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, జేఎన్‌టీయూహెచ్ డైరెక్టర్ ప్రొ. ఎన్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లపై సీలింగ్ ఎత్తివేయాలి



ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి తదితరులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: పెన్షన్లపై సీలింగ్ ఎత్తేసి కరువుభత్యంతో కూడిన కనీస పెన్షన్ ప్రతి నెలా 9 వేల రూపాయలు చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈపీఎఫ్ పెన్షనర్ల రాష్ట్ర సదస్సు జరిగింది. నారాయణరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షన్ల విషయంలో సానుకూలంగా స్పందించాలన్నారు. జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి అతుల్ దిగే మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రావిడెంట్ ఫండ్‌లో ఉద్యోగులు దాచుకున్న సొమ్మును కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడం సరైంది కాదన్నారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుడు భూపాల్ మాట్లాడుతూ పెన్షనర్ల పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. టీయూసీఐ రాష్ట్ర నాయకుడు కె.సూర్యం మాట్లాడుతూ ఇది 78 లక్షల మంది పెన్షనర్ల పోరాటం మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా ఉన్న 6 కోట్ల మంది పోరాటమని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకుడు బాలరాజు, టీయూసీఐ నాయకులు ఎం.శ్రీనివాస్, జాతీయ కమిటీ నాయకులు ధర్మార్జున్, ఎం. జనార్దన్‌రెడ్డి, జి.అశోక్, బ్రహ్మచారి, ఎం.నరహరి, వైకుంఠారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు స్వాగతం



శంషాబాద్: తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఇటీవల ఉమ్రా యాత్రకు వెళ్లిన బృందం బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసినట్లు నిర్వాహకులు ఫయాజ్ అలీ తెలిపారు. ఉమ్రా యాత్రకు మరో బృందం సిద్ధంగా ఉందన్నారు.

11 మంది కాంగ్రెస్ నేతలకు బెయిల్

సిటీ కోర్టులు: బీజేపీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన ఘర్షణ కేసులో 11 మంది కాంగ్రెస్ నాయకులకు బుధవారం నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాంగ్రెస్ నాయకుల తరఫున టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ తిరుపతి వర్మ వాదనలు వినిపించారు. వీరి వాదనలను ఏకీభవించిన నాంపల్లిలోని రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరికీ రూ.5 వేల పూచీకత్తులు పెట్టాలని కోర్టు వారిని ఆదేశించింది. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీని ఉద్దేశించి ఢిల్లీ బీజేపీ నేత రమేశ్ బిదూరీ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహించిన కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించే క్రమంలో బీజేపీ కార్యకర్తలతో ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు గాయాలపాలవడంతో పోలీసులు 11 మంది కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేశారు. దీంతో బుధవారం కాంగ్రెస్ నాయకుల తరఫున టీపీసీసీ లీగల్ సెల్ టీం అశోక్‌రెడ్డి, పద్మావతి, రాజ్‌కుమార్, విజయ్, స్రవంతి, అరుణ తదితర న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేసి వాదనలు వినిపించారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ



సాక్షి,సిటీబ్యూరో: పీఆర్‌టీయూ హైదరాబాద్ జిల్లా డైరీ–2025ని జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు మందడి వెంకట్‌రెడ్డి, వి.అశోక్, మన్సూర్, కొండల్‌రెడ్డి, అశోక్ కుమార్, నటరాజ, ఎ.వేణుమాధవ్, ఎం.సురేష్ కుమార్, రంజిత్‌రెడ్డి, ఇస్రత్ సుల్తానా, రానా సలీం, వెంకట్‌రెడ్డి, రాజేందర్, అంజనేశ్వర్, రవీందర్, అసద్ పాల్గొన్నారు.

మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలి: పొన్నం

షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ



ఇన్‌వార్డులో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: దరఖాస్తుదారులకు నాణ్యమైన సేవలు అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన బంజారాహిల్స్ రోడ్ నెంబర్–2లోని షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌వార్డుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కల్యాణ లక్ష్మి దరఖాస్తులు, ఆదాయ, కుల ధ్రువీకరణ దరఖాస్తులను ఎన్నిరోజుల్లో విచారించి సర్టిఫికెట్లు అందిస్తున్నారని తహసీల్దార్ అనితారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలనలో పలు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోనివారి దరఖాస్తులను ఇప్పుడు తీసుకుంటున్నారా లేదా అని ఆరా తీశారు. ఆ దరఖాస్తులను కూడా స్వీకరించి అర్హులైనవారికి సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. అనంతరం కార్యాలయంలోని ల్యాండ్ రికార్డ్స్ పరిశీలించారు. వివిధ విభాగాల అధికారులతో మాట్లాడారు. దరఖాస్తుదారులకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇన్‌వార్డు రిజిస్టర్ ఇంకా బాగుండాలని, కార్యాలయంలో కొన్ని కేబుల్ వైర్లు బయటికి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయని, వాటిని సరి చేసుకోవాలని సూచించారు. షేక్‌పేట మండల కార్యాలయం ప్రాంగణంలో ఖాళీ భవనాన్ని అంగన్‌వాడీ, లేదంటే ఇతర అవసరాల కోసం వినియోగించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు.

వంద పడకలకు ప్రతిపాదనలు పంపండి

అమీర్‌పేట ఆసుపత్రి అధికారులకు సూచించిన మంత్రి పొన్నం



చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. వైద్యులు, రోగులు, రోగుల సహాయకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ, అత్యవసర కేసులు, గైనకాలజీ విభాగాన్ని పరిశీలించి ప్రసవాలపై ఆరా తీశారు. ఇటీవల పాపకు జన్మనిచ్చి పరీక్షల కోసం వచ్చిన మహిళ వద్దకు వెళ్లి బాలుడి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మెడికల్ ఓపీకి వెళ్లి బీపీ చెకప్ చేయించుకున్నారు. బయో మెడికల్ వేస్టేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. అమీర్‌పేట ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగినందున వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియానాను కలిసి ఆసుపత్రికి మరో 50 పడకలను పెంచేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆసుపత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

10 డయాలసిస్ బెడ్ల ఏర్పాటు

24 గంటలు నిరంతరం కరెంటు ఉండేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. 10 డయాలసిస్ బెడ్ల ఏర్పాటుతోపాటు 108 అంబులెన్సును ఆసుపత్రికి ఇచ్చేలా అధికారులతో మాట్లాడతానని మంత్రి హామీనిచ్చారు. ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదని శానిటేషన్ సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవూఫ్, సీనియర్ వైద్యులు దశరథ్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

మార్పుకు నాంది పాట: మంత్రి సీతక్క

బంజారాహిల్స్: పాట అనేది ఎంతో మందిని చైతన్యవంతులను చేస్తూ, మారుస్తూ మార్పుకు నాందిగా నిలుస్తుందని, పాటకు ఉన్న గొప్పతనమే అది అని పంచాయితీ రాజ్ శాఖామంత్రి సీతక్క అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో రమణారెడ్డి దర్శకత్వ, స్వీయ రచనలో అలీ, కామ్న శర్మ నటించిన 'నిన్ను నన్ను కన్న ఆడదిరా..' పాటను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో కుల, మత, చిన్నా, పెద్దా తేడా లేకుండా అత్యాచారాలు జరుగుతుండటం అత్యంత బాధాకరమని అన్నారు. తాగిన మత్తులో కొందరు మృగాలుగా మారుతున్నారని అన్నారు. మహిళ రూపంలో ఉన్న ఓ తల్లిని గౌరవించలేని జీవితం వృధా అని అన్నారు. మహిళల భద్రత కోసం ఉన్నత స్థాయి కమిటీ వేశామని, ఇప్పటికే పలు సమావేశాలు సైతం నిర్వహించామని అన్నారు. సినీ నటుడు అలీ మాట్లాడుతూ తల్లి మీద ప్రేమతో ఈ పాటను తయారు చేశామని, దీనిని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు అంకితమిస్తున్నట్లు తెలిపారు.



'నిన్ను..నన్ను కన్న ఆడది రా..' పాటను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

మతోన్మాదంపై సాంస్కృతికోద్యమం

ఇప్టా 90 వసంతాల వేడుకల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపు



నాంపల్లి: మతోన్మాదానికి వ్యతిరేకంగా సాంస్కృతిక కళారూపాలను రూపొందించి ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారకరామారావు కళా మందిరంలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) 90 వసంతాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభ్యుదయ నటుడు నల్లూరి వెంకటేశ్వరరావు, అభ్యుదయ రచయిత కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ప్రముఖ కవి డాక్టర్ ఏటుకూరి ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. అరసం జాతీయ నాయకులు ఆర్.వి.రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కూనంనేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సామాజిక బాధ్యత, జాతీయ సమైక్యతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో దేశంలోని అభ్యుదయ కవులు, రచయితలు, కళాకారులు కైఫీ, అజ్మీ, మజ్రూహ్ సుల్తాన్‌పురి, సాహిల్ లుధియాన్వీ, బల్‌రాజ్ సాహ్నీ, మోహన్ సెహగల్, ముల్క్‌రాజ్, నాగభూషణం, రాజనాల, అల్లు రామలింగయ్య వంటి ఎందరో రచయితలను, నటీనటులను చిత్ర పరిశ్రమకు అందించిన ఘనత ఇప్టాదేనని కూనంనేని అన్నారు. భారత రాజ్యాంగం రక్షణకు పాటలు, దృశ్య కళలు రూపొందించి ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు మాదాల రవి, సినీ నిర్మాత మద్దినేని రమేష్, తెలుగు వర్సిటీ మాజీ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, రాజేశ్వర్‌రావు, జానకీరామ్, ప్రజానాట్యమండలి వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పలయ్య, అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరాస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి కేవీఎల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జి.చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కారిడార్లలో మెగా జంక్షన్లు

- సృజనాత్మక నైపుణ్యాల ఆవిష్కరణ వేదికగా మెట్రో
- 'మి టైమ్ ఆన్ మెట్రో' ప్రారంభోత్సవంలో ఎన్వీఎస్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్: మెట్రో రెండో దశ కారిడార్లలో మెగా జంక్షన్లు ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రెండో దశలోని పార్ట్ 'బి'ప్రతిపాదిత జేబీఎస్– శామీర్‌పేట్ (22 కి.మీ.), ప్యారడైజ్ – మేడ్చల్ (23 కి.మీ.) మార్గాలకు ఉమ్మడిగా ఒక మెగా జంక్షన్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. రెండో దశలోని పార్ట్ 'ఏ'లో ఉన్న 5 కారిడార్ల డీపీఆర్‌లకు కేంద్రం నుంచి త్వరలో ఆమోదం లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. కేంద్రం అనుమతి లభించిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. అప్పటివరకు పాతబస్తీలో భూసేకరణ, రోడ్ల విస్తరణలో భాగంగా కూల్చివేతలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా ఎల్అండ్‌టీ మెట్రో, హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థలు ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో ప్రారంభించిన 'మి టైం ఆన్ మెట్రో' మూడు రోజుల వినూత్న ప్రచార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎల్అండ్ టీ హైదరాబాద్ మెట్రో ఎండీ కేవీబీరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెట్రో సృజనాత్మక వేదిక..

ప్రయాణికులు సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించుకొనేందుకు మెట్రోస్టేషన్లు చక్కటి వేదికలుగా నిలుస్తాయని ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎంజీబీఎస్ స్టేషన్‌తోపాటు అన్ని ప్రధాన స్టేషన్లలో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నిత్యం లక్షలాది మందికి ప్రయాణ సదుపాయం కలిస్తున్న మెట్రో ఇప్పుడు ప్రయాణికులకు సరికొత్త అనుభూతులను అందజేయనుందని తెలిపారు. కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల పట్ల అభిరుచి ఉన్న ప్రయాణికులు మెట్రో స్టేషన్లలో తమ సృజనాత్మక కళా రూపాలను ఆవిష్కరించుకోవచ్చని అన్నారు. 'మెట్రో అంటే కేవలం కాంక్రీట్, గోడల నిర్మాణాలతో కూడిన ఒక రవాణా వ్యవస్థ మాత్రమే కాదు. అది హైదరాబాద్ జన జీవితాలతో ముడిపడి ఉన్న ఆత్మ వంటిది'అని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా మెట్రో ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా కొన్ని ముఖ్యమైన స్టేషన్ల జంక్షన్లను, విశాలమైన స్థలాలను ప్రత్యేక హబ్‌లుగా, అంతర్జాతీయ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఎల్ అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు రైళ్లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆర్డర్ ఇచ్చిన తరువాత 18 నెలల్లో కొత్త రైళ్లు రానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 'మి టైం ఆన్ మెట్రో'ప్రచారంలో భాగంగా లఘు చిత్రాలను, నృత్యాలను పలువురు ప్రదర్శించారు. 'సంక్రాంతి సంబురాలు'గా చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమం రూపొందించిన మెట్రో రైలును ఎన్వీఎస్ రెడ్డి, కేవీబీరెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు.



విభిన్న సంస్కృతుల సమ్మేళనం 'హైదరాబాద్'లో ఒక్కో గల్లీ ఒక్కో ప్రత్యేకత సంతరించుకున్న విషయం విదితమే. ముఖ్యంగా ఆనాటి నుంచి విభిన్న రుచులకు సైతం భాగ్యనగరం కేంద్రంగా కొనసాగుతోంది. స్థానిక ఆహార వంటకాలు మొదలు విదేశాల కాంటినెంటల్ రుచుల వరకు మన నగరం విరాజిల్లోతోంది. ఈ ఆనవాయితీలో భాగంగానే ఈ మధ్య 'దొన్నె బిర్యానీ' సైతం నగరానికి చేరుకుంది. విశ్వవ్యాప్తమైన హైదరాబాద్ బిర్యానీ గురించి అందరికీ తెలుసు.. కానీ.. దొన్నె బిర్యానీ ఏంటనే కదా..?! ఇది కూడా దక్షిణాది ప్రత్యేక వంటకమే. కర్ణాటక, ప్రధానంగా బెంగళూరులో ఈ డిష్ వెరీ స్పెషల్. కొంత కాలంగా దొన్నె బిర్యానీ అక్కడక్కడా కనిపిస్తూనే ఉంది. అయితే బెంగళూరులో 90 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న శివాజీ మిలటరీ హోటల్ నగరంలోని మాదాపూర్‌కు విస్తరించింది. ఈ నేపథ్యంలో నగరంలో మరో కొత్త రుచి చేరిపోయిందని ఆహారప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

- ఆహారప్రియులకు వైవిధ్యాన్ని పంచుతున్న నగరం
- స్థానిక రుచులతో పాటు కాంటినెంటల్ వరకు ఆహ్వానం
- బెంగళూరు నుంచి నగరానికి శివాజీ మిలిటరీ హోటల్

దొన్నె బిర్యానీ..

ఈ డిష్ వెరీ స్పెషల్



బెంగళూరులోని ప్రముఖ శివాజీ మిలిటరీ హోటల్, నోరూరించే మాంసాహార వంటకాలకు ప్రసిద్ధి చెందింది. వందేళ్ల క్లబ్‌లో చేరబోతున్న ఈ ప్రముఖ భారతీయ హోటల్ మొదటిసారి మరో నగరంలో ఆవిష్కృతం అవడం, అది కూడా హైదరాబాద్‌ను ఎంచుకోవడంతో ఇక్కడి వైవిధ్యాన్ని మరింత పెంచుతోంది. కన్నడ వంటకాలు నగరంలో ఇది మొదటిసారి ఏమీ కాదు.. ఎస్ఆర్‌నగర్,

దక్షిణాది రుచులకు ఆదరణ..

మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో కన్నడ రుచులు ఇప్పటికే లభ్యమవుతున్నా.. పూర్తిస్థాయిలో అక్కడి రుచులకు ఆదరణ లభిస్తోందనడానికి ఇదో నిదర్శనం. దొన్నె బిర్యానీ, మటన్ ఫ్రై వంటి పలు వంటకాలకు ప్రసిద్ధి చెందిన శివాజీ హోటల్ హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలో తమ సేవలను విస్తరించింది. 1935 నుంచి దక్షిణాదిలో తన ప్రత్యేకత పెంచుకున్న శివాజీ మిలిటరీ హోటల్ నగరవాసులకూ చేరువైంది. స్పైసీగా ఉండే మన హైదరాబాదీ బిర్యానీకి దొన్నె బిర్యానీ కాస్త భిన్నంగా ఉన్నప్పటికీ.. భౌగోళిక సమ్మేళనంలో భాగంగా ఇప్పటికే తెలుగు వారు సైతం ఈ బిర్యానీని రుచి చూస్తున్నారు.



కలల కారు.. కళకు హుషారు

సాక్షి, సిటీబ్యూరో: మనకు కనిపిస్తున్న వెరైటీ కార్లు ఎన్నో.. అయితే మనం కలలు కనే కారు మరేదో కావచ్చు.. అలాంటి కలల కార్లను చిత్రాలుగా మలిచి.. పోటీలో నిలిచి గెలుచుకోమంటూ ఆహ్వానిస్తోంది ఈ పోటీ. టొయోటా కిర్లోస్కర్ మోటార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టొయోటా యువర్ డ్రీమ్ కార్ కాంటెస్ట్ కోసం నగరంలోని చిన్నారుల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలో ఏడేళ్ల వయసులోపు చిన్నారులకు ఓ కేటగిరీ, 8 నుంచి 11 ఏళ్ల మధ్య, 12 నుంచి 15 మధ్య వయసు ఉన్న చిన్నారుల కోసం ఇలా 3 విభిన్న కేటగిరీల్లో నిర్వహిస్తున్నారు. ఎంట్రీలను పంపేందుకు ఆఖరు తేదీ ఈ నెల 31గా వివరించారు. ఎంట్రీలను https://www.toyotabharat.com/dream-car-contestకు పంపాలని కోరారు.



రా.. రమ్మంటున్న ఆకృతి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వస్త్ర ప్రదర్శన బుధవారం ప్రారంభమైంది. ఆకృతి వస్త్ర–25 పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన చేతి వృత్తులతో పాటు కళాకృతులు, చేనేత వస్త్రాలు, భిన్న రకాల బొమ్మలు, కళాకృతులకు ప్రాధాన్యతనిచ్చే స్టాల్స్ ఏర్పాటు చేశారు. నగర మహిళలు పెద్ద సంఖ్యలో ఎగ్జిబిషన్‌కు హాజరయ్యారు.

దేశాలు, జాతులు, మతాలు, కులాల పేరిట విద్వేషాల కుంపట్లు పెరిగిపోతున్న నేపథ్యంలో మానవులందరూ సహోదరులేనని, అందరి అమ్మ ఒడి భూగర్భమేననే విషయాన్ని గుర్తు చేస్తూ ఓ అద్భుత చిత్రాన్ని రూపొందించారు నగరవాసి. త్వరలోనే ఆ చిత్రాన్ని అంతర్జాతీయంగా ప్రదర్శించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువ చిత్రకారుడు వెంకటేష్ కందునూరి(35) తన చిత్రం వివరాలను సాక్షితో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

- సాక్షి, సిటీబ్యూరో

భూగర్భమే.. ఓ విచిత్రం

- ఆగర్భ శత్రువులం కాదు.. భూగర్భవాసులం
- జాతి కుల మత విద్వేషాలు వదిలితేనే బలం
- ఆలోచింపజేసే సందేశం అందిస్తున్న అద్భుత చిత్రం
- అంతర్జాతీయంగా ప్రదర్శించేందుకు సన్నాహాలు

మాది మహబూబ్‌నగర్ జిల్లా.. ప్రస్తుతం నగరంలోని చైతన్యపురిలో ఉంటున్నా.. చిన్నప్పటి నుంచీ కళల పట్ల ఉన్న ఆసక్తితో నగరంలోని జేఎన్‌టీయూలో బీఎఫ్ఏ చేసి ప్రస్తుతం ఫ్రీలాన్స్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాను. తరచూ సామాజిక అంశాలపై చిత్రాలను గీయడం నాకు అలవాటు. అదేవిధంగా ఈ ఆర్ట్ వర్క్ రూపొందించాను.

భూమి.. బలిమి..

ఈ చిత్రంలో ప్రధానంగా భూమి, మనుషులు, జెండాలు, తుపాకులు అనే నాలుగు అంశాలు కనిపిస్తాయి. ఒక మహిళ తన గర్భంలో భూమిని మోస్తూ ఉంటే, ఆ భూమి లోపల తుపాకీతో కాలుస్తున్నట్లు కనిపిస్తుంది. ఆ తుపాకీ భూమి లోపల దించి ఉండటం వల్ల ఆ మట్టిని తాకిన తుపాకీకి ఉన్న చెక్క జీవం పోసుకుని, చిగురు ఆకులతో కనిపిస్తుంది. మరో వైపు వివిధ రకాల జెండాలు, తుపాకులను చేతబట్టిన ప్రజలు యుద్ధ వాతావరణాన్ని ప్రతిబింబిస్తారు. 'ఓ మనిషి నువ్వు నన్ను ఎన్ని రకాలుగా చిత్రవధ చేసినా నేను మాత్రం చివరి వరకూ నిన్ను కాపాడుతూనే నీకు జీవాన్ని పోస్తూనే ఉంటా' అని చెబుతున్న భూమి విలువ గుర్తించమనేదే ఈ చిత్రంలోని అంతరార్థం. ఆరు అడుగుల పొడవు, ఆరున్నర అడుగుల వెడల్పు కలిగిన ఈ భారీ చిత్రాన్ని దేశ రాష్ట్రపతితో ప్రారంభించి, అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించాలని, అలాగే ఐక్యరాజ్యసమితి వరకు చేర్చాలని ప్రయత్నిస్తున్నాను.




జాతి జాగృతి కోసం..

బంజారా భగవద్గీత



రామంతాపూర్: పురాణాల ప్రకారం, దైవత్వాన్ని పొందిన మొట్ట మొదటి ధార్మిక గ్రంథం భగవద్గీత. దీన్ని భారతీయ సంస్కృతి, సంస్కారాలను ప్రభావితం చేసిన జ్ఞాన ప్రవాహంగా పరిగణిస్తారు. హిందువులకు ఎంతో పవిత్రమైన ఆధ్యాత్మిక గ్రంథం. మనిషి ఎలా మసులుకోవాలి.. కష్టసుఖాల్లో ఎలా వ్యవహరించాలి తదితర విషయాలపై మానవాళిని సన్మార్గంలో నడిపే పవిత్ర గ్రంథం భగవద్గీత. భారతీయ సంస్కృతికి గోపురం వంటి గీతను సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడు మానవ ప్రపంచానికి అందించారు. దాదాపు ప్రపంచంలోనే అన్ని భాషల్లోకి అనువదించబడినా బంజారాలకు మాత్రం చేరలేదు. దాంతో వారికి భగవద్గీత సారాన్ని అందించాలని అనుకున్నారు హబ్సిగూడవాసి కేతావత్ సోమ్‌లాల. తన జాతి జాగృతం కోసం మొక్కవోని సంకల్పంతో 16 నెలలు శ్రమించి భగవద్గీతలోని 701 శ్లోకాలను బంజారాభాషలోకి అనువదించారు. తెలుగు లిపిలో బంజారాలకు సులభంగా అర్థమయ్యే రీతిలో గీతను మలిచి అందజేశారు. యాదాద్రి, భువనగిరి జిల్లాలోని ఆకుతోట బావి తండాకు చెందిన సోమ్‌లాల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తించి వీఆర్ఎస్ తీసుకున్నారు. విద్యార్థి దశలోనే బంజారాలను చైతన్యపరుస్తూ 200లకుపైగా పాటలు రాశారు. తండాలు తిరుగుతూ ఈ పాటలు పాడి బంజారాలను ఉత్తేజపరిచారు.

- విద్యార్థి దశలోనే బంజారా భాషలోకి అనువాదం చేసేందుకు ఎంతో శ్రమించారు. బంజారా భాషలో మల్లె మొగ్గ అనే పదాన్ని ఏమంటారో తెలుసుకోవడం కోసం తిరగని తండా లేదు. పువ్వుడా అంటారని తెలుసుకొని ఆ పదాన్ని గీతలోకి చేర్చారు. దాదాపు 50 భగవద్గీతలు చదివి 1988 ఆగస్టు నెలలో అనువాదం మొదలుపెట్టారు. దాదాపు 16 నెలలు కృషి చేస్తే పూర్తయింది. కానీ ముద్రణకు మాత్రం 25 ఏళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. బంజారా భగవద్గీతను అప్పటి టీటీడీ ప్రెస్ అధికారి రవ్వ శ్రీహరి సహకారంతో తిరుమల బ్రహ్మోత్సవాల్లో అప్పటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఎల్ దత్తు, జడ్జి రమణ ఆవిష్కరించారు.



- పేద కుటుంబంలో జన్మించిన ఆయన జనగామలోని ప్రభుత్వ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న సమయంలో ఈ హాస్టల్ పక్కనే ఉన్న గీత మందిరం నుంచి ప్రతిరోజూ ఉదయం లౌడ్ స్పీకర్‌లో వినిపించే గీతా శ్లోకాలను వింటూ స్ఫూర్తి పొందారు. వెనుకబడిన తన బంజారా సమాజానికి గీతా సారాన్ని అందించాలని నిర్ణయించుకున్నారు.

- బంజారాల కోసం అనువదించిన భగవద్గీతతో పాటు ది హిస్టరీ ఆఫ్ బంజారా, బంజారా గీతమాల వంటి రచనలు చేసిన సోమ్‌లాల్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. 2024 సంవత్సరం ఏప్రిల్ నెలలో భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతులమీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. 2001లో ఆల్ ఇండియా బంజారా సేవా సమితి ముంబై వారు సోమ్‌లాల్‌కు బంజారా జానపద బ్రహ్మ అనే అవార్డు అందించారు. మాజీ సీఎం కేసీఆర్ బంజారా సాహిత్యానికి సోమలాల్ చేస్తున్న సేవలను గుర్తించి బంగారు కంకణం తొడిగారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం ఆయనను అభినందించారు.

ఐటీ జాబ్ వదిలేసి..

ఆర్గానిక్ వైపు..



మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్, ఐఎమ్‌టీ ఘజియాబాద్‌లో ఎంబీఏ చదివి నగరంలోని ఐటీ కంపెనీల్లో ఏడాదికి రూ.25 లక్షలకుపైగా జీతమిచ్చే ఉద్యోగాలు చేశారు. ఆ ఉద్యోగాలను వదిలేసి.. 'ఆర్గానిక్ ఉత్పత్తులు ఆరోగ్యాన్నిస్తాయి.. కల్తీ ఆహారోత్పత్తులతో రోగాల పాలు కావొద్దు' అని ఇంటింటికీ వెళ్లి చెబుతున్నారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛమైన ఆర్గానిక్ ఉత్పత్తుల కోసం అన్వేషణ సాగిస్తున్నారు. ఆ విశేషాలు నగరవాసి యోగితా జాహ్నవి మాటల్లోనే..

- సాక్షి, సిటీబ్యూరో

'గర్భిణిగా ఉన్నప్పుడు పోషకాహారం తినాలని ప్రతి ఒక్కరూ చెబుతారు కానీ పోషకాలు అందించే ఆహారం దొరకాలి కదా.. ఇప్పుడు ఎటు చూసినా కల్తీ.. ఈ పరిస్థితుల్లో కడుపులోని బిడ్డకు స్వచ్ఛమైన ఆహారం అందించడం ఎలా?' అంటూ చాలా ఆందోళన చెందాను' అంటూ తాను గర్భిణిగా ఉన్ననాటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు ఆర్గానిక్ ఉత్పత్తుల సంస్థ వీ రిచ్ నిర్వాహకురాలు యోగితా జాహ్నవి.

అంతా కల్తీ.. తినేదెలా?

అదీ ఇదీ లేదని సందేహం వలదు.. ఎందెందు వెదికినా అందందే కలదు అడల్ట్రేషన్.. మనం తింటున్న ఆహారం మనకు పోషకాలు ఇస్తోందా? రోగాలు తెస్తోందా? ఈ ఆందోళన గర్భిణిగా ఉన్నప్పుడు మరింత పెరిగింది. కడుపులో ఉన్న బిడ్డ కోసమైనా స్వచ్ఛమైన పాలు, తేనె, కుంకుమ పువ్వు తీసుకోవాలనే ఆరాటంతో నా అన్వేషణ మొదలైంది. ఎంత కష్టమైనా సరే స్వచ్ఛమైన ఆహారోత్పత్తులను అందించాలనే తపన పెరిగింది. అదే ఏళ్ల తరబడి శ్రమించి అందుకున్న డిగ్రీ పట్టా, అది అందించిన లక్షల జీతమిచ్చే ఉద్యోగం.. వదిలేసి మా పల్లెటూరి వైపు నా చూపును మళ్లించింది.

పాడితో కూడి..

ప్రభుత్వోద్యోగం చేసి రిటైరయ్యాక డైరీ ఫార్మ్ పెడదామని నాన్న కల. ఉద్యోగం వదిలేశాక మా నాన్న కల సాకారంతో పాటు నా ఆశయాలకు ఆకారం కూడా ఇవ్వాలని మా ఊరు(ఆంధ్రప్రదేశ్‌లోని కందుకూరు)లో ఒక డైరీ ఫార్మ్‌ను ఏర్పాటు చేశా. ఆవులు, గేదెలకు గ్రోత్ హార్మోన్ ఇంజక్షన్లు ఇవ్వకుండా వాటి మేత కూడా సహజమైన ఆహారమే అందిస్తున్నాం.. తద్వారా ఏ దశలోనూ కల్తీ కాని, రసాయనాలు కలవని స్వచ్ఛమైన పాలు ఉత్పత్తి చేస్తున్నాం.





పరిశోధించి.. పరిశీలించి..

పర్వత ప్రాంతమైన ఉత్తరాఖండ్‌లో ఒకే సీజన్‌లో తేనె లభిస్తుంది. ప్రభుత్వం, ఎన్‌జీవోలు కలిపి ప్రతి ఇంటికీ తేనె సేకరించేలా ఏర్పాట్లు చేస్తారు. విభిన్న రకాల పూల నుంచి సేకరించిన ఈ తేనెలో ఔషధ విలువలు పుష్కలం. ఇది తెలిసి అక్కడకు వెళ్లి వారితో ఒప్పందం కుదుర్చుకున్నా. అదేవిధంగా బెల్లం పొడి కూడా అక్కడిదే. మెటల్ సీడ్ నుంచే పుట్టే ఈ బెల్లం ఆరోగ్యకరం. ఇక్కడ లభించే బెల్లం పొడిలా దీన్ని కలిపితే పాలు విరగవు. ఇందులో ఐరన్ కంటెంట్ బాలింతలకు ఆరోగ్యకరం. అలాగే అత్యుత్తమ రైస్ రకం గురించి అన్వేషిస్తే బ్లాక్ రైస్ గురించి తెలిసింది. వియత్నాం, రష్యాలో ఈ రైస్‌కి బాగా డిమాండ్ ఉంది. మన దేశంలో మణిపూర్‌లో బాగా పండిస్తారు. అక్కడి నుంచి బ్లాక్ రైస్ తెస్తున్నా. అలాగే కశ్మీర్ నుంచి కుంకుమ పువ్వు ఇలా దాదాపు డజనుకు పైగా అన్వేషించినవి, అత్యుత్తమమైనవి అందిస్తున్నా. దీన్నేదో కేవలం వ్యాపారంగా చూడటం లేదు. అత్యధిక శాతం మహిళా సిబ్బందితో నడిచే మా సంస్థ.. ఇంటింటికీ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు చేరవేయాలని, ముఖ్యంగా బాలింతలు, బలహీనంగా ఉండే మహిళలకు బలవర్ధకమైన ఆహారం అందించాలనే ఆశయంతో నిర్వహిస్తున్నాం.

ఎల్‌ఆర్‌ఎస్ పేరిట దోపిడీ

ప్రజల నుంచి రూ.15 వేల కోట్ల వసూలుకు యత్నం: మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: భూక్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) పేరిట ప్రభుత్వం ప్రజల నుంచి రూ.15 వేల కోట్లు ముక్కుపిండి వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై అడ్డగోలు విమర్శలు చేసిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక అసలు రంగు బయట పెట్టిందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారని, రియల్ ఎస్టేట్ రంగం కుదేలైన మాట వాస్తవమేనని మంత్రి వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయన్నారు. 7 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఏడాదిగా ఎదురు చూస్తున్నారని, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్, ఆరోగ్య భద్రత పథకాల సేవలను అటకెక్కించే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

హరిత హబ్‌గా విశాఖ..

▶ మొదటి పేజీ తరువాయి

అభిమానానికి నా కృతజ్ఞతలు. నా అభిమానాన్ని చూపించే అవకాశం ఇప్పుడు లభించింది. సింహాచలం లక్ష్మీ నృసింహ స్వామికి నమస్సులు తెలియజేసుకుంటున్నా..''అని తెలుగులో తన ప్రసంగాన్ని ప్రధాని ప్రారంభించారు. మీ ఆశీర్వాదంతో 60 సంవత్సరాల తర్వాత మూడోసారి కేంద్రంలో మన ప్రభుత్వం ఏర్పాటైందని... దేశంతోపాటు ఏపీ కూడా అభివృద్ధి చెందుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల లక్ష్యాలను సాకారం చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఏపీ అభివృద్ధి మా విజన్.. ఏపీ ప్రజల సేవే మా సంకల్పం' అని పేర్కొన్నారు. ప్రధాని ఇంకా ఏమన్నారంటే...

ఇప్పటికీ విశాఖకు అంతే ప్రాధాన్యం..

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేశాం. ఏపీ అభివృద్ధి దృష్ట్యా ఇది చాలా ముఖ్యమైన కార్యక్రమం. చిరకాల స్వప్నం ఈ రోజు నెరవేరబోతోంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం అందుబాటులోకి వచ్చిన తర్వాత వ్యవసాయం, వ్యాపార కార్యకలాపాలు విస్తరించనున్నాయి. పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థలో కూడా కొత్త అవకాశాలు దక్కుతాయి. . సరికొత్త టెక్నాలజీకి ఏపీ రాష్ట్రం కేంద్రంగా మారుతోంది. అందులో ఒకటి గ్రీన్ హైడ్రోజన్. దేశంలో 2023లోనే నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు శ్రీకారం చుట్టాం. 2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. దీని కోసం ప్రారంభ దశలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు ఏర్పాటు చేస్తుండగా అందులో ఒకటి విశాఖలో ఏర్పాటవుతోంది. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ రానుంది. దేశంలో నెలకొల్పే మూడు బల్క్ డ్రగ్ పార్కులలో ఒకటి రాష్ట్రంలో ఏర్పాటు కానుండటం శుభ పరిణామం.

మనిద్దరి స్కూల్ ఒకటే సార్..: సీఎం చంద్రబాబు

దేశం కాదు.. ప్రపంచమే మెచ్చిన ప్రధాని మోదీ. భవిష్యత్తులో కూడా ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్, నేను... ఈ కాంబినేషన్ ఉంటుంది. మోదీ ప్రధానిగా దేశ రాజకీయాల్లో కొనసాగుతారు. మోదీని నిరంతరం స్ఫూర్తిగా తీసుకుంటూ ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. మీరు శంకుస్థాపన చేసిన అమరావతిని మీ ఆశీస్సులతో నిర్మించి.. మీ చేతుల మీదుగా ప్రారంభించే రోజు దగ్గర్లోనే ఉంది. మీ స్కూల్, నా స్కూల్ ఒకటే సార్..! ఇద్దరం ఒకేలా ఆలోచిస్తున్నాం.

కేటీఆరే పనికిరాని పెద్ద లొట్టపీసు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మా జీమంత్రి కేటీఆరే పనికి రాని పెద్ద లొట్ట పీసు అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్, టీపీసీసీ అధికార ప్రతినిధి బొజ్జ సంధ్యారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లా డారు. సీఎం అనే మర్యాద లేకుండా రేవంత్‌రెడ్డిని లొట్టపీసు ముఖ్యమంత్రి అంటావా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ అరెస్టు భయంతో నోటికొచ్చినట్టు మాట్లా డుతున్నార న్నారు. అవినీతి, అక్రమాలు చేసి దొరికిపో యి.. తిరిగి మాపైన ఎదురుదాడి చేస్తవా అని ప్రశ్నించారు. నీ లొట్టపీసు కథలన్నీ బయటకు వస్తున్నాయన్న భయంతోనే ఏసీబీ ముందుకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నావని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉందని, ఆరు గ్యారంటీలను అమలు చేసి చూపిస్తామన్నారు. హరీశ్‌రావు తెలంగాణ గోబెల్స్‌గా మారాడని, అబద్ధాల పుట్టగా తయారయ్యాడని మండిపడ్డారు. పదేళ్ల మోసాలకు హరీశ్‌రావు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

తుది దశకు నీట్-పీజీ అడ్మిషన్లు

కటాఫ్ తగ్గింపుతో మిగిలిన సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ

11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఇన్ సర్వీస్ వైద్యులకు దక్కని ఊరట



సాక్షి, హైదరాబాద్: పీజీ వైద్యవిద్యలో ప్రవేశాల ప్రక్రియ తుది దశకు చేరింది. రాష్ట్రంలో ఇప్పటికే రాష్ట్ర కోటా ప్రవేశాల కోసం రెండు దశల్లో విడుదలైన అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుండగా.. తాజాగా కేంద్రం పీజీ అడ్మిషన్లకు కటాఫ్ తగ్గించటంతో అందుకు తగ్గట్లుగా కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం మరో నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో కలిపి రాష్ట్ర కోటా కింద 1,350 పీజీ సీట్లు ఉన్నాయి. కటాఫ్ తగ్గించడంతో మిగిలిపోయిన సీట్ల భర్తీకి మార్గం సుగమమైంది. పీజీ ప్రవేశాలకు అర్హత సాధించాలంటే ఇప్పటివరకు జనరల్ విద్యార్థులు 50 శాతం.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులు 40 శాతం పర్సంటైల్ సాధించాలనే నిబంధన ఉంది. దీనివల్ల చాలా వర్సిటీలలో పీజీ సీట్లు మిగిలిపోతున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం కటాఫ్ పర్సంటైల్‌ను జనరల్‌కు 15 శాతం.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు 10 శాతంగా నిర్ణయించింది. తగ్గిన కటాఫ్ ప్రాతిపదికన మిగిలిపోయిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు కాళోజీ వర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. బుధవారం (8వ తేదీ) సాయంత్రం ఐదు గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరింది. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం మెరిట్ జాబితాను విడుదల చేస్తుంది. తదనుగుణంగా వెబ్ ఆప్షన్లకు మరో నోటిఫికేషన్ జారీ చేస్తుంది.

ఇన్‌సర్వీస్ వైద్యులకు నిరాశే

స్థానికతపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం జరగాల్సిన వాదనలు 15 తేదీకి వాయిదా పడ్డాయి. దీంతో తెలంగాణ ఇన్ సర్వీస్ డాక్టర్లకు నిరాశే ఎదురైంది. రాష్ట్రంలో ఇన్‌సర్వీస్ కోటా కింద 297 సీట్లు ఉండగా , ఇప్పటివరకు 17 మంది మాత్రమే పీజీలో చేరారు. కటాఫ్ తగ్గిస్తూ ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా ఇచ్చిన నోటిఫికేషన్ దరఖాస్తులకు ఈ నెల 11 చివరి తేదీగా నిర్ణయించటంతో.. కేసు విచారణకు ముందే ఇన్ సర్వీస్ కోటా సీట్ల భర్తీ కూడా పూర్తవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

మరో 20 ఏళ్లు పవర్‌లో ఉండాలి

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర పార్టీ కమిటీలను మూడు వారాల్లోగా ఏర్పాటు చేయాలని సూచించారు. వీలున్నంత త్వరగా ప్రభుత్వ పదవులను కూడా భర్తీ చేయాలని చెప్పారు.

అంబేడ్కర్‌ను అవమానించడాన్ని సీరియస్‌గా తీసుకోవాలి

దేశ రాజకీయ చరిత్రలో అంబేడ్కర్‌ను అవమానించిన నాయకులు లేరని, మొదటిసారి కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానకరంగా మాట్లాడిన విషయాన్ని తీవ్రంగా పరిగణించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పాదయాత్రలు నిర్వహించాలని కోరారు.

మంచి అభిప్రాయం ఉండేలా చూసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆశించిన మేర కృషి జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన వేణుగోపాల్..ముఖ్యమంత్రిపై మంత్రులకు, మంత్రులపై ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్యేలపై ప్రజలకు మంచి అభిప్రాయం ఉండేలా చూసుకోవాలని చెప్పినట్లు తెలిసింది.

ప్రభుత్వ పథకాలను వివరించిన సీఎం

గత ఏడాది కాలంగా రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రూ.21 వేల కోట్లతో రైతు రుణమాఫీ అమలు చేశామని, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామని, జనవరి 26 నుంచి రైతు భరోసా అమలు చేయబోతున్నామని తెలిపారు. ఒక్కో వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు అందించబోతున్నామని, కొత్త రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. మొదటి ఏడాదిలోనే 55,143 ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేశామన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించబోతున్నామని చెప్పారు. మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. అంబేడ్కర్‌ను అవమానించిన ఉదంతంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించి నిరసనలు తెలియజేశామని వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీపీసీ సభ్యులు వి.హన్మంతరావు, జానారెడ్డి, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డి, సంపత్‌కుమార్, వంశీచంద్ రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, బలరాం నాయక్, గీతారెడ్డి, అజారుద్దీన్, మధుయాష్కీ గౌడ్, చిన్నారెడ్డి తదితరులు హాజరయ్యారు. పీఏసీ సభ్యురాలు రేణుకాచౌదరి వ్యక్తిగత కారణాల వల్ల సమావేశానికి గైర్హాజరయ్యారు. కాగా గురువారం పార్లమెంటు ప్రజా పద్దుల కమిటీ సమావేశం జరిగే ఫలక్‌నుమా ప్యాలెస్ హోటల్లోనే వేణుగోపాల్ బుధవారం రాత్రి బస చేశారు. అక్కడే ఆయనతో కలిసి రేవంత్, తదితరులు డిన్నర్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో మధుయాష్కీ గౌడ్

25-28 తేదీల మధ్య సంవిధాన్ బచావో ర్యాలీ

పీఏసీ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు పలువురు నేతలతో కలిసి వాటిని విలేకరులకు వెల్లడించారు. అంబేడ్కర్‌ను అవమానిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 25 నుంచి 28వ తేదీ మధ్యలో తెలంగాణలో సంవిధాన్ బచావో ర్యాలీని నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ర్యాలీకి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరు కావాలని కోరుతూ పీఏసీ తీర్మానించినట్లు తెలిపారు. సంవిధాన్ బచావో పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజుల పాటు పాదయాత్రలు నిర్వహించాలని, ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ నేతల అభిప్రాయాలను కేవలం పీఏసీ సమావేశంలో మాత్రమే వివరించాలని, ఎవరూ బయట మాట్లాడకూడదని నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రులు ప్రతినెలా జిల్లాల్లో ప్రజా దర్బార్ నిర్వహించాలని కూడా నిర్ణయించామన్నారు. మహాత్మాగాంధీ శత జయంతి ఉత్సవాలను ఏడాది కాలం పాటు రాష్ట్రమంతటా నిర్వహించేలా కార్యాచరణ తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు.

ఐఏఎస్ చెరుకూరి శ్రీధర్ వాంగ్మూలం రీరికార్డింగ్!

సీఐడీ, మఫ్టీ పోలీసుల పహారా మధ్య రీరికార్డింగ్

సాక్షి, అమరావతి: చంద్రబాబుపై అవినీతి కేసులను నీరుగార్చడమే ఏకైక కర్తవ్యంగా భావిస్తున్న సీఐడీ అందుకు చర్యలు వేగవంతం చేసింది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధానిలో అసైన్డ్ భూముల దోపిడీ, ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాలను ఆధారాలతో సహా వెల్లడించిన అప్పటి సీఆర్‌డీయే కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌పై ఒత్తిడి తెచ్చి, గతంలో ఆయనిచ్చిన వాంగ్మూలాన్ని మార్పించి, కొత్తగా వాంగ్మూలం ఇప్పించడంలో విజయవంతమైంది. చంద్రబాబు ప్రభుత్వ అక్రమాలను వెల్లడిస్తూ ఆయన గుంటూరులోని న్యాయస్థానంలో ఇంతకుముందు 164 సీఆర్‌పీసీ వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న ఆయనతో గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి పూర్తి విరుద్ధంగా వాంగ్మూలం ఇవ్వాలని సీఐడీ ద్వారా బెదిరింపులకు పాల్పడింది. ఇందుకు ఆయన అంగీకరించలేదు. రెండుసార్లు ఆయనతో 164 సీఆర్‌పీసీ వాంగ్మూలాన్ని రీరికార్డింగ్ చేసేందుకు సీఐడీ యత్నించి విఫలమైంది. ఓసారి న్యాయాధికారి సెలవులో ఉండటంతో వాయిదా పడింది. మరోసారి న్యాయ స్థానం ప్రాంగణం వరకూ వచ్చిన శ్రీధర్ బయటే చాలాసేపు తన వాహనంలో ఉండిపోయారు. న్యాయస్థానం లోపలికి వెళ్లలేదు. ఓసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరోసారి వాంగ్మూలం ఇవ్వడం నేరంగా పరిగణిస్తారని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పలువురు న్యాయ వాదులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో ఆయన వాంగ్మూలం ఇవ్వకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. మూడో ప్రయత్నంలో బుధవారం సీఐడీ అధికారులు ఆయన్ని గుంటూరులోని న్యాయస్థానానికి తీసుకువచ్చారు. సీఐడీ అధికారులు, మఫ్టీలో ఉన్న పోలీసు అధికారుల పహారా మధ్య దాదాపు రెండు గంటల పాటు ఆయన న్యాయస్థానంలోనే ఉన్నారు. ఆ సమయంలో ఇతరులు ఎవరూ ఆయన్ని కలిసేందుకు కూడా సీఐడీ అధికారులు అనుమతించలేదు. సీఆర్‌పీసీ 164 కింద శ్రీధర్ తన వాంగ్మూలాన్ని రీరికార్డింగ్ చేసినట్టు సమాచారం.

త్వరలో 'సౌర' టెండర్ల ఖరారు!

- ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో సౌరవిద్యుత్ కేంద్రాల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళల ఆధ్వర్యంలో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) పిలిచిన టెండర్లను త్వరలో ఖరారు చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇందుకుగాను ఎస్‌హెచ్‌జీల కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన రుణ సహాయం కోసం ఎస్‌హెచ్‌జీలను బ్యాంకులతో సమన్వయం చేయాలని కోరారు. ఎస్‌హెచ్‌జీల ద్వారా 1,000 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు గతేడాది సెప్టెంబర్‌లో ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ కార్యక్రమం పురోగతిపై మంత్రులు సీతక్క, కొండా సురేఖతో కలిసి బుధవారం ప్రజాభవన్‌లో జిల్లా కలెక్టర్లతో ఉపముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకి 4 ఎకరాలు చొప్పున ప్రతిజిల్లాలో కనీసం 150 ఎకరాలు, రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల ఎకరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇందుకుగాను దేవాదాయ, నీటిపారుదల శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని సూచించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తయారు చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో చిన్న స్థాయి పారిశ్రామికవాడల ఏర్పాటుకు భూములు సేకరించాలని భట్టి ఆదేశించారు. వీటితో ఎస్‌హెచ్‌జీలు వ్యాపారాలు చేసుకోవచ్చన్నారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల ఏర్పాటుకి 4-5 ఎకరాల భూమి సరిపోతుందన్నారు. అటవీ భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అధికంగా ఉన్న గుట్టలతో పాటు నగరాల్లో భారీ భవంతులపై సౌర విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గిరిజనులకు భూమి ఎక్కువగా ఉన్నా ఆదాయం తక్కువగా ఉంటుందని, అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరీవాహకంలోని భూములపై దృష్టిపెడితే వారికి ప్రయోజనం కలుగుతుందని మంత్రి సీతక్క అన్నారు. సమావేశంలో ఇంధన, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్యకార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, లోకేశ్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ పాల్గొన్నారు.

ఏదుల 'ప్యాకేజీ-3' పనులు తక్షణం చేపట్టాలి

కాంట్రాక్టర్‌తో పని చేయించే బాధ్యత అధికారులదే

సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ జలాశయం నుంచి ఏదుల జలాశయానికి నీళ్లను తరలించే ప్యాకేజీ-3 ప్రధాన కాల్వ పనులను సత్వరం చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నిర్మాణ అంచనా వ్యయాన్ని పెంచాలని గుత్తేదారు సంస్థ పట్టుబడుతున్న నేపథ్యంలో ఈ పనులపై సీఎం బుధవారం నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ అధికారులతో సమావేశమై చర్చించారు. నిర్మాణ సంస్థతో పనులు చేయించే బాధ్యత అధికారులదేనని స్పష్టంచేశారు. హైదరాబాద్‌కు తాగునీరు, నల్లగొండ జిల్లాకు సాగునీరు అందించే పుట్టంగండి రిజర్వాయర్‌లో ఏర్పడిన లీకేజీలను తక్షణమే అరికట్టాలని, లేనిపక్షంలో రిజర్వాయర్ దెబ్బతిని పంప్‌హౌస్‌లోకి నీరు చేరే ప్రమాదముందని అధికారులు సీఎంకు వివరించారు. జలమండలి, నీటిపారుదల శాఖల అధికారు లు సంయుక్తంగా సర్వే నిర్వహించాక రిజర్వాయర్‌కు మరమ్మతులతో పాటు కాల్వకు లైనింగ్ పనులను చేపట్టాలని సీఎం సూచించారు. మరమ్మతులు చేసే క్రమంలో హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ పైప్‌లైన్ వేయాల్సి ఉంటుందని అధికారులు చెప్పగా.. సీఎం అనుమతిచ్చారు. ఏదుల రిజర్వాయర్‌కు నీటిని తరలించే ప్యాకేజీ-3లో భాగంగా 8.235 కి.మీ.ల కాల్వ తవ్వాల్సి ఉంది. పెరిగిన ధరలకు అనుగుణంగా ఈ ప్యాకేజీ అంచనా వ్యయాన్ని రూ.416 కోట్ల నుంచి రూ.784 కోట్లకు పెంచాలని నీటిపారుదల శాఖ సిఫారసు చేయగా, ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం తిరస్కరించింది.

రేవంత్ ఒక లొట్టపీసు సీఎం

అమరుల త్యాగాలతో పోలిస్తే నాది పెద్ద ఇబ్బంది కాదు

- కేసీఆర్ తయారు చేసిన సైనికుడిని.. అక్రమ కేసు లెక్కేం కాదు
- తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ డైరీ ఆవిష్కరణలో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా-ఈ రేస్ అంశంలో తనపై పెట్టిన కేసు లొట్టపీసు (డొల్ల) అని, రేవంత్‌రెడ్డి ఒక లొట్టపీసు ముఖ్యమంత్రి అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్ తయారుచేసిన సైనికుడిని అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రక్తం పంచుకొని పుట్టిన తాను రేవంత్ సర్కారు పెట్టిన అక్రమ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావ సమయం నాటి పరిస్థితులు, తెలంగాణ ఉద్యమకారులు పడిన ఇబ్బందులు, అమరుల త్యాగాలతో పోలిస్తే తాను పడుతున్నది పెద్ద ఇబ్బందేమీ కాదన్నారు. తెలంగాణభవన్‌లో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ 2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'నాపై పెట్టిన కేసును రేవంత్ తీర్చుకుంటున్న ప్రతీకారమని ప్రజలు అనుకుంటున్నారు. తమ భూముల కోసం లగచర్ల గిరిజనులు 40 రోజులపాటు జైలులో గడిపిన దానితో పోలిస్తే నేను పడుతున్నది పెద్ద ఇబ్బందేమీ కాదు. అక్రమ కేసులపై చట్ట ప్రకారం పోరాడుతా. కేసుల గురించి ఆలోచించకుండా రైతులు, మహిళలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ మోసగిస్తున్న తీరును ప్రజల్లో ఎండగట్టాలి. కొత్త సంవత్సరంలో తెలంగాణ కోసం కలిసి నడుస్తూ ప్రభుత్వంపై పోరాటం చేద్దాం. ఏడాది కాలంలో పార్టీకి కొత్త కమిటీలు, సభ్యత్వ నమోదు, పార్టీ అధ్యక్షుడి ఎన్నిక వంటి అనేక కార్యక్రమాలు ఉంటాయి'అని కేటీఆర్ వెల్లడించారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, హరీశ్‌రావు

కేటీఆర్‌కు ఆపద వస్తే అండగా నిలుస్తాం: మాజీమంత్రి హరీశ్‌రావు

ప్రశ్నించే గొంతుక కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ప్రజల్లో రోజురోజుకూ రేవంత్ ప్రభుత్వ ప్రతిష్ట దిగజారుతుండటంతో అక్రమ కేసులతో ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారన్నారు. ఆపద సమయంలో కార్యకర్తలు, నాయకులకు అండగా నిలిచిన తరహాలో కేటీఆర్‌కు ఆపద వస్తే పార్టీ మొత్తం అండగా నిలుస్తుందని చెప్పారు. రేవంత్ ఏడాది పాలన కోతలు, ఎగవేతలు, కేసులు అన్నట్టుగా తయారైందన్నారు. రేవంత్ ప్రభుత్వం హామీలు ఎగవేస్తున్న తీరును ప్రశ్నించిన తనపై మానకొండూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారన్నారు. లగచర్ల, అల్లు అర్జున్, టీఎస్ నుంచి టీజీగా మార్పు, తెలంగాణ రాజముద్ర మార్పు వంటి దృష్టి మళ్లింపు కార్యక్రమాలు మినహా ప్రభుత్వం ఏడాదిలో చేసిందేమీ లేదని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలుకు డబ్బులు లేవని చెబుతున్న సీఎం రేవంత్ తన కుటుంబ సభ్యుల భూముల కోసం కల్వకుర్తి వరకు ఆరు లేన్ల రహదారిని వేసుకుంటున్నాడని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో స్వర్ణయుగం రాగా, కాంగ్రెస్ పాలనలో కారుచీకట్లు కమ్ముకున్నాయని శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి విమర్శించారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ ప్రసంగించారు.

గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖల్లో మెరుగైన సేవలందాలి

ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క



సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కోట్లాదిమంది జీవితాలతో ముడిపడిన గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల ద్వారా మెరుగైన సేవలందాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క సూచించారు. జిల్లా కేంద్రాల్లో నిరుపయోగంగా ఉన్న మహిళా ప్రాంగణాల పూర్తి సద్వినియోగానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. ఈ కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు చేపట్టే వ్యాపారాలకు పనికొచ్చే విధంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. దివ్యాంగులకు స్వల్పకాలిక శిక్షణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. బుధవారం సచివాలయంలో జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో ఈ శాఖలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ జువెనైల్ హోమ్స్‌లోని పిల్లల కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి స్పోర్ట్స్ కిట్స్ అందిస్తామని తెలిపారు. ఈ మేరకు క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డికి సూచించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ల సేవలను ప్రస్తుతం హైదరాబాద్ ట్రాఫిక్ కూడళ్లలో వినియోగిస్తున్నారని, ఈ ప్రయోగం విజయవంతమైతే మండల కేంద్రాల్లోనూ వారి సేవలు వినియోగిస్తామని సీతక్క తెలిపారు. దేశంలోనే ట్రాన్స్‌జెండర్ల క్లినిక్ సెంటర్లు రాష్ట్రంలోనే అందుబాటులో ఉన్నాయని మంత్రులు వెల్లడించారు. ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై పూర్తి నివేదిక తెప్పించుకోండి

గవర్నర్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి ఘటనపై సవివరమైన నివేదికను తెప్పించుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. చట్టప్రకారం నిష్పాక్షికంగా శాంతిభద్రతలు పరిరక్షించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉన్న గవర్నర్‌ను కోరుతున్నామన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు బీజేపీ నేత క్షమాపణలు చెప్పాక, ఈ వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని బీజేపీ స్పష్టం చేసినా కూడా రాజకీయ ప్రత్యర్థులను బెదిరించేందుకు అధికార పార్టీ హింసాత్మక దాడులకు దిగిందని తెలిపారు. బుధవారం ఈ మేరకు గవర్నర్‌కు కిషన్‌రెడ్డి లేఖ రాశారు. బీజేపీ కార్యాలయంపై పెద్ద పెద్ద కర్రలు, రాడ్లు, రాళ్లతో 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేసి కొందరు బీజేపీ నాయకులు, కార్యకర్తలను గాయపరిచారని వెల్లడించారు. ఓ జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయంపై మరో జాతీయ పార్టీ కార్యకర్తలు దాడి చేయడం దేశంలోనే జరగలేదన్నారు. ఇది పూర్తిగా ముందస్తు ప్రణాళికతో జరిపిన దాడేనని, పోలీసుల సమక్షంలోనే ఇది జరగడం మరింత ఆశ్చర్యానికి గురిచేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విధమైన దాడికి సీఎం మద్దతు ఉందని చాలా మంది భావిస్తున్నారని, అయితే దీనిపై తాము ఏ నిర్ధారణకు రాదలచుకోలేదని లేఖలో తెలిపారు.

దాడులే మీ ఎజెండా అయితే.. మేమూ రెడీ: ఎంపీ ఈటల




మీడియాతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్. చిత్రంలో రామచందర్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'దాడులే మీ ఎజెండా అయితే.. మేము కూడా అందుకు రెడీ' అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో బీజేపీ నాయకులు కాసం వెంకటేశ్వర్లు, ఆనంద్‌గౌడ్, నందు గాయపడ్డారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. సీఎం రేవంత్‌రెడ్డి, నగర పోలీస్ కమిషనర్ భేషరతుగా క్షమాపణ చెప్పాలి'అని డిమాండ్ చేశారు. 'మేము దాడి చేయం.. కానీ మామీద దాడి చేస్తే మాత్రం ఊరుకోం. మేం సహనంతో ఉన్నాం. రేవంత్ నీకు అధికారం ఉంది అనుకుంటున్నావు. మీ పార్టీ అధికారంలో ఉంది అక్కడక్కడే. కానీ మేము దేశమంతా ఉన్నాం. మేం పథకం వేస్తే మీరు ఎవరూ మిగలరు. మేము తలుచుకుంటే తుక్కుతుక్కు అవుతారు'అని హెచ్చరించారు. బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ దాడిని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావులతో కలసి ఈటల మీడియాతో మాట్లాడుతూ, 'కాంగ్రెస్‌కి పోయే కాలం వచ్చింది. ఒక పార్టీ ఆఫీసు మీద ఇంకో పార్టీ దాడి చేసిన చరిత్ర లేదు. సీఎం మీరే.. హోం మంత్రి మీరే.. అనుభవజ్ఞులైన సీపీ ఉన్నారు, మీ పార్టీ నాయకులు చేస్తున్న దాడి మీకే తెలియదా..? ఇంటెలిజెన్స్ వైఫల్యమా లేక పథకం ప్రకారం చేశారా చెప్పాలి'అని ఆయన ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. 'మీలాగా చిల్లర పనులు చేసే నాయకులం కాదు. ఛీ ఈయనా మా సీఎం.. అని ప్రజల్లో భావన వచ్చింది. మీ మీద ఢిల్లీ నాయకులకు కూడా ఏవగింపు వచ్చింది. అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదట. వారి మెప్పుకోసం చిల్లర పనులు చేస్తూ చిల్లర గాడిలా వ్యవహరించవద్దు'అని ఈటల హితవు పలికారు. 'కొత్త బిచ్చగాళ్లలా బీజేపీ ఆఫీస్‌పై దాడి చేశారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం, పోలీసులను డిమాండ్ చేస్తున్నా' అని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 'మాకు పెయిడ్ వర్కర్లు ఉండరు. మేము పిలుపు ఇస్తే మీ పార్టీ ఆఫీసు ఉంటుందా? రాజ్యాంగం పుస్తకాన్ని చేతిలో పట్టుకోవడం కాదు అమలు చేయండి'అని సూచించారు.

30 మంది విద్యార్థులను చితకబాదిన పీడీ

స్టడీఅవర్స్‌కు ఆలస్యమయ్యారని.. సిద్దిపేట జిల్లా గురుకులంలో ఘటన



ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థికి వాతలు

కొండపాక(గజ్వేల్): స్టడీ అవర్స్‌కు ఆలస్యమ య్యారంటూ ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల ను చితకబాదాడు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడలోని గురుకుల పాఠశాలలో బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గురుకులంలో ఇంటర్మీడియట్, టెన్త్ విద్యార్థులకు ఉదయం వేళ ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆలస్యంగా వచ్చిన 30 మంది విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ వాసు వరుసగా నిలబెట్టి.. కర్రతో చితకబాదారు. ఒళ్లంతా వాతలు రావడంతో తరగతిలో కూర్చోవడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తీవ్రంగా గాయపడిన కొందరిని సిద్దిపేటలో ని ఒక ఆస్పత్రిలో చికిత్స చేయించినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన మరో విద్యార్థి హర్షవర్ధన్ హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో నివాసం ఉంటున్న తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో.. వారు పాఠశాలకు చేరుకొని కన్నీటిపర్యంతమయ్యారు. ఫిజికల్ డైరెక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గొడవకు దిగారు. విద్యార్థులను చితకబాదిన ఫిజికల్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ తల్లిదండ్రులకు నచ్చజెబుతూ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు.

జాతీయ ఆధ్యాత్మిక ఉత్సవం
కుంభమేళా
జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనున్న మహా కుంభమేళా గురించిన విశేషాలు. నేటి 'సాక్షి ఫ్లస్' సన్నిధి పేజీలో...



● ఆత్మీయ సమ్మేళనం



● ఆత్మీయ సమ్మేళనంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజన్న గూడెం ఆడబిడ్డలు

పుట్టినింటికి ఆడబిడ్డలు



ఊరు అంటే ఊరు కాదు. జ్ఞాపకాల తోట. ఖండాంతరాలు దాటినా ఆ పరిమళం మనసును వీడిపోదు.

ఏదో ఒక సమయాన స్వరూపకు నాగమణి గుర్తుకు వస్తుంది. పక్కింటి నాగమణి, స్వరూప క్లోజ్‌ఫ్రెండ్స్. దగ్గరలో ఉన్న మండల కేంద్రానికి సినిమాకు వెళ్లడం నుంచి సీమచింతకాయల వేట వరకు వారి జ్ఞాపకాల్లో ఎన్నో ఉన్నాయి. పెళ్లి అయిన తరువాత నాగమణి అక్కడెక్కడో సూరత్‌లో ఉంటుంది. స్వరూప కూడా పెళ్లయిన తరువాత సొంతూరులో కాకుండా వేరే ఊళ్లో ఉంటుంది. ఆ దూరం అలా కొనసాగుతూనే ఉంది.

ఇక అంతేనా?

'ఈ 5జీ జమానాలో కూడా అంతేనా... ఇంతేనా అంటూ నిట్టూరిస్తే ఎలా?' అంటూ కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజన్న గూడెం మహిళలు. పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితుల 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం' మనకు తెలుసు. అయితే ఇది అలాంటి సమ్మేళనం కాదు... రాజన్న గూడెం ఆడపడుచుల ఆత్మీయ సమ్మేళనం!

పెళ్లయిన తరువాత ఎక్కడెక్కడో వేరు వేరు ఊళ్లలో ఉంటున్న ఆడపడుచులు ఈ సమ్మేళనం పుణ్యమా అని ఎన్నో సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. రోజంతా సంబరాలు చేసుకున్నారు!

'నా బిడ్డలందరూ నా దగ్గరికి వచ్చారు' అని ఊరు సంతోషంతో ఉప్పొంగి పోయిన రోజు అది....

బతుకమ్మ పండుగ రోజు...

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం రాజన్న గూడెం ఆడబిడ్డలు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఉన్న ఊరిని వదిలి అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులందరు 'ఆత్మీయ సమ్మేళనం' పేరుతో ఒక చోటకు చేరారు. అత్తవారింటి నుంచి పుట్టింటికి వచ్చే వారి సంఖ్య ప్రతి యేడూ తగ్గుతోంది. పోయిన బతుకమ్మ పండుగ రోజు ఇదే విషయం గురించి మాట్లాడుకున్నారు కొందరు మహిళలు. 'అందరం ఒక రోజు కలుసుకొని మాట్లాడుకుంటే ఎంత బాగుంటుంది' అనుకున్నారు. అది అసాధ్యమైన కోరికేమీ కాదనే విషయం కూడా వారికి తెలుసు. 'ఎంత బాగుంటుంది అని ఒకటికి పదిసార్లు అనుకోవడం కాదు. కచ్చితంగా కలవాల్సిందే' అంటూ నడుం బిగించారు.

సోషల్ మీడియా వేదికగా....

అనుకున్నదే తడవుగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశారు. వివిధ రంగాల్లో ఉన్న తమ ఊరి ఆడబిడ్డలను ఒకదగ్గర చేర్చడానికి సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నారు. పేరాల ఇందిర, సూదిని రజిని, యాట ఇందిరాదేవి, రావుల ఉమాదేవి, ఊట్కూరి లక్ష్మి నాలుగు నెలల పాటు ఎంతో శ్రమ తీసుకున్నారు. ఫోన్ నెంబర్‌లు సేకరించడం నుంచి ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం వరకు ఎన్నో చేశారు.

దాగుడుమూతలు... దస్తీబిస్తీలు

అనుకున్న రోజుకు దాదాపు అందరూ వచ్చారు. ఇరవై ఏళ్ల నుంచి తొంభై ఏళ్ల వయసు వరకు ఎంతోమంది మహిళలు వచ్చారు. వయసు తేడా లేకుండా చిన్నపిల్లలై పోయారు. దాగుడు మూతలు, దస్తీబిస్తీ, మ్యూజికల్ చైర్, బెలూన్ బ్లాస్టింగ్, ఒంటికాలి కుంటుడు ఆటలు, డీజే పాటలతో హోరెత్తించారు.

ఇక ప్రతి సంవత్సరం... ఆ రోజు పండగే!

మా ఊరి ఆడబిడ్డలం అందరం ఒకచోట చేరి చిన్న పిల్లలమయ్యాం. చిన్నప్పటి పండుగలను, ఆనాటి సంబరాలను గుర్తు చేసుకున్నాం. వయసు తేడా లేకుండా ఆటలాడుకున్నాం. మా ఊరి మీద మరింత ప్రేమ పెంచుకున్నాం. ప్రతి సంవత్సరం 'ఆడబిడ్డల ఆత్మీయ సమ్మేళనం' ఏర్పాటు చేయాలని, మరింత ఎక్కువమంది హాజరయ్యేలా చూడాలనుకుంటున్నాం.

– **ఊట్కూరి లక్ష్మి**, నల్లగొండ

'ఎవరి లోకం వారిదే' అయిపోయిన ఈ కాలంలో, ఒకే ఇంటి కుటుంబ సభ్యులు కూడా వేరు వేరు ప్రపంచాలు అయిన ఈ ఉరుకులు పరుగుల కాలంలో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తాయి. పల్లె మోములో రోజూ పండగ కళను తీసుకువస్తాయి.

మరెన్నో ఊళ్లకు 'రాజన్న గూడెం ఆడపడుచుల ఆత్మీయ సమ్మేళనం' స్ఫూర్తిని ఇవ్వాలని ఆశిద్దాం.

– **యంబ నర్సింహులు**,
సాక్షి, యాదాద్రి

కళ్లనీళ్లు పెట్టుకున్నారు

'రాజన్న గూడెం ఆడబిడ్డల ఆత్మీయ సమ్మేళనం' పేరుతో చేపట్టిన కార్యక్రమం మా జీవితంలో మరవలేనిది. ఎన్నో తరాల ఆడబిడ్డలను ఒకచోటికి రప్పించాం. రకరకాల కారణాలతో పుట్టిన ఊరికి ఇక రాలేమనుకున్న వారిని సైతం గుర్తించి రప్పించడం విశేషంగా భావిస్తున్నాం. ఆడబిడ్డలందరినీ ఒకచోట చూసి పెద్ద వయసు వారు కన్నీటి పర్యంతమయ్యారు.

– **పేరాల ఇందిర**,
మోత్కూరు

మళ్లీ మళ్లీ రావాలని...

తల్లిదండ్రులు చనిపోయిన వారు, సింగిల్ పేరేంట్స్... మొదలైనవారు మా ఊరికి చాలా ఏళ్లుగా రావడం లేదు. అలాంటి వారందరినీ 'ఆత్మీయ సమ్మేళనం' ద్వారా రప్పించాం. వచ్చినవారంతా ఒకరి కష్టసుఖాలు ఒకరు పంచుకున్నారు. నిక్‌నేమ్‌లను గుర్తు చేసుకున్నారు. మరోసారి ఇలాంటి కార్యక్రమం పెడితే మళ్లీ పుట్టింటికి వచ్చినట్లు వస్తామని సంతోషంగా చెప్పి వెళ్లారు.

– **సూదిని రజిని**, సిరిపురం

అంబరాన్ని అంటిన సంబరం

ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగకు కొద్దిమందిమి మాత్రమే పుట్టింటికి వస్తున్నాం. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'ఆత్మీయ సమ్మేళనం'కు రూపకల్పన చేశాం. ఊరు దాటగానే ఎవరి లోకం వారిదై పోతుంది. అలా కాకుండా పట్టుదలగా, ఇష్టంగా పనిచేశాం. రాలేమన్న వారిని ఒప్పించి రప్పించాం. మా ఊరి ఆడబిడ్డల ముఖాల్లో మాటల్లో చెప్పలేనంత సంతోషాన్ని చూశాం.

– **యాట ఇందిరాదేవి**,
ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్,
సీతాఫల్ మండి, సికింద్రాబాద్

● మన(సు)లో మాట

మీ భర్త మరణానికి మీరు బాధ్యులు కాదు...



డాక్టరు గారూ! నేనొక ప్రభుత్వ ఉద్యోగినిని. నా పిల్లలిద్దరూ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. 3 నెలల క్రితం 55 సంవత్సరాల నా భర్త సడెన్ హార్ట్ ఎటాక్‌తో మరణించారు. రాత్రి భోజనానికి తనకిష్టమైన కూర వండించుకుని తిన్నారు. ఉదయాన్నే నిద్ర లేచేసరికి పక్కనే విగత జీవిగా కనిపించారు. అప్పటినుంచి నాకు ఇంటికి రావాలంటేనే భయంగా ఉంటోంది. రాత్రుళ్లు నిద్ర పట్టడం లేదు. అలాగే నిద్రలో ఉలిక్కిపడి లేవడం, గట్టిగా ఏడవడం చేస్తున్నాను. ఉన్నట్టుండి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండె దడ, విపరీతమైన భయం వేస్తున్నాయి. నాభర్త చనిపోవడానికి నా నిర్లక్ష్యమే కారణమేమోననే వేదన నన్ను కలచి వేస్తోంది. ఎంత సర్ది చెప్పుకుందామన్నా నావల్ల కావడం లేదు. ఈ బాధను అధిగమించే మార్గం చెప్పగలరా?

– **శాంతిశ్రీ**, విజయనగరం

మీరు అనుభవిస్తున్న ఈ వేదన, బాధ పూర్తిగా అర్థం చేసుకోగలను. మీ స్థానంలో ఉన్న వారికి ఇలాంటి లక్షణాలు ఉండటం చాలా సహజం. మీకున్న ఈ నిద్రలేమి, గుండెదడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ప్యానిక్ ఎటాక్‌ని సూచిస్తున్నాయి. ఈ మానసిక స్థితి ఇటువంటి ట్రామాటిక్ సంఘటనకు సహజమైన ప్రతిస్పందన. సైలెంట్ హార్ట్ ఎటాక్స్‌ని ముందుగా అంచనా వేయడం లేదా పూర్తిగా నివారించడం అసాధ్యం అని మీరు గుర్తించాలి. అందువల్ల మీరు వారిపై చూపించిన ప్రేమ, ఆప్యాయతలను పదే పదే గుర్తు తెచ్చుకోవడం ద్వారా మీలో ఉన్న గిల్ట్ ఫీలింగ్ తగ్గుతుంది. దగ్గరిలోని సైకియాట్రిస్ట్‌ని సంప్రదించి, మైండ్‌ఫుల్‌నెస్ థెరపీ, కాగ్నిటివ్ థెరపీ తీసుకోవడం వలన మీ బాధ తగ్గడమే కాక మీ ఆలోచనలు మార్చడానికి, కోపింగ్ స్ట్రేటజీస్ పెంచడానికి సహాయపడుతుంది. అలాగే డీప్ బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్, ధ్యానం, ప్రోగ్రెసివ్ మజిల్ రిలాక్సేషన్ వంటివి తప్పక సహాయపడతాయి. నిద్ర వచ్చినా రాకపోయినా నిద్ర షెడ్యూల్ పాటించడం చాలా ముఖ్యం. అవసరాన్ని బట్టి కొన్ని రకాల మందులు కూడా మీరు త్వరగా కోలుకోవడానికి సహకరిస్తాయి.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● సేవాపథం



పేద పిల్లల నేస్తం

బిహార్ విద్యాశాఖలో ఉన్నతాధికారి అయిన డాక్టర్ మంజు కుమారి రోహ్తాస్ జిల్లాలో, ముఖ్యంగా వెనకబడిన ప్రాంతమైన తిలౌతు బ్లాక్‌లో రకరకాల సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోంది. బ్లాక్ రిసోర్స్ సెంటర్(బీఆర్‌సి) ఇంచార్జిగా ఆమె తన అధికారిక విధులకు మాత్రమే పరిమితం కావడం లేదు. ఆర్థికంగా వెనకబడిన పిల్లలు చదువులో ముందుండేలా తన వంతు కృషి చేస్తోంది....

ఆఫీసు సమయం అయిపోగానే అందరిలా ఇంటికి వెళ్లదు మంజు కుమారి. సమీపంలోని ఏదో ఒకగ్రామానికి వెళ్లి పేదపిల్లలకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ లాంటివి అందజేస్తుంది. దీని కోసం ఇతరులు ఇచ్చే డబ్బులు, స్వచ్ఛంద సంస్థలపై ఆధారపడకుండా తన జీతం నుంచే కొంత మొత్తాన్ని వెచ్చిస్తుంది. మంజు కుమారికి సామాజిక సేవపై ఆసక్తి చిన్నప్పటి నుంచే ఉంది. నాన్న శివశంకర్ షా తనకు స్ఫూర్తి.

'సామాజిక సేవకు సంబంధించి నాన్న ఎప్పుడూ చురుగ్గా ఉండేవారు. మా ఊరి పాఠశాల కోసం భూమిని ఉదారంగా ఇవ్వడమే కాదు అవసరమైన వనరులు అందించారు. ఇలాంటివి చూసి నాలో సామాజిక బాధ్యత పెరిగింది. ఆ స్కూల్ ఇప్పటికీ ఉంది. సామాజిక సేవాకార్యక్రమాలు మరిన్ని చేసేలా నిరంతరం స్ఫూర్తినిస్తుంది' అంటుంది మంజు కుమారి.

రాంచీ యూనివర్శిటీ నుంచి పోస్ట్‌గ్రాడ్యుయేషన్... ఆ తర్వాత పీహెచ్‌డీ చేసిన మంజు డెహ్రీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దశాబ్దానికి పైగా హిందీ టీచర్‌గా పనిచేసింది. 2023లో బీఆర్‌సి ఇంచార్జిగా నియామకం అయింది. దీంతో సామాజిక సేవలో మరింత క్రియాశీలంగా పనిచేస్తోంది.

స్థానిక పాఠశాలలను తనిఖీ చేస్తుంటుంది. పాఠశాల పరిశుభ్రతపై ఎన్నో సూచనలు ఇస్తుంటుంది. విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటుంది. ప్రభుత్వ ఉద్యోగానికి ముందు ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసేది మంజు కుమారి. ఆ సమయంలో గిరిజన గూడేలకు వెళ్లి ఎప్పుడూ స్కూల్‌కు వెళ్లని పిల్లలకు అక్షరాలు నేర్పించేది, పాఠాలు చెప్పేది. ఇది చూసి తల్లిదండ్రులు పిల్లలను రోజూ స్కూల్‌కు పంపించేవారు.

'ఇది నేను సాధించిన పెద్ద విజయం' అంటుంది మంజు కుమారి. అయితే మంజుకు మారి ప్రయాణం నల్లేరు మీద నడక కాదు. ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. అత్తమామలు, భర్త అభ్యంతరం చెప్పేవాళ్లు. మంజుకుమారిని సామాజిక సేవ దారి నుండి తప్పించడానికి ఎన్నో ప్రయత్నాలు చేసేవాళ్లు. అయినప్పటికీ ఆమె పట్టుదలగా ముందుకు వెళ్లింది.

సామాజిక బాధ్యత, నైతిక విలువలు క్షీణించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మంజు కుమారి... 'తమ గురించి మాత్రమే ఆలోచించే ధోరణి ప్రజలలో బాగా పెరిగింది. సామాజిక స్పృహ లోపిస్తుంది. సేవా స్ఫూర్తిని, సామాజిక నిబద్ధతను పునరుద్ధరించాలని ఆశిస్తున్నాను' అంటుంది.

● బ్యూటిప్స్

చుండ్రుకు బీట్‌రూట్ థెరపీ

బీట్‌రూట్‌ను పేస్ట్ చేసి, నీళ్లలో కలిపి మరిగించాలి. చల్లారిన తర్వాత వడకట్టిన ఆ నీటిని రాత్రి పడుకోబోయేముందు మాడుకు పట్టించి, వేళ్లతో మసాజ్ చేసుకోవాలి. మరుసటి రోజు ఉదయాన్నే తలస్నానం చేయాలి. వారానికి రెండు సార్లు చేస్తూ ఉంటే చుండ్రు సమస్య తగ్గిపోతుంది.

● బతుకు పోరాటం



మంచు పులులు

**గడ్డ కట్టే మంచు, కోత పెట్టే చలి
పరీక్ష పెట్టే వాతావరణం
కాని తప్పని బతుకుపోరు...
కశ్మీర్‌లో పురుషులతో పాటు
స్త్రీలూ శ్రమ చేసి సంపాదిస్తేనే
ఇళ్లు గడుస్తాయి.
దాల్ లేక్ వెంబడి వందలాది
స్త్రీలు చిల్లర వస్తువులు అమ్ముతూ
బతుకు ఈడుస్తారు.
ప్రస్తుతం దాల్ లేక్ గడ్డ కట్టింది.
ఆగక మంచుకురుస్తోంది.
బిడ్డల ఆకలి తీర్చడానికి
సరస్సు వొడ్డున మంచుపులుల్లా
తల్లులు తమ కొట్లు
తెరిచి నిలుచున్నారు.
వారి బతుకు చిత్రం.**



● దాల్ లేక్ ఒడ్డున కూరగాయలు విక్రయిస్తూ...

కశ్మీరీలు గిరిజనులే అయినా వారికి జ్ఞానం మెండు. ప్రతి సంవత్సరం డిసెంబర్ మూడవ వారం నుంచి జనవరి మొదటి వారం వరకూ వచ్చే 'చిలాయి కలాన్' (భారీ మంచు)కు వారు సిద్ధమయ్యే వుంటారు. కాని ఈసారి చిలాయి కలాన్ గత 30 ఏళ్లలో లేనంత ఎక్కువగా ఉంది. ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల నుంచి 3 డిగ్రీల వరకూ పడిపోయాయి. దాల్ లేక్ రాత్రిళ్లు పూర్తిగా గడ్డకట్టి మధ్యాహ్నానికి గాని కొద్దిగా పలుచబడదు. ఈలోపు ఎలా జీవించాలి?

'ఇంట్లో పండిన కూరగాయలను ఉదయాన్నే తీసుకొని షికారా (చిన్న పడవ)లో బయలుదేరి దాల్ లేక్ ఒడ్డు మీదకు వచ్చి అంగడి తెరుస్తాను. దాల్ లేక్ గడ్డ కడితే షికారా కదలదు. ట్రాలీలు వెతుక్కుని రోడ్డు మార్గాన రావాలి. అసలే మంచుతో కరువు... ఇదో ఖర్చు' అంటుంది ఒక కశ్మీరీ దుకాణం దారు.

శ్రీనగర్‌లో జనం రెండు విధాలుగా జీవిస్తారు. ఒక విధం దాల్ లేక్ చుట్టుపక్కల... మరో విధం మైదాన, ఎత్తయిన ఏరియాల్లో. దాల్ లేక్‌లో జీవించే వారికి హౌస్ బోట్లు, విహార బోట్లు, రోడ్డు మీద చిల్లర అంగళ్లు... ఇవే ఆధారం. 'మేము చాలామంది స్త్రీలము రోడ్డు మీద కూరగాయలు, పూలు, చేపలు, చిన్న చిన్న వస్తువులు అమ్ముతాం. నిజానికి మా అందరికీ ఈ పని చాలా కష్టం. కాని మా పిల్లలైనా బాగుపడాలని వేణ్నీళ్లకు చన్నీళ్లుగా ఈ ప్రయత్నం చేస్తాం. ఇలా మా పూర్వికులు కూడా చేశారు. కాని బాగుపడిన వారు తక్కువ' అంటారు వారు.

8 నుంచి 13 గంటలు...

కశ్మీర్ అంటే టూరిస్టులు. టూరిస్టులు వచ్చే వేసవి కాలంలో బేరాలు ఒక రకంగా ఉంటాయి. మంచు తీవ్రంగా కురిసే సమయంలో టూరిస్ట్‌లకు బ్రేక్ పడుతుంది. ఆ సమయంలో కూడా బతకడానికి దాల్ లేక్ ఒడ్డున అంగళ్లు తెరవక తప్పదు. 'రోజూ తెల్లవారు జామునే వచ్చి సాయంత్రం వరకూ నిలబడతాము. 8 నుంచి 13 గంటలు రోడ్డు మీద ఉంటాము' అని చెప్తారు వీళ్లు. 'నా కూతురు డాక్టర్ కావాలనుకుంటోంది. బాగా చదువుతోంది. దాని చదువు కోసం ఈ కష్టాన్ని మునిపంట నొక్కి చేస్తున్నాను' అని ఒకావిడ చెప్పింది. దట్టమైన మంచు కురిసే సమయంలో వీరికి ఆస్పత్రి సౌకర్యం ఉండదు. ప్రసూతి అవసరాలకు ఆస్పత్రికి వెళ్లడానికి వీలు కానంతగా దార్లు మూసుకుపోతాయి. దాల్ లేక్ ఒడ్డున అమ్ముకునే స్త్రీలకు అవసరమైన టాయిలెట్లు కూడా ఉండవు. అయినా సరే వారు తమ కుటుంబాలు గడవడానికి మంచులో తడుస్తూనే ఉంటారు.

టార్పాలిన్ కట్టకూడదు!

దాల్ లేక్ ఒడ్డున రోడ్డు మీద వెళుతూ ఉంటే స్త్రీలు ఏ టార్పాలిన్ కట్టకుండా ఆకాశం కింద నిలబడి వస్తువులు అమ్ముతుంటారు స్త్రీలు. 'మేము చలికి ఆగలేక, మంచు నుంచి రక్షించుకుందామని టార్పాలిన్లు కట్టుకుంటాం. కాని భద్రత దృష్ట్యా మునిసిపాలిటీ వాళ్లు, రక్షణ దళాలు వాటిని పీకేస్తాయి. ఏ ఉగ్రవాదులో ఈ టార్పాలిన్ల దగ్గర చాటు తీసుకుంటారని వీరి భయం. కాని మా ప్రాణాల సంగతి?' అని మరో మహిళ ప్రశ్నించింది.

మంచుకు తడిసి, నీటికి నాని ఈ స్త్రీలకు ఎన్నో ఆరోగ్య సమస్యలు. కాని చిరునవ్వు చెరగనివ్వరు. టూరిస్ట్‌లతో స్నేహంగా మాట్లాడుతూ సంధ్య చీకట్లలో ఇళ్ల వైపుకు వెళ్లిపోతారు. ఈ స్త్రీల శ్రమకు విలువ కట్టే షరాబు ఉన్నాడా?

● ముగ్గు ముచ్చట





ఎ. ఇందిర,
హన్మాన్ వాడ,
భువనగిరి, యాదాద్రి





టి.గౌతమి
గుడుగుంట్లపాలెం, సూర్యాపేట

19 చుక్కలు, 10 వచ్చే వరకు మధ్య చుక్క



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

డిఫెండింగ్ చాంపియన్‌పై నిశేష్ సంచలన విజయం

ఏఎస్‌బీ క్లాసిక్ ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో తెలుగు సంతతి అమెరికన్ టీనేజర్ నిశేష్ బసవరెడ్డి సంచలనం సృష్టించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 19 ఏళ్ల నిశేష్ 6-4, 5-7, 6-4తో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ 23వ ర్యాంకర్ అలెజాంద్రో టబిలో (చిలీ)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. 2 గంటల 25 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిశేష్ తొమ్మిది ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. గత నెలలో ప్రొఫెషనల్‌గా మారిన నిశేష్ ఈ టోర్నీ తొలి రౌండ్‌లో 6-2, 6-2తో 85వ ర్యాంకర్ కమ్సానా (అర్జెంటీనా)పై గెలిచాడు. మరోవైపు అడిలైడ్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో శ్రీరామ్ బాలాజీ (భారత్)–మిగెల్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లో 6-3, 3-6, 11-13తో నాలుగో సీడ్ హ్యారీ హెలియోవారా (ఫిన్‌లాండ్)–హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది.



క్వార్టర్స్‌లో యూకీ ద్వయం

ఆక్లాండ్: కొత్త ఏడాదిని భారత డబుల్స్ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ విజయంతో ప్రారంభించాడు. ఏఎస్‌బీ క్లాసిక్ ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6-4, 6-4తో సాండెర్ అరెండ్స్ (నెదర్లాండ్స్)–జాన్సన్ (బ్రిటన్) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ జంట రెండు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.





ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ

ప్రణయ్, మాళవిక శుభారంభం ● మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

కౌలాలంపూర్: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టి 21–10, 16–21, 21–5తో మింగ్ చెలు–టాంగ్ కాయ్ వె (చైనీస్ తైపీ)లపై గెలుపొందారు. 56 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ తొలి గేమ్‌ను నెగ్గినా... రెండో గేమ్‌లో తడబడింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో సాత్విక్–చిరాగ్ చెలరేగి ప్రత్యర్థి జోడీ ఆట కట్టించారు. సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకోగా... ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. ప్రణయ్ 21–12, 17–21, 21–15తో బ్రియాన్ యాంగ్ (కెనడా)పై నెగ్గగా... ప్రియాన్షు 11–21, 16–21తో ఏడో సీడ్ షి ఫెంగ్ లీ (చైనా) చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... అనుపమా , ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మాళవిక 21–15, 21–16తో గోజిన్ వె (మలేసియా)పై విజయం సాధించగా... ఆకర్షి 14–21, 12–21తో జూలీ జేకబ్సన్ (డెన్మార్క్) చేతిలో, అనుపమ 17–21, 21–18, 8–21తో పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు.



అఫ్గానిస్తాన్ జట్టుకు మెంటార్‌గా యూనిస్ ఖాన్

కరాచీ: వచ్చే నెలలో జరిగే చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నీ సందర్భంగా పాకిస్తాన్ మాజీ కెప్టెన్ యూనిస్ ఖాన్ సేవలను అఫ్గానిస్తాన్ జట్టు వినియోగించుకోనుంది. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరిగే ఈ టోర్నీ సమయంలో అఫ్గానిస్తాన్ జట్టు వెంట యూనిస్ ఖాన్ 'మెంటార్'గా ఉంటాడని అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. 47 ఏళ్ల యూనిస్ ఖాన్ పాక్ తరఫున 118 టెస్టులు, 265 వన్డేలు, 25 టి20 మ్యాచ్‌లు ఆడి 2017లో ఆటకు వీడ్కోలు పలికాడు.

'అమెరికన్ల ఆటగా మార్చడమే లక్ష్యం'

వరల్డ్ కప్ తర్వాత క్రికెట్ స్థాయి పెరిగింది
- ఒలింపిక్స్‌తో అందరికీ చేరువవుతుంది
- యూఎస్ క్రికెట్ చైర్మన్ వేణుకుమార్ రెడ్డి వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: అగ్రరాజ్యం అమెరికాలో ఇటీవలి కాలంలోనే క్రికెట్ కొత్తగా అభివృద్ధి చెందుతోంది. 2024 టి20 వరల్డ్ కప్ టోర్నీ నిర్వహణతో స్థానికుల దృష్టి దీనిపై పడగా... 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ కూడా భాగం కావడంతో మరింత ఎక్కువ మందికి ఆసక్తి పెరుగుతోంది. అయితే అమెరికన్లు పెద్దగా పట్టించుకోని సమయంలో ఆటను వారికి చేరువ చేయడంలో యూఎస్ క్రికెట్ అసోసియేషన్ చైర్మన్, తెలుగు వ్యక్తి వేణుకుమార్ రెడ్డి పిసికె పాత్ర ఎంతో ఉంది. నల్లగొండకు చెందిన వేణు గత ఆరేళ్లుగా యూఎస్‌లో క్రికెట్‌ను విస్తృతం చేయడంలో ఎంతో కృషి చేస్తున్నారు. ఇప్పుడు ఈ ఆటను అమెరికన్లు తమదిగా భావించి ఇతర క్రీడల్లాగే ప్రాధాన్యత ఇచ్చేలా చేయడమే తన లక్ష్యమని వేణు 'సాక్షి'తో చెప్పారు. ఇటీవలే భారత్‌కు వచ్చిన ఆయన బీసీసీఐ ఉన్నతాధికారులను కలిసి అమెరికా క్రికెట్ అభివృద్ధి కోసం సహకారాన్ని కూడా కోరారు. 'టి20 వరల్డ్ కప్‌ను విజయవంతంగా నిర్వహించగలిగాం. భారత్, పాకిస్తాన్‌లతో అమెరికా తలపడిన మ్యాచ్‌లకు స్థానిక అభిమానుల నుంచి మంచి స్పందన వచ్చింది. పాక్‌పై గెలుపుతో అమెరికన్లు కూడా ఫలితాలపై ఆసక్తి చూపించారు. ఇప్పుడు మా ముందు ఒలింపిక్స్ రూపంలో పెద్ద లక్ష్యం ఉంది. వచ్చే రెండేళ్లలో క్రికెట్ వారికి మరింత చేరువ చేయడమే మా లక్ష్యం' అని వేణు రెడ్డి అన్నారు.

1998లో ఐటీ నిపుణుడిగా యూఎస్‌కు వెళ్లి ఆపై సగటు భారత క్రికెట్ అభిమాని తరహాలో అక్కడ క్రికెట్ టోర్నీలు, క్యాంప్‌లు నిర్వహిస్తూ వేణు ఆటకు ప్రాచుర్యం పెంచారు. ముఖ్యంగా స్కూల్, కాలేజీలలో టీమ్‌లను తయారు చేయడం ద్వారా ప్రతిభను గుర్తించే అవకాశం దక్కింది.

'సహజంగానే భారత్ నుంచి వచ్చిన వారు, భారత మూలాల ఉన్నవారే క్రికెట్ వైపు వచ్చారు. అందరూ ఇతర ఉద్యోగాల్లో ఉంటూ క్రికెట్ ఆడేందుకు వచ్చేవారే. వేర్వేరు రాష్ట్రాల్లో కూడా ఆటకు ప్రాచుర్యం కల్పించేందుకు వాలంటీర్లు ముందుకు వచ్చారు. అలాంటి స్థితి నుంచి ఇప్పుడు యూఎస్ జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులు ఇస్తున్నాం. ఇదంతా ఇన్నేళ్లలో అమెరికా క్రికెట్‌లో వచ్చిన మార్పు గురించి చెబుతుంది' అని వేణు వివరించారు. అయితే ఇప్పటికీ అసలైన అమెరికన్లు కాకుండా ఇతర దేశాల నుంచి వస్తున్న వారే యూఎస్ క్రికెట్ జట్లలో ఎక్కువగా ఉండటం వాస్తవమేనని ఆయన అంగీకరించారు. దీనిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, అలా జరిగితే క్రికెట్ కూడా యూఎస్‌లో ఇతర క్రీడల్లా దూసుకుపోతుందని వేణు అభిప్రాయపడ్డారు. 'టి20 వరల్డ్ కప్ సమయంలో పెద్ద కార్పొరేట్ సంస్థలు, ప్రతిష్టాత్మక మీడియా కంపెనీలు క్రికెట్‌పై బాగా దృష్టి పెట్టాయి. అండర్–11 స్థాయి నుంచి అండర్–23 వరకు ఇప్పుడు వరుసగా టోర్నీలు నిర్వహిస్తున్నాం. ఈ దశలో పెద్ద సంఖ్యలో అమెరికన్లు భాగమవుతున్నారు. జాతీయ జట్టుకు ఎంపిక చేసే ముందుకు జరిగే సెలక్షన్స్‌లో వీరంతా పాల్గొనే అవకాశం ఉంటుంది. కాబట్టి రాబోయే రోజుల్లో యూఎస్ టీమ్‌లో మనవారు మాత్రమే కాకుండా అమెరికన్లను కూడా చూడవచ్చు. అయితే భారతీయుల్లో మన తెలుగువారు కూడా యూఎస్ క్రికెటర్లుగా మంచి గుర్తింపు తెచ్చుకోవడం సంతోషకరం. సీనియర్ మహిళల క్రికెట్‌లో పగడ్యాల చేతనా రెడ్డి ఇటీవల 136 పరుగులు చేసి అరంగేట్రంలో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా నిలిచింది' అని వేణు గుర్తు చేశారు. ఐసీసీ టోర్నీల్లో మినహా ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడే అవకాశం అమెరికాకు ఎక్కువగా రావడం లేదని... భారత్‌లోని రంజీ టీమ్‌లతో మ్యాచ్‌లు ఏర్పాటు చేసి తమ ఆటను మెరుగుపర్చుకునే అవకాశం ఇవ్వాలని ఇటీవల ఐసీసీ చైర్మన్ జై షా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాలకు విజ్ఞప్తి చేసినట్లు వేణు వెల్లడించారు. ఆసియా కప్ తరహాలో 'నార్త్ అమెరికన్ చాంపియన్‌షిప్' నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశామని, త్వరలోనే ఈ టోర్నీ జరుగుతుందని ఆయన చెప్పారు. 2018 నుంచి యూఎస్‌సీఏలో డైరెక్టర్‌గా అడుగు పెట్టిన వేణు 2023లో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. తన పదవీ కాలంలో యూఎస్ జట్టు 2024 టి20 టోర్నీ (ఆతిథ్య జట్టు హోదాలో), 2026 టి20 వరల్డ్ కప్‌కు అర్హత సాధించిందని... 2027 వన్డే వరల్డ్ కప్‌కు క్వాలిఫై కావాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు వేణు రెడ్డి స్పష్టం చేశారు.


ఐసీసీ చైర్మన్ జై షాతో వేణు రెడ్డి (ఫైల్)

సంతోష్ ట్రోఫీ విజేతలంతా అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లు

- బెంగాల్ జట్టులోని 22 మందికీ పోలీస్ ఉద్యోగాలిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ. 50 లక్షల నజరానా అందజేత

కోల్‌కతా: సంతోష్ ట్రోఫీ జాతీయ సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించిన బెంగాల్ జట్టు ఆటగాళ్లకు ఆ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఈ టోర్నీలో బెంగాల్ జట్టు 33వసారి ట్రోఫీ నెగ్గగా... విజేత జట్టులోని ఆటగాళ్లందరికీ పోలీస్ విభాగంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్‌ఐ)లుగా నియమించనున్నట్లు ప్రకటించింది. సంతోష్ ట్రోఫీ విజేతలకు బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో బెంగాల్ క్రీడా శాఖ మంత్రి అరూప్ బిశ్వాస్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఇటీవల హైదరాబాద్ వేదికగా జరిగిన సంతోష్ ట్రోఫీ ఫైనల్లో కేరళను ఓడించి బెంగాల్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. జట్టులోని సభ్యులకు బెంగాల్ ప్రభుత్వం రూ. 50 లక్షల నజరానా ప్రకటించింది. జట్టులోని మొత్తం 22 మంది ప్లేయర్లకు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు, ఈ నియామకాలకు సంబంధించిన ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి తెలిపారు.



బుమ్రా 'టాప్' ర్యాంక్ పదిలం

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ బుమ్రా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇప్పటికే 907 రేటింగ్ పాయింట్లతో భారత్ నుంచి అత్యుత్తమ రేటింగ్ సాధించిన బౌలర్‌గా నిలిచిన బుమ్రా... ఇప్పుడు మరో పాయింట్ సాధించి 908 పాయింట్లతో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఈ జాబితాలో కమిన్స్ (841) రెండో స్థానంలో కొనసాగుతుండగా... భారత స్పిన్నర్ రవీంద్ర జడేజా ఒక స్థానం మెరుగుపర్చుకొని 9వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో యశస్వి జైస్వాల్ తన 4వ స్థానాన్ని నిలబెట్టుకోగా... సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు అర్ధసెంచరీ సాధించిన రిషభ్ పంత్ మూడు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. టెస్టు ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో జడేజా నంబర్‌వన్‌గానే కొనసాగుతున్నాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



సాక్షి సినిమా


స్క్రీన్ టైమ్ గురించి ఆలోచించను

– శ్రద్ధా శ్రీనాథ్



''ఏ సినిమాలోనైనా నా స్క్రీన్ టైమ్ గురించి నేను ఆలోచించను. మనసుకి నచ్చి చేసిన పాత్రకు ఓ నటిగా వంద శాతం న్యాయం చేశామా? లేదా అని మాత్రమే ఆలోచిస్తాను. 'డాకు మహారాజ్' మూవీలో ప్రగ్యా జైస్వాల్, ఊర్వశీ రౌతేలా... ఇలా మిగతా పాత్రలు కూడా ముఖ్యంగానే ఉంటాయి'' అన్నారు హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్. బాలకృష్ణ హీరోగా నటించిన తాజా చిత్రం 'డాకు మహారాజ్'. ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్లుగా నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ– ''డాకు మహారాజ్' మూవీలో నందిని అనే ఎమోషనల్ డెప్త్ ఉన్న క్యారెక్టర్ చేశాను. చాలా ఓర్పు ఉన్న పాత్ర. అదే సమయంలో ఎప్పుడు మాట్లాడాలో అప్పుడు స్పష్టంగా మాట్లాడుతుంది. నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర ఇది. నా గత చిత్రాలతో పోల్చినప్పుడు ఈ చిత్రం నాకు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. చాలా జాగ్రత్తగా డబ్బింగ్ చెప్పాను. ఈ మూవీలో బాలకృష్ణ, బాబీ డియోల్‌గార్లతో నటించాను. నటిగా కొత్త విషయాలు నేర్చుకున్నాను. బాబీగారు ప్రతిభ గల దర్శకుడు. సితార ఎంటర్‌టైన్మెంట్స్‌లో 'జెర్సీ' మూవీ చేశాను. ఇప్పుడు 'డాకు మహారాజ్' చేశాను. 'జెర్సీ'లో నేను చేసిన సారా, 'డాకు మహారాజ్'లోని నందిని... ఈ రెండు పాత్రలు వేటికవే ప్రత్యేకం. ఇక పదేళ్లుగా ఇండస్ట్రీలో స్థిరంగా రాణిస్తున్నాను. కేవలం ఇది లక్ మాత్రమే కాదు... నా పెర్ఫార్మెన్స్ కూడా ఉంది. ఓ నటిగా నిజ జీవితానికి దగ్గరగా ఉన్న రోల్స్ చేయడానికి ఇష్టపడతాను. ఇంకా 'పొన్నియిన్ సెల్వన్' లాంటి పీరియాడికల్ మూవీలో నటించాలని ఉంది'' అని తెలిపారు.

వేసవిలో రెట్రో


● సూర్య

సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'రెట్రో'. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్, స్టోన్ బెంచ్ క్రియేషన్స్ సంస్థలు నిర్మించాయి. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా మే 1న విడుదల చేయనున్నట్లుగా బుధవారం చిత్రయూనిట్ ప్రకటించింది. జయరామ్, జోజు జార్జ్, కరుణాకరన్, నాజర్, ప్రకాశ్‌రాజ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ మూవీకి సంతోష్ నారాయణన్ సంగీతం అందించారు. ఈ చిత్రంలో హీరోయిన్ శ్రియ ఓ స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నారు.

యాక్షన్ హైందవ


● సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హైందవ' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివన్ రామకృష్ణ సమర్పణలో మూన్‌షైన్ పిక్చర్స్‌పై మహేశ్ చందు పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్న పన్నెండో చిత్రం ఇది. ఈ చిత్రానికి టైటిల్ ఖరారు చేసినట్లుగా ఓ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న హై బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'హైందవ'. శతాబ్దాల నాటి దశావతార అనే ఆలయం నేపథ్యంలో కథ సాగుతుంది. ఆలయాన్ని ధ్వంసం చేసే దుండగుల ప్రయత్నాన్ని పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో హీరో అడ్డుకునే అంశాలు సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయి. 'హైందవ' అనేది దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే గొప్ప పాన్ ఇండియా టైటిల్. ప్రస్తుతం 35 శాతం షూటింగ్ పూర్తయింది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్.

డైలాగ్స్ ఇవ్వగానే చేతులు వణికేవి

– ఐశ్వర్యా రాజేశ్



''సినిమా అనేది ఓ గొప్ప వేదిక. స్క్రీన్‌పై కనిపించే అవకాశం అందరికీ రాదు. అందుకే నా వరకు నేను డిఫరెంట్ రోల్స్ చేయడానికే ఇష్టపడతాను. ఏ పాత్ర చేసినా అందులో ఓ సామాజిక బాధ్యత ఉండాలని కోరుకుంటుంటాను. నా టార్గెట్ అదే'' అని హీరోయిన్ ఐశ్వర్యా రాజేశ్ అన్నారు. వెంకటేశ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో ఐశ్వర్యా రాజేశ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నలుగురు పిల్లల తల్లిగా నటించాను. నా పాత్ర పేరు భాగ్యం. ఈ క్యారెక్టర్ కోసం నా కంటే ముందు ఒకరిద్దరు హీరోయిన్లను యూనిట్ సంప్రదిస్తే, వారు నో చెప్పారట. ఫైనల్‌గా అనిల్‌గారు భాగ్యం పాత్రకు ఆడిషన్ చేసి, నన్ను ఎంపిక చేశారు. భాగ్యం కత్తి మీద సాములాంటి పాత్ర. అమాయకంగా ఉంటే తేలిపోతుంది. కాస్త ఓవర్ డోస్ అయితే హైపర్ అనిపిస్తుంది. ఈ పాత్రను నేను అర్థం చేసుకోడానికి పది రోజులు పట్టింది. మొదట్లో డైలాగ్స్ ఇచ్చినప్పుడు చేతులు వణికేవి. ఓసారి జ్వరం కూడా వచ్చింది (నవ్వుతూ). అయితే ఈ రోల్‌ను నేను బాగా చేయడానికి వెంకటేశ్, అనిల్‌గార్లు చాలా హెల్ప్ చేశారు. ఇక 'దిల్' రాజుగారు సపోర్టివ్‌గా ఉంటారు. ఇలాంటి ఫ్యామిలీ ఫీల్ గుడ్ సినిమా వచ్చి చాలా రోజులైంది. వెంకటేశ్‌గారి ఎక్స్‌ప్రెషన్స్ అన్నీ నేచురల్‌గా ఉంటాయి. ఆయన్ని మ్యాచ్ చేయడం చాలా చాలా కష్టం. ఈ మూవీతో మీనాక్షీతో నాకు మంచి స్నేహం ఏర్పడింది. మీనాక్షీ ఇంట్రడక్షన్ సీన్, డెహ్రాడూన్ సీన్స్‌లో తప్ప మిగతా సినిమా అంతా వెంకటేశ్‌గారు, నేను, మీనాక్షీ స్క్రీన్‌పై కనిపిస్తూనే ఉంటాం. ఓ సినిమా పాటలు ఆడియన్స్‌కు చేరితే సినిమా సగం పాస్ అయినట్లే. ఈ సినిమాలోని 'గోదారి గట్టు...' పాటకు మంచి స్పందన రావడం హ్యాపీగా ఉంది. నేనెక్కడైనా కనిపిస్తే ఫొటోలు అడుగుతున్నారు. 'మీనూ, బ్లాక్‌బస్టర్ పొంగల్' సాంగ్స్‌కు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. భీమ్స్ మంచి మ్యూజిక్ ఇచ్చారు'' అని అన్నారు.

షష్టిపూర్తి సినిమాని కుటుంబమంతా చూడాలి

– రాజేంద్ర ప్రసాద్


● ఆకాంక్షా సింగ్, రూపేష్, రాజేంద్ర ప్రసాద్, అర్చన

''మంచి కథతో రూపొందిన చిత్రం 'షష్టిపూర్తి'. తెలుగు వారి సంప్రదాయం, సంస్కృతిని ఇష్టపడేవారు ఇలాంటి సినిమాలను ప్రోత్సహించాలి. మన ఇంట్లో ఏం ఉంటే సంతోషంగా ఉంటామనేది ఈ చిత్రం చెబుతుంది. అందుకే అందరూ కుటుంబంతో సహా థియేటర్‌కి వెళ్లి ఈ సినిమా చూడాలి'' అని నటుడు రాజేంద్ర ప్రసాద్ కోరారు. రూపేష్, ఆకాంక్షా సింగ్ జంటగా, రాజేంద్ర ప్రసాద్, అర్చన మరో జోడీగా నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేష్ చౌదరి నిర్మించారు. బుధవారం జరిగిన సమావేశంలో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– ''ఆ నలుగురు' తర్వాత నేను చేసిన సినిమాలు భగవంతుడు వేసిన భిక్ష అనుకోవాలి. 'షష్టిపూర్తి' లాంటి అద్భుతమైన సినిమా చేసే అవకాశాన్ని నాకు కల్పించాడు దర్శకుడు పవన్. 'లేడీస్ టైలర్' తర్వాత అర్చన, నేను మళ్లీ నటించిన 'షష్టిపూర్తి'లో మా ఇద్దరి పాత్రలు అద్భుతంగా ఉంటాయి'' అని చెప్పారు. అర్చన మాట్లాడుతూ–''చాలా విరామం తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. 'షష్టిపూర్తి' ద్వారా నాకు ఇంత గొప్ప స్వాగతం పలికిన అందరికీ కృతజ్ఞతలు'' అని తెలిపారు. ''నా మొదటి సినిమా ఇది. అందరూ ఆదరించాలి'' అన్నారు రూపేష్. పవన్ ప్రభ మాట్లాడుతూ–''నాకు ఇంతమంచి నటీనటులను, సాంకేతిక నిపుణులను ఇచ్చిన నిర్మాత రూపేష్‌గారికి థ్యాంక్స్'' అని పేర్కొన్నారు. ''మా సినిమాను ఫ్యామిలీతో కలిసి చూడాలి'' అని ఆకాంక్షా సింగ్ అన్నారు.

పగ... ప్రతీకారం


● అప్సరా రాణి

'రాచకొండ ఒక అడవి లాంటిదప్పా... ఈడ బలంతో పోరాడే పులులు, బలగంతో పోరాడే ఏనుగులు, ఎత్తుకు పై ఎత్తు వేసే గుంట నక్కలు, కాసుకుని కాటేసే విష సర్పాలు ఉంటాయి... ఆదిపత్యం కోసం జరిగే పోరులో రక్త పాతాలే తప్ప రక్త సంబంధాలు ఉండవు' వంటి డైలాగులతో 'రాచరికం' మూవీ ట్రైలర్ విడుదలైంది. అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ నటించిన చిత్రం 'రాచరికం'. సురేశ్ లంకలపల్లి, ఈశ్వర్ వాసె దర్శకత్వం వహించారు. ఈశ్వర్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 1న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్‌ను డైరెక్టర్ మారుతి రిలీజ్ చేశారు. 'బైకులో అనంతపురం అంతా తిరగాల నుంది.. చాలా ఇష్టం శివ', 'ఆడపిల్ల పెళ్లి అయితానే ఆడపిల్ల అవుతుంది కానీ ఈడపిల్ల అవ్వదు' అంటూ అప్సరా రాణి చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''పల్లెటూరి నేపథ్యంలో పగ, ప్రతీకారాలు ప్రధానాంశాలుగా రూపొందిన చిత్రం 'రాచరికం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: ఆర్య సాయికృష్ణ, సంగీతం: వేంగి.

రాజీ పడరు


● యశ్

'కేజీఎఫ్: చాప్టర్ 1, కేజీఎఫ్: చాప్టర్ 2' వంటి బ్లాక్ బస్టర్ మూవీస్ తర్వాత యశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్'. ఈ చిత్రాన్ని గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వెంకట్ కె. నారాయణ, యశ్ నిర్మిస్తున్నారు. బుధవారం (జనవరి 8న) యశ్ పుట్టినరోజు సందర్భంగా 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోనప్స్' నుంచి 'బర్త్ డే పీక్' అంటూ ఓ గ్లింప్స్‌ని విడుదల చేశారు. గీతూ మోహన్‌దాస్ మాట్లాడుతూ– ''ఈ చిత్రం రొటీన్‌కు భిన్నంగా ఉంటుంది. రెండు భిన్నమైన ఆలోచనలున్న వ్యక్తులు కలిసినప్పుడు ఎవరూ రాజీపడరు. ఆ కలయిక స్టోరీ టెల్లింగ్‌లో సరిహద్దులు దాటుతుంది. భాష, సంస్కృతిపరమైన అడ్డంకులు ఏవీ ఎదురు కావు. ఇది కేవలం వెండితెరపై చూసి ఎంజాయ్ చేసే సినిమా మాత్రమే కాదు... ఓ వైవిధ్యమైన అనుభవాన్ని పొందుతారు'' అన్నారు.

సాక్షి బిజినెస్
గురువారం 9-1-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 51	78,148
నిఫ్టీ ▽ 19	23,689

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	19,362	▽	126
డోజోన్స్	42,358	▽	170
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,251	△	6
డాక్స్	20,330	▽	11
షాంఘై	3,231	△	1
నికాయ్	39,981	△	102

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారట్)	77,364	△	238
బంగారం (22 క్యారట్)	77,054	△	237
వెండి (కేజీ)	89,503	△	29

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	85.40	86.42
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.80	108.66
€	యూరో	ఒకటి	87.63	90.23
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.65	54.98
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.43	54.62
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.48	65.21
SAR	సౌదీ రియాల్	[illegible]	22.00	23.56
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	22.49	24.27
¥	చైనా యువాన్	[illegible]	10.83	12.66

బాబోయ్ రూపాయ్



- మరో సరికొత్త కనిష్టానికి రూపాయి
- 17 పైసలు పతనమై 85.91 వద్ద ముగింపు
- గతేడాది సుమారు 3 శాతం డౌన్
- దిగుమతులు, విదేశీ విద్య మరింత భారం
- ఐటీకి లాభించినా.. పోటీపరంగా ప్రతికూలం

కీలక కరెన్సీగా చలామణీ అవుతున్న డాలర్ మారకంలో రూపాయి విలువ నానాటికీ తగ్గిపోతోంది. తాజాగా బుధవారం 17 పైసలు పతనమై మరో కొత్త కనిష్ట స్థాయి 85.91కి క్షీణించి 86 స్థాయికి మరింత చేరువైంది. గతేడాది మొత్తం మీద చూస్తే రూపాయి విలువ 3 శాతం కరిగిపోయింది. అంత ర్జాతీయంగా భౌగోళిక .. రాజకీయ అనిశ్చితి, మన మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, మిగతా కరెన్సీలతో పోలిస్తే డాలరు బలపడుతుండటం, పెరుగుతున్న వాణిజ్య లోటు .. ముడి చమురు రేట్లులాంటి అంశాలు రూపాయి పతనానికి కారణమవుతున్నాయి. ఇలా రూపాయి రోజురోజుకూ సెంచరీకి దగ్గరవుతుండటం పలు వర్గాలను కలవరపెడుతోంది. రూపాయి పడిపోవడం కొన్ని ఎగుమతుల ఆధారిత రంగాలకు లాభించేదే అయినా.. దిగుమతుల ఆధారిత రంగాలకు మాత్రం బిల్లుల మోత మోగిపోతోంది. విదేశీ విద్య కూడా భారమవుతోంది. ఈ నేపథ్యంలోనే రూపాయి పతనంతో ప్రభావితమయ్యే అంశాలపై ప్రత్యేక కథనం.

- సాక్షి, బిజినెస్‌డెస్క్

ఎగుమతి చేసే ఆటో కంపెనీలకు ఓకే..

వాహనాలను ఎగుమతి చేస్తున్న బజాజ్ ఆటో, మారుతీ సుజుకీ వంటి దేశీ ఆటోమొబైల్ కంపెనీలకు రూపాయి క్షీణత లాభించనుంది. అలాగే, ఆటో విడిభాగాల తయారీ సంస్థల ఆదాయాల్లో కూడా ఎక్కువ భాగం ఎగుమతుల నుంచి వస్తుండటంతో వాటికి కూడా ప్రయోజనకరంగానే ఉంటుంది. భారత ఆటోమొబైల్ విడిభాగాల ఎగుమతుల్లో అమెరికా వాటా ఏకంగా 33 శాతంగా ఉంటోంది. మరో వైపు, దిగుమతుల ఆధారిత లగ్జరీ కార్ల తయారీ సంస్థలైన మెర్సిడెస్-బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి, వోల్వో లాంటి కంపెనీలకు మాత్రం రూపాయి పతనం ప్రతికూలమే అవుతుంది.

దిగుమతులకు భారం..



చమురు, పసిడి మొదలైన వాటి కోసం భారత్ ప్రధానంగా దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. పెట్రోల్‌తో మొదలెడితే ప్లాస్టిక్, ఎరువుల వరకు మనకు నిత్యం అవసరమయ్యే అనేక ఉత్పత్తులు, సర్వీసుల్లో క్రూడాయిల్ కీలకపాత్ర పోషిస్తోంది. ఆయిల్ రేటు పెరిగిందంటే.. దానికి సంబంధమున్న వాటన్నింటి రేట్లూ పెరుగుతాయి. రూపాయి మారకం విలువ వచ్చే ఏడాది వ్యవధిలో సగటున ప్రస్తుత స్థాయిలోనే ఉంటే దిగుమతుల బిల్లు భారం ఏకంగా 15 బిలియన్ డాలర్లకు పైగా (సుమారు రూ. 1.27 లక్షల కోట్లు) పెరగవచ్చని అంచనా. కరెన్సీ బలహీనపడటం వల్ల వంటనూనెలు, పప్పులు, యూరియా, డీఏపీలు మొదలైన దిగుమతులపై ప్రభావం ఎక్కువగా పడుతుంది. ప్రస్తుతం భారత్‌లో అసెంబుల్ చేసే స్మార్ట్‌ఫోన్లలో 80–90 శాతం వరకు దిగుమతి చేసుకున్న విడిభాగాలు ఉంటున్నాయని, ఫలితంగా రూపాయి క్షీణత వల్ల స్మార్ట్‌ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ప్రియమవుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించి కరెన్సీ విలువ 5 శాతం క్షీణిస్తే వ్యయాలు 2 శాతం పెరుగుతాయని అంచనా. థర్మల్ విద్యుత్ ప్లాంట్ల కోసం దిగుమతి చేసుకున్న బొగ్గును కూడా వాడుతుంటారు. మారకం విలువ ఒక్క రూపాయి మారినా.. దిగుమతి చేసుకున్న బొగ్గుతో నడిచే పవర్ ప్రాజెక్టుల్లో ఉత్పత్తి చేసే విద్యుత్ వ్యయాలు యూనిట్‌కి 4 పైసల మేర మారిపోతాయి.

ఐటీ, ఫార్మా హ్యాపీస్...

దేశీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగానికి రూపాయి క్షీణత బాగా లాభిస్తుంది. చాలామటుకు సంస్థల ఆదాయాలు డాలర్లలోనే ఉండటం వల్ల రూపాయి 1 శాతం క్షీణిస్తే ఐటీ కంపెనీల ఆదాయం సుమారు 0.5 శాతం, లాభం దాదాపు 1.5 శాతం పెరుగుతుందని అంచనా. మూడో త్రైమాసికంలో డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 125 పైసలు పైగా పతనమైంది. దీంతో ఐటీ సంస్థల మార్జిన్లు 30–50 బేసిస్ పాయింట్లు (0.30-0.50 శాతం) వరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, ఇదే సమయంలో చైనా యువాన్, జపనీస్ యెన్, మెక్సికన్ పెసోలాంటివి కూడా పతనం కావడం వల్ల ఆకర్షణీయమైన రేటుకు సేవలు అందించడంలో మన సంస్థలకు పోటీ పెరిగిపోతోంది. ఇక ఫార్మా విషయానికొస్తే.. మన ఫార్మా ఎగుమతుల్లో మూడో వంతు వాటా అమెరికా మార్కెట్‌దే ఉంటోంది కాబట్టి ఎగుమతి కంపెనీలకు రూపాయి పతనం సానుకూలంగా ఉంటుంది. అయితే, రూపాయి క్షీణత వల్ల.. దేశీ మార్కెట్‌పై ఫోకస్ పెట్టే సంస్థలకు వ్యయాలు పెరుగుతాయి.

సానుకూలం ▲

- ఎగుమతి ఆధారిత రంగాలు
- ఫార్మా • ఐటీ సర్వీసులు • జౌళి
- ఉక్కు • రెమిటెన్సులు

ప్రతికూలం ▼

- విదేశీ ప్రయాణాలు
- విదేశీ చదువులు
- ధరల సెగ: ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తులు, కార్లు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు మొదలైనవి
- వ్యాపారాలు: కంపెనీలకు మార్జిన్ల ఒత్తిళ్లు. విస్తరణ ప్రణాళికలకు బ్రేక్. ఉద్యోగావకాశాలపై ప్రభావం, విదేశీ రుణాలు ప్రియం.

విదేశాల్లో చదువు.. తడిసిమోపెడు..

చాలామటుకు అంతర్జాతీయ యూనివర్సిటీలు విదేశీ కరెన్సీల్లోనే (డాలరు, పౌండ్లు, యూరోల్లాంటివి) ట్యూషన్ ఫీజులు వసూలు చేస్తాయి. దీంతో రూపాయి బలహీనపడే కొద్దీ ఫీజుల భారం పెరుగుతుంటుంది. అలాగే విద్యాభ్యాసం కోసం అక్కడ నివసించే భారతీయ విద్యార్థుల రోజువారీ ఖర్చులు (ఇంటద్దె, ఆహారం, రవాణా మొదలైనవి) మన మారకంలో చూసుకుంటే పెరిగిపోతాయి. ఉదాహరణకు సగటున 50,000 డాలర్ల ట్యూషన్ ఫీజును పరిగణనలోకి తీసుకుంటే, గతేడాది రూపాయి విలువ 3 శాతం పడిపోవడంతో, జనవరిలో సుమారు రూ. 41.39 లక్షలుగా ఉన్న ట్యూషన్ ఫీజు .. డిసెంబర్ నాటికి రూ. 42.90 లక్షలకు పెరిగింది. అంటే డాలరు రూపంలో ఫీజు అంతే ఉన్నా.. రూపాయి విలువ పడిపోవడంతో కేవలం పన్నెండు నెలల్లో ఏకంగా రూ. 1.51 లక్షలకు పైగా భారం పెరిగినట్లయింది.

కనిష్టం నుంచి రికవరీ

నష్టాల్లో ముగింపు • నిరాశపరిచిన జీడీపీ ముందస్తు అంచనాలు

ముంబై: కనిష్ట స్థాయి వద్ద కొనుగోళ్ల మద్దతు లభించినప్పటికీ..., స్టాక్ సూచీలు బుధవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ప్రస్తుత 2024–25 వృద్ధి రేటుకు సంబంధించి కేంద్రం ముందస్తు అంచనాలు మార్కెట్ వర్గాలను నిరాశ పరిచాయి. కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాలు వెల్లడి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా సెన్సెక్స్ 51 పాయింట్లు పతనమై 78,148 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19 పాయింట్లు నష్టపోయి 23,689 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 712 పాయింట్లు క్షీణించి 77,487 వద్ద, నిఫ్టీ 212 పాయింట్లు కోల్పోయి 23,496 వద్ద కనిష్టాలను నమోదు చేశాయి. మిడ్ సెషన్‌లో కనిష్ట స్థాయి వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్వల్ప నష్టాలతో గట్టెక్కాయి.

జీఆర్‌టీ జ్యువెలర్స్ 'స్వర్ణ సంక్రాంతి' ఆఫర్లు



హైదరాబాద్: పండుగ సీజన్ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో 'స్వర్ణ సంక్రాంతి' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. ఇందులో భాగంగా బంగారు ఆభరణాల వీఏపై 20%, డైమండ్, అన్‌కట్ డైమండ్ విలువపై 25%, వెండి వస్తువుల వీఏపై 25%, వెండి ఆభరణాల ఎంఆర్‌పీపై పదిశాతం తగ్గింపు అందిస్తుంది. స్వర్ణ సంక్రాంతి ఆఫర్లు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ కోరారు.

బిగ్‘సి’లో పండుగ ఆఫర్లు

హైదరాబాద్: బిగ్‘సి’ సంక్రాంతి పండుగ ఆఫర్లు ప్రకటించింది. ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10 వేల వరకు విలువగల మొబైల్ ప్రొటెక్షన్‌తో పాటు, రూ.5,999 విలువైన స్మార్ట్ వాచ్ లేదా రూ.1,799 విలువైన ఎయిర్‌బడ్స్ ఉచితంగా ఇస్తుంది. ప్రతి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.15 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్ ఇస్తుంది. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51% వరకు డిస్కౌంట్ పొందవచ్చు. సంక్రాంతి ఆఫర్లను ప్రజలంతా వినియోగించుకోవాలని బిగ్‘సి’ వ్యవస్థాపకులు బాలు చౌదరి కోరారు.



జీఎంఆర్‌కు రూ.6,300 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ సంస్థ జీఎంఆర్ గ్రూప్ తాజాగా అబుదాబీకి చెందిన అబు దాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) నుంచి రూ.6,300 కోట్లు అందుకుంది. సావరిన్ వెల్త్ ఫండ్ ఏడీఐఏ నుంచి రూ.6,300 కోట్ల రుణం స్వీకరించనున్నట్లు కంపెనీ 2024 అక్టోబర్‌లోనే ప్రకటించింది. ఆప్షనల్లీ కన్వర్టబుల్ డిబెంచర్స్‌ను (ఓసీడీ) కేటాయించడం ద్వారా జీఎంఆర్ ఇన్‌ఫ్రా ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జీఐఈపీఎల్) ఈ నిధులను సమకూర్చుకుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌ను ప్రమోట్ చేస్తున్న జీఐఈపీఎల్ అనుబంధ కంపెనీయే జీఐఈపీఎల్. ప్రమోటర్ గ్రూప్ సంస్థ జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రయివేట్ లిమిటెడ్ రుణ భారాన్ని తగ్గించుకునేందుకు నిధులను వెచ్చించనున్నట్లు గ్రూప్ తెలియజేసింది.



స్టాండర్డ్ గ్లాస్ ఐపీవో సూపర్ సక్సెస్

చివరి రోజుకల్లా 183 రెట్లు స్పందన

హైదరాబాద్ కంపెనీ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ పబ్లిక్ ఇష్యూ సూపర్ సక్సెస్ అయ్యింది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో చివరి రోజు బుధవారానికల్లా దాదాపు 183 రెట్లు అధికంగా స్పందన లభించింది. కంపెనీ 2.08 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. 380 కోట్లకుపైగా షేర్ల కోసం సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. రూ. 133–140 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 410 కోట్లు సమీకరించింది.

లక్ష్మీ డెంటల్ @ రూ. 407-428

ఈ నెల 13–15 మధ్య ఐపీవో

ఆర్బీమెడ్‌కు పెట్టుబడులున్న లక్ష్మీ డెంటల్ పబ్లిక్ ఇష్యూకి రూ. 407–428 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 13న ప్రారంభమై 15న ముగుస్తుంది. ఐపీవోలో భాగంగా రూ. 138 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.31 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా మొత్తం రూ. 698 కోట్లు సమీకరించాలని భావిస్తోంది.

మళ్లీ జొమాటో క్విక్ సర్వీసులు

ఎంపిక చేసిన పట్టణాలలో షురూ



న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో రెండేళ్ల తదుపరి క్విక్ సర్వీసులను తిరిగి ప్రారంభించింది. ఎంపిక చేసిన పట్టణాలలో 15 నిమిషాల్లో ఫుడ్ డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వినియోగదారులకు 2 కిలోమీటర్ల పరిధిలో ఎంపిక చేసిన రెస్టారెంట్ల నుంచి ఫుడ్ అందించనుంది. తద్వారా రేసులోకి వచ్చింది. ప్రత్యర్థి సంస్థ స్విగ్గీ స్నాక్ పేరుతో 15 నిమిషాల్లోనే ఆహారం, పానీయాలు తదితరాలను అందిస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గింపు! | బ్యాంకింగ్ లాభాలకు గండి!

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌పీసీఐఎల్, కక్రాపర్ సైట్‌లో 176 అప్రెంటిస్‌లు

అనుమల(గుజరాత్)లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్), కక్రాపర్ గుజరాత్ సైట్‌లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 284.
» శిక్షణా కాలం: ఏడాది.
» ఖాళీల వివరాలు: ట్రేడ్ అప్రెంటిస్‌లు–176, డిప్లొమా అప్రెంటిస్‌లు–32, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–76.
» ట్రేడ్ అప్రెంటిస్: ట్రేడులు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, సీవోపీఏ/పీఏఎస్ఏఏ, మెషినిస్ట్, టర్నర్, ఏసీ మెకానిక్, డీజిల్ మెకానిక్.
» డిప్లొమా అప్రెంటిస్: విభాగాలు: కెమికల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్.
» గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: విభాగాలు: కెమికల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, బీఎస్సీ(ఫిజిక్స్), బీఎస్సీ(కెమిస్ట్రీ), హ్యూమన్ రిసోర్సెస్, కాంట్రాక్ట్స్ అండ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్.
» అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 21.01.2025 నాటికి ట్రేడ్ అప్రెంటిస్‌కు 18 నుంచి 24 ఏళ్లు, డిప్లొమా అప్రెంటిస్‌కు 18 నుంచి 25 ఏళ్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
» స్టైపెండ్: నెలకు ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7,700 నుంచి రూ.8,050, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000.
» ఎంపిక విధానం: ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో పొందిన మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.01.2025
» వెబ్‌సైట్: https://npcilcareers.co.in

ఈడీసీఐఎల్(ఇండియా) లిమిటెడ్, న్యూఢిల్లీలో 255 కౌన్సిలర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(ఈడీసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల్లో కెరీర్–మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 255.
» అర్హత: అభ్యర్థులు తప్పనిసరిగా సైకాలజీలో ఎమ్మెస్సీ, ఎంఏ, బ్యాచిలర్స్ డిగ్రీ, కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్‌లో డిప్లొమా కలిగి ఉండాలి. సంబంధిత రంగాల్లో కనీసం 2 1/2 సంవత్సరాల కౌన్సిలింగ్ అనుభవం కలిగి ఉండాలి.
» వయసు: గరిష్ట వయో పరిమితి 31.12.2024 నాటికి 40 ఏళ్లు ఉండాలి.
» వేతనం: ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.30,000.
» ఎంపిక విధానం: అర్హత, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: అప్లికేషన్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
» దరఖాస్తులకు చివరితేది: 10.01.2025.
» వెబ్‌సైట్: https://www.edcilindia.co.in

ఏపీ హైకోర్టులో లా క్లర్క్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలోని హైకోర్టులో ఒప్పంద ప్రాతిపదికన లా క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 05.
» శిక్షణా కాలం: ఒక సంవత్సరం
» అర్హత: ఐదేళ్లు/మూడేళ్ల లా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» వేతనం: నెలకు రూ.35,000.
» ఎంపిక విధానం: విద్యార్హతలు, మెరిట్ మార్కులు, వైవా వాయిస్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, హైకోర్ట్ ఆఫ్ అమరావతి, నేలపాడు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 17.01.2025.
» వెబ్‌సైట్: https://aphc.gov.in

గ్రూప్ 2 కటాఫ్ ఎంతంటే!

» టీజీపీఎస్సీ గ్రూప్ 2 క్లిష్టంగా ఉందంటున్న అభ్యర్థులు
» పేపర్–1, 3 బాగా కష్టంగా : పేపర్–2, 4 ఓ మోస్తరు క్లిష్టత
» ఓపెన్ కేటగిరీలో 400 కటాఫ్ అంచనా



టీజీపీఎస్సీ గ్రూప్-2.. రాష్ట్ర స్థాయిలో నాయిబ్ తహశీల్దార్, ఏసీటీఓ, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ తదితర పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష! గత నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షకు 2.5 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు! ఇప్పుడు వీరందరిలో ఒకటే సందేహం.. గ్రూప్-2 కటాఫ్ మార్కులు ఎంత ఉంటాయి? అనేదే!! మరోవైపు.. ఔత్సాహికుల్లో గ్రూప్-2 పేపర్ సరళి ఎలా ఉంది.. భవిష్యత్తు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి? అనే సందేహాలు. ఈ నేపథ్యంలో.. రెండు రోజులపాటు మొత్తం నాలుగు పేపర్లుగా నిర్వహించిన తెలంగాణ గ్రూప్-2లో.. పేపర్ వారీ విశ్లేషణ.. నిపుణుల కటాఫ్ అంచనా తదితర వివరాలు..

- 783: టీజీపీఎస్సీ గ్రూప్–2 పోస్టుల సంఖ్య.
- 5,51,855: గ్రూప్ 2కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు.
- 2,51,486: గ్రూప్–2 పరీక్షకు హాజరైన అభ్యర్థులు..
- స్థూలంగా చూస్తే గ్రూప్–2 పరీక్షకు సంబంధించిన గణాంకాలు ఇవి! దరఖాస్తు చేసుకున్న వారిలో సగానికి పైగా అభ్యర్థులు గైర్హాజరు కావడంతోపాటు పరీక్ష కటాఫ్ విషయం ఇప్పుడు పోటీ పరీక్షల అభ్యర్థుల్లో హాట్ టాపిక్‌గా మారింది.

పేపర్-1 క్లిష్టంగా

టీజీపీఎస్సీ గ్రూప్–2 పేపర్ల సరళిని పరిశీలిస్తే.. పేపర్–1 బాగా కష్టంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జనరల్ స్టడీస్ పేరిట నిర్వహించిన ఈ పేపర్‌లో ప్రభుత్వాల విధానాలు, అంతర్జాతీయ అంశాలు, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, రీజనింగ్‌ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. ప్రశ్నలు సుదీర్ఘంగా ఉండడంతో.. వాటికి సరైన సమాధానాలు గుర్తించే విషయంలో అభ్యర్థులు సమయాభావానికి లోనయ్యారు. ఎలక్ట్రిక్ వెహికిల్స్, నీతి ఆయోగ్, కాగ్, ఇస్రో, జాతీయ అవార్డులు, జాగ్రఫీలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టింది. ఇంగ్లిష్‌పై 20 వరకూ ప్రశ్నలు అడిగారు. అయితే ఇవి సుదీర్ఘంగా ఉండటం అభ్యర్థులను ఇబ్బందిపెట్టింది. మొత్తంగా ఈ పేపర్ అభ్యర్థి విషయ పరిజ్ఞానాన్ని, లోతైన అవగాహనను పరిశీలించేలా ఉందనే వాదన వినిపిస్తోంది.

పేపర్-2 ఓ మోస్తరు క్లిష్టత

గ్రూప్–2 రెండో పేపర్ విషయంలో మాత్రం అభ్యర్థులు కొంత ఉపశమనం లభించిందని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో జోగిని వ్యవస్థ, తెలంగాణ జిల్లాలు, స్థానిక సంస్థల అధికారాలు, ఆయా సామాజిక వర్గాలకు చెందిన కమిషన్ల గురించి ప్రశ్నలు అడిగారు. వీటికి సమాధానం ఇవ్వడం పెద్ద కష్టంగా లేదని అభ్యర్థులు పేర్కొంటున్నారు. అయితే తెలంగాణ హిస్టరీకి సంబంధించి అడిగిన ప్రశ్నలు బాగా క్లిష్టంగా ఉన్నాయని పేర్కొంటున్నారు. కుతుబ్‌షాహీలు, రాంజీగోండు, ఆంధ్ర మహాసభ సమావేశాలు వంటి ప్రశ్నలకు సరైన మ్యాచింగ్ ఎంచుకోవడం కొంత కష్టంగా మారింది.

పేపర్-3 బాగా కఠినంగా

ఎకానమీ అంశాలతో ఉండే పేపర్–3 మాత్రం అత్యంత క్లిష్టంగా ఉందని ఎక్కువ మంది అభ్యర్థులు పేర్కొంటున్నారు. బడ్జెట్, సర్వేలతోపాటు ప్రభుత్వ పథకాలు, పంటలు, జనాభాకు సంబంధించిన ప్రశ్నలు ఎక్కువగా అడిగారు. ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ఎకానమీలోని అన్ని అంశాలపై గణాంక సహిత పరిపూర్ణ పరిజ్ఞానం ఉన్న వారికే సాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అంతేకాకుండా 2011-2013 మధ్య కాలంలోని గణాంకాలపై ప్రశ్నలు ఇచ్చారు. దీంతో సమకాలీన పరిణామాల ఆధారంగా ప్రిపరేషన్ సాగించిన అభ్యర్థులు సమాధానాలు గుర్తించడంలో ఇబ్బందికి గురయ్యారు. అసెర్షన్ అండ్ రీజన్ ప్రశ్నలు ఎక్కువగా అడగడంతో సమాధానాలు గుర్తించేందుకు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చిందని అభ్యర్థులు అంటున్నారు.

పేపర్-4 తేలికగానే

తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం అంశాలు ఉండే పేపర్ ఇది. ఇది కొంత సులభంగానే ఉందని అభ్యర్థులు చెబుతున్నారు. ఊహించిన రీతిలోనే తెలంగాణ ప్రాధాన్యం గల అంశాలపైనే ప్రశ్నలు అడిగారు. తెలంగాణ ఉద్యమం, ఉద్యమకారులు, సంస్థలు, పార్టీలు, కమిటీలు, రైతు ఉద్యమాలు, నిజాం పరిపాలన గురించి ప్రశ్నలు అడిగారు. అయితే ఇందులో చంద్రబాబు విజన్ డాక్యుమెంట్ -2020, ఆంధ్ర కన్‌స్ట్రక్షన్ కంపెనీల గురించి అడగడంతో అభ్యర్థులు విస్మయానికి గురయ్యారు. వీటిపై ఏ మాత్రం దృష్టి పెట్టకపోవడంతో దాదాపు పది ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోయామని అభ్యర్థులు చెబుతున్నారు.

స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలు

గ్రూప్–2లో ఈసారి స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలు ఎక్కువగా కనిపించాయి. దీంతో సమాధానాలు ఇచ్చేందుకు అభ్యర్థులు కొంత తికమకకు గురయ్యారు. అదే విధంగా మ్యాచింగ్ టైప్ కొశ్చన్స్, క్రానాలజీ ఆర్డర్ ప్రశ్నల సంఖ్య కూడా అధికంగానే ఉంది. అదే విధంగా అసెర్షన్ అండ్ రీజన్ ప్రశ్నలకు దగ్గరి పోలిక ఉండడంతో సరైన సమాధానాలు గుర్తించడంలో అభ్యర్థులు ఆందోళన చెందారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఎకానమీలో స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం చాలా క్లిష్టంగా మారిందని అభ్యర్థులు పేర్కొంటున్నారు.

పట్టు సాధిస్తేనే

అన్ని పేపర్లను పరిశీలిస్తే.. అభ్యర్థులు ఆయా సబ్జెక్టులలో పూర్తిగా పట్టు సాధిస్తేనే సమాధానాలు ఇచ్చే విధంగా ఉన్నాయి. సమకాలీన అంశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం గమనార్హం. అదే విధంగా పాత గణాంకాలకు సంబంధించి ప్రశ్నలు అడిగారు. దీంతో తాజా గణాంకాలకు పరిమితమైన అభ్యర్థులు ఇబ్బందికి గురయ్యారు.

మెయిన్స్ అభ్యర్థులకు సైతం

టీజీపీఎస్సీ గ్రూప్–2కు గ్రూప్–1 మెయిన్స్‌కు హాజరైన వారు కూడా ఉన్నారు. అయితే వీరు కూడా గ్రూప్–2 పేపర్లకు సమాధానాలు గుర్తించడం కష్టంగా ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా జనరల్ స్టడీస్, ఎకానమీపై నిడివి ఎక్కువ ఉన్న ప్రశ్నలు ఎదురవడం, తాజా అంశాలు కాకుండా పాత గణాంకాలపై ప్రశ్నలు అడగడంతో.. తమ ప్రిపరేషన్‌కు భిన్నంగా ప్రశ్నలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

లోతైన అవగాహనతోనే సక్సెస్

గ్రూప్–2 ప్రశ్నలు అంచనాలకు అందని విధంగా ఉన్నాయి. దీంతో టీజీపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లపై లోతైన అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సదరు అంశాలకు సంబంధించి పూర్వాపరాల నుంచి సమకాలీన పరిణామాల వరకూ.. అన్నింటిపైనా పట్టు సాధించాలని పేర్కొంటున్నారు. అదే విధంగా ప్రిపరేషన్ సమయంలోనే స్టేట్‌మెంట్స్, అసర్షన్ అండ్ రీజన్, మ్యాచింగ్ టైప్ కొశ్చన్స్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలని సలహా ఇస్తున్నారు. ఫలితంగా పరీక్ష హాల్లో సమయాభావ సమస్య నుంచి ఉపశమనం పొందొచ్చని పేర్కొంటున్నారు.

ఓపెన్ కేటగిరీలో 400?

గ్రూప్ 2 ప్రశ్నలు క్లిష్టంగా, సుదీర్ఘంగా వచ్చిన నేపథ్యంలో కటాఫ్‌పై అంచనాకు రావడం అంత తేలిక కాదని చెబుతున్నారు. అయితే ప్రశ్న పత్రాల సరళి, అభ్యర్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న సబ్జెక్ట్ నిపుణులు.. ఓపెన్ కేటగిరీలో 400 వరకు కటాఫ్ ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. బీసీ కేటగిరీలో 370నుంచి 390మధ్యలో;ఎస్సీ కేటగిరీలో 360;ఎస్టీ కేటగిరీలో 360 వరకు కటాఫ్‌గా నిలిచే అవకాశముందని ప్రాథమికంగా పేర్కొంటున్నారు.

టీజీపీఎస్సీ గ్రూప్-2.. ముఖ్యాంశాలు

- అసెర్షన్ అండ్ రీజన్, స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలకు ప్రాధాన్యం.
- సమకాలీన అంశాలతోపాటు కోర్ అంశాలకూ ప్రాధాన్యం.
- లోతైన అవగాహన ఉంటేనే సమాధానాలు ఇచ్చేలా ప్రశ్నలు.
- తెలంగాణకు సంబంధం లేని ప్రశ్నలతో అభ్యర్థుల విస్మయం
- ఓపెన్ కేటగిరీలో 400 వరకు కటాఫ్ ఉంటుందనే అంచనా

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- బ్యాంకింగ్ అవేర్‌నెస్



వృద్ధుడైనా వణకలేదు!

- సైబర్ నేరగాళ్లకు చుక్కలు చూపించిన వైనం
- మనీలాండరింగ్ కేసు అంటూ నేరస్తుల బెదిరింపులు
- రూ.25 లక్షలు పంపకుంటే డిజిటల్ అరెస్ట్ చేస్తామని హూంకరింపు
- ధైర్యంగా ఎదుర్కొన్న వృద్ధుడు.. నిందితుల అరెస్ట్

బంజారాహిల్స్ (హైదరాబాద్): సైబర్ నేరగాళ్లు బెదిరిస్తే చదువుకున్నవాళ్లు, ఐటీ ఉద్యోగులు, యువతే బెదిరిపోయి వారి వలలో ఇరుక్కుని లక్షల్లో నష్టపోతున్నారు. అయితే ఓ 80 ఏళ్ల వృద్ధుడు మాత్రం వాళ్ల మోసాన్ని ధైర్యంగా ఎదుర్కోవడమే కాకుండా, భారీ ఆర్థిక నష్టం నుంచి తప్పించుకున్నాడు. వివరాలు...బంజారాహిల్స్ రోడ్డునంబర్ 12లో నివాసం ఉండే పెంచికల రఘునందన్‌రెడ్డి (80)ని శంకర్‌కుమార్ అనే వ్యక్తి సంప్రదించాడు. ప్రోస్టేట్ కేన్సర్‌కు ఆయుర్వేద చికిత్స గురించి తెలియజేస్తూ, తన తండ్రికి పూర్తిగా నయమైందంటూ నమ్మబలికాడు. ఆ తర్వాత అశోక్ యాదవ్ అనే వ్యక్తి 4వ తేదీన రఘునందన్‌రెడ్డి ఇంటికి వచ్చాడు. మీ గురించి శంకర్‌కుమార్ చెప్పాడని, ఇంట్లో ఆయుర్వేద కషాయాన్ని తయారుచేయమని వృద్ధుడిని బలవంతం చేశాడు. అనంతరం రఘునందన్‌రెడ్డిని వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఓ ఆయుర్వేద దుకాణానికి తీసుకువెళ్లాడు. అక్కడ మనోజ్ అనే వ్యక్తి వివిధ మూలికలతో కూడిన మందుల ప్రిస్క్రిప్షన్ ఇచ్చాడు. ఆ మొత్తం దాదాపు రూ.9,26,820 కాగా, అడ్వాన్స్‌గా రూ.76,800ల నగదు, రూ.7,50,000లకు చెక్కును రఘునందన్‌రెడ్డి ఇచ్చాడు. అయితే శంకర్‌కుమార్ తన తండ్రి చికిత్సకు రూ.40 వేలు మాత్రమే ఖర్చయ్యాయని చెప్పిన విషయం రఘునందన్‌రెడ్డికి గుర్తుకువచ్చి తనను మోసం చేశారని గ్రహించాడు. దీంతో బ్యాంకుకు వెళ్లి చెక్కు చెల్లింపులను నిలిపివేయించాడు.

లైన్‌లోకి సైబర్ నేరగాళ్లు..

దీంతో నిందితులు ఇచ్చిన సమాచారంతో ఆ తర్వాత నుంచి ఢిల్లీ పోలీసులమని, సీబీఐ అధికారినంటూ కొందరు రఘునందన్‌రెడ్డికి ఫోన్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. నీపై మనీ లాండరింగ్ యాక్ట్ కేసు నమోదైందని, వెంటనే రూ.25 లక్షలు పంపించకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామంటూ బెదిరించారు. వీడియో కాల్‌లో సైబర్ నేరస్తుడు పోలీసు ఆఫీసర్ డ్రెస్‌లో బెదిరించి దడదడలాడించినా రఘునందన్‌రెడ్డి తొణకలేదు. ఇలా గంట, రెండు గంటలు కాదు..ఏకంగా ఐదున్నర గంటల పాటు వృద్ధుడిని ఇబ్బంది పెట్టారు. ఇదంతా సైబర్ మోసగాళ్ల పనిగా గ్రహించిన వృద్ధుడు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేన్సర్‌కు ఆయుర్వేద మందు పేరుతో తనను మోసగించిన వ్యక్తులే తన నుంచి పూర్తి వివరాలు రాబట్టి సైబర్ మోసగాళ్లకు సమాచారం ఇచ్చి లక్షలు లాక్కోవాలని పథకం వేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు శంకర్‌కుమార్, అశోక్‌యాదవ్, మనోజ్‌లతో పాటు రాపిడో ఏజెంట్‌పై కేసు నమోదు చేశారు.



అన్నానికి పిలిచి కన్నం

అప్పులు తీర్చటానికి ఓ యువకుడి ఎత్తు

మహబూబాబాద్ రూరల్: అన్నం పెట్టినోళ్ల ఇంటికే కన్నం పెట్టారని.. తిన్నింటి వాసాలు లెక్కపెట్టారనే వార్తలు అడపాదడపా చదువుతుంటాం. కానీ భోంచేద్దువు గాని రమ్మని పిలిచి.. అతిథి అన్నం తింటుండగానే గప్‌చుప్‌గా ఆయన ఇంటికెళ్లి నగానట్రా చక్కబెట్టేసి వచ్చిన యువకుడి ఉదంతమిది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో చోటుచేసుకున్న భారీ చోరీ కేసు వివరాలను బుధవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. నర్సింహులపేటకు చెందిన కోటగిరి రవి అప్పులపాలై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన వడ్డీ వ్యాపారి ఏరనాగి సీతారాములు ఇంట్లో చోరీచేస్తే జీవితం సెటిలైపోతుందనే ఆలోచనకు వచ్చాడు. సీతారాములు భార్య ఇటీవల చనిపోయింది. ఇద్దరు కుమారులు, కోడళ్లు పనులపై బయటకు వెళ్లారు. ఇంతకంటే మంచి సమయం దొరకదని భావించిన రవి.. ఈనెల 6న సీతారాములును తనింటికి మధ్యాహ్న భోజనానికి ఆహ్వానించాడు. ఆయనొచ్చి భోజనం చేస్తుండగా, రవి కుటుంబసభ్యులు మాటల్లో పెట్టారు. ఇదే అదనుగా రవి సీతారాములు ఇంటికెళ్లి దొరికినంతా మూటగట్టేశాడు. సీతారాములు తన ఇంటికి వెళ్లేసరికి తాళం పగులగొట్టి ఉంది.

ఎలా దొరికాడంటే..: ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. ఈనెల 6న సీతారాములు ఏ సమయంలో బయటికెళ్లారు? ఎక్కడెక్కడికి వెళ్లారు? అనేది ఆరా తీశారు. ఆయన రవి ఇంటికెళ్లి భోజనం చేసి వచ్చేసరికి ఇదంతా జరిగిందని తేలింది. దీంతో రవిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు జరిగిందంతా కక్కేశాడు. చోరీ సొత్తును బావి వద్ద దాచినట్టు చెప్పడంతో.. అక్కడ సోదాచేసి రూ.17.60 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.8.90 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.



లారీ కింద పడినా 'క్షేమం'



పెద్దపల్లి రూరల్: మోపెడ్‌పై ప్రయాణిస్తున్న దంపతులు యూటర్న్ తీసుకోవడం.. ఆగిన లారీ కదలడం.. మోపెడ్‌తో సహా భార్యాభర్తలిద్దరూ దానికిందకు దూసుకుపోవడం.. క్షణాల్లో జరిగిపోయాయి. లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన గుర్రాల తిరుపతి, లక్ష్మి దంపతులు.. పెద్దపల్లి బస్టాండ్‌కు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటున్నప్పుడు.. ఆగిన లారీ హఠాత్తుగా ముందుకు కదిలింది. దీంతో దంపతులిద్దరూ మోపెడ్‌తో సహా లారీ కిందకు దూసుకుపోయారు. కానీ, లారీ డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బ్రేక్ వేయడంతో.. తిరుపతి వెంటనే బయటికి రాగా.. లక్ష్మి లారీ కింద సురక్షితంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. లారీపై 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి'.. నినాదం ఉండటం గమనార్హం.



సాక్షి, హైదరాబాద్:

ఎక్సైజ్ శాఖకు యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) కంపెనీ ఝలక్ ఇచ్చింది. తాము తయారు చేసే బీర్లను ఇక నుంచి తెలంగాణలో సరఫరా చేయబోమని ఆ కంపెనీ ప్రకటించింది. బేసిక్ ధరలు పెంచలేదని, బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు కంపెనీ నిబంధనల ప్రకారం...ఎన్ఎస్ఈ(నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్), బీఎస్ఈ (బాంబే స్టాక్ ఎక్స్చేంజ్)లకు సమాచారం ఇచ్చింది. రాష్ట్రంలో నాలుగైదు బ్రాండ్ల బీర్లకు మంచి మార్కెట్ ఉంది. అందులో యూబీ తయారు చేసే కింగ్‌ఫిషర్ బీర్లదే సింహభాగం. మొత్తం తెలంగాణ మార్కెట్‌లో 72 శాతం వరకు ఈ బ్రాండ్‌దే ఉంటుందని అంచనా. ఈ బీర్లు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్)కు సరఫరా చేసినందుకుగాను కేసుకు రూ.289 చొప్పున తయారీదారులకు చెల్లిస్తారు. ఈ బేసిక్ ధర పెంచాలన్న డిమాండ్ ఎక్సైజ్ శాఖలో చాలా కాలంగా వినిపిస్తున్నా, అమల్లోకి రాకపోవడంతో తాజా సమస్య ఏర్పడింది.

కేఎఫ్ బీర్లు బంద్

బేసిక్ ధరలు పెంచనందున తెలంగాణకు కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు యూబీ కంపెనీ ప్రకటన

తక్షణమే నిలిపివేస్తున్నాం...

యూబీ కంపెనీ సెక్రటరీ నిఖిల్ మల్పానీ పేరుతో బుధవారం స్టాక్ ఎక్స్చేంజీలకు ఇచ్చిన సమాచారాన్ని జాతీయ మీడియా బహిర్గతం చేసింది. ఈ లేఖలో పేర్కొన్న ప్రకారం యూబీ తయారు చేసే బీర్ల సరఫరాను తెలంగాణలో తక్షణమే నిలిపివేయనుంది. 2019–20 నుంచి కంపెనీకి చెల్లించే బేసిక్ ధరలను తెలంగాణ ప్రభుత్వం సవరించలేదని, దీని కారణంగా భారీ నష్టాలు వస్తున్నాయని ఆ లేఖలో వెల్లడించారు. టీజీబీసీఎల్ చెల్లించాల్సిన పెద్ద మొత్తం పెండింగ్‌లో ఉందని, ఈ కారణంగానే తాము బీర్లు సరఫరా చేయడం లేదని స్పష్టం చేసింది.

పలుమార్లు విజ్ఞప్తులు

ఐదేళ్లుగా బీర్, లిక్కర్ తయారీదారులకు బేసిక్ ధరలను రాష్ట్ర ప్రభుత్వం సవరించలేదు. ముఖ్యంగా బీర్ తయారీదారులకు ఎప్పటి నుంచో కేస్‌కు రూ.289 మాత్రమే చెల్లిస్తున్నారు. బీర్ల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల ధరలు పెరిగినందున బేసిక్ ధరలు పెంచాలని యూబీతోపాటు అనేక కంపెనీలు కూడా ప్రభుత్వాన్ని కోరాయి. కొద్ది రోజుల క్రితం ఆలిండియా బీర్ అసోసియేషన్ ప్రతినిధులతో ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ శ్రీధర్ చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. సీఎంతోపాటు ఎక్సైజ్ మంత్రి వద్ద జరిగిన అంతర్గత చర్చల్లోనూ లిక్కర్ కంపెనీల బేసిక్ ధరలు పెంచేది లేదని కరాఖండిగా తేల్చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే యూబీ కంపెనీ తమ ఉత్పత్తులను రాష్ట్రంలో సరఫరా చేయరాదని నిర్ణయించింది.

వారం రోజులు ఓకే..

బీర్ల సరఫరా తక్షణమే నిలిపివేసినా, మార్కెట్‌లో బీర్ల కొరత ఇప్పటికిప్పుడే రాదని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే యూబీ కంపెనీ నుంచి టీజీబీసీఎల్‌కు అందిన బీర్లు మరో ఆరేడురోజుల పాటు మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతేనే ఫలానా బ్రాండ్ బీర్ల కొరత ఏర్పడుతుందని చెబుతున్నాయి. అయితే వైన్‌షాపుల యజమానులు అప్రమత్తమయ్యారు. వీలున్నంత ఎక్కువగా కింగ్‌ఫిషర్ బీర్లకు ఇండెంట్ పెట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో డిపోల వద్ద రేషన్ విధించే యోచనలో ఎక్సైజ్ శాఖ ఉన్నట్టు తెలుస్తోంది.



చర్చలకు సిద్ధంగా ఉన్నాం : టీజీబీసీఎల్

ఎండీకి యూబీ కంపెనీ లేఖ

ధరల పెంపు, బకాయిల విషయంలో నిర్ణయం తీసుకోనందునే తాము బీర్ల సరఫరాను బుధవారం నుంచి నిలిపివేసినట్టు, ఈ ప్రతిష్టంభనను తొలగించుకునేందుకు టీజీబీసీఎల్‌తో చర్చలకు సిద్ధమని యూబీ కంపెనీ ప్రకటించింది. ఈ మేరకు టీజీ బీసీఎల్ ఎండీ, ఎక్సైజ్ డైరెక్టర్ చెవ్వూరి హరికృష్ణకు యూబీ కంపెనీ చీఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ ఆఫీసర్ గరీమాసింగ్ లేఖ రాశారు. ఏప్రిల్ 1, 2024 నాటికి తమకు రూ.702 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని, గత ఏడాది అక్టోబర్ నుంచి ఎలాంటి చెల్లింపులు జరగలేదని ఆ లేఖలో తెలిపారు. బేసిక్ ధర పెంపు నిర్ణయం జరిగిన వెంటనే బీర్ల సరఫరాను యథాతథంగా కొనసాగిస్తామని వెల్లడించారు. తమ బకాయిలు సెప్టెంబర్ 2025 లోపు దశలవారీగా చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని టీజీ బీసీఎల్‌కు రాసిన లేఖలో గరీమాసింగ్ స్పష్టం చేశారు.

ధరలు పెంచడమే న్యాయం

ముడిసరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో బీర్ తయారీ కంపెనీలకు బేసిక్ ధర పెంచడమే న్యాయం. ఈ క్రమంలో స్థానిక అసోసియేషన్లతో సంప్రదింపులు జరిపి పెంచితే మంచిది. ప్రభుత్వం రమ్మంటే వెళ్లి చర్చిస్తాం. యూబీ కంపెనీ ప్రతినిధులతో కూడా మాట్లాడతాం. కానీ, న్యాయమైన ధర మాత్రం ఇవ్వాల్సిందే.

– ఎం.కామేశ్వరరావు,
అసోసియేషన్ ఆఫ్ లిక్కర్ అండ్ బీర్ సప్లయర్స్

ధరల పెంపుపై ఒత్తిడి తేవడం పద్ధతి కాదు: జూపల్లి



బీర్ల ధరల పెంపు అంశంపై రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని కమిటీ నిర్ణయం తీసుకోకముందే యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) కంపెనీ తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్‌పై ఒత్తిడి తేవడం పద్ధతి కాదని ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గుత్తాధిపత్యంతో బీర్ల ధరలు పెంచాలని యూబీ కంపెనీ చూస్తోందని విమర్శించారు. ఒత్తిళ్లకు తమ ప్రభుత్వం తలొగ్గే ప్రశ్నే లేదన్నారు. బుధవారం సచివాలయ మీడియా పాయింట్‌లో మంత్రి మాట్లాడారు. ఒక్కో బీరుపై దాదాపు 33.1 శాతం పెంచాలని కంపెనీ అడుగుతోందని, అలా చేస్తే బీరు ధర రూ.150 నుంచి రూ.250 వరకు పెరుగుతుందన్నారు. బీర్ల ధరల పెంపుపై హైకోర్టు రిటైర్డ్ జడ్జితో గతంలోనే కమిటీ వేశామని, కమిటీ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. యూబీ కంపెనీ మార్కెట్ షేర్ 72 శాతం ఉంది కదాని.. ప్రజలు డిమాండ్ చేస్తారు కదాని ఇష్టానుసారంగా ధరలు పెంచాలని కోరడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.1,130 కోట్లు చెల్లించామని, ఇంకా రూ. 658 కోట్లు చెల్లించాల్సి ఉందని, కానీ కంపెనీ రూ.702 కోట్లు అని తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలోని బకాయిలే రూ.407 కోట్లు ఉన్నాయన్నారు. పక్క రాష్ట్రాల కంటే తెలంగాణలో తక్కువ రేట్లు ఉన్న విషయం వాస్తవమేనని, కర్ణాటకలో రూ.190, ఏపీలో రూ.180 ఒక్కో బీరు ధర ఉంటే, తెలంగాణలో రూ.150 ఉందన్నారు. 14 లక్షల కేసుల స్టాక్ ప్రస్తుతం ఉందని, సంక్రాంతి పండుగకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పైసా కూడా ట్యాక్స్ పెంచలేదని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

గేమ్ చేంజర్ బెనిఫిట్ షోకు నిరాకరణ

టికెట్ ధరల పెంపునకు అనుమతి



సాక్షి, హైదరాబాద్: దర్శకుడు శంకర్, హీరో రామ్‌చరణ్ తేజ్ కలయికలో ఈనెల 10న విడుదల కానున్న 'గేమ్‌చేంజర్' సినిమా బెనిఫిట్ షోల ప్రదర్శనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఇటీవల పుష్ప–2 సినిమా బెనిఫిట్ షో నేపథ్యంలో నెలకొన్న ఘటనల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. టికెట్ ధరల పెంపునకు మాత్రం ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈనెల 10వ తేదీన 6 షోలు ప్రదర్శించుకోవచ్చు. మల్టీప్లెక్స్ థియేటర్లలో ఇప్పటికే అమల్లో ఉన్న టికెట్ ధరపై అదనంగా రూ.150, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.100 చొప్పున పెంచుకునే వెసులుబాటు కల్పించింది. ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రోజుకు 5 షోలు ప్రదర్శించుకోవచ్చు. ఈ తొమ్మిది రోజుల పాటు మల్టీప్లెక్స్ థియేటర్లలో ఇప్పటికే అమల్లో ఉన్న టికెట్ ధరపై అదనంగా రూ.100, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.50 చొప్పున పెంచుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ధరలు జీఎస్టీతో కలిపి ఉంటాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈమేరకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, లైసెన్స్ జారీ చేసే అధికారులను ఆదేశించింది.

తెలంగాణ, ఏపీలో పలు చోట్ల ఐటీ సోదాలు

హన్సిక, అనిల్ అనే నిందితుల వసూళ్లపై ఆరా

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వంలో పనులు చేయిస్తామని పలు కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేసిన హన్సిక, అనిల్ అనే నిందితుల కేసుపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. నిందితుల వసూళ్లపై ఆరా తీస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కార్యదర్శి పీకే మిశ్రా కుమార్తె, అల్లుడిగా చెప్పుకుని ప్రభుత్వంలో పనులు చేయిస్తామంటూ వీరు వివిధ కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేయడంతో ఇటీవలే ఒడిశా పోలీసులు భువనేశ్వర్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు తమ దర్యాప్తులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో బుధవారం 12 ప్రాంతాల్లో సోదాలు చేశారు. పన్నుల చెల్లింపుల్లో మినహాయింపులు ఇప్పిస్తామంటూ హన్సిక, అనిల్ చెప్పిన మాటలను నమ్మిన పలువురు పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు వీరికి ముడుపులు సమర్పించుకున్న విషయం విదితమే. అలా వారిద్దరూ దాదాపు రూ.100 కోట్లు వసూలు చేసినట్టు సమాచారం. ఈ డబ్బులతో విలాసవంతమైన జీవితాన్ని గడిపిన హన్సిక, అనిల్‌కుమార్ మహంతి.. లగ్జరీ కార్లు, అధునాతన విల్లాలు కొనుగోలు చేశారని ఆరోపణలు ఉన్నాయి.

చెత్త అమ్మి.. బీమా చేసి

జీపీ కార్మికులకు రూ.10 లక్షల బీమా చేయించిన పంచాయతీ కార్యదర్శి



జీపీ కార్మికులకు ప్రమాద బీమా బాండ్లు అందిస్తున్న శేషాద్రి

తంగళ్లపల్లి (సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పాడిచెత్త (ప్లాస్టిక్ బాటిల్స్, బీరుసీసాలు) విక్రయించి గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు ప్రమాద బీమా చేయించారు. ఒక్కొక్కరికి రూ.559 చొప్పున తొమ్మిది మందికి పోస్టల్ ప్రమాద బీమా చేయించారు. చెత్త విక్రయిస్తే వచ్చిన రూ.6 వేల నుంచి కార్మికుల సంక్షేమం కోసం రూ.5,031 వెచ్చించారు. మిగతా సొమ్మును గ్రామపంచాయతీ ఖాతాలో వేశారు. ఈ బాండ్లను కార్మికులకు బుధవారం తంగళ్లపల్లి ఎంపీడీవో ఆఫీస్‌లో డీఆర్‌డీఓ, ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి చేతుల మీదుగా అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు పోస్టల్ ప్రమాదబీమా చేయించిన పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌ను ఆయన అభినందించారు. మండెపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా గ్రామాల్లోని కార్మికులకు ప్రమాద బీమా చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు జారీ చేసిన నోటీసుల సస్పెన్షన్‌ను హైకోర్టు బుధవారం పొడిగించింది. ఈ నెల 22 వరకు సస్పెండ్ చేస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



అధిక సాంద్రత పత్తి సాగు క్షేత్ర సందర్శన చేస్తున్న మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు



విత్తన మేళాలో రైతులకు కొత్త రకం వరి విత్తనాలను అందజేస్తున్న మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు

రైతుల సేవలో కేవీకే

36 ఏళ్లుగా మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సేవలు | రైతులకు పంటల సాగుపై అవగాహన సదస్సులు

మహబూబాబాద్ రూరల్:

మహబూబాబాద్ మండలం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని 1989లో ఏర్పాటు చేశారు. 36 ఏళ్లుగా ఈ కేంద్రం రైతులకు సేవలందిస్తోంది. జెన్నారెడ్డి రఘోత్తంరెడ్డి తన తండ్రి వెంకటరెడ్డి పేరు మీద మల్యాల గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రానికి 46.6 ఎకరాల భూమిని కేటాయించారు. మల్యాల కేవీకేలో సమన్వయకర్తగా డాక్టర్ ఎస్.మాలతి, విస్తరణ విభాగ అధిపతిగా డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, పంట సేద్యం ఉత్పత్తి శాస్త్రవేత్తగా బి.క్రాంతికుమార్, ఉద్యాన శాస్త్రవేత్తగా డాక్టర్ ఈ.రాంబాబు పనిచేస్తున్నారు. సస్యరక్షణ విభాగం, వెటర్నరీ, గృహ విజ్ఞాన విభాగాల శాస్త్రవేత్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



రైతులకు అవగాహన

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిపిన పరిశోధనలపై మల్యాల కేవీకే ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక భూముల నాణ్యతను బట్టి వాటికి అనువుగా ఉంటే ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలుగా ఎంపిక చేసి పరీక్షలు నిర్వహిస్తారు. మళ్లీ వాటిని పరిశోధనకు తీసుకువెళ్లి ఇతర రైతులకు ఉపయోగపడే విధంగా తెలియజేస్తున్నారు. రైతు దినోత్సవాలు, కిసాన్ మేళాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఉన్న ప్రధాన పంటలపైన రైతులకు శిక్షణ కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలను సమన్వయం చేస్తూ సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న పంట క్షేత్రాలను సందర్శించి పురుగులు, తెగుళ్ల నివారణ విషయంలో రైతులను చైతన్యపరుస్తున్నారు.

చిరు సంచుల్లో వంగడాలు..

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన వంగడాలను చిరు సంచుల రూపంలో రైతులకు అందజేస్తున్నారు. రైతులు చిరు సంచుల ధాన్యం అభివృద్ధి బాగా ఉందని చెబితే కొత్తగా మరింత మంది రైతులకు ఇస్తున్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, చీడపీడల నివారణ, పురుగుమందుల వాడకంపై మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు క్షేత్ర దినోత్సవాలు, ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతుల క్షేత్రాల్లో వరి, పత్తి, మిరప, మొక్కజొన్న పంటలతోపాటు ఆరుతడి పంటలపై క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

మట్టి పరీక్షలు..

భూసార పరీక్ష కేంద్రం ద్వారా రైతులకు మట్టి, నీళ్ల పరీక్షలు నిర్వహించి ఫలితాలు తెలియజేస్తున్నారు. వ్యవసాయ రంగంలో రోజురోజుకూ కొత్తకొత్త మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంతోపాటు సేంద్రియ సాగుపై ఆసక్తి పెరిగే విధంగా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. పెట్టుబడులు తగ్గించి అధిక దిగుబడులు పొందడం కోసం రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ వ్యవసాయంలో రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నారు.

వరి విత్తన ఉత్పత్తి..

మల్యాల కేవీకేలోని ఫాంలో వరి విత్తన ఉత్పత్తిలో భాగంగా సిద్ధి సన్న రకం, ఆర్‌ఎన్‌ఆర్ 15048 (తెలంగాణ సోనా), కునారం 118 సన్నాలు, డబ్ల్యూజీఎల్ 962 సన్నాలు తయారు చేస్తున్నారు. వరిలో విత్తన ఉత్పత్తి ద్వారా జిల్లాలోని రైతాంగానికి నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నారు. గిరిజన ఉప ప్రణాళిక, ఎస్సీ ఉప ప్రణాళిక పథకంలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల రైతులకు పంటల సాగులో మెళకువలపై శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా స్కిల్ ట్రైనింగ్‌లు, ఒకేషనల్ ట్రైనింగ్‌లు, గుర్తించబడిన అంశాలపై ట్రైనింగ్ ఇస్తున్నారు. ఆర్య (అట్రాక్టింగ్ అండ్ రిటైనింగ్ రూరల్ యూత్ ఇన్ అగ్రికల్చర్) పథకంలో భాగంగా గ్రామాలను దత్తత తీసుకుని 18 నుంచి 35 ఏళ్ల వయసుగల వారిని ఎంపిక చేసి పురుష, మహిళా రైతులకు శిక్షణ ఇస్తున్నారు.

కూరగాయల సాగు, పెరటికోళ్ల పెంపకం..

కేవీకేలోని షేడ్ నెట్లలో కూరగాయల సాగు పెంపకం, వర్మి కంపోస్టు తయారీ, పెరటి కోళ్ల పెంపకం, చిరుధాన్యాలతో వంటకాలు తయారు చేయడంపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. గిరిజనులు, దళితులు ఎక్కువగా ఉండే గ్రామాలను ఎంపిక చేసి, దత్తత తీసుకొని అక్కడి స్థానికులకు కుట్టు మెషీన్లపై శిక్షణ ఇచ్చారు. మూడు నుంచి నాలుగు సంవత్సరాలకుగాను జిల్లాలో కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని శిక్షణ ఇస్తున్నారు. కాటన్ స్పెషల్ ప్రాజెక్టులో భాగంగా నాగ్‌పూర్ అఖిల భారత పత్తి పరిశోధన సంస్థ (సీఐసీఆర్) సహకారంతో అధిక సాంద్రత పత్తి సాగు వల్ల జరిగే మేలుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. తద్వారా రోజురోజుకూ రైతులు అధిక సాంద్రత పత్తి సాగుపై మక్కువ కనబరుస్తున్నారు. దీంతో మొక్కల సంఖ్య పెరిగి పంట దిగుబడి పెరగటంతో పాటుగా ఆర్థికంగా చేయూత వచ్చే విధంగా కృషి చేస్తున్నారు.

మరిన్ని విశేషాలు..

- పెసర, మినుము, కందిలో కొత్త రకాలను చిరు సంచుల రూపంలో రైతులకు అందజేసి పంటల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు.
- కిసాన్ సారథి మొబైల్ యాప్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 1,12,124 మంది రైతులను అందులో సభ్యులుగా చేర్చారు. పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలను కిసాన్ సారథి మొబైల్ యాప్ ద్వారా సమాచారాన్ని రైతులకు చేరవేస్తున్నారు.
- డిస్ట్రిక్ట్ అగ్రో మెటరాలజీ యూనిట్ (దాము) వాట్సాప్ గ్రూపు ద్వారా 2023–24 సంవత్సరంలో రైతులకు వాతావరణ సూచనలు చేరవేశారు.
- మల్యాల కేవీకే అనుసంధానంలో రైతులకు మిరపలో సాగు జాగ్రత్త చర్యలో భాగంగా నీలిరంగు, పసుపు రంగు జిగురు అట్టలను మిరప పంట చేలలో ఏర్పాటు చేసుకుని పంటను కాపాడుకునే విధానాలపై తెలియజేస్తున్నారు. మిరపలో సమగ్ర వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ మల్చింగ్ విధానం వల్ల కలిగే లాభాలు, మిరప పంట చేనుల చుట్టూ బంతి పూల చెట్లు, మొక్కజొన్న వేసుకుంటే మేలుదాయకమని అవగాహన కల్పిస్తున్నారు.
- వరిలో నేరుగా వెదజల్లే పద్ధతి ద్వారా రైతులకు లాభాలు చేకూరుస్తున్నారు.
- మొక్కజొన్నలో జంటసాళ్ల పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నారు.
- యాసంగిలో జీరో టిల్లేట్ పద్ధతిలో మొక్కజొన్న సాగు లాభదాయకంపై తెలియజేస్తున్నారు.
- వరి, మిరప పంటలకు ముందుగా పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలని అవగాహన కల్పించటం వల్ల 40 శాతం వరకు రైతులు వృద్ధి సాధిస్తుండగా సూడోమోనోస్ జీవ నియంత్రికల వాడకాన్ని పెంచారు.

మందుల వాడకం తగ్గించాలి



రైతులు పంటల సాగు సమయంలో పురుగు మందులు, తెగుళ్ల మందులు అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బతింటుంది. పురుగు మందులు, తెగుళ్ల మందుల వాడకం తగ్గించడం శుభసూచకం. తద్వారా మనం సాగుచేసే నేల పాడైపోకుండా భావితరాల వారికి అందించే విధంగా ఉంటుంది. విచక్షణారహితంగా మందుల వాడకాన్ని తగ్గించాలి. సమీకృత వ్యవసాయాన్ని ఆచరించాలి. భావితరాల పురోగతికి నాంది పలకాలి.

–డాక్టర్ ఎస్.మాలతి, మల్యాల కేవీకే సమన్వయకర్త

గ్రామీణ యువతకు అవగాహన కల్పిస్తున్నాం...



మల్యాల కేవీకే ద్వారా నిర్వహించే వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలతో గ్రామీణ యువతకు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై అవగాహన కల్పిస్తున్నాం. తద్వారా వారు ఉపాధి అవకాశాలు పొందే విధంగా ప్రోత్సహిస్తున్నాం. జిల్లాలోని రైతులకు సమగ్ర ఎరువులు, పురుగు మందుల వాడకంపై తెలియజేస్తూ వారు సమగ్ర వ్యవసాయం చేసే విధంగా అవగాహన కల్పిస్తున్నాం.

–డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, మల్యాల కేవీకే శాస్త్రవేత్త

కొత్త రకాల విత్తనాలతో దిగుబడి సాధించా..



మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా నేను కొత్త రకాలైన వరి, పెసర విత్తనాలను తీసుకున్నాను. వాటి ద్వారా అధిక దిగుబడి సాధిస్తూ నాతోటి రైతులకు కొత్త రకం వరి, పెసర రకాలను పరిచయం చేస్తున్నాను. కేవీకే ద్వారా ఏర్పాటు చేస్తున్న అనేక శిక్షణ కార్యక్రమాలు, రైతు సదస్సులకు హాజరవుతున్నాను. తద్వారా రైతులు కొత్త విషయాలను తెలుసుకునే విధంగా సాయం చేస్తున్నాను. ముఖ్యంగా నేరుగా వరిలో విత్తేపద్ధతి, సమగ్ర వ్యవసాయం, కొత్త రకాలు, వివిధ పంటల్లో జంటసాళ్ల పద్ధతి మొక్కజొన్నలో అవలంబిస్తూ ఆర్థిక లబ్ధి పొందుతున్నాను.

–గంద్రాతి భాస్కర్‌రెడ్డి, రైతు, బయ్యారం

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తున్నాను



మల్యాల కేవీకే ద్వారా గత మూడు సంవత్సరాలుగా నేను అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తున్నాను. దీని ద్వారా ఎకరాకు పది నుంచి 11 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తుండగా ఆర్థికంగా అభివృద్ధి ఉంటోంది. పత్తి తర్వాత జొన్న, బొబ్బెర పంటలను సాగు చేసి ఆదాయాన్ని పొందుతున్నాను. మల్యాల కేవీకే ద్వారా ముఖ్యంగా సమగ్ర ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం, అధిక సాంద్రత పత్తిసాగు, కొత్త రకాలైన విత్తనాలు, సమగ్ర వ్యవసాయంపై విషయాలు తెలుసుకుని తోటి రైతులు అవలంబించే విధంగా ప్రోత్సహిస్తున్నాను.

–మాలోతు బాలాజీ, రైతు, చంద్రుతండా



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్



ఔరా.. సొర!

ఒకటీ రెండూ కాదు అయిదున్నర అడుగుల సొరకాయ ఇది. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలం పాపయ్యపేటకు చెందిన లింగాల స్వామి, సునీత దంపతుల ఇంట్లో సొరకాయ తీగకు అయిదున్నర అడుగుల సొరకాయ కాసింది. దీన్ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. - నర్సంపేట

శాకాహారానికే జై!

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) 2021లో చేసిన అధ్యయనం ప్రకారం భారత్‌లో లక్షలాది మంది శాకాహారులు ఉన్నారని అంచనా. అయితే ఏటా ఈ సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. వీగన్ డైట్ గురించి గూగుల్ ట్రెండ్‌లు, ఆన్‌లైన్ శోధన డేటాను బట్టి చూస్తే గత దశాబ్ద కాలంలో దేశంలో శాకాహారంపై ప్రజల్లో ఆసక్తి గణనీయంగా పెరిగినట్టు స్పష్టమవుతోంది.

- దేశంలో క్రమంగా పెరుగుతున్న వీగన్స్
- లక్షలాది మంది శాకాహారులున్నట్లు ఐసీఎంఆర్–2021 అధ్యయనం అంచనా
- మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లతో వీగనిజమ్‌ను అందిపుచ్చుకుంటున్న వైనం
- 23 నుంచి 37 శాతం వెజిటేరియన్లు ఉన్నట్లు పలు ప్రభుత్వ సర్వేల వెల్లడి
- ప్రముఖ నగరాల్లో పెరుగుతున్న శాకాహార రెస్టారెంట్లు, హోటళ్లు
- అత్యధికంగా రాజస్తాన్, గుజరాత్, మహారాష్ట్ర, హరియాణా, పంజాబ్, బిహార్, యూపీల్లో వెజిటేరియన్లు

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో ఇటీవలి కాలంలో ఆహార అలవాట్లు, ప్రాధాన్యాల్లో స్పష్టమైన మార్పులు కన్పిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా శాకాహారంవైపు మొగ్గు విషయంలో వస్తున్న మార్పులు, ట్రెండ్‌లను 'వీగనిజమ్'ను దేశ ప్రజలు వేగంగా అందిపుచ్చుకుంటున్నట్టు వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకప్పుడు వెజిటేరియన్ ఫుడ్‌ను ప్రముఖుల జీవనశైలి అలవాటుగా పరిగణించేవారు. కానీ ఈ ఆహారపు అలవాటు విషయంలో క్రమంగా సాంస్కృతికంగా మార్పులు వస్తున్నట్టు తెలుస్తోంది. ఆయా అంశాల ప్రాతిపదికన చూస్తే వెజిటేరియనిజమ్ వైపు మొగ్గు పెరుగుతున్నట్టుగా పలు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఇండియాలో వీగనిజమ్ అనే కొత్త ఉద్యమం ప్రారంభమైనట్టుగా నిపుణులు అంచనా వేస్తున్నారు. గతంలోనే భారత్‌ను 'ప్రపంచ శాకాహార రాజధాని'గా ఇతర దేశాలకు చెందిన వారు కీర్తించినా.. పలు ప్రభుత్వ సర్వేలు, అధ్యయనాల ప్రకారం చూస్తే 23 నుంచి 37 శాతం మంది దాకా వెజిటేరియన్లు ఉన్నారనే ప్రచారం జరిగింది. కొంత కాలం కిందట అమెరికాకు చెందిన బాలమురళి నటరాజ్, ఇండియాకు చెందిన సూరజ్ జాకబ్ నిర్వహించిన సర్వే ప్రకారం వీరి సంఖ్య 20 శాతం దాకా ఉండొచ్చునని అంచనా వేశారు. హైదరాబాద్ మొదలుకుని ముంబై, బెంగళూరు, పుణే, గోవా వంటి చోట్ల పూర్తిస్థాయి శాకాహార రెస్టారెంట్లు, హోటళ్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దేశంలోని చిన్న చిన్న పట్టణాల్లో కూడా శాకాహార ఉత్పత్తులు అందుబాటులోకి రావడంతో ప్రజలు వెజిటేరియన్ ఫుడ్‌వైపు మొగ్గుచూపుతున్నట్టు స్పష్టం అవుతోందంటున్నారు.

తాజా సర్వేలు, పరిశీలనలను బట్టి చూస్తే..

- రాజస్తాన్‌లో అత్యధికంగా శాకాహారం తీసుకునే ప్రజలున్నారు. ముఖ్యంగా జైపూర్, ఉదయ్‌పూర్ వంటి పట్టణ ప్రాంతాల్లో వీరు అధికం. తరతరాలుగా సంప్రదాయబద్ధంగా వస్తున్న ఆహారపు అలవాట్లే ఇందుకు కారణమంటున్నారు.



- గుజరాత్‌లో అత్యధిక శాతం వెజిటేరియన్లు ఉన్నారు. ముఖ్యంగా జైనుల్లో మతపరమైన విశ్వాసాలు, శాకాహార జీవనశైలి కారణమని అంచనా.
- మహారాష్ట్రలో గణనీయమైన సంఖ్యలో శాకాహారుల జనాభా ఉంది. ముంబై, పుణే వంటి నగరాల్లో వీరి సంఖ్య అధికం. ఇక్కడి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు ఒకేవిధమైన ఆహార పద్ధతులు పాటిస్తున్నారు.
- హరియాణాలో కూడా తగినంత సంఖ్యలో వెజిటేరియన్లు ఉన్నారు. ఇక్కడి జనాభాలో ఎక్కువ మంది శాకాహారులే. ఈ రాష్ట్రంలోని గ్రామీణ వ్యవసాయ జీవనశైలి దీనికి కారణం.
- పంజాబ్ ప్రత్యేకమైన శాకాహార వంటలకు ప్రసిద్ధి. దాల్, రోటీ, సబ్జీ వంటివి విరివిగా లభిస్తాయి. ఇక్కడ సిక్కుల జనాభా అధికంగా ఉండటం కూడా ఓ కారణం.
- బిహార్‌లోనూ హిందూయిజం, జైనిజంల విధానాలు, పద్ధతుల పాటింపు. పట్టణాలు, గ్రామాల్లో రోజువారీ ఆహారంలో అధికశాతం శాకాహారమే.
- యూపీలో పెద్దసంఖ్యలో శాకాహారులున్నారు. రాష్ట్ర సంస్కృతి, ఆచారాల్లో శాకాహారం అనేది అంతర్భాగంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికులు వెజిటేరియన్లుగా ఉన్నారు.

భారత్‌లో శాకాహారం వైపు మొగ్గు ఎందుకంటే?

- ఎక్కువ మంది ప్రజల్లో మొక్కల ఆధారిత, ఆకుపచ్చ కూరలతో కూడిన ఆహార అలవాట్ల వల్ల ఆరోగ్యపర ప్రయోజనాల పట్ల అవగాహన పెరుగుదల.
- జంతువుల సంక్షేమంపై దృష్టి పెరగడంతో పాటు వాటికి హాని చేకూర్చకూడదనే విలువల పట్ల ప్రజల్లో చైతన్యం పెరగడం.
- క్రికెటర్ విరాట్ కోహ్లి, భారత అత్యుత్తమ ఫుట్‌బాల్ ప్లేయర్ సునీల్ ఛెత్రి, సినీతారలు అమితాబ్ బచ్చన్, అక్షయ్‌కుమార్, షాహిద్‌కపూర్, అనుష్క శర్మ, ఆలియా భట్, మలైకా అరోరా, భూమి ఫడ్నేకర్ వంటి సెలబ్రిటీలు వెజిటేరియన్లుగా మారిన ప్రభావం వారి అభిమానులపై బాగానే పడినట్టు వెల్లడైంది.
- ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'ద గేమ్ చేంజర్స్'వంటి డాక్యుమెంటరీలు శాకాహారంపై అవగాహన, చైతన్యం పెరిగేందుకు దోహదపడ్డాయి.
- సూపర్‌మార్కెట్లు, రెస్టారెంట్లతో పాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పైనా వెజిటేరియన్ ఉత్పత్తులు విరివిగా అందుబాటులోకి రావడం కూడా కారణం.
- భారత్‌లో ప్లాంట్ బేస్డ్ ఫుడ్ ఇండస్ట్రీ అనేక రెట్లు పెరిగి 2022లో 1.3 బిలియన్ల మార్కెట్ వాల్యూను చేరుకుంది.
- 2010 నుంచి చూసినట్లయితే ఇండియాలో 'వీగన్ డైట్'పై ఆన్‌లైన్ సెర్చ్ డేటా రెండింతలు పెరుగుదల.
- యూ గవ్ సర్వే ప్రకారం శాకాహార డైట్‌వైపు మొగ్గు చూపేందుకు 59 శాతం మంది సంసిద్ధత వ్యక్తం చేసినట్టు వెల్లడి.
- వివిధ ఆహార ఉత్పత్తుల్లో జంతువుల నుంచి సేకరించిన దినుసులు లేవని తాము సేఫ్టీ స్టాండర్డ్స్ పాటిస్తున్నామని పలు సంస్థలు తమ ఫుడ్ లేబుళ్లపై స్పష్టం చేస్తున్నాయి.

పశుసంవర్ధక శాఖను పునరుద్ధరిస్తాం: భట్టి



పశువైద్యులు, ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన డైరీ, కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

సుందరయ్య విజ్ఞానకేంద్రం (హైదరాబాద్): పశుసంవర్ధక శాఖను పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. బుధవారం పశువైద్యులు, ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన డైరీ, కేలండర్‌ను ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భాస్కర్, మాన్యం రమేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి గంధం నాగయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి సట్ల వెంకట్ పాల్గొన్నారు.

వెదురు సాగుతో ఏటా లక్ష ఆదాయం

ఏజెన్సీలో సాగుకు రైతులను ప్రోత్సహించాలి: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: ప్లాస్టిక్ స్థానంలో వెదురును ఉపయోగించాలని, ప్రజలు పర్యావరణహితులుగా మారాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మూడు, నాలుగేళ్లు ఓపిక పడితే పంట చేతికొస్తుందని, ఎకరంలోపు భూమిలోనే ఏడాదికి కనీసం లక్ష సంపాదించవచ్చని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వెదురు సాగును ప్రోత్సహించాలని ఐటీడీఏ అధికారులకు ఆమె సూచించారు. ప్రతి ఇల్లు సుసంపన్నం కావాలని, అందుకే సీఎం రేవంత్ రెడ్డి మహిళా శక్తి స్కీం కింద మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి వెదురు వర్క్‌షాప్‌లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. మహిళల ఆదాయాన్ని పెంపొందించే దిశలో వెదురు సాగును ప్రోత్సహించడానికి గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెదురు సాగు, ఉత్పత్తులు, మార్కెటింగ్ మెలకువలు నేర్పిస్తున్న ఇండస్ట్రీస్ ఫౌండేషన్ ప్రతినిధులను మంత్రి సన్మానించారు.

'ఇంజనీర్స్' డైరీ ఆవిష్కరించిన మంత్రి ఉత్తమ్



డైరీ ఆవిష్కరిస్తున్న నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పంజగుట్ట (హైదరాబాద్): ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని, ఇరిగేషన్ శాఖకు మంచి గుర్తింపు తేవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను బుధవారం ఆయన ఎర్రమంజిల్‌లోని జలసౌధ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతులు, టీఏ బిల్స్, హెచ్‌ఆర్‌ఏ, నూతనంగా చేరిన ఏఈఈల వేతనాలు వంటి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, కార్యదర్శి ఎ.సత్యనారాయణ, పరమేశ్వర్‌రెడ్డి, ఏటీఏఈఈ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్, కార్యదర్శి ఎల్.నాగరాజు, కోశాధికారి సంతోష్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు టి.వి.ప్రసాద్, రాష్ట్ర సంఘం నాయకులు సమర్‌సేన్, మహేంద్రనాథ్, ప్రవీణ్, అశోక్‌రాజ్, అభినవ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

150 మంది ఏఈఈలకు జీతాలు..

ఇటీవల నియామకం పొందిన 700 మంది ఏఈఈల్లో సుమారు 150 మందికి గత మూడు నెలలుగా జీతాలు అందకపోవడంపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పందించారు. ఒక జోన్‌కి చెందిన తమను మరో జోన్‌కి పోస్టు చేయడంతో ఆర్థిక శాఖ జీతాలు ఇవ్వడం లేదని బాధిత ఏఈఈలు కొందరు మంత్రిని కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో ఫోన్‌లో మాట్లాడి వారికి జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ట్రస్మాకు అండగా ఉంటా: మంత్రి తుమ్మల



ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన మంత్రి తుమ్మల

సుభాష్‌నగర్: బడ్జెట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ట్రస్మా ముఖ్య సలహాదారుడిగా యాదగిరి శేఖర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడిగా శివరాత్రి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఐవీ రమణారావు, కోశాధికారిగా జయసింహాగౌడ్ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మల మాట్లాడుతూ బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల సంఘం ఇంత బలంగా ఉందంటే, వారికి సమస్యలున్నట్లు అర్థమవుతోందన్నారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. ఖమ్మంకు చెందిన దివంగత ట్రస్మా రాష్ట్ర అధికార ప్రతినిధి సూరపనేని శేషుకుమార్‌ను తుమ్మల గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎస్‌టీయూ డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించిన కోదండరాం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (టీఎస్‌టీయూ) రూపొందించిన 2025 డైరీ, కేలండర్‌ను ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర సాధనలో టీఎస్‌టీయూ కీలకపాత్ర పోషించిందన్నారు. విద్యా రంగం వినూత్న మార్గంలో ఉపాధ్యాయుల తోడ్పాటు అవసరమని పేర్కొన్నారు. టీచర్ల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి, పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు అరకల కృష్ణగౌడ్, సంఘ నేతలు శ్రీనివాసరెడ్డి, అల్లె పరమేశ్వర్, సురేందర్, అఫ్సర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల సంస్థకు అద్దె భారం!

గిడ్డంగుల సంస్థ ద్వారా గోడౌన్లు అద్దెకు తీసుకునే ప్రతిపాదన



- ఏడాదికి రూ.16–25 కోట్ల అద్దె భారం
- నేరుగా ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకుంటే తక్కువ అద్దె
- సంస్థపై ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు గత అధికారుల నిర్ణయం
- కూటమి నేతల స్వలాభం కోసం పౌరసరఫరాల సంస్థ బలి

సాక్షి, అమరావతి: మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (సీఎస్‌సీ) పరిస్థితి మారనుంది. రేషన్ బియ్యం నిల్వ చేసేందుకు అవసరమైన బఫర్ గోడౌన్లను గిడ్డంగుల సంస్థ ద్వారా అద్దెకు తీసుకోవాలనే ప్రతిపాదనతో భారీగా ఆర్థిక భారాన్ని మోయాల్సి రానుంది. ప్రైవేటు వ్యక్తుల నుంచి సీఎస్‌సీ నేరుగా గోడౌన్స్‌ల అద్దెకు తీసుకునే ధరకంటే గిడ్డంగుల సంస్థల ద్వారా తీసుకుంటే ఎక్కువ అద్దె చెల్లించాల్సి ఉంటుంది. దీంతో గత ప్రభుత్వం రూ.వేల కోట్ల అప్పుల్లో మూలుగుతున్న సీఎస్‌సీపై ఆర్థిక భారం తగ్గించేందుకు నేరుగా ప్రైవేటు వ్యక్తుల గోడౌన్లతో ఒప్పందాలు చేసుకుంది. కానీ, ప్రస్తుత పాలకుల రాజకీయ స్వలాభం కోసం కార్పొరేషన్‌ను ఆర్థిక కష్టాల్లోకి నెట్టేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. ఫ లితంగా పౌరసరఫరాల సంస్థపై రూ.16–25 కోట్ల మేర అదనపు భారం పడే అవకాశం కనిపిస్తోంది.

సొంతంగా తీసుకుంటేనే అద్దె తక్కువ

సీఎస్‌సీ ప్రైవేటు వ్యక్తుల నుంచి గోడౌన్లను తీసుకుంటే నెలకు ఒక బస్తాకు రూ.4.25 అద్దె, 6 శాతం సూపర్‌వైజరీ చార్జీలు చెల్లిస్తుంది. అదే రాష్ట్ర, కేంద్ర గిడ్డంగుల సంస్థ ద్వారా గోడౌన్లు తీసుకుంటే బస్తాకు రూ.5 అద్దె చెల్లించడంతో పాటు 7 శాతం సూపర్‌వైజరీ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత పద్ధతి ప్రకారం గోడౌన్ల వినియోగానికి ఏడాదికి సుమారు రూ.175 కోట్లు చెల్లిస్తుండగా గిడ్డంగుల సంస్థ ద్వారా గోడౌన్లు తీసుకుంటే కార్పొరేషన్‌పై ఏడాదికి సుమారు రూ.16–25 కోట్లు మేర ఆర్థిక భారం పడనుంది.

నిర్ణీత సమయంలోనే..

ప్రైవేటు గోడౌన్లు టైమ్ బౌండ్ లేకుండా పని చేస్తాయి. కానీ.. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గిడ్డంగులైతే సెలవు రోజుల్లో పని చేయవు. ప్రతిరోజు నిర్ణీత సమయానికి మాత్రమే తెరుచుకుంటాయి. అప్పుడే ప్రజాపంపిణీకి అవసరమైన కార్యకలాపాలు చేపట్టాల్సి ఉంటుంది. దీనికితోడు ఓవర్ అండ్ ఎబౌవ్ చార్జీలను క్లెయిమ్ చేస్తారు. అవకాశం ఉన్నంత మేరకు స్టోరేజీ లాస్‌లను డిక్లేర్ చేస్తారు. మరోవైపు పరిమితికి మించిన స్టోరేజీ లాస్ అయితే దానికి సంబంధించి బియ్యం పరిమాణం ఎంత ఉంటుందో.. ఆ బియ్యం ఖరీదు (ఎకనమిక్ కాస్టు)ను లెక్కగట్టి కేంద్ర, రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు చెల్లించాల్సిన అద్దె మొత్తం నుంచి సీఎస్‌సీ రికవరీ చేస్తుంది. ఇలా రికవరీ చేసిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రైవేటు గోడౌన్ల నిర్వహణలో యజమానులదే పూర్తి బాధ్యత కావడంతో ఇలాంటి సమస్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి.

గిడ్డంగుల సంస్థలో బియ్యం భద్రమేనా

ప్రైవేటు వ్యక్తులకు చెందిన బఫర్ గోడౌన్లలో బియ్యం నిల్వ చేస్తే పక్కదారి పడుతున్నాయంటూ కూటమి పాలకులు విష ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి మచిలీపట్నం ఘటనలో సదరు గోడౌన్ యజమాన్యం స్వయంగా లేఖ రాసిన తర్వాతే నిల్వలు తగ్గాయన్న విషయం బయటకు వచ్చింది. సదరు గోడౌన్ యాజమాన్యం బాధ్యతగా వ్యవహరిస్తే ప్రభుత్వ పెద్దలు మాత్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. దీనినే సాకుగా చూపించి ప్రైవేటు వ్యక్తుల గోడౌన్లలో బియ్యం దారి మళ్లుతున్నాయంటూ దుష్ప్రచారం చేపట్టింది. వాస్తవానికి గతంలో అనేకసార్లు గిడ్డంగుల సంస్థ గోడౌన్లలో పీడీఎస్ సరుకులు మాయమయ్యాయి. గిడ్డంగుల సంస్థకు చెందిన ఆత్మకూరు గోడౌన్‌లో కందులు, శనగలు, **నంద్యాలలో** బియ్యం స్టాక్‌లో అవకతవకలు **జరిగాయని ఆరోపణలొ**చ్చాయి. అనంతపురం జిల్లాలోని తి**మ్మంచెర్లలో చేయని పను**లకు బిల్లులు చూపించి సీఎస్‌సీ నుంచి రూ.కోట్లు కొల్లగొట్టినట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాలోని గిడ్డంగుల సంస్థ ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకున్న ఓ గోడౌన్‌లో నిర్వహణ లోపంతో బియ్యం నాణ్యత దెబ్బతింది. ఇలా పీడీఎస్ బియ్యం నిల్వల్లో గిడ్డంగుల సంస్థ నిర్లక్ష్యం బయటపడింది. వాస్తవానికి గిడ్డంగుల సంస్థలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఒక్కో వ్యక్తి 2–3 గోడౌన్ల బాధ్యతలను చూడాల్సిన పరిస్థితి. ఇలాంటి తరుణంలో గిడ్డంగుల సంస్థలో బియ్యం నిల్వ చేస్తే భద్రంగా ఉంటా యా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు చాలా వరకు గిడ్డంగుల సంస్థ గోడౌన్లు 30–40 **ఏళ్లు నిం**డి, సరైన నిర్వహ**ణకు నోచుకోకుండా ఉన్నాయి. ఉదాహరణకు కడప గోడౌన్‌లో పందులు, బర్రెలు తిరుగుతుండటం గమనార్హం.**


ఒక్కో గోడౌన్‌కు ఒక్కో చార్జీ

గిడ్డంగుల సంస్థకు అద్దెకు ఇచ్చిన ప్రైవేటు గోడౌన్ల యజమానుల సమస్యలు వర్ణనాతీతం. అద్దెలు సమయానికి చెల్లించకపోవడం, ఒక్కో గోడౌన్‌కు ఒక్కో రకమైన.. పద్ధతి లేని స్టోరేజీ చార్జీలు ఉంటున్నాయి. గిడ్డంగుల సంస్థ ద్వారా వెళితే ప్రైవేటు గోడౌన్లకు నెలకు బస్తాకు రూ.3.25 మాత్రమే అద్దె దక్కుతోంది. దీనికితోడు ఆలస్యంగా అద్దె చెల్లిస్తుండటంతో ప్రైవే టు గోడౌన్ల యజమానులు సీఎస్‌సీ వైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు హ్యాండ్లింగ్ ట్రాన్స్‌పోర్టు టెండర్లలో గిడ్డంగుల సంస్థలో భారీగా అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి.

బరులకు బేరం

సంక్రాంతి కోడిపందేలకు పశ్చిమగోదావరి జిల్లా పెట్టింది పేరు. భీమవరం, చుట్టుపక్కల జరిగే పందేలకు ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. చుట్టూ గ్యాలరీలు, ఎల్‌ఈడీ స్క్రీన్ల మధ్య జరిగే పందేలను వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాదు.. దేశ విదేశాల నుంచి బంధుమిత్రులు వస్తుంటారు. మూడు రోజుల్లో రూ.వంద కోట్లకు పైగా నగదు చేతులు మారుతుందని అంచనా. ఇప్పటికే బరుల ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ప్రాంతం, బరి సైజును బట్టి రూ.15 లక్షల నుంచి రూ.కోటి వరకూ డిమాండ్ చేస్తున్నారు.





పశ్చిమగోదావరి జిల్లాలో సిద్ధమవుతున్న కోడిపందేల బరులు



- భీమవరం పరిసరాల్లో రూ.కోటి..
- ఇతర చోట్ల రూ.15 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు రేటు
- కోడిపందేల బరుల వద్దే గుండాట, పేకాటకు ఏర్పాట్లు
- నియంత్రణ ఊసెత్తని పోలీసులు

సాక్షి, భీమవరం : భీమవరం చుట్టుపక్కల సీసలి, పెద అమిరం, కొవ్వాడ అన్నవరం, డేగాపురంలో నాలుగు భారీ బరులను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో బరి దాదాపు రెండెకరాల్లో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. కోడిపందేల కోసం మధ్యలో పెద్ద దిమ్మ, చుట్టూ ప్రేక్షకులు కూర్చుని చూసేందుకు వీలుగా గ్యాలరీలు నిర్మిస్తున్నారు. పక్కనే భారీగా గుండాట, పేకాట ఇతర జూద కార్యకలాపాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని కలగంపూడి, వీరవాసరం, తణుకు, తాడేపల్లిగూడెం, కొణితివాడ, ఆచంట, కొత్తపాడు, కవిటం, వడలి, అయినపర్రు, గణపవరం, తదితర చోట్ల బరుల ఏర్పాట్లలో ఉన్నారు. చాలాచోట్ల టీడీపీ, జనసేన నాయకులు సిండికేటుగా, కొన్నిచోట్ల వేర్వేరుగా బరులను సిద్ధం చేయిస్తున్నట్టు తెలుస్తోంది.

భీమవరం ప్రాంతంలో రూ.80 లక్షల నుంచి రూ.కోటి..

కేవలం కోడిపందేల ద్వారా బరులు నడిపితే నిర్వాహకులకు అంతగా వచ్చేది ఏమీ లేక నష్టపోవాల్సివస్తుంది. పెద్ద బరిలో రోజుకు 15 నుంచి 20 వరకు మాత్రమే పందేలు జరుగుతాయి. ఒక పందెం నిర్వహించేందుకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తే మూడు రోజుల్లో వచ్చే మొత్తం రూ.5.5 లక్షలు నుంచి రూ.15 లక్షలు లోపే ఉంటుంది. బరి నిర్మాణం నిమిత్తం రూ. ఎనిమిది లక్షలు నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చయితే, నేతలు, పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ, ఫైర్ అధికారులకు మామూళ్లు, వారికి పంపే కోజాల (పందెం పుంజులు) ఖర్చు, బౌన్సర్లు, సిబ్బంది జీతాలు తదితర రూపాల్లో బరిని బట్టి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలు పైనే ఉంటుందని అంచనా. బరుల వద్ద గుండాట, పేకాట, ఇతర జూదాలు, అశ్లీల నృత్యాలు, మద్యం స్టాళ్లు, చికెన్ పకోడీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు పెట్టించడం ద్వారా ఈ ఖర్చును, తమ లాభాలను రాబడతారు. భీమవరం పరిసరాల్లోని బరులకు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు, మిగిలిన ప్రాంతాల్లో జనాల రద్దీని బట్టి రూ.15 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు బేరసారాలు సాగిస్తున్నట్టు సమాచారం. కొన్నిచోట్ల ఇప్పటికే జూద నిర్వాహకులు బరులను దక్కించుకుని అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

జేబులు గుల్లే

ప్రత్యేకంగా బరుల వద్ద జూదాల నిర్వహణలో ఆరితేరిన వారు ఎంతోమంది ఉన్నారు. పందేలు చూసేందుకు వచ్చిన వారిని ఆకర్షించి వారి జేబులు గుల్ల చేసి ఒట్టి చేతులతో పంపిస్తుంటారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా బరులను దక్కించుకునే పనిలో వీరంతా నిమగ్నమై ఉన్నారు. బరులను సిద్ధం చేయిస్తున్న వారితో బేరసారాలు సాగిస్తున్నారు.

పందేల ఊసెత్తని పోలీసులు

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ సంక్రాంతికి రెండు మూడు వారాల ముందు నుంచే గ్రామగ్రామాన విస్తృత ప్రచారం చేసేవారు. సిద్ధం చేస్తున్న బరులను ధ్వంసం చేసి పందేలు నిర్వహించరాదని బ్యానర్లు కట్టించేవారు. డిసెంబరు నెలలోనే కోడి కత్తుల తయారీదారులు, కట్టే వారు, పందేలు, గుండాట, పేకాట నిర్వాహకులను బైండోవర్ చేస్తుండేవారు. గత ఏడాది జిల్లాలో దాదాపు 700 మందికి పైగా బైండోవర్ చేసి 1500కు పైగా కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సారి మాత్రం జిల్లాలో ఎక్కడా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సంక్రాంతికి రెండు నెలల ముందు నుంచే వారంలో రెండు మూడు చోట్ల రాత్రి వేళల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కోడిపందేలు ఏర్పాటు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కోడిపందేల సంప్రదాయం మాటున జూద కార్యకలాపాలతో ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నా పోలీసు యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు అస్వస్థత

అనకాపల్లి జిల్లా వేములపూడిలో ఘటన

నర్సీపట్నం(అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం, వేములపూడి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో ఆహారం కలుషితం కావడంతోనే అస్వస్థతకు గురైనట్టు తెలుస్తోంది. మంగళవారం ఉదయం పులిహోర, రాత్రి అరటి కాయ కూరతో భోజనం చేశారు. గంట తరువాత నుంచి కొంతమంది విద్యార్థినులకు వాంతులు, విరోచనాలు మొదలయ్యాయి. మొత్తం 18 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఆరో తరగతి విద్యార్థిని పిండి తనోజ్, ఎనిమిదో తరగతి విద్యార్థినులు కె.హేమలత, ఎస్.నవ్యశ్రీ , హేమ అమృత హర్షిణి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని వి.కాక్షాయిని పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో సమీపంలోని వేములపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తనోజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు నర్సీపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. తిన్న ఆహారం అరగకపోవడం వల్ల అస్వస్థతకు గురయ్యారని డాక్టర్ తెలిపారు.

హిందూపురంలో నియంత పాలన సాగుతోందా?

విలేకరులతో మునిసిపల్ కాంట్రాక్టర్ ఆవేదన

హిందూపురం: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో నియంత పాలన సాగుతోందా? అని మునిసిపల్ కాంట్రాక్టర్ గోవర్ధన్‌బాబు ప్రశ్నించారు. ఆయన బుధవారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తనకు పనుల కాంట్రాక్టు దక్కిందని, వాటిని చేయడానికి అధికారుల అనుమతి కోరితే ముందు ఎమ్మెల్యే ఆఫీసుకు వెళ్లి కలవాలని అంటున్నారని చెప్పారు. అక్కడికెళితే ఎమ్మెల్యే పీఏ శ్రీనివాసులు 'నీవెవరు కాంట్రాక్ట్ చేయడానికి' అంటూ దౌర్జన్యం చేశాడన్నారు. అతని అనుచరులు తనను బయటకు గెంటేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లను నేరుగా బెదిరిస్తున్నారని, అస్మదీయులకే పనులన్నీ కట్టబెడుతున్నారని వాపోయారు. తాను రూ.5 లక్షల విలువైన మొక్కల సరఫరా, రూ.16 లక్షలతో 85 చెత్త బండ్ల సరఫరా టెండర్లను ఆన్‌లైన్ ద్వారా దక్కించుకున్నానన్నారు. వీటిలో ముందుకు వెళ్లడానికి అధికారులు సహకరించడం లేదని, ఎమ్మెల్యే పీఏలు దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు.

క్లుప్తంగా...

సీఆర్డీఏలో సంక్షేమ పథకాలకు నిధుల విడుదల

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్డీఏ పరిధిలో సంక్షేమ పథకాల అమలుకు 2024–25 సంవత్సరానికి నాలుగో విడతగా రూ.256.66 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే సీఆర్డీఏ పరిధిలో రూ.11,467.27 కోట్లతో 20 ఇంజినీరింగ్ పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది.

'కార్మిక చట్టాలు అమలయ్యేలా చూడాలి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కార్మిక చట్టాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలని అధికారులను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. విశాఖ, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ ఈఎస్‌ఐ ఆస్పత్రులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. బుధవారం సచివాలయంలో కార్మిక, బీమా వైద్య సేవల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం14.5 లక్షల బీమా లబ్ధిదారులను 25 లక్షలకు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో డయాగ్నోస్టిక్ సెంటర్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలన్నారు. చంద్రన్న బీమా మీద విధి విధానాలు త్వరితగతిన ఖరారు చేయాలని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీప్రసాద్, అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు, ఈఎస్‌ఐ డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కౌలు రైతుల కోసం త్వరలో చట్టం

వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి రాజశేఖర్

సాక్షి, అమరావతి: కౌలురైతుల కోసం త్వరలో సమగ్రమైన చట్టం తీసుకొస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ తెలిపారు. కౌలు రైతుల కోసం ఏపీ కౌలు రైతుల సంఘం ప్రత్యేకంగా రూపొందించిన డైరీని ఉన్నతాధికారులు ఎస్ ఢిల్లీ రావు, వీరపాండ్యన్, మనజీర్ జిలానీస మూన్‌తో కలిసి రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. రైతులకు కరదీపికలా ఉపయోగపడేలా డైరీని రూపొందించినట్లు ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు చెప్పారు. నాబార్డ్ డీజీఎం ఎంఎస్ ఆర్ చంద్రమూర్తి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఏపీ బాలికల బృందం

సాక్షి, అమరావతి: తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో ఈ నెల 10 నుంచి 14 వరకు జరిగే 68వ జాతీయ హ్యాండ్‌బాల్ అండర్–17 బాలికల పోటీలకు రాష్ట్రం నుంచి 16 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. క్రీడాకారిణుల బృందం బుధవారం సమగ్రశిక్షా రాష్ట్ర కార్యాలయంలో ఎస్పీడీ బి.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసింది. చక్కని ప్రతిభతో రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని క్రీడా బృందాన్ని శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

కృష్ణపట్నం పోర్టుకు ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు



ముత్తుకూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అదానీ కృష్ణపట్నం పోర్టుకు సేవా రంగంలో జాతీయ స్థాయి అవార్డు లభించింది. 18వ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు–24 దక్కింది. కోల్‌కతాలోని తాజ్‌బెంగాల్ హోటల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో పోర్టు డ్రై కార్గో ఆపరేషన్స్ హెడ్ విజయ్ రాథోడ్ బృందం ఈ అవార్డును స్వీకరించింది. పశ్చిమబెంగాల్ రాష్ట్ర మహిళా, స్త్రీశిశు అభివృద్ధి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ శశి పంజా, పర్యావరణ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి రోష్నిసేన్ మెమెంటో, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

విషపూరిత రసాయనాల వల్లే తాబేళ్లు మృత్యువాత

ఫిష్‌కాన్ డైరెక్టర్ అర్జిల్లు దాసు

సాక్షి, అమరావతి: సముద్రంలో వేట కోసం మత్స్యకారులు వినియోగిస్తోన్న ట్రాల్, గిల్ నెట్స్ వలనే తాబేళ్లు మృత్యువాతపడుతున్నాయని అటవీ శాఖాధికారులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఏపీ మత్స్యకార సముదాయాల సంఘాల నెట్‌వర్క్ (ఫిష్‌కాన్) డైరెక్టర్ అర్జిల్లి దాసు మండిపడ్డారు. ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున తాబేళ్లు మృత్యువాత పడుతుండడానికి ప్రధాన కారణం గడచిన 25 ఏళ్లగా తీరంలో ఫార్మా కంపెనీలు, పవర్ ప్లాంట్స్, ఇతర పరిశ్రమలు విడుదల చేసే విషపూరిత రసాయనాలేనని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించారు. తీరప్రాంత క్రమబద్ధీకరణ మండలి చట్టం (సీఆర్ జెడ్ 2011) అమలుకు తూట్లు పొడుస్తున్నారని, ఇప్పటికే తీరంలో 60 శాతం మత్స్యసంపద కనుమరుగైపోయిందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని, అవసరమైతే అటవీ, మత్స్య, పర్యావరణ శాఖాధికారులతో నిజనిర్ధారణ కమిటీ వేసి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకూ ఎంటీఎస్ అమలుచేయాలి

సాక్షి, అమరావతి: జీవో–2 ప్రకారం సమగ్రశిక్షలో పనిచేస్తున్న 25 వేల మంది ఉద్యోగులకూ మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని సమగ్రశిక్ష యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు సైకం శివకుమారిరెడ్డి ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న నారా లోకేశ్ సమగ్రశిక్ష ఉద్యోగులందరికీ తమ ప్రభుత్వం రాగానే టైం స్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

సంక్రాంతికైనా డీఏ ఇవ్వండి: ఆర్జేయూపీ

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా ఇంతవరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని, సంక్రాంతి పండుగకైనా డీఏ ప్రకటించాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ కోరారు. 2023 జూలై నుంచి పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బదిలీల్లో పెర్ఫార్మెన్స్ పాయింట్లు వద్దు

సాక్షి, అమరావతి: బదిలీల చట్టంలో ఉపాధ్యాయులకు పెర్ఫార్మెన్స్ పాయింట్లు అమలు చేయవద్దని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనివల్ల సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, పైరవీలకు ఆస్కారం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం సర్వీసు, పాఠశాల పాయింట్లు, ప్రిఫరెన్షియల్ పాయింట్లతో బదిలీల చట్టం తీసుకురావాలని కోరారు.

పేపర్‌లెస్ ఈ–ఆఫీస్ అమలు చేయాలి

- దీనిపై నివేదికలు పంపండి
- మెమో జారీ చేసిన సాధారణ పరిపాలన శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయం నుంచి శాఖాధిపతులు, జిల్లా కార్యాలయాలు, మండల, గ్రామ కార్యాలయాలన్నింటిలో నూటికి నూరు శాతం పేపర్‌లెస్ ఈ–ఆఫీస్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. కొన్ని శాఖలు ఈ–ఆఫీస్ ద్వారా కాకుండా ఫైళ్ల భౌతికంగా పంపుతున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చిందని, ఆలా పంపడం ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధమని, అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. భౌతికంగా పంపడంతో అనవసరమైన రాద్ధాంతం జరుగుతోందని పేర్కొంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం మెమో జారీ చేశారు.ఈ–ఆఫీస్ అమలుకు సంబంధించి నివేదికలు పంపాలని కోరినప్పటికీ ఇంకా కొన్ని కార్యాలయాల నుంచి నివేదికలు రాలేదని, పంపని వారు వెంటనే నివేదికలను పంపాలని ఆదేశించారు. ఈ–ఆఫీస్ అమలు తీరును పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించామని తెలిపారు. నివేదికలు పంపకపోతే ఈ–ఆఫీస్ అమలు పురోగతి అంచనా వేయడం సాధ్యం కావడం లేదని, వెంటనే ఈ–ఆఫీస్‌ను నూటికి నూరు శాతం అమలు చేస్తూ నివేదికలు పంపాలని అన్ని శాఖలను, ప్రభుత్వ కార్యాలయాలను ఆదేశించారు.

తల్లిదండ్రులపై కన్న కొడుకు దాడి

- తండ్రి మృతి, తల్లికి తీవ్రగాయాలు
- నెల్లూరు జిల్లా దామరమడుగులో ఘటన

బుచ్చిరెడ్డిపాళెం: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దామరమడుగు గ్రామంలో మానసిక స్థితి సరిగాలేని ఓ యువకుడు చేసిన దాడిలో అతని తండ్రి మృతిచెందగా తల్లి తీవ్రంగా గాయపడింది. వివరాలలోకి వెళితే.. గ్రామంలోని మతం కాలనీ (ఆర్ఆర్‌నగర్)కి చెందిన అంతటి శ్రీనివాసులు, సుబ్బమ్మ దంపతులు, వారి కుమారుడు ఏడుకొండలు నివాసం ఉంటున్నారు. గత కొన్నేళ్లుగా ఏడుకొండలు మానసిక స్థితి సరిగాలేక తల్లిదండ్రులపై తరుచూ దాడులు చేస్తుండేవాడు. నెల్లూరులోని ఓ మానసిక చికిత్సా కేంద్రంలో వైద్యం కూడా చేయించారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం కూలి పనికి వెళ్లి ఇంటికి వచ్చి పడుకున్న తల్లిదండ్రులపై ఏడుకొండలు పెద్ద కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో తండ్రి శ్రీనివాసులు (57) అక్కడికక్కడే మృతిచెందగా తల్లి సుబ్బమ్మ తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. దాడి అనంతరం నిందితుడు పరారయ్యాడు. విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ జి.శ్రీనివాసరావు, సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.



స్థానికులను విచారిస్తున్న డీఎస్పీ జి.శ్రీనివాసరావు

వ్యవసాయ శాస్త్రవేత్తలు లోతైన పరిశోధనలు చేయాలి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సునిశిత పరిశీలనతో క్షుణ్ణంగా తెలుసుకుంటూ శాస్త్రవేత్తలు లోతైన పరిశోధనలు చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు సూచించారు. ఆచార్యఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రెండ్రోజుల పాటు జరుగనున్న 54వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలను బుధవారం ఆయన ప్రారంభించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో.. తొలుత పత్తి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, వరిలో ఎలుకల నివారణ ఎర్ర తెర పద్ధతి, సుస్థిర భవిష్యత్ కోసం ప్రకృతి వ్యవసాయం పేరిట ప్రచురించిన పుస్తకాలను విడుదల చేశారు. పాడేరు ఏరువాక కేంద్రం అభివృద్ధి చేసిన ఏఎస్ఆర్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ప్రాంతీయ పరిశోధనలతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశోధనా ఫలితాలను పేరొందిన పరిశోధనా పత్రికల్లో ప్రచురించాలని సూచించారు. పరిశోధనా ఫలాలను రైతులకు వేగంగా చేరువయ్యేలా కృషి చేయాలని, గ్రామ స్థాయిలో విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 2023–24 సంవత్సరానికి ఉత్తమ ప్రాంతీయ పరిశోధనా స్థానంగా రాగోలు ఏఆర్ఎస్, ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా కొండెంపూడి కేవీకే, ఉత్తమ ఏరువాక కేంద్రంగా ఏలూరు ఏరువాక కేంద్రాలకు అవార్డులు ప్రదానం చేశారు. అలాగే అత్యుత్తమ శాస్త్రవేత్తలుగా మాజీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఏఎస్ రావు, మాజీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్ఎల్ వాసంతి, మాజీ విస్తరణ సంచాలకులు డాక్టర్ రాంబాబు, ఆయిల్ పామ్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎంవీ ప్రసాద్‌కు అవార్డులు ప్రదానం చేశారు. వర్సిటీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివనారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సదరన్ సైన్స్ ఫెయిర్‌కు 25 ప్రాజెక్టులు

సాక్షి, అమరావతి: విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలతో సరికొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఈనెల 20 నుంచి పాండిచ్చేరిలో జరిగే దక్షిణ భారతదేశ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన 25 ఎగ్జిబిట్లకు ఎస్పీడీ బహుమతులు అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ప్రతి తరగతి గది ఓ ల్యాబ్‌లా మారాలని, ఉపాధ్యాయులు విద్యార్థులను సైన్స్ పరిశోధనల వైపు ప్రోత్సహించాలన్నారు. అప్పుడే సరికొత్త ఆవిష్కరణలు చేసేందుకు వీలవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

మహా పర్వం






జాతీయ ఆధ్యాత్మిక ఉత్సవం
కుంభమేళా

మహా కుంభమేళా భారతీయ ఆధ్యాత్మిక పరంపరకు ఒక నిలువుటద్దం. భారతదేశపు అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవం. సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక ప్రాముఖ్యత కలిగిన మహాసమారోహం. గంగా నదీ తీరంలో కూడే ప్రపంచంలోనే అతిపెద్ద మానవ సమూహం. మహా కుంభ మేళాకు సుమారు 40 కోట్ల మంది సందర్శకులు హాజరవుతారని అంచనా. పురాణాల ప్రకారం, దేవతలు అసురులు అమృతాన్ని పొందేందుకు కలసి సముద్ర మథనాన్ని నిర్వహించారు. అమృతపు కుంభం (పాత్ర)నుంచి నాలుగు బిందువులు హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్, ప్రయాగ్ రాజ్‌లలో పడ్డాయి. అవి పడ్డ ఈ నాలుగు ప్రదేశాలూ కుంభమేళా జరిగే పవిత్ర క్షేత్రాలుగా స్థిరపడ్డాయి. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి మహామేళా జరుగుతుంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ (మునుపటి అలహాబాద్) లో జనవరి 13న ప్రారంభమై ఫిబ్రవరి 26తో ముగుస్తుంది.

కుంభమేళాలో పాల్గొనడం పాపవిమోచనకు దోహదపడుతుందని, మోక్షాన్ని ప్రసాదిస్తుందని విశ్వాసం. భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సాధువులు, నాగసాధువులు, ఆధ్యాత్మిక గురువులు ఈ మహాసమారోహంలో పాల్గొంటారు. ఈ సాధువులు తమ ఆధ్యాత్మిక సాధనను ప్రదర్శించడం, భక్తులకు ఉపదేశాలు ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణ. పండితులు, ఆధ్యాత్మిక గురువులు వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలపై ఆసక్తికరమైన చర్చలు నిర్వహిస్తారు. ఈ చర్చలు భక్తులకు జ్ఞానం ప్రసాదిస్తాయి. ఈ ఉత్సవంలో సంగీతం, నృత్యం, నాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.



పర్యావరణ పరిరక్షణ...

ఈసారి కుంభమేళాలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం, నదీ జలాల శుభ్రతను మెరుగుపరచడం వంటి చర్యలు చేపడుతున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసే ఈ ఉత్సవంలో పాల్గొనడం అందరూ సుకృతంగా భావిస్తారు.

12 సంవత్సరాలకు ఒకసారి జరిగే పవిత్ర స్నానాల సమయాన్ని 'కుంభమేళా' అని. ఆరు సంవత్సరాలకు ఒకసారి జరిగే దాన్ని 'అర్ధ కుంభమేళా' అని. ప్రతి సంవత్సరం మాఘమాసంలో జరిగే పవిత్ర స్నానాలను 'మాఘీమేళా' అనే పేరుతో పిలుస్తారు. ఖగోళంలో జరిగే మార్పులను అనుసరించి పంచాంగం ప్రకారం లెక్కించిన విధంగా ఒక్కొక్క స్థలంలో ఒక్కొక్క సమయంలో కుంభమేళా జరుగుతుంది. 2025 మేళా ముఖ్యమైన తేదీలు జనవరి 13 పూర్ణిమ సందర్భంగా, మొదటి రాజస్నానం జరుగుతుంది. జనవరి 14 మకర సంక్రాంతి, 29 మౌని అమావాస్య, ఫిబ్రవరి 03 వసంత పంచమి, ఫిబ్రవరి 12మాఘ పూర్ణిమ, ఫిబ్రవరి 26 మహాశివరాత్రి, ముఖ్యంగా గంగా, యమునా, సరస్వతి నదుల సంగమంలో స్నానం చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తారు.





'కుంభమేళా భారతదేశపు ఆధ్యాత్మికత, ఐక్యత, విశ్వ భావనల ప్రతీక. భారతీయ ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటి చెప్పే ఈ'మహాకుంభమేళా' సంక్రాంతి నుంచి శివరాత్రి వరకు అంటే జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు పవిత్ర గంగ, యమున, సరస్వతీ నదుల త్రివేణి సంగమ ప్రయాగ్‌రాజ్, ఉత్తరప్రదేశ్‌లో జరగనుంది.

చరిత్ర...

మరో పౌరాణిక గాథ ప్రకారం విష్ణుమూర్తి వాహనమైన గరుత్మంతుడు పినతల్లి కద్రువ బానిసత్వం నుంచి విముక్తి కోసం కద్రువ కుమారులైన నాగుల కోరిక మేరకు దేవలోకం వెళ్లి ఇంద్రలోక రక్షకులందరినీ ఓడించి అమృత కలశాన్ని తీసుకొని వస్తుండగా ఇంద్రుడు వచ్చి కారణం తెలుసుకుని విషాన్ని చిమ్మే పాములకు మృత్యువే లేకుండా అమృతం ఇవ్వడం భావ్యం కాదని హితవు పలికి గరుత్మంతుని శక్తిని మెచ్చుకుంటూనే 'నీవు అమృతభాండాన్ని నాగులకప్పగించి, వారి ఎదురుగా దర్భలపై ఉంచితే నీవు, నీ తల్లి విముక్తులు కాగలరు. అప్పుడు నేను వెంటనే ఆ అమృతాన్ని దేవలోకం తీసుకొని వెళ్తాను' అని చెప్పి అలాగే చేశాడు. ఈ క్రమంలోనే ఆ కలశం నుంచి భూలోకం లో నాలుగు నదులలో నాలుగుచోట్ల కొన్ని అమృతం చుక్కలు పడినట్లు చరిత్ర, ఆ అమృతపు బిందువులు పడిన ప్రదేశాలను పుణ్యస్థలాలుగా... పుణ్య తీర్థాలుగా భావించి ప్రజలు పుణ్యస్నానాలు చేసే పరంపర ప్రారంభమైంది.

ధర్మరక్షణ కోసం...

కుంభమేళాలో సాంప్రదాయిక ఊరేగింపు జరిగేటప్పుడు నాగ సాధువులు, మండలేశ్వరులు, మహామండలేశ్వరులు, అఖాడాలు కత్తులు, త్రిశూలాలు, గదలు ధరించి సనాతన ధర్మాన్ని రక్షించడానికి మేము ముందుంటామని నడుస్తుండ గా వెనుక శిష్యులు, సామాన్య భక్తులు లక్షలాదిగా పాల్గొంటారు. అనంతరం పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కుంభమేళాకు హాజరయ్యేందుకు సంక్రాంతి నుండి శివరాత్రి వరకు కోట్లమంది భక్తులు వస్తారు. వీరంతా ధర్మరక్షణకు మేమూ నిలబడతామనీ,'ధర్మరక్షణ అంటే వ్యక్తిగతంగా ధర్మాన్ని పాటించడమే అని భావించి సంకల్పం తీసుకొని పుణ్య స్నానాలాచరించి తిరిగి వస్తుంటారు'.



పూజ్యులు పీఠాధిపతులు మఠాధిపతులు భక్తులకు మంత్రోపదేశము చేస్తుంటారు, ప్రవచనాలు చేస్తుంటారు, కుంభమేళాలో వేలాది మంది సాధ్వీమణులు (మహిళా సన్యాసులు) కూడా ఆశ్రమాలు ఏర్పాటు చేసుకొని ప్రబోధాలు చేస్తుంటారు.

వారు చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు అందరికీ పరిచయం చేయడం జరుగుతుంటుంది.

అలనాడు జగద్గురు ఆది శంకరాచార్యుల వారు ప్రయాగరాజ్‌ను సందర్శించి కుంభమేళాలో పాల్గొనగా, 1514 లో బెంగాల్‌కు చెందిన చైతన్య మహాప్రభు. తులసీ రామాయణాన్ని రచించిన సంత్ తులసీదాస్ కూడా కుంభమేళాలో పాల్గొని పుణ్యస్నానం ఆచరించినట్లుగా చరిత్ర.

ప్రస్తుతం విష్ణు పాదోద్భవి గంగ ఆకాశమార్గం గుండా వచ్చి హిమాలయాల పైన చేరి అక్కడినుంచి శివుడి జటాజూటంలో పడి హరిద్వార్ వద్ద దివి నుండి భువికి దిగి వచ్చి భూలోకంలో ప్రవహిస్తూ ప్రయాగ రాజ్ వద్ద గంగా యమునా అంతర్వాహిని సర్వసతీ నదిని కలుపుకొని త్రివేణీ సంగమంగా విరాజిల్లుతున్న స్థలంలో కుంభమేళా జరుగబోతున్నది. మొట్టమొదటిసారిగా ఈ క్షేత్రంలోనే యాజ్ఞవల్క్య మహర్షి ఇక్కడ యజ్ఞం చేశారని పురాణాలు తెలియజేస్తున్నాయి.

కుంభమేళా జరిగే పవిత్ర స్థలాలు

1. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ వద్ద గంగానదిలో,
2. మధ్యప్రదేశ్ ఉజ్జయిని వద్ద క్షిప్రానదిలో,
3. మహారాష్ట్రలోని నాసిక్ వద్ద గోదావరి నదిలో
4. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో గంగా, యమున, అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి నది సంగమం వద్ద.

వెల్లివిరిసే సమరసత...

పుణ్యస్నానాలు ఆచరించడం కోసం దేశం నలుమూలల నుంచేగాక ప్రపంచంలోని అనేక దేశాల నుంచి కోట్లమంది ప్రజలు కలిసి వచ్చి ప్రాంతీయ, భాషా, కుల భేదాలు మరచి తరతమ భేదాలు లేకుండా కుంభమేళా సందర్భంగా కలసి స్నానాలు చేస్తారు. ఇంతటి సమాన భావనతోనే.. వచ్చిన భక్తులందరికీ ఆవాసాలు, పానీయాలు, అల్పాహారాలు, భోజనాలు అందించడం, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.



పుణ్యస్నానాలు మాత్రమే కాదు..

కుంభమేళా అంటే కేవలం కుటుంబమంతా వెళ్లి పుణ్యస్నానాలు చేయడం మాత్రమే కాదు, పండితులు నిర్ణయించిన క్షణం నుండి అనేకానేక వేడుకలు. కుంభమేళా ఖగోళ శాస్త్రం, జ్యోతిష శాస్త్రం, ఆర్థిక శాస్త్రం సామాజిక శాస్త్రం, ఆధ్యాత్మికత, సంప్రదాయాలు, సాంస్కృతిక ఆచారాలు, విజ్ఞాన శాస్త్రాలన్నీ పండితుల చేత, ఋషుల చేత మునుల చేత సన్యాసుల చేత నెలల తరబడి ఆ ప్రాంతంలోనే ఉండి కఠినసాధన చేస్తూ గడచిన 12 సంవత్సరాలలో వారు కనుగొన్న ఎన్నో విషయాలను దేశం నలుమూలల నుంచి ప్రజలకు ప్రబోధించే సన్నివేశం అది. పాటించవలసిన మంచిని బోధించి సమాజానికి మార్గదర్శనం చేసి చూపించే ఈ కుంభమేళాను అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవడం అవసరం.

– డి.వి.ఆర్.

మంచి మాటలు

- భయం ఓటమికి చిరునామా పట్టుదల విజయానికి చిరునామా
- మన లక్ష్యం ఉన్నతమైనది అయినప్పుడు మనసులో భయం వీడి పట్టుదలతో ముందుకు సాగితే విజయం మనదే అవుతుంది.
- రేపటి వెలుతురు చూడాలంటే నేటి చీకటిని భరించాలి. రేపటి ఆనందాన్ని పొందాలంటే నేటి బాధను భరించాలి.
- మంచిపని చేసేటప్పుడు మనం కనబడాల్సిన అవసరంలేదు. కాబట్టి ప్రతిఫలం ఆశించకుండా నువ్వు చెయ్యాలి అని అనుకున్నది నువ్వు చెయ్యి. అప్పుడు ఆ దేవుడే నీకు అన్నీ అందేలా చూస్తాడు.
- జీవస్థితి నుండి దైవీస్థితికి చేరడానికి వంతెనలాంటిది ఈ ప్రపంచం. ఈ ప్రపంచంలో శాశ్వతంగా ఉండాలనుకోవడం వంతెనపై ఇల్లు కట్టుకోవాలనుకోవడం లాంటిది.
- ఏ విషయాన్ని అయినా మొదట 'అవగాహన' చేసుకుని, తర్వాత 'ఆచరణ'లో తీసుకొచ్చిన తరువాతనే ఇతరులకు చెప్పాలి.

● ఇస్లాం వెలుగు

దైవస్మరణకు లభించే పారితోషికం

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: దైవ ప్రవక్త (సఅసం) ప్రవచించారు: నా దాసుడు నా గురించి ఎలా తలపోస్తాడో నేనూ అతడి పట్ల అలాగే మెలుగుతాను. అతడు నన్ను స్మరించినప్పుడు నేనూ అతని వెంటనే ఉంటాను. అతడు తన మనసులోనే నన్ను స్మరిస్తే నేను నా మనసులోనే అతన్ని తలచుకుంటాను. ఉత్తములైన వారి బృందంలో నన్ను అతడు నా గురించి చెప్పుకుంటే నేను అంతకంటే ఉత్తములైన వారి బృందంలో అతడి గురించి పొగుడుతాను. అతడు ఒక జానెడు దూరం నాకు చేరు వయితే నేను అతనికి ఓ మూరెడు దూరం చేరు వవుతాను. అదే అతడు నా వైపునకు ఓ మూరెడు దూరం జరిగితే నేను అతని వైపునకు ఓ బాఅ (అంటే సుమారు 6:30 అడుగుల దూరం) వరకు అతనికి దాపుగా వస్తాను. అతడు నా వైపునకు నడిచి వస్తే నేను అతని వైపునకు పరిగెడుతూ వస్తాను.

వివరణ: నేను నా దాసుణ్ణి ఎలాంటి ఆధారం లేకుండా వదిలిపెట్టను. అతణ్ణి ఆదుకుంటూనే ఉంటాను. ఎల్లప్పుడూ నా కారుణ్య కటాక్షాలు అతణ్ణి అంటిపెట్టుకొని ఉంటాయి అని అర్థం. ఏకాంతంలో హృదయపూర్వకంగా ప్రేమతో నన్ను తలుచుకున్న వారికి నేను ఇచ్చే పారితోషికం ఏమిటో ఎవరూ ఊహించలేరు



అతడు గనుక ఉత్తమమైన సత్పురుషుల సమూహంలో నా గురించి చర్చిస్తే అతడి గురించి నేను అంతకంటే ఉత్తములైన సచ్ఛీలురయిన పరిష్తాల (అంటే దైవదూతల) సమూహంలో అతన్ని పొగిడినవానిగా చేసుకుంటాను.

నా దాసుడు నా దాపుకు రావడంలో, నా ఆదేశ పాలనలో ఎంత కృషి చేస్తాడో, అంతకంటే అధికంగా అతనిపై నా కారుణ్య కటాక్షాలు వర్షిస్తాయి. అల్లాహ్ ను స్మరించడం అంటే దేవుని కోసం భక్తుడు తన సార్వభౌమత్వాన్ని వదిలేసుకొని ఎల్లప్పుడూ ఆయన ఆదేశాన్ని పాలించడం. నోరు ఆయన గురించే స్తుతించడం. హృదయం ఆయన గురించే ప్రేమాతిశయంతో పెల్లుబుకటం. ఎల్లప్పుడూ దైవాన్ని స్మరించేవారు ఆయన కారుణ్య కటాక్షాలకు దూరం కాజాలరు.

అయితే ఆయనకు దగ్గరగా ఉండడానికి, ఆయన అనురాగాన్ని పొందడానికి, భక్తుడు ఎంతగా కృషి చేస్తున్నాడు, ఆయన చూపిన రుజుమార్గం ఆయన ధర్మ వ్యాప్తి కోసం ఎంతవరకు ప్రయత్నిస్తున్నాడు అన్నదే ఇక్కడ కావాల్సింది. నా భక్తుడు నా గురించి ఎలా తలపోస్తాడో నేను కూడా అతని గురించి అలాగే తలపోస్తాను అంటే, నా గురించి సదుద్దేశంతో ఉంటేనే నేను అతనిపై నా కారుణ్యం కురిపిస్తాను. అలా కాకుండా అతడు నా గురించి ఆశలు వదులుకుంటే నేను కూడా అతనిని మర్చిపోతాను అని అర్థం.

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

ముక్కోటి పుణ్యాలు



శేషతల్పం మీద శయనించే విష్ణుమూర్తిని దర్శించుకోడానికి వైకుంఠానికి తరలివెళ్లే ముక్కోటి దేవతలతో కలిసి స్వామి భూలోకానికి వచ్చే శుభ సందర్భం వైకుంఠ ఏకాదశి. పరమ పవిత్రమైన ఈ రోజున ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకుంటే జన్మ జన్మల పాపాలు తొలగిపోయి పుణ్య లోకాలు ప్రాప్తిస్తాయని ప్రతీతి. ముక్కోటి ఏకాదశి రోజు విష్ణుదర్శనం తర్వాత పూజచేసి ఉపవాసం ఉంటే అఖండ ఐశ్వర్యం సిద్ధిస్తుందంటారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆ పర్వదినం గురించి..

ఈ రోజు శ్రీ మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సరిసమానమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా చెబుతారు. ముక్కోటి ఏకాదశి నాడే పాలకడలి నుంచి అమృతం పుట్టిందంటారు. మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉపదేశించాడని కూడా భక్తుల విశ్వాసం. ముక్కోటి నాడు విష్ణుమూర్తిని నియమ నిష్ఠలతో పూజ చేసివారికి పుణ్యఫలముతో పాటు కార్యసిద్ధి కలుగుతుందని, వైకుంఠ ఏకాదశి రోజున నిష్ఠనియమాలతో వ్రతమాచరించే వారికి మరో జన్మంటూ ఉండదని పురాణాలు చెబుతున్నాయి.

ముక్కోటి ఏకాదశి నాడు చేసే విష్ణుపూజ, గీతా పారాయణం, గోవింద నామ స్మరణం, పురాణ శ్రవణం మోక్ష ప్రాప్తి కలిగిస్తాయి. ఇవన్నీ చేయకపోయినా.. ఓం నమోనారాయణాయ అనే అష్టాక్షరీ మంత్రాన్ని 108 సార్లు జపించడం ద్వారా మీరనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవుతాయి. ఇంకా ఏకాదశి రోజు విష్ణు, వేంకటేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకోవచ్చు. ఈ రోజున వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలు ఉంటాయి. ఈ రోజున ముఖ్యమైనవి ఉపవాసం, జాగరణ. ఆటు తర్వాత జపం, ధ్యానం.

వైకుంఠ ఏకాదశి రోజున దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు, ఆస్తికులు సముద్రాల్లోనూ, పుణ్యనదుల్లోనూ పవిత్ర స్నానం ఆచరించడమే కాకుండా, ఉపవాసాలు చేసి, జాగరణ ఉంటూ, నియమ నిష్ఠలతో పూజాదికాలు చేసి, తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటారు. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 356 వైష్ణవ దేవాలయాల్లో దాదాపు ఒకే సమయంలో, ఒకే విధమైన పూజాదికాలు అత్యంత వైభవంగా జరగడం విశేషం.

తిరుమలలో వైకుంఠ ఏకాదశి

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో కూడా ఇదే మాదిరిగా వైకుంఠద్వారా ప్రవేశం, తదనంతరం దైవదర్శనం అనుమతిస్తారు. ఈ ఏకాదశికి ముందురోజు అనగా దశమినాటి రాత్రి ఏకాంత సేవానంతరం బంగారు వాకిలి మూసివేస్తారు. పిదప తెల్లవారు జామున వైకుంఠ ఏకాదశినాడు సుప్రభాతం మొదలుకొని మరునాడు అనగా ద్వాదశినాటి రాత్రి ఏకాంత సేవ వరకూ శ్రీవారి గర్భాలయానికి ఆనుకొని ఉన్న వైకుంఠద్వారాన్ని తెరచి ఉంచుతారు. ఈ రెండు రోజులూ భక్తులు శ్రీవారి దర్శనం తర్వాత ముక్కోటి ప్రదక్షిణ మార్గంలో వెళ్తారు.



శ్రీరంగంలో...

శ్రీరంగం లోని శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు 21 రోజులు జరుగుతాయి. దీనిలో మొదటి భాగాన్ని పాగల్ పట్టు (ఉదయం పూజ) అని రెండవ భాగాన్ని ఇరపట్టు (రాత్రి పూజ) అని పిలుస్తారు. విష్ణువు అవతారమైన రంగనాథస్వామిని ఆ రోజు వజ్రాలతో చేసిన వస్త్రాల్ని అలంకరించి వెయ్యి స్తంభాల ప్రాంగణంలోనికి వైకుంఠ ద్వారం గుండా తీసుకొని వచ్చి అక్కడ భక్తులకు దర్శనమిస్తారు. ఈ ద్వారం గుండా వెళ్ళిన భక్తులు వైకుంఠం చేరుకుంటారని భక్తుల నమ్మకం.

సువార్త

ఆత్మ... దేవుడు పెట్టిన దీపం

మనుష్యులు ఈ లోకంలో ఎలా జీవించాలి అనే విషయంలో ఏసుప్రభువు వారు కొండమీద ప్రసంగంలో ఈ విధంగా చెప్పారు. గాంధీజీ తన ఆత్మకథలో 'సెర్మన్ ఆన్ ది మౌంట్' పేరుతో ప్రసిద్ధి చెందిన జీసస్ 'పర్వత ప్రసంగం' తనను తీవ్రంగా ప్రభావితం చేసిందని రాసుకున్నాడు. ఒకసారి ప్రభువు ఆ జనసమూహాలను చూసి కొండ యెక్కి కూర్చుని ఈ విధంగా బోధించాడు.

'ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు, పరలోక రాజ్యం వారిది. వాస్తవంగా మనం ఇంతలో కనపడి అంతలోనే మాయమైపోవు మనుష్యులం. ఆత్మ దేవుడు పెట్టిన దీపం. ఈ దేహం మంటి నుండి తీయబడింది. మంటిలోనే కలిసిపోతుంది. దేవుడిచ్చిన ఆత్మ దేవుని వద్దకు చేరుతుంది. కనుక మనుష్యులు ఆత్మ విషయమై దీనులైన వారికి దైవరాజ్యం/పరలోక రాజ్యం దక్కుతుంది. దుఃఖపడువారు ధన్యులు; వారు భూలోకంలో ఓదార్చబడుదురు. సాత్వికులు వారు భూలోకాన్ని స్వతంత్రించుకుంటారు. నీతి కోసం ఆకలి దప్పులు గలవారు ధన్యులు; వారు కనికరం పొందుతారు. హృదయశుద్ధిగల వారు ధన్యులు; వారు దేవుని చూస్తారు. సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులుగా పిలవబడతారు. నీతి నిమిత్తం హింసించబడువారు ధన్యులు; పరలోక రాజ్యం వారిది. నా నిమిత్తం జనులు మిమ్ము నిందించి, హింసించి మీమీద అబద్ధంగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించండి. పరలోకంలో మీ ఫలము అధికమవుతుంది. ఇలా వారు మీకు పూర్వమందున్న ప్రవక్తను హింసించారు.

మీరు లోకానికి వెలుగై వున్నారు. కొండ మీద వుండు పట్టణం మరుగై వుండనేరదు. మనుషులు దీపం వెలిగిస్తారు. దీపస్తంభం పైనే ఉంచుతారు. కానీ గంపకింద ఉంచరు కదా! ప్రజలు మీ సత్కార్యాలను చూసి పరలోకంలో ఉన్న మీ తండ్రిని సన్నుతించడానికి మీ వెలుగును వారి ఎదుట ప్రకాశింపనివ్వండి అంటూ ఆ ప్రసంగంలో 'వ్యభిచారం చెయ్యవద్దు, ఒక స్త్రీని మోహపు చూపుతో చూసే ప్రతివాడు అప్పుడే తన హృదయంలో ఆమెతో వ్యభిచారం చేసినవాడు అవుతాడు' అంటాడు. 6,7 మత్తయి సువార్త అధ్యాయాలలో మనుష్యులు లోకంలో ఎలా జీవించాలో ప్రభువు బోధించాడు.



సంఘంలో ఐక్యత కలిగి వుండాలంటే భేదాలు వుండకూడదు. ఐక్యత ఎలా కలిగి వుండాలంటే యేసుప్రభువు వైపు చూసినప్పుడే ఐక్యత కలిగి వుంటున్నాం. మన దేవుని వైపు చూసినప్పుడు దేవుడు మనల్ని ఆశీర్వదిస్తాడు. ధైర్యం ఎవరి వలన ఎందువలన అంటే దేవుని వైపు చూడటం వల్లనే వారికి ధైర్యం వచ్చింది. ఐక్యతతో మనం వుంటే దేవుడు తప్పక ఆశీర్వదిస్తాడు. ఐక్యతతో చేసే పనివలన బలం, ఆరోగ్యం అనుగ్రహింపబడతాయి. కావున ఎల్లప్పుడూ మనం దేవుని వైపు చూసేవారమై వుందుముగాక. జకర్యాకు చూపిన దర్శనం మెస్సయ్యకు సాదృశ్యం. (జకర్యా 4 :1 –4)

– కోట బిపిన్ చంద్రపాల్

సాక్షి ప్లస్
గురువారం । 9-1-2025

బిజినెస్ రీల్

17 నుంచి ఆటో ఎక్స్‌పో

న్యూఢిల్లీ: భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో జనవరి 17 నుంచి ప్రారంభం కానుంది. న్యూఢిల్లీలోని భారత్ మండపం, ద్వారక వద్ద ఉన్న యశోభూమి (ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్), గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్ వేదికలుగా ఈ ఆటో ఎక్స్‌పో 22 వరకు జరగనుంది. ఆటో షో, బ్యాటరీ షో, టైర్ షో, ఎలక్ట్రానిక్స్ షో, కంపోనెంట్స్ షో, డ్రోన్ షో సైతం నిర్వహిస్తున్నారు. అన్ని వాహన విభాగాల్లో కలిపి 40కిపైగా నూతన మోడళ్లు తొలిసారిగా కొలువుదీరనున్నాయి. దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నాయి. రెండు లక్షలకుపైగా చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రదర్శన ముస్తాబవుతోంది.

రూ. 600 కోట్లతో కాయిన్‌స్విచ్ కేర్స్

న్యూఢిల్లీ: వజీర్‌ఎక్స్‌పై సైబర్‌దాడిలో నష్టపోయిన యూజర్లకు తోడ్పాటు అందించేందుకు క్రిప్టో ప్లాట్‌ఫాం కాయిన్‌స్విచ్ తాజాగా రూ. 600 కోట్లతో 'కాయిన్‌స్విచ్ కేర్స్' పేరిట రికవరీ ప్రోగ్రాంను ప్రకటించింది. ప్రభావిత యూజర్లు తమ నష్టాలను రికవర్ చేసుకునేందుకు, రివార్డులను పొందేందుకు, తిరిగి మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఇది ఉపయోగపడగలదని వివరించింది. రికవరీ అంచనాలను తెలుసుకునేందుకు, ఫండ్స్‌ను డిపాజిట్ చేసేందుకు, రివార్డులను పొందేందుకు కాయిన్‌స్విచ్ కేర్స్ పోర్టల్‌ను సందర్శించాలని పేర్కొంది. ఈ ప్రోగ్రాం 24 నెలల పాటు అమల్లో ఉంటుందని తెలిపింది.

ఓలా ఎలక్ట్రిక్‌కి సెబీ వార్నింగ్



న్యూఢిల్లీ: కీలక వ్యాపార వివరాలను ఎక్స్ఛేంజీలకు తెలియజేయడానికి ముందే సోషల్ మీడియాలో వెల్లడించడంపై ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వార్నింగ్ ఇచ్చింది. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని, దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించింది. అలాగే తగు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు ఓలాకు సెబీ లేఖ పంపింది. స్టోర్ల విస్తరణ ప్రణాళికలపై స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఓలా డిసెంబర్ 2న మధ్యాహ్నం సుమారు ఒంటిగంటన్నరకు సమాచారం ఇవ్వగా, కంపెనీ సీఈవో భవీష్ అగర్వాల్ ఆ వివరాలను ఉదయం సుమారు పది గంటల ప్రాంతంలో సోషల్ మీడియా సైట్ ఎక్స్‌లో వెల్లడించడం ఈ పరిణామానికి దారి తీసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-1-2025

విశాఖ	515-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.45

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	271.5	3.04
ITC	449.65	1.94
ASIANPAINT	2,336.50	1.91
DRREDDY	1,375.00	1.74
TCS	4,095.05	1.66

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
APOLLOHOSP	7,135.05	-4.06
TRENT	6,684.95	-2.75
ULTRACEMCO	11,370.00	-2.14
SHRIRAMFIN	2,899.95	-1.98
BAJAJ-AUTO	8,644.00	-1.89

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,459
ఎన్ఎస్ఈ	95,369
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,81,818
ఎఫ్ఐఐ	- 3,362
డీఐఐ	+ 2,716

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	73.29	$	74.25
బ్రెంట్	76.11	$	77.05

వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గింపు!

- పన్నుల చట్టాల సరళతరం
- ఆర్థిక వృద్ధికి నిర్మాణాత్మక చర్యలు
- బడ్జెట్‌పై ఈవై ఇండియా అంచనాలు



న్యూఢిల్లీ: రానున్న కేంద్ర బడ్జెట్‌లో మూలధన వ్యయాలు, పన్ను చట్టాల సరళతరం, వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గింపు ప్రతిపాదనలకు చోటు కల్పించొచ్చని ఈవై ఇండియా అంచనా వేసింది. ముఖ్యంగా తక్కువ ఆదాయ వర్గాలకు పన్నుల ఉపశమనం తప్పనిసరి అని పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను వచ్చే నెల 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుండడం తెలిసిందే. దీంతో బడ్జెట్ అంచనాలతో ఈవై ఇండియా ఒక నోట్‌ను విడుదల చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.31 లక్షల కోట్ల మేర ఆదాయపన్ను వివాదాల రూపంలో చిక్కుకుపోయినట్టు చెప్పింది. ఆదాయపన్ను కమిషనర్ (అప్పీళ్లు) సత్వరమే వీటిని పరిష్కరించాలని, ప్రత్యామ్నాయ పరిష్కార యంత్రాంగాలను తీసుకురావాలని సూచించింది. ''ప్రత్యక్ష పన్నుల కోడ్ సమగ్ర సమీక్షకు సమయం తీసుకోవచ్చు. కాకపోతే ఈ దిశగా ఆరంభ నిర్ణయాలకు బడ్జెట్‌లో చోటు ఉండొచ్చు. వ్యక్తిగత ఆదాయపన్నును సైతం తగ్గించొచ్చు. తక్కువ ఆదాయ వర్గాలకు ఉపశమనంతోపాటు డిమాండ్‌కు ఊతం ఇచ్చేందుకు వీలుగా చర్యలు ఉండొచ్చు''అని ఈవై ఇండియా నేషనల్ ట్యాక్స్ లీడర్ సమీర్ గుప్తా తెలిపారు. ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే విధంగా వ్యూహాత్మక సంస్కరణలపై బడ్జెట్‌లో దృష్టి సారించొచ్చన్నారు. ద్రవ్య స్థిరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా స్థిరమైన ఆర్థిక వృద్ధికి తగిన నిర్మాణాత్మక చర్యలు ఉండొచ్చన్నారు.

పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు..

ముఖ్యంగా పన్నుల విధానాన్ని సులభంగా మార్చడం, కస్టమర్ల సేవలను మెరుగుపరచడం, వివాదాలను తగ్గించడం, పన్ను నిబంధనల అమలును పెంచడం దిశగా ప్రభుత్వం చర్యలు ప్రకటించొచ్చని ఈవై ఇండియా అంచనా వేస్తోంది. పన్ను చట్టాల సులభీకరణ కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రజల నుంచి సూచనలను ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించడం, వ్యాపార ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై కీలకంగా దృష్టి సారించాలని పేర్కొంది. గత బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మూలధన లాభాల విధానాన్ని హేతుబద్ధీకరించడానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు చెబుతూ.. ఈ దిశగా మరిన్ని చర్యలు రాబోయే బడ్జెట్‌లో ఉండొచ్చని తెలిపింది. ముఖ్యంగా ఎస్ఎంఈలకు పన్నుల సంక్లిష్టతను తగ్గించడం ఎంతో అవసరమని అభిప్రాయపడింది.

నాలుగేళ్ల కనిష్టానికి జీడీపీ వృద్ధి

ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా ● ఆర్‌బీఐ, ప్రభుత్వ లెక్కలకన్నా తక్కువే



న్యూఢిల్లీ: బలహీనమైన డిమాండ్ వంటి పలు కారణాల నేపథ్యంలో మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి వృద్ధి రేటు 6.3 శాతంగా ఉంటుందని బ్యాంకింగ్ దిగ్గజం- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పరిశోధనా నివేదిక పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (6.6 శాతం), జాతీయ గణాంకాల కార్యాలయం మొదటి ముందస్తు అంచనాలు(6.4 శాతం), ఆర్థిక శాఖ తొలి అంచనా (7 శాతం) కన్నా ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా తక్కువగా ఉండడం గమనార్హం. వ్యవస్థలో డిమాండ్ ధోరణులు బలహీనంగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. 2020-21లో కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో ఎకానమీలో అసలు వృద్ధిలేకపోగా 5.8 శాతం క్షీణతను నమోదుచేసిన సంగతి తెలిసిందే. అటు తర్వాత 6.3 శాతం వృద్ధి రేటు నమోదయితే అది నాలుగేళ్ల కనిష్ట స్థాయి అవుతుంది. బేస్ ఎఫెక్ట్‌తో 2021-22లో ఎకానమీ వృద్ధి రేటు 9.7 శాతంగా నమోదయ్యింది. 2022-23లో 7 శాతం, 2023-24లో 8.2 శాతంగా ఈ రేట్లు ఉన్నాయి. . ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 6.7 శాతం వృద్ధి నమోదవగా, రెండవ క్వార్టర్‌లో 7 క్వార్టర్ల కనిష్ట స్థాయిలో 5.4 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ సౌమ్య కాంతి ఘోష్ రూపొందించిన ఈ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు...

- జీడీపీ వృద్ధిలో మందగమనం ఉన్నప్పటికీ తలసరి ఆదాయం 2023-24తో పోల్చితే, 2024-25లో రూ. 35,000 పెరిగే అవకాశం ఉంది.
- భారీ పెట్టుబడులకు సంబంధించిన విభాగం- క్యాపిటల్ ఫార్మేషన్‌లో వృద్ధి రేటు 270 బేసిస్ పాయింట్లు (2.7%) 7.2 శాతానికి దిగిరానుంది.
- ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు 2024-25 జీడీపీలో 4.9 శాతంగా (బడ్జెట్ లక్ష్యం ప్రకారం) ఉంటుంది.

మళ్లీ రూ.80,000కు పసిడి



న్యూఢిల్లీ: పసిడి ధర దేశ రాజధాని న్యూఢిల్లీలో బుధవారం మళ్లీ రూ.80,000 స్థాయిని తాకింది. 99.9 శాతం ప్యూరిటీ ధర రూ.300 పెరిగి నెల గరిష్ఠం రూ.80,000కు చేరింది. ఆభరణ వర్తకులు, స్టాకిస్టుల నుంచి కొనుగోళ్ల డిమాండ్ దీనికి కారణం . ఇక 99.5 శాతం ప్యూరిటీ ధర సైతం రూ.300 పెరిగి రూ.79,600కు చేరింది. మరోవైపు వెండి ధర వరుసగా మూడవరోజూ పెరిగింది. బుధవారం క్రితం ముగింపుతో పోల్చితే రూ.500 పెరిగి రూ.92,500కు చేరింది. భారత్‌సహా ప్రపంచ వ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకుల భారీ కొనుగోళ్లు పసిడికి బలం చేకూర్చుతున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు 2024 నవంబర్‌లో 53 టన్నుల పసిడిని కొనుగోలు చేయగా, ఇందులో భారత్ వాటా 8 టన్నులుగా ఉంది.

పసిడి దిగుమతుల విలువ సవరణ

ఇదిలావుండగా, నవంబర్‌లో భారీ బంగారం దిగుమతులు (14.86 బిలియన్ డాలర్లు) జరిగాయన్న తొలి లెక్కలపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో తాజాగా వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ అంకెలను సవరించింది. తొలి 14.86 బిలియన్ డాలర్ల లెక్కలకు దాదాపు 5 బిలియన్ డాలర్లు తగ్గించింది. దీనితో ఈ విలువ 9.84 బిలియన్ డాలర్లకు చేరింది. వాణిజ్యశాఖ అనుబంధ విభాగం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటిలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ (డీజీసీఐఎస్) ఈ విషయాలను తెలిపింది.

అరిష్ గ్లోబల్ సర్వీసెస్‌తో వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ జట్టు

న్యూఢిల్లీ: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ తాజాగా బ్రిటన్‌కు చెందిన అరిష్ గ్లోబల్ సర్వీసెస్‌తో జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యం ద్వారా వచ్చే మూడేళ్లలో 5,000 ఉద్యోగాలు కల్పించాలనేది ఇరు సంస్థల లక్ష్యం. ఔట్‌సోర్సింగ్ పరిశ్రమలో వర్టెక్స్ స్థానం మరింత పటిష్టమయ్యేందుకు ఇది తోడ్పడనుంది. కస్టమర్ సర్వీస్, ఐటీ సపోర్ట్, డేటా ప్రాసెసింగ్, ఫైనాన్స్, బ్యాక్-ఆఫీస్ మొదలైన కార్యకలాపాలకు సంబంధించి మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ సీఈవో గగన్ ఆరోరా తెలిపారు. దేశీయంగా ఔట్‌సోర్సింగ్ రంగానికి ఊతమివ్వడంతో పాటు వర్ధమాన టెక్నాలజీలు, మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో కెరియర్‌లను తీర్చిదిద్దుకునేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడగలదని అరిష్ గ్లోబల్ సర్వీసెస్ గ్లోబల్ డైరెక్టర్ సన్నీ క్వాత్రా వివరించారు.

కొంత చెల్లించి విమానం ఎక్కండి

మేక్‌మైట్రిప్ పార్ట్ పేమెంట్ ఆప్షన్



న్యూఢిల్లీ: ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ మేక్‌మైట్రిప్ దేశంలో తొలిసారిగా వినూత్న సేవలకు శ్రీకారం చుట్టింది. విమానాల్లో విదేశాలకు వెళ్లేవారికి పార్ట్ పేమెంట్ ఆప్షన్‌ను ప్రవేశపెట్టింది. మొత్తం ఛార్జీలో తొలుత 10 నుండి 40 శాతం మధ్య చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని ప్రయాణ తేదీకి ముందు లేదా టికెట్ బుక్ చేసిన 45 రోజుల్లోగా పూర్తి చేయాలి. పార్ట్ పేమెంట్ ఆప్షన్‌ని ఎంచుకునే కస్టమర్లు చార్జీ మొత్తాన్ని చెల్లించిన తర్వాత నిబంధనల ప్రకారం ధృవీకరించిన బుకింగ్‌లను సవరించుకోవచ్చని మేక్‌మైట్రిప్ తెలిపింది. 'పెద్ద కుటుంబాలు, బృందాలు ఒకేసారి మొత్తం టికెట్ చార్జీని చెల్లించడం భారం అవుతుంది. అటువంటి వారికి పార్ట్ పేమెంట్ ఆప్షన్ సౌకర్యవంతంగా చెల్లించేందుకు వీలు కల్పిస్తుంది' అని కంపెనీ సీవోవో సౌజన్య శ్రీవాస్తవ తెలిపారు. కాగా, ఎక్కువ మందిని అంతర్జాతీయ ప్రయాణాలకు ప్రోత్సహించేందుకు పార్ట్ పేమెంట్ ఆప్షన్ దోహద పడుతుందని రిటైల్ రంగ నిపుణులు కలిశెట్టి నాయుడు తెలిపారు. 'ఇటువంటి సౌకర్యంతో విమానయాన సంస్థలకు క్యాష్ రొటేషన్ అవుతుంది. విద్యార్థులు, వ్యాపారస్తులకు చెల్లింపుల సౌలభ్యం ఉంటుంది' అని వివరించారు.

నాల్కో సీఎండీగా బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో) సీఎండీగా బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. బర్న్‌పూర్-దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్‌కు డైరెక్టర్-ఇన్‌చార్జ్, సెయిల్ బోర్డులో సభ్యుడిగా గతంలో ఆయన పనిచేశారు. ఐఐటీ ధన్‌బాద్ (గతంలో ఐఎస్ఎం ధన్‌బాద్) నుండి మైనింగ్ మెషినరీ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్, మార్కెటింగ్‌లో ఎంబీఏ డిగ్రీ పట్టా అందుకున్నారు.

వేదాంతా చేతికి రివర్‌సైడ్ స్టూడియో

100 ఏళ్లుగా కార్యకలాపాలు



న్యూఢిల్లీ: కళలకు కేంద్రమైన లండన్‌లోని సుప్రసిద్ధ రివర్‌సైడ్ స్టూడియోను వేదాంతా గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అనిల్ అగర్వాల్ సొంతం చేసుకున్నారు. 100 ఏళ్ల క్రితం థేమ్స్ నది ఒడ్డున ఏర్పాటైన ఈ సుప్రసిద్ధ స్టూడియోను ఇకపై అనిల్ అగర్వాల్ రివర్‌సైడ్ స్టూడియోస్ ట్రస్ట్‌గా నిర్వహించనున్నట్లు వేదాంతా గ్రూప్ పేర్కొంది. దీంతో భారత్‌తోపాటు ప్రపంచ కళలు, సంప్రదాయాలకు గమ్యంగా అవతరించనున్నట్లు ఒక ప్రకటనలో అనిల్ అగర్వాల్ పేర్కొన్నారు. వెరసి ఈ సందర్భంగా తమ నైపుణ్యాలు, కళలను ప్రదర్శించేందుకు తరలిరావలిసిందిగా భారతదేశ కళాకారులు, సినీ పరిశ్రమను ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. ఇదేవిధంగా వివిధ గ్లోబల్ లీడర్లు సైతం తమ జీవిత ప్రయాణంలోని విశేషాలతో ప్రేక్షకులను ఉత్తేజితం చేసేందుకు స్టూడియోను వినియోగించుకోవలసిందిగా కోరారు.


పీటీడబ్ల్యూ గ్రూప్‌తో బార్‌ట్రానిక్స్ ఇండియా ఎంవోయూ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫిన్‌టెక్ బిజినెస్ సొల్యూషన్స్ సంస్థ బార్‌ట్రానిక్స్ ఇండియా తాజాగా సింగపూర్‌కి చెందిన సెమీకండక్టర్ సొల్యూషన్స్ సంస్థ పీటీడబ్ల్యూ గ్రూప్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. భారత మార్కెట్లో పీటీడబ్ల్యూ గ్రూప్ ప్రవేశించేందుకు ఇది ఉపయోగపడనుంది. ఈ ఎంవోయూ ప్రకారం భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, రీఫర్బిషింగ్, శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థలు తెలిపాయి. అలాగే, పరిశోధన-అభివృద్ధి, తయారీ, సిబ్బందికి శిక్షణ కార్యకలాపాలకు కూడా ఇది ఉపయోగపడగలదని పేర్కొన్నాయి. దేశీయంగా సెమీకండక్టర్ల పరిశ్రమ వృద్ధి, కొత్త సొల్యూషన్స్ ఆవిష్కరణ దిశగా ఇరు సంస్థలు పనిచేయనున్నట్లు బార్‌ట్రానిక్స్ ఎండీ ఎస్. విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. దీర్ఘకాలికంగా తమ గ్లోబల్ కార్యకలాపాలకు భారత్ కీలక కేంద్రంగా నిలవగలదని పీటీడబ్ల్యూ గ్రూప్ ఎండీ టార్స్‌టెన్ సీఫ్రెడ్ చెప్పారు.

బ్యాంకింగ్ లాభాలకు గండి!

- 2025-26పై ఇండ్-రా అంచనా
- మొండి బకాయిల ప్రభావం పడుతుందని విశ్లేషణ



ముంబై: మొండిబకాయిల ప్రభావం ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) బ్యాంకింగ్ లాభదాయకతపై ప్రభావం చూపుతుందని దేశీయ రేటింగ్ సంస్థ- ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ (ఇండ్-రా) నివేదిక పేర్కొంది. బ్యాంకింగ్ లాభదాయకత 2024-25లో ''పీక్'' స్థాయిలో ఉన్నాయని, 2025-26లో ఇది దిగివచ్చే అవకాశాలు అధికమని వివరించింది. రిటైల్ రంగం నుంచి ప్రధానంగా మొండి బకాయిల సవాళ్లు తలెత్తే వీలుందని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ ఫైనాన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ హెడ్ అండ్ డైరెక్టర్ కరణ్ గుప్తా నివేదికలో వెల్లడించారు.

నివేదికలోని ముఖ్యాంశాలు...

- మొండి బకాయిలు నియంత్రణ స్థాయిలోనే ఉంటాయి. రూ.50,000 కంటే తక్కువ రిటైల్ సురక్షిత రుణాలు బ్యాంకుల రుణాల మొత్తంలో 0.4 శాతంగా ఉన్నాయి. 11 శాతానికి పైగా వడ్డీ రేటు కలిగిన రుణాలు మొత్తం రుణాల్లో 3.6 శాతంగా ఉన్నాయి.
- 2024-25లో రుణ వృద్ధి మందగించింది. 2023-24తో పోల్చితే ఈ రేటు 15 శాతం నుండి 13-13.5 శాతానికి తగ్గే వీలుంది.
- బ్యాంకుల నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2025-26లో 0.10 శాతం తగ్గిపోతుంది. డిపాజిట్ వడ్డీ రేటు పెంపు, కొత్త అకౌంటింగ్ విధానాలు దీనికి కారణంగా ఉంటాయి.
- 2025-25లో రుణ-డిపాజిట్ వృద్ధి మధ్య వ్యత్యాసం తగ్గుముఖం పడుతుంది. అయితే ప్రాజెక్ట్ ఫైనాన్స్ కొత్త నిబంధనలు, లిక్విడిటీ కవరేజ్ రేషియో, క్రెడిట్ నష్టాల అంచనా విధానం వంటి అంశాలు బ్యాంకింగ్ రంగానికి సవాళ్లను సృష్టిస్తాయి.
- 2024-25లో మైక్రోఫైనాన్స్ ఆస్తుల వృద్ధి 5 శాతంగా ఉంటుంది. 2024-25లో ఇది 12 శాతానికి పెరుగుతుంది. గ్రామీణ ఎకానమీ బలోపేతం మైక్రోఫైనాన్స్ రంగానికి లాభదాయకంగా ఉండొచ్చు.

శక్తికాంతదాస్ విధానాలు భేష్

మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో ఆర్‌బీఐ తీసుకున్న సంస్కరణలు బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలంగా మార్చాయని నివేదిక పేర్కొనడం గమనార్హం. అయితే కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఈ నిబంధనల్లో పూర్తిగా కాకున్నా, కొంతమేర సరళతరం అయ్యే అవకాశం ఉందని అంచనావేసింది. వ్యక్తిగత రుణాలు, సురక్షిత వ్యాపార రుణాలు, మైక్రోఫైనాన్స్ రంగంపై అవుట్‌లుక్ 'స్థిరత్వం'' నుండి 'దుర్వినియోగ పరిస్థితి' గా మారుతోందని నివేదిక పేర్కొంది. బ్యాంకులు, నాన్-బ్యాంకు ఫైనాన్స్ కంపెనీలు అలాగే హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలపై ఇండ్‌రా రేటింగ్ తన అవుట్‌లుక్‌ను కొనసాగించింది. అయితే ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున కొన్ని అసెట్ సెగ్మెంట్లపై అవుట్‌లుక్‌ను సవరించింది.

కొత్త శిఖరానికి ఆఫీస్ స్పేస్ లీజింగ్

- హైదరాబాద్‌లో 17 శాతం అధికం
- 8 నగరాల్లో 21 శాతం వృద్ధి
- కరోనా ముందస్తు స్థాయి కంటే ఎక్కువ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన నగరాల్లో 2024లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ నూతన గరిష్టాలకు చేరింది. మొత్తం 719 లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) పరిమాణంలో లీజు లావాదేవీలు నమోదయ్యాయి. 2023లో స్థూల లీజింగ్‌తో పోల్చి చూసినప్పుడు 21 శాతం అధికం కాగా, కరోనా విపత్తుకు ముందు ఏడాది 2019 గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 19 శాతం వృద్ధి కనిపించింది. ఈ వివరాలను రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా విడుదల చేసింది. కరోనా కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో ఆఫీస్ స్పేస్ మార్కెట్ కుదేలవడం గమనార్హం. ఆ తర్వాత నుంచి ఏటా పుంజుకుంటూ వస్తోంది.

పట్టణాల వారీ లీజింగ్

- బెంగళూరులో స్థూల ఆఫీస్ లీజింగ్ ముందటి సంవత్సరంతో పోల్చితే 2024లో 45 శాతం వృద్ధితో 181 లక్షల ఎస్ఎఫ్‌టీకి చేరింది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో 25% వృద్ధితో స్థూల లీజింగ్ 127 లక్షల ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.
- ముంబై మార్కెట్లోనూ 40 శాతం వృద్ధి నమోదైంది. 104 లక్షల చదరపు అడుగుల లీజింగ్ లావాదేవీలు జరిగాయి.
- పుణెలో 19 శాతం పెరిగి 80 లక్షల చదరపు అడుగులకు చేరింది.
- అహ్మదాబాద్‌లో 64 శాతం వృద్ధితో 30 లక్షల ఎస్ఎఫ్‌టీ స్థూల లీజింగ్ లావాదేవీలు నమోదయ్యాయి.
- ఒక్క చెన్నై మార్కెట్లో మాత్రం 25 శాతం క్షీణించి 81 లక్షల ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.

సానుకూలతలు ఎన్నో..

ఆఫీస్ స్పేస్ లీజింగ్ నూతన గరిష్టాలకు చేరడం వెనుక దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండడం, బలమైన దేశీ వినియోగం, అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత్ ప్రాతినిధ్యం తదితర అంశాలను కారణాలుగా నైట్‌ఫ్రాంక్ ఇండియా పేర్కొంది. ఆఫీస్ స్పేస్‌కు అసాధారణ డిమాండ్ ఉండడం దేశ, విదేశీ సంస్థల్లో వ్యాపార విశ్వాసానికి నిదర్శనంగా పేర్కొంది. జీసీసీలు, ఐటీఈఎస్, బీఎఫ్ఎస్ఐ రంగాలు ఈ డిమాండ్‌కు దన్నుగా నిలుస్తున్నట్టు తెలిపింది.

ఏఐలో భారత్ కీలక పాత్ర పోషించాలి

- సొంత మోడల్స్ రూపొందించుకోవాలి
- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల



న్యూఢిల్లీ: కృత్రిమ మేథకు (ఏఐ) సంబంధించి పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల్లో భారత్ కీలక పాత్ర పోషించాలని టెక్ దిగ్గజం సత్య నాదెళ్ల చెప్పారు. ఏఐకి పునాదుల్లాంటి ఫౌండేషన్ మోడల్స్‌ను సొంతంగా రూపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఒక్క కొత్త మ్యాథ్స్ సూత్రం, అల్గోరిథంలాంటిది కనుగొన్నా మొత్తం ఏఐ స్వరూపం మొత్తం మారిపోయే అవకాశాలు ఉన్నాయని నాదెళ్ల పేర్కొన్నారు. కృత్రిమ మేథను ఉపయోగించి, పరిశ్రమల పనితీరును మెరుగుపర్చవచ్చని ఆయన పేర్కొన్నారు. అయితే, అధునాతనమైన ఏఐ సిస్టమ్స్ మీద కసరత్తు చేయాలంటే పెట్టుబడుల కొరత ప్రధాన అడ్డంకిగా ఉంటోందని ఆయన చెప్పారు. కానీ పరిశోధనలతో వ్యయాల భారాన్ని తగ్గించుకోవచ్చని మైక్రోసాఫ్ట్ ఇండియా ఏఐ టూర్ రెండో రోజు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నాదెళ్ల వివరించారు. ప్రస్తుతం ఓపెన్‌ఏఐ, గూగుల్‌లాంటి టెక్ దిగ్గజాలు తయారు చేసిన ఏఐ ఇంజిన్లనే (ఫౌండేషన్ మోడల్స్) దేశీయంగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, కార్యక్రమం సందర్భంగా రైల్‌టెల్, అపోలో హాస్పిటల్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా గ్రూప్ మొదలైన సంస్థలతో మైక్రోసాఫ్ట్ వ్యూహాత్మక భాగస్వామ్యాలను ప్రకటించింది. ఈ ఒప్పందాల కింద క్లౌడ్, ఏఐ ఆవిష్కరణల ద్వారా ఆయా సంస్థల సిబ్బంది, కస్టమర్లు ప్రయోజనం పొందేందుకు కావాల్సిన తోడ్పాటును మైక్రోసాఫ్ట్ అందిస్తుంది. అటు దేశీయంగా ఏఐ, కొత్త టెక్నాలజీలను మరింతగా అభివృద్ధి చేసేందుకు, సమ్మిళిత వృద్ధికి దోహదపడే ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఇండియా ఏఐతో కూడా కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది.

5 లక్షల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ

ఇండియాఏఐతో భాగస్వామ్యం ద్వారా 2026 నాటికి 5 లక్షల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణనివ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ తెలిపారు.

గప్టిల్ గుడ్‌బై

అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన న్యూజిలాండ్ బ్యాటర్



ఆక్లాండ్: న్యూజిలాండ్ సీనియర్ ప్లేయర్ మార్టిన్ గప్టిల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2022లో చివరిసారిగా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 38 ఏళ్ల గప్టిల్ ఇకపై టి20 లీగ్‌ల్లో మాత్రమే ఆడనున్నట్లు బుధవారం వెల్లడించాడు. జాతీయ జట్టు తరఫున 47 టెస్టులాడి 2586 పరుగులు చేసిన గప్టిల్... 198 వన్డేల్లో 7346 పరుగులు చేశాడు. అందులో ఒక డబుల్ సెంచరీ, 18 సెంచరీలు ఉన్నాయి. టి20ల్లో అత్యంత ప్రమాదకర ఆటగాడిగా గుర్తింపు సాధించిన గప్టిల్ 122 టి20ల్లో 3532 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 20 అర్ధసెంచరీలు ఉన్నాయి. న్యూజిలాండ్ తరఫున వన్డేల్లో 'డబుల్ సెంచరీ' చేసిన తొలి ఆటగాడిగా నిలిచిన గప్టిల్.. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 'చిన్నతనంలో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని కలలు కనేవాడిని. అలాంటిది దేశం తరఫున 367 మ్యాచ్‌లు ఆడాను. ఎన్నో మరపురాని అనుభూతులను మూటగట్టుకున్నా. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. గత కొన్నేళ్లలో న్యూజిలాండ్ క్రికెట్ ఎన్నో విజయాలు సాధించింది. వాటిలో భాగం అయినందుకు ఆనందంగా ఉంది' అని గప్టిల్ పేర్కొన్నాడు. అరంగేట్ర వన్డేలోనే 'శత'క్కొట్టిన గప్టిల్... 2019 వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్లో అద్భుత త్రోతో భారత స్టార్ ప్లేయర్ మహేంద్ర సింగ్ ధోనీని రనౌట్ చేసిన విషయం భారత అభిమానులు ఎప్పటికీ మరవలేరు.



హెచ్ఐఎల్‌తో ఆర్థిక స్థిరత్వం

యువత హాకీ వైపు అడుగులు వేస్తోంది

హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) వల్ల ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని... దీని వల్ల యువ ఆటగాళ్లు హాకీని కెరీర్‌గా ఎంచుకునేందుకు మక్కువ చూపుతారని భారత మహిళల హాకీ జట్టు గోల్‌కీపర్, మాజీ కెప్టెన్ సవితా పూనియా అభిప్రాయపడింది. ఈ నెల 12 నుంచి 26 వరకు మహిళల కోసం తొలిసారి హెచ్ఐఎల్ నిర్వహిస్తుండగా... దీని వల్ల ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని సవిత ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో సుదీర్ఘ అనుభవం ఉన్న సవిత... 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ వరకు ఆడాలనుకుంటున్నట్లు వెల్లడించింది. కెరీర్ విశేషాలు, భవిష్యత్తు లక్ష్యాలు, దేశంలో హాకీ భవిష్యత్తుపై సవిత తన అభిప్రాయాలు వెల్లడించింది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

- 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ వరకు ఆడతా
- భారత మహిళల హాకీ జట్టు గోల్‌కీపర్ సవితా పూనియా మనోగతం

ప్రతి ప్లేయర్‌కు ఆర్థిక స్థిరత్వం ముఖ్యం. హాకీ ఇండియా లీగ్ వల్ల అది సాధ్యమవుతుంది. క్రీడా సామాగ్రి కొనుగోలు చేసేందుకు కూడా తల్లిదండ్రులపై ఆధార పడాల్సి వస్తే ఆ కుటుంబం ఎంతో ఇబ్బంది పడుతుంది. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చేసినప్పుడు అవార్డులు, రివార్డులు లభిస్తాయి. అదే జూనియర్ స్థాయిలో ఆడేవాళ్లకు ఆర్థిక ఇబ్బందులు ఉంటాయి. అలాంటి వాళ్లకు హెచ్ఐఎల్ ఎంతో ఉపయుక్తకరంగా ఉంటుంది.

→ ఆర్థిక ఇబ్బందులు లేనప్పుడే ప్లేయర్లు తమ లక్ష్యంపై దృష్టి సారించగలుగుతారు. సీనియర్ ప్లేయర్‌గా జూనియర్లకు ఎప్పుడూ లక్ష్యాన్ని వదలొద్దనే చెబుతా. హాకీ అనే కాదు ఏ క్రీడలోనైనా అంతే.

→ హాకీని కెరీర్‌గా ఎంపిక చేసుకుంటే గతంలో తల్లిదండ్రులు ఆర్థిక కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఇప్పుడు కనీసం వాళ్లు సంతోషిస్తారు. పిల్లలు మంచి ప్రదర్శన చేస్తే వారికి మెరుగైన భవిష్యత్తు ఉంటుందనే నమ్మకం అయితే వస్తుంది.

→ 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనాలని అనుకుంటున్నా. అప్పటి వరకు రిటైర్మెంట్ గురించి ఆలోచించను. నా నిర్ణయాన్ని మా కుటుంబ సభ్యులు ఎప్పుడూ కాదనలేదు. పెళ్లి తర్వాత భర్త కూడా నన్ను అర్థం చేసుకున్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహించడం కంటే గొప్ప విషయం ఇంకేం ఉంటుంది.


→ ప్రస్తుతం 2026 ప్రపంచకప్‌తో పాటు ఆసియా క్రీడలపైనే ప్రధానంగా దృష్టి పెట్టా. ఆటను ఆస్వాదిస్తున్నా.

→ మహిళల హాకీలో హెచ్ఐఎల్ పెను మార్పులు తీసుకువస్తుంది. కేవలం మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా దీనికి మంచి గుర్తింపు దక్కడం ఖాయం. ఎందరో అంతర్జాతీయ స్టార్ ప్లేయర్లు ఇందులో పాల్గొంటున్నారు. వారి అనుభవాల నుంచి భారత యువ క్రీడాకారిణులు పాఠాలు నేర్చుకుంటారు.

→ భారత జట్టులో సీనియర్ ప్లేయర్‌గా నా బాధ్యతలేంటో తెలుసు. యువ ఆటగాళ్లకు సూచనలు ఇవ్వడంతో పాటు... గోల్‌కీపర్‌గా ఆటను నిశితంగా పరిశీలించాల్సి ఉంటుంది.

న్యూజిలాండ్‌దే వన్డే సిరీస్

- 133 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం
- రాణించిన రచిన్ రవీంద్ర
- తీక్షణ 'హ్యాట్రిక్' వృథా


తీక్షణ

హామిల్టన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు... శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో వన్డే మిగిలి ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు 113 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. వర్షం కారణంగా 37 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 9 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (63 బంతుల్లో 79; 9 ఫోర్లు, 1 సిక్స్), మార్క్ చాప్‌మన్ (52 బంతుల్లో 62; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ 'హ్యాట్రిక్' సహా 4 వికెట్లు తీశాడు. 35వ ఓవర్ చివరి రెండు బంతులకు సాంట్నర్ (20), నాథన్ స్మిత్ (0)ను అవుట్ చేసిన తీక్షణ... 37వ ఓవర్ తొలి బంతికి మ్యాట్ హెన్రీ (1)ని పెవిలియన్‌కు పంపించాడు. హసరంగ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక జట్టు 30.2 ఓవర్లలో 142 పరుగులకు ఆలౌటైంది. కమిందు మెండిస్ (66 బంతుల్లో 64; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేయగా... మిగతా వారంతా విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో రూర్కె 3, జాకబ్ డఫీ రెండు వికెట్లు పడగొట్టాడు. రచిన్ రవీంద్రకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన మూడో వన్డే శనివారం ఆక్లాండ్‌లో జరుగుతుంది.

7 వన్డేల్లో 'హ్యాట్రిక్' తీసిన ఏడో శ్రీలంక బౌలర్‌గా తీక్షణ గుర్తింపు పొందాడు. గతంలో చమిందా వాస్ (2 సార్లు), లసిత్ మలింగ (3 సార్లు), తిసారా పెరీరా, మహరూఫ్, హసరంగ, మదుషంక (ఒక్కోసారి) ఈ ఘనత సాధించారు.

విజయ్ హజారే టోర్నీ బరిలో ప్రసిధ్ కృష్ణ, పడిక్కల్, సుందర్

నేడు ప్రిక్వార్టర్స్‌లో రాజస్తాన్‌తో తమిళనాడు, హరియాణాతో బెంగాల్ 'ఢీ'


ప్రసిధ్ కృష్ణ


పడిక్కల్


సుందర్

బెంగళూరు: 'అంతర్జాతీయ మ్యాచ్‌లు లేకుంటే ప్రతి ఒక్కరూ దేశవాళీల్లో ఆడాల్సిందే' అని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్న మాటలను భారత ఆటగాళ్లు సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపిస్తోంది. ప్రతిష్టాత్మక 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో పరాజయం అనంతరం స్వదేశానికి తిరిగి వచ్చిన భారత ఆటగాళ్లలో పలువురు విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్ నాకౌట్ మ్యాచ్‌ల్లో పాల్గొననున్నారు. ఈ టోర్నీలో భాగంగా గురువారం జరుగనున్న ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో రాజస్తాన్‌తో తమిళనాడు, హరియాణాతో బెంగాల్ తలపడనున్నాయి. వీటితో పాటు ఇక మీద జరగనున్న మ్యాచ్‌ల్లో పలువురు భారత స్టార్ ఆటగాళ్లు పాల్గొననున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాలో పర్యటించిన ప్రసిధ్ కృష్ణ, అభిమన్యు ఈశ్వరన్, దేవదత్ పడిక్కల్, సుందర్ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు ఆడనున్నారు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లోనూ ఆడిన కేఎల్ రాహుల్ కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోనున్నాడు. అయితే ఆ తర్వాత ఈ నెలాఖరున తిరిగి ప్రారంభం కానున్న రంజీ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌ల్లో రాహుల్ పాల్గొనే అవకాశం ఉంది. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన స్టార్ ఆటగాళ్లు రేపటి నుంచి వారివారి రాష్ట్రాల జట్లతో కలవనున్నారు. తమిళనాడు జట్టు విజయ్ హజారే ట్రోఫీ సెమీఫైనల్‌కు చేరితే స్పిన్ ఆల్‌రౌండర్ సుందర్ బరిలోకి దిగనున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో మూడు మ్యాచ్‌లాడిన సుందర్ 114 పరుగులు చేసి 3 వికెట్లు పడగొట్టాడు. ఇక సిడ్నీ వేదికగా కంగారూలతో జరిగిన చివరి టెస్టులో మెరుగైన ప్రదర్శన చేసిన ప్రసిధ్ కృష్ణ కర్ణాటక జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

రంజీ ట్రోఫీలో నితీశ్ రెడ్డి...



'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో అద్వితీయ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి... రంజీ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లు ఆడనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు నాకౌట్ దశకు అర్హత సాధించలేకపోవడంతో అతడికి వన్డే టోర్నీలో ఆడే అవకాశం లేకుండా పోయింది. ఇక ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న రంజీ ట్రోఫీ రెండో దశలో పోటీల్లో ఆంధ్ర జట్టు మరో రెండు మ్యాచ్‌లు ఆడనుంది. వాటిలో నితీశ్ కుమార్ రెడ్డి పాల్గొననున్నాడు. మెల్‌బోర్న్ టెస్టులో ప్రతికూల పరిస్థితుల మధ్య చక్కటి సెంచరీతో సత్తా చాటిన నితీశ్ రెడ్డి... ఈ నెల 23 నుంచి పుదుచ్చేరితో, 30 నుంచి రాజస్తాన్‌తో ఆంధ్ర జట్టు ఆడే మ్యాచ్‌ల్లో బరిలోకి దిగనున్నాడు. గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్ర జట్టు ఆడిన 5 మ్యాచ్‌ల్లో మూడింట ఓడి, మరో రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని 4 పాయింట్లతో పట్టికలో ఏడో స్థానంలో కొనసాగుతోంది.



సిడ్నీ పిచ్‌పై ఐసీసీ 'సంతృప్తి'

రేటింగ్ ప్రకటించిన అంతర్జాతీయ క్రికెట్ మండలి

దుబాయ్: భారత్, ఆస్ట్రేలియా మధ్య 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా చివరి టెస్టు జరిగిన సిడ్నీ పిచ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సానుకూల నివేదిక ఇచ్చింది. ఈ పిచ్‌ను 'సంతృప్తికరం' అనే రేటింగ్‌ను ఇచ్చింది. సీమ్ బౌలింగ్‌కు విపరీతంగా స్పందించడంతో పాటు అనూహ్య బౌన్స్‌తో కనిపించిన ఈ పిచ్‌పై పేస్ బౌలర్లు చెలరేగారు. గ్రౌండ్స్‌మన్ ఈ టెస్టు కోసం కొత్త తరహా పచ్చికను ఉపయోగించారు. ఫలితంగా సిడ్నీలో తక్కువ సమయంలో ముగిసిన టెస్టుల జాబితాలో (బంతుల పరంగా) ఈ మ్యాచ్ మూడో స్థానంలో నిలిచింది. మ్యాచ్‌లో రెండు అర్ధసెంచరీలు మాత్రమే నమోదయ్యాయి. ఐసీసీ ఇచ్చిన నివేదిక వల్ల ముమ్ముందు ఇలాంటి 'సంతృప్తికర' పిచ్‌లను రూపొందించేందుకు తాము సిద్ధమవుతామని ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు (సీఏ) స్పందించింది. మరో వైపు తొలి నాలుగు టెస్టులు జరిగిన పెర్త్, అడిలైడ్, బ్రిస్బేన్, మెల్‌బోర్న్ మైదానాలు 'చాలా బాగున్నాయి' అనే రేటింగ్‌తో ఐసీసీ కితాబునిచ్చింది.



హైదరాబాద్ తూఫాన్స్ గెలుపు

హాకీ ఇండియా లీగ్

రూర్కెలా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన పోరులో హైదరాబాద్ 3-0 గోల్స్ తేడాతో యూపీ రుద్రాస్‌ను చిత్తు చేసింది. తొలి క్వార్టర్‌లో 2 గోల్స్ చేసిన హైదరాబాద్ మూడో క్వార్టర్‌లో మరో గోల్‌తో తమ ఆధిక్యాన్ని పెంచుకుంది. మూడు ఫీల్డ్ గోల్స్ సాధించిన తూఫాన్స్ మరో మూడు పెనాల్టీ కార్నర్‌లను వాడుకోలేకపోయింది. మరో వైపు చివరి క్వార్టర్‌లో ఎనిమిది నిమిషాల వ్యవధిలో ఐదు పెనాల్టీలు సహా మొత్తం ఆరు పెనాల్టీలు వచ్చినా రుద్రాస్ వాటిలో ఒక్కదానిని కూడా గోల్‌గా మలచలేకపోయింది. హైదరాబాద్ తరఫున జాకరీ వాలెస్ (6వ నిమిషం), రాజిందర్ సింగ్ (14వ నిమిషం), శిలానంద్ లాక్డా (32వ నిమిషం) గోల్స్ నమోదు చేశారు. ఎనిమిది జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో తాజా ఫలితం తర్వాత పాయింట్ల పట్టికలో హైదరాబాద్ ఐదో స్థానంలో కొనసాగుతోంది. గోల్స్ వర్షం కురిసిన మరో మ్యాచ్‌లో తమిళనాడు డ్రాగన్స్ 6-5 గోల్స్‌తో టీమ్ గోనాసిక వైజాగ్‌పై గెలుపొందింది. ఈ గెలుపుతో డ్రాగన్స్ రెండో స్థానానికి చేరగా, గోనాసిక ఏడో స్థానంలో నిలిచింది.

అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా అంజూ

- ఆరుగురు మహిళా అథ్లెట్లకు అవకాశం
- పురుషుల విభాగంలో నీరజ్ చోప్రాకు చోటు


నీరజ్ చోప్రా, అంజూ జార్జి (ఫైల్)

చండీగఢ్: భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) నూతన కార్యవర్గం తొలి వార్షిక సర్వసభ్య సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 9 మంది అథ్లెట్లతో కూడిన ఏఎఫ్ఐ అథ్లెట్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ఆరుగురు మహిళా అథ్లెట్లు, ముగ్గురు పురుష అథ్లెట్లకు చోటు దక్కింది. తాజా ఎన్నికల్లో మరోసారి సీనియర్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన 'డబుల్ ఒలింపియన్' మాజీ లాంగ్‌జంపర్ అంజూ బాబీ జార్జి... ఈ కమిషన్‌కు చైర్‌పర్సన్‌గా వ్యవహరించనుంది. ఈ కమిషన్‌లో అంజూతో పాటు జ్యోతిర్మయి సిక్దర్ (రన్నింగ్), కృష్ణ పూనియా (డిస్కస్ త్రో), ఎండీ వల్సమ్మ (హర్డిల్స్), సుధా సింగ్ (స్టీపుల్‌ఛేజ్), సునీతా రాణి (రన్నింగ్) చోటు దక్కించుకున్నారు. పురుషుల విభాగం నుంచి ఏఎఫ్ఐ అధ్యక్షుడు బహదూర్ సింగ్ సాగూతో పాటు ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, అవినాశ్ సాబ్లే (స్టీపుల్ ఛేజ్) ఉన్నారు. గత కమిషన్‌లో నలుగురు మహిళలు ఉండగా... ఇప్పుడు వారి ప్రాతినిధ్యాన్ని పెంచుతూ ఆ సంఖ్యను 6 చేశారు. బహదూర్ సింగ్ గతంలో సుదీర్ఘ కాలం ఈ కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు. బిజీ షెడ్యూల్ కారణంగా కమిషన్‌కు ఎక్కువ సమయం కేటాయించలేనని చెప్పినప్పటికీ... ఏఎఫ్ఐ ఎక్స్‌క్యూటివ్ కౌన్సిల్ నీరజ్ చోప్రాతో చర్చించి అతడిని కమిషన్‌లో భాగం చేసింది.

2012 నుంచి వరుసగా మూడు పర్యాయాలు ఏఎఫ్ఐ అధ్యక్షుడిగా వ్యవహరించిన అదిలె సుమరివాలా ఎక్స్ అఫిషియో సభ్యుడిగా కొనసాగనున్నారు. ప్రస్తుతం ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ బోర్డు సభ్యుడిగా వ్యవహరిస్తున్న సుమరివాలాకు.. ఏఎఫ్ఐ ఎక్స్‌క్యూటివ్ కౌన్సిల్ సమావేశాలకు హాజరయ్యే అధికారాలు ఉన్నాయి. డోపింగ్ ఉదంతాల వల్ల దేశ అథ్లెటిక్స్ ప్రభ మసకబారకుండా తగిన చర్యలు చేపట్టాలని ఏఎఫ్ఐ నిర్ణయించింది. దీని కోసం అథ్లెట్ల శిక్షణకు సంబంధించిన వివరాలను జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా)తో కలిసి పర్యవేక్షించనుంది.

సాకేత్ జోడీ ఓటమి



నొంతాబురి (థాయ్‌లాండ్): బ్యాంకాక్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టెన్నిస్ టోర్నీ డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారులు సాకేత్ మైనేని, నిక్కీ కలియంద పునాచా, అనిరుధ్ చంద్రశేఖర్‌లకు నిరాశ ఎదురైంది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సాకేత్ మైనేని-నిక్కీ పునాచా ద్వయం 4-6, 6-4, 8-10తో ఫ్రాన్సిస్ కేసీ అల్‌కంటారా (ఫిలిప్పీన్స్)-ఇవాన్ కింగ్ (అమెరికా) జంట చేతిలో ఓడిపోయింది. రెండో సీడ్ అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)-కరోల్ డ్రెజెవ్‌స్కీ (పోలాండ్) జోడీ 6-7 (4/7), 3-6తో బ్లేక్ బేల్డన్ (ఆస్ట్రేలియా)-జాకుబ్ పాల్ (స్విట్జర్లాండ్) జంట చేతిలో పరాజయం చవిచూసింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) ద్వయం 7-6 (7/3), 6-4తో పవిత్ సార్నాలక్సప్-థాంటుబ్ సుక్సుమ్రన్ (థాయ్‌లాండ్) జంటపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.



బ్రిటన్‌లోని నార్త్ టినీసైడ్ నగరంలోని
వైట్లీబే సమీప సముద్రతీరం వెంట ఎగసిపడుతున్న భారీ అలలు



కార్చిచ్చు అంటుకోవడంతో అగ్నికి ఆహుతి అవుతోన్న అల్టాడేనా ప్రాంతంలోని ఓ ఇల్లు. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం లాస్ ఏంజిలెస్ కౌంటీ పరిధిలో బుధవారం తీసిన ఫొటో ఇది



సిల్వర్‌టన్ గ్రామంలోని తమ కొత్త బీఎండబ్ల్యూ కార్ల షోరూమ్ పార్కింగ్‌లో బుధవారం భారీగా పేరుకుపోయిన మంచును తొలగిస్తున్న సిబ్బంది. అమెరికాలోని ఓహియో రాష్ట్రంలో కనిపించిన దృశ్యమిది

హోం వర్క్ చేయకుంటే గోడకుర్చీ వేయిస్తారా?

ప్రియుడితో వెళ్తా, పెళ్లైన నెల రోజులకు విడాకులిస్తారా?

- కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'టెలి–లా'పోర్టర్‌కు వెల్లువెత్తిన విచిత్ర ప్రశ్నలు
- సలహాలు అడిగిన వారిలో 12 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయస్కులు
- పోర్టల్‌ను ఆశ్రయించిన వారిలో 19లక్షల మందితో యూపీ టాప్
- పోర్టల్‌ను ఆశ్రయించిన 3 లక్షల మంది ఏపీ, 3 లక్షల మంది తెలంగాణవాసులు
- దేశ వ్యాప్తంగా 'టెలి–లా'పోర్ట్‌లో రిజిస్టరైన వారి సంఖ్య కోటికి పైనే
- వివరాలు వెల్లడించిన కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: 'సార్.. నేను హోంవర్క్ చేయకుంటే మా టీచర్ నన్ను గోడకుర్చీ వేయించవచ్చా? పిల్లలను కొట్టే తల్లిదండ్రులపై కేసు పెట్టవచ్చా? నేను సొంతింట్లో మరుగుదొడ్డి నిర్మించాలనుకుంటున్నాను. ప్రభుత్వం నుంచి ఏ మేరకు సహాయం అందుతుంది? అదెలా పొందాలి? ప్రేమికుడి దగ్గరకి వెళ్లాలనుకుంటున్నాను. వివాహమైన నెల రోజులకు విడాకులు సాధ్యమేనా?'పెళ్లైన 30ఏళ్ల తర్వాత విడాకులు తీసుకోవచ్చా?.. ఇలాంటి విచిత్ర ప్రశ్నలు కేంద్ర ప్రభుత్వ టెలీ–లా పోర్టల్‌కు పోటెత్తాయి. న్యాయ సలహాల కోసం ఇలా ఎన్నో రకాల ప్రశ్నలు అడుగుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది పోర్టల్‌ను ఆశ్రయించారు. ఇలాంటి ప్రశ్నలు అడిగిన వారిలో 12 ఏళ్ల మైనర్ల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు ఉండటం విశేషం. గత సంవత్సరం పోర్టల్‌ను ఆశ్రయించిన వారి సంఖ్య కోటి దాటడం గమనార్హం. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుంచి ఏకంగా 19 లక్షల మంది పోర్టల్‌ను ఆశ్రయించారు. ఎక్కువ మందితో ఉత్తర్‌ప్రదేశ్ తొలి స్థానంలో నిలిచింది. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో మూడు లక్షలకు పైగా, తెలంగాణలో రెండు లక్షలకు పైగా వ్యక్తులు టెలి–లాను ఆశ్రయించారని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా న్యాయపరమైన హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించి వారికి న్యాయ సహాయం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'టెలి–లా'పోర్టల్‌ను ప్రారంభించిన విషయం విదితమే. ఈ పోర్టల్‌కు పౌరుల నుంచి మంచి స్పందన వస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు అత్యంత తీవ్రమైన సమస్యలతో పాటు అసంబద్ధమైన విషయాలపైనా న్యాయ సలహాలు కోరుతున్నారు. దీని ద్వారా.. కొన్ని చోట్ల పిల్లలపై జరుగుతున్న తీవ్రమైన నేరాలు వెలుగులోకి వచ్చాయి. మైనర్ల నుంచి ఆసక్తికరమైన ప్రశ్నలు సైతం పోర్టల్ అందుకుంది. న్యాయ సలహాలే కాకుండా ప్రభుత్వ పథకాల సమాచారాన్ని తెలుసుకునేందుకు కూడా 'టెలి–లా'పోర్టల్‌ను పెద్దసంఖ్యలో పౌరులు ఆశ్రయించి తగు సూచనలు, సలహాలు పొందారు. ఈ పోర్టల్ ద్వారా అన్ని రకాల చట్టపరమైన సమస్యలపై లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెందిన న్యాయవాదులు సంప్రదింపులు, సహాయంతో పాటు దిశానిర్దేశం చేస్తారు. 2024 డిసెంబర్ 31 నాటికి వివిధ రాష్ట్రాల నుండి 1,06,18,641 మంది న్యాయ సలహా కోసం పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వారిలో 1,0492,575 మందికి న్యాయ సహాయం, సంప్రదింపులు కూడా అందించారు. 'టెలి–లా'ను ఆశ్రయించిన టాప్ ఐదు రాష్ట్రాల్లో యూపీ తొలిస్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 1,902,911 మంది ఆశ్రయించగా 1,888,805 మంది సలహాలు పొందారు. మధ్యప్రదేశ్‌లో 1,126,681 మంది పోర్టల్‌ను ఆశ్రయించగా 1,125,191 మంది సలహాలు పొందారు. మహారాష్ట్ర నుంచి 838,214 మంది ఆశ్రయించగా 834,149 మంది సలహాలు పొందారు. జమ్మూకశ్మీర్ నుంచి 694,208 మంది ఆశ్రయించగా 687,375 మంది సలహాలు పొందగలిగారు. రాజస్థాన్ నుంచి 650,980 మంది ఆశ్రయంగా పొందారు. వీరిలో 646,394 మందికి లాయర్లు సలహాలు ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక అగ్రస్థానంలో నిలిచింది. కర్ణాటక నుంచి 401,838 మంది టెలి–లా పోర్టల్‌ను ఆశ్రయించగా 369,859 మంది సలహాలు అందాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 341,884 మంది పోర్టల్‌ను ఆశ్రయించగా 341,424మంది సలహాలు పొందారు. తెలంగాణ నుంచి 300,171 మంది ఆశ్రయించారు. వీరిలో 294,977 మందికి న్యాయవాదులు సలహాలు ఇచ్చారు. తమిళనాడు నుంచి 286,107 మంది ఆశ్రయంగా పొందగా 284,408 మంది సలహాలు పొందారు. కేరళ నుంచి 40,746 మంది పోర్టల్‌ను సలహాలు, సూచనలు అడగ్గా 36,891 మందికి సలహాలు ఇచ్చారు.

ఐఏఎస్ కల నుంచి సాధ్వీ గౌరీ గిరి దాకా...

బాహ్య ప్రపంచం నుంచి ఆధ్యాత్మిక మార్గంలోకి మరలిన బాలిక

- 19న జునా అఖాడాలో సభ్యత్వం తీసుకోనున్న టీనేజీ బాలిక
- మహాకుంభమేళాలో క్రతువు

ఇద్దరు ఆడపిల్లలున్న కుటుంబం అది. నిక్కీ అని ముద్దుగా పిలుచుకునే చెల్లెలు ప్రాచీతో కలిసి ఆడుకోవడమంటే 13 ఏళ్ల అక్క రాఖీ సింగ్‌కు మహా ఇష్టం. పాఠశాలలోనూ చక్కని చదువరి. పెద్దయ్యాక ప్రజాసేవ చేయాలనేది ఆమె కల. ఐఏఎస్ ఆఫీసర్ అవ్వాలనేది ఆమె ఆశయం. స్ప్రింగ్ ఫీల్డ్ ఇంటర్‌కాలేజీలో 9వ తరగతి చదువుతూ స్కూళ్లో పాఠ్యాంశాలతోపాటు రామయణ, భాగవతాది ఇతిహాసాలపైనా అనర్గళంగా మాట్లాడేది. హిందూ మతంపై అచంచల విశ్వాసం ఉన్న రాఖీసింగ్ దుర్గాదేవిని బాగా పూజించేది. దేవీ శరన్నవరాత్రుల కాలంలో చెప్పుల్లేకుండానే నడిచిందని స్కూల్ యాజమాన్యంలోని అధికారి పీసీ శర్మ చెప్పారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లాలోని దౌలీ పట్టణం ఈమె స్వస్థలం. ఆధ్యాత్మిక అంశాలపై ఆసక్తి చూపే రాఖీ హఠాత్తుగా తాను సన్యాసినిగా మారతానని చెప్పినా తల్లిదండ్రుల్లో ఎలాంటి కలవరపాటు లేదు. ఆధ్యాత్మిక భావాలున్న తమ పెద్దకూతురు నిర్ణయాన్ని వాళ్లు స్వాగతించారు. దీంతో జనవరి 19వ తేదీన జునా అఖాడాలో చేరి సాధ్వీగా మారేందుకు రాఖీ సిద్ధమైంది. ఆమెను పిండదాన్ క్రతువు తర్వాత గౌరీ గిరిగా పేరు మార్చి అఖాడాలో చేర్చుకుంటామని అఖాడా పెద్ద మహంత్ కౌషల్ గిరి చెప్పారు.

ఇటీవల మరికొందరూ..

ఇటీవలికాలంలో భారత్‌లో ఎంతోమంది సాధారణ జీవితానికి స్వస్తిపలికి ఆధ్యాత్మిక జీవితాన్ని ఆరంభించారు. ఇందులో టీనేజర్లూ ఉన్నారు. సూరత్‌లో వందల కోట్ల ఆస్తులున్న వజ్రాల వ్యాపారి గారాలపట్టి, 8 ఏళ్ల దేవాన్షీ సంఘ్వీ సైతం సన్యాసినిగా మారింది. జైన్ సాధ్విగా కొత్త జీవితాన్ని ప్రారంభించి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఇలాంటి ఘటన ఇంకోటి గుజరాత్‌లోనే జరిగింది. హిమ్మత్‌నగర్‌లో నిర్మాణరంగంలో వ్యాపారం చేస్తూ రూ.200 కోట్ల ఆస్తులు కూడబెట్టిన భవేశ్ భాయ్ భండారీ దంపతులు సన్యాసులుగా మారారు. అంతకుముందే అంటే 2022లోనే వీళ్ల టీనేజీ కుమారుడు, కుమార్తె సన్యాసులుగా మారడంతో వీళ్ల బాటలనే తల్లిదండ్రులు పయనించడం విశేషం.

మలుపు తిప్పిన మహాకుంభమేళా

తండ్రి సందీప్ సింగ్ ధాకరా, తల్లి రీమా సింగ్‌లతో కలిసి గత ఏడాది డిసెంబర్‌లో ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా ప్రాంతానికి వెళ్లింది. అక్కడి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంది. ప్రాపంచిక సుఖాలకు దూరంగా నిరాడంబరంగా గడుపుతున్న సాధువుల జీవనశైలిని చూసి ఆకర్షితురాలైంది. ఐఏఎస్ అధికారిగా ప్రజల కష్టాలను తీర్చే బదులు ఆధ్యాత్మిక బోధనల ద్వారా ప్రజల మానసిక సమస్యలు తీర్చడం ముఖ్యమని భావించింది. బాహ్య ప్రపంచ కష్టాల కడలిని ఈదలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలను తన ఆధ్యాత్మిక బోధనలతో సాంత్వన చేకూరుస్తానని, సాధ్విగా తన వంతు సాయం చేస్తానని రాఖీసింగ్ చెప్పింది. డిసెంబర్ 26వ తేదీన తన నిర్ణయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వెంటనే వాళ్లు అందుకు అంగీకరించి సెక్టార్20 ప్రాంతంలోని మహంత్ కౌషల్ గిరి ఆశ్రమంలో చేర్పించారు.

కన్యాదానం నుంచి సాధ్వి దాకా

13 ఏళ్ల రాఖీ నడవడికను స్వయంగా గమనించిన అఖాడా పెద్దలు ఆమెను సన్యాసినిగా స్వీకరించేందుకు అంగీకరించారు. గురుగ్రామ్ నుంచి మహంత్ రాగా ఆయన సమక్షంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ జనవరి ఆరో తేదీన తల్లిదండ్రులు ఆశ్రమానికి రాఖీని కన్యాదానం చేశారు. ఆరోజున అఖాడాలు ఆమెకు గౌరి అని నామకరణం చేశారు.



దీక్షలో సాధ్వీ గౌరీ గిరి

కూతురు సన్యాసినిగా మారుతుండటంపై తల్లి రీమా స్పందించారు. ''మా కుటుంబం గత నాలుగేళ్లగా ఆధ్యాత్మిక మార్గంలోనే పయనిస్తోంది. మహంత్ మేముండే ప్రాంతంలో భాగవతం విశేషాలను అందరికీ విడమరిచి చెప్పేవారు. ప్రయాగ్‌రాజ్ వెళ్లినప్పుడు రాఖీ తన మనసులోని మాట చెప్పింది. అది ఆమె నిర్ణయం కాకపోవచ్చు. భగవత్ సంకల్పం అనుకుంటా. ఆశ్రమంలో ఎందుకు చేర్పించారని బంధువుల నుంచి ఎన్నో ప్రశ్నలు. అయినా తల్లిగా నా బిడ్డ అక్కడ ఎలా ఉండగలదు? ఏం తింటుంది? అనే భయం నాకూ ఉంది. కానీ ఆమె నిర్ణయం దైవేచ్ఛ కాబట్టి మేం కూడా అడ్డుచెప్పలేదు''అని తల్లి రీమా అన్నారు.

సుదీర్ఘంగా క్రతువు

సనాతన ధర్మ ప్రకారం సాధ్విగా మారితే ఆ అమ్మాయి కేశసంరక్షణపై ధ్యాస పెట్టకూడదు. జుట్టంతా ఉండలు కట్టినా పట్టించుకోవద్దు. కాషాయ వస్త్రాలు, రుద్రాక్షలు ధరించాలి. సాధ్విగా మారే రోజున ఐదుగురు సాధువులు ఇచ్చిన ఐదు పవిత్ర పత్తిదారాలను స్వీకరించాలి. సన్యాసుల అన్నపానాలు, దీక్షా నియమాలను పాటించాలి. ప్రేమ, రాగద్వేషాలు, కామామోహాలను త్యజించాలి. మహాకుంభమేళాలో నాలుగో పవిత్ర పుణ్యస్నానాల రోజున అంటే జనవరి 19వ తేదీన పిండదాన్ క్రతువులో భాగంగా గౌరీని వేదమంత్రోచ్ఛారణల మధ్య గంగానదిలో 108 సార్లు ఓం నమఃశివాయ అని చదివిస్తూ ముంచుతారు. తర్వాత గంగాదేవికి హారతి ఇచ్చాక గౌరీ గిరిగా కొత్త పేరుతో పిలుస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆగని రష్యా దాడులు

ఉక్రెయిన్‌లో 13 మంది పౌరుల మృతి

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం జపోరిఝియా ప్రాంతంలోని పట్టణంపై రష్యా ప్రయోగించిన మిస్సైల్ దాడిలో 13 మంది ఉక్రేనియన్ల ప్రాణాలు కోల్పోయారు. 30 మంది గాయాలపాలయ్యారని రీజనల్ గవర్నర్ ఇవాన్ ఫెడరోవ్ తెలిపారు. రక్తమోడుతున్న పౌరులను నగర వీధిలో రోడ్డుపైనే ప్రథమ చికిత్సనందిస్తున్న దృశ్యాలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన టెలిగ్రామ్ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్‌చేశారు. ''కేవలం సాధారణ పౌరులున్న సిటీపై దాడి చేస్తే అమాయకులు చనిపోతారని తెలిసీ రష్యా దారుణాలకు ఒడిగడుతోంది''అని జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తంచేశారు. గత మూడేళ్లుగా తరచూ రష్యా గగనతల దాడులతో ఉక్రేనియన్ల కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత యూరప్‌లో అతిపెద్ద సంక్షోభంగా మారిన ఈ యుద్ధంలో ఇప్పటిదాకా వేలాది మంది ఉక్రెయిన్ పౌరులు చనిపోయారు.

రైల్వే అభివృద్ధికి 76% నిధులు ఖర్చు

- రూ.2.65,200 కోట్ల బడ్జెట్‌కు గాను రూ.1,92,446 ఖర్చు చేశాం
- వివరాలు వెల్లడించిన రైల్వే మంత్రిత్వ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ రైల్వే రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నట్లు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. రైల్వేకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో ఖర్చు చేస్తూ.. మరో పక్క కోట్లాది మంది ప్రయాణికులకు అతి తక్కువ ఖర్చులో సౌకర్యార్థమైన ప్రయాణాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల నాలుగు రోజుల్లో (2024–25) బడ్జెట్ కేటాయించిన 76 శాతం నిధులు ఖర్చు చేసినట్లు బుధవారం రైల్వే మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. గత పదేళ్లలో భారతీయ రైల్వే క్రమక్రమంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొంది. 2024–25 బడ్జెట్ అంచనాల్లో రైల్వేల మొత్తం బడ్జెట్ రూ.2,65,200 కోట్లు కాగా ఇందులో ఇప్పటికే రూ.1,92,446కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. వీటిలో రోలింగ్ స్టాక్ కోసం రూ.50,903 కోట్లు కేటాయించగా ఇందులో నుంచి రూ.40,367 కోట్లు జనవరి 5 నాటికి ఖర్చు చేసినట్లు వివరించింది. భద్రతకు సంబంధించిన పనులకు రూ.34,412 కోట్లు కేటాయించగా రూ.28,281 కోట్లు ఖర్చు అయ్యింది. ఈ పదేళ్లలో 136 వందే భారత్ రైళ్లు, బ్రాడ్‌గేజ్‌లో 97 శాతం విద్యుదీకరణ, కొత్త లైన్ల ఏర్పాటు, గేజ్ మార్పిడి, ట్రాక్‌ల రెట్టింపు, ట్రాఫిక్ సౌకర్యాల పనులన్నీ పెట్టుబడి రూపంలో కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ దేశవ్యాప్తంగా 2.3 కోట్ల మంది ప్రయాణికులను రైళ్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు చేర్చుతున్నట్లు భారతీయ రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

అధికారంలోకి వస్తే రూ. 25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

ఢిల్లీలో కాంగ్రెస్ హామీ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే 'జీవన్ రక్షా యోజన'పథకం కింద ప్రతి ఒక్కరికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ బుధవారం హామీ ఇచ్చింది. దీర్ఘకాలిక వ్యాధులు, ఆసుపత్రుల్లో చేరిక, చికిత్సలకు ఈ పథకం కింద సమగ్ర బీమా వర్తిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ప్రకటించారు. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. దేశానికి ఇది అవసరమన్నారు. ఢిల్లీ వాసుల ఆరోగ్య అవసరాలు తీర్చడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందనడానికి జీవన్ రక్షా యోజన నిదర్శనమన్నారు. 'ఈ రోజు వరకు కాంగ్రెస్ పార్టీయే దేశాన్ని కలిపి ఉంచిందని, కాంగ్రెస్ అన్ని కులాలను, మతాలను కలుపుకొని వెళుతుందని గహ్లోత్ పేర్కొన్నారు. రూ. 25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా పథకం రాజస్తాన్‌లో అత్యంత విజయవంతమైందని, ఢిల్లీలోనూ జనాదరణ పొందుతుందని అన్నా రు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఈ బీమా పథకంలో చేరుస్తామని, ప్రతి ఢిల్లీ వాసికి ఇది ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.



ఇన్నాళ్లూ గాల్లో చక్కర్లు కొట్టిన ఈ విమానం ఇప్పుడు భోజన ప్రియులకు 'టైగర్ ఏరో రెస్టారెంట్'గా సేవలందిస్తోంది. పాత విమానాన్ని ఇలా రెస్టారెంట్‌గా మార్చారు. బెంగళూరులో ఉందీ హోటల్.

ఆప్‌కే కీలక పార్టీల మద్దతు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఇండియా కూటమి పెద్దన్న కాంగ్రెస్ ఒంటరైపోయేలా ఉంది. కూటమి కీలక పార్టీలైన తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ, శివసేన (యూబీటీ)లు అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు ప్రకటించాయి. ఫిబ్రవరి 5వ తేదీన జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ పొత్తులేకుండా వేర్వేరుగా పోటీచేస్తున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఆప్‌కు మద్దతునిస్తుందని ఆ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ బుధవారం ప్రకటించారు. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి కృతజ్ఞతలు తెలిపారు. 'ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ ఆప్‌కు మద్దతు పలికింది. దీనికి మమతా దీదీకి కృతజ్ఞతలు. మంచి చెడుల్లో మీరు మాకు అండగా ఉన్నారు. అందుకు ధన్యవాదాలు'అని కేజ్రీవాల్ బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. డిసెంబరులో ఆప్ నిర్వహించిన మహిళా అదాలత్‌లో సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆప్‌కు మద్దతు ప్రకటించారు. అలాగే శివసేన (యూబీటీ) కూడా ఆప్‌కు మద్దతుగా మరికొద్దిరోజుల్లో ప్రచారంలోకి దిగనుందని సమాచారం. ఈమేరకు కేజ్రీవాల్.. ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడుతున్నట్లు తెలిసింది.

లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు ఆప్, కాంగ్రెస్ పొత్తు పెట్టుకొని పోటీచేసినా ఖాతా తెరవలేకపోయాయి. అమలులో లేని పథకాల పేరు చెప్పి కేజ్రీవాల్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ ఈసీకి ఫిర్యాదు చేయడం.. ఆప్‌కు ఆగ్రహం తెప్పించింది. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్‌ను తొలగించాలని ఇతర భాగస్వామ్యపక్షాలను సంప్రదిస్తామని ఆప్ ప్రకటించింది. కాగా మరోవైపు ఢిల్లీ ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక, మల్లికార్జున ఖర్గే కనిపించడం లేదు. ద్వితీయశ్రేణి నాయకులే ప్రచార బాధ్యతలు మోస్తున్నారు. 70 అసెంబ్లీ స్థానాలున్న ఢిల్లీలో ఆప్ 2015లో 67, 2020 ఎన్నికల్లో 62 స్థానాలు నెగ్గిన విషయం తెలిసిందే.

హసీనా వీసా గడువు పెంపు

పాస్ట్‌పోర్ట్‌ను రద్దుచేసిన బంగ్లాదేశ్ సర్కార్

న్యూఢిల్లీ: విద్యార్థుల ఉద్యమం, ఎగసిన అల్లర్లతో స్వదేశం వీడి భారత్‌లో తలదాచుకుంటున్న పదవీచ్యుత బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా విషయంలో మోదీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆమెకు ఇచ్చిన వీసా గడువును పొడిగించింది. గత ఏడాది జూలై–ఆగస్ట్‌లో బంగ్లాదేశ్‌లో దేశ విమోచన పోరాటయోధుల కుటుంబాలు, వారసులకు నియామకాల్లో రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ మొదలైన ఉద్యమాన్ని హసీనా ఉక్కుపాదంతో అణిచేసి దారుణాలకు పాల్పడ్డారని ఆమెను విచారిస్తామని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించడం తెల్సిందే. ఆమె పాస్ట్‌పోర్ట్‌ను రద్దుచేస్తున్నట్లు మొహమ్మద్ యూనుస్ సర్కార్ మంగళవారం ప్రకటించిన వేళ ఆమె వీసా గడువను భారత్ తాజాగా పొడిగించడం గమనార్హం. ఆమెతోపాటు 75 మంది పాస్ట్‌పోర్ట్‌లను రద్దుచేస్తున్నట్లు బంగ్లాదేశ్ ప్రకటించింది.

అంతులేని నిర్లక్ష్యమిది

- బాలుడిని అన్యాయంగా పాతికేళ్లు జైలు పాలుచేశారు
- న్యాయం పొందే అన్ని అవకాశాలనూ పోగొట్టారు
- తక్షణం అతణ్ణి విడుదల చేయండి: సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: పద్నాలుగేళ్ల టీనేజర్‌ను 20 ఏళ్ల వయసు వ్యక్తిగా తప్పుగా నిర్ధారించి జీవితకాల శిక్ష వేయగా 25 సంవత్సరాల తర్వాత సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో అతను ఎట్టకేలకు జైలు నుంచి విడుదలకాబోతున్నాడు. తాను మైనర్‌ను అని అతను పెట్టుకున్న అర్జీను బుట్టదాఖలు చేసి కింది కోర్టులు అతడిని సమాజంతో మళ్లీ మమేకం కాకుండా శాశ్వతంగా దూరం చేశారని సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పాతికేళ్ల జీవితాన్ని కారాగారంలో కోల్పోయిన ఓం ప్రకాశ్ అలియాస్ రాజు దాస్ అనే వ్యక్తిని తక్షణం విడుదల చేయాలంటూ జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం తీర్పు చెప్పింది.

అడుగడుగునా అన్యాయం

''బాల నేరస్థునిగా అత్యల్ప శిక్ష అనుభవించాల్సిన ఒక మైనర్ బాలుడు కోర్టుల తప్పులకు దారుణ శిక్షను అనుభవించిన ఉదంతం ఇది. జైళ్లో ఉన్నన్ని రోజులు ఎలాంటి గొడవలకు దిగలేదు. మౌనంగా శిక్షను అనుభవించాడు. సమాజంతో కలిసే సువర్ణావకాశాన్ని కోల్పోయాడు. జీవితంలో ఎంతో విలువైన సమయాన్ని కోల్పోయాడు. దానిని మనం తిరిగివ్వలేం''అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ''హత్య నేరానికి జైలు శిక్షను ఎదుర్కొనేనాటికి అతని వయసు కేవలం 14 సంవత్సరాలు. అయితే 2001 మార్చి ఏడో తేదీన బ్యాంక్ అకౌంట్ తెరిచేందుకు అందులో 20 ఏళ్లు అని పేర్కొన్న విషయాన్ని మాత్రమే కోర్టు పరిగణనలోకి తీసుకుని అతని వయసును 20 ఏళ్లుగా లెక్కలేసుకుంది. దానికి తగ్గట్లే మరణశిక్ష విధించింది. క్షమాభిక్ష కోరుతూ రాష్ట్రపతికి అర్జీ పెట్టుకుంటే 60 ఏళ్ల వయసు వచ్చేవరకు బెయిల్‌పై కూడా విడుదలకాకుండా మరణశిక్షను యావజ్జీవశిక్షగా విధిస్తూ రాష్ట్రపతి శిక్షను తగ్గిస్తూ 2012 మే 8న ఉత్తర్వులిచ్చారు. ప్రతి సందర్భంలోనూ నిజాలు, డాక్యుమెంట్లు స్పష్టంగా కంటికి కనిపిస్తున్నా కోర్టులు ఇతన విషయంలో శీతకన్ను వేశాయి. ట్రయల్ కోర్టు మొదలు హైకోర్టు దాకా అతని మొర ఏ కోర్టూ వినలేదు. అతను మైనర్ అని సర్టిపై చేసిన పాఠశాల సర్టిఫికేట్‌ను ఎవరూ పరిశీలించలేదు. పదేళ్లు దాటిన మైనర్ కూడా బ్యాంక్ ఖాతా తెరవొచ్చని సమాచారహక్కు చట్టం ద్వారా తాను తెల్సుకున్న విషయాన్ని కోర్టులకు నివేదించినా అతనికి న్యాయం దక్కలేదు. బ్యాంక్ ఖాతా ఉందన్న ఒకే ఒక్క కారణంగా అతను మేజర్ అని తప్పుడు లెక్క వేశారు''అని సుప్రీంకోర్టు ఆవేదన వ్యక్తంచేసింది. విడుదలయ్యాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకం ఇతనికి అమలయ్యేలా చూడాలని ఆదేశించింది.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఆర్టికల్ ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

స్థానిక ప్రభుత్వాలు

మండల పరిషత్

మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల పరిషత్ మధ్యస్థ అంచె. 1986లో ఎన్టీ రామారావు హయాంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 330 పంచాయతీ సమితిల స్థానంలో 1104 మండలాలను ఏర్పాటు చేశారు. మండల పరిషత్‌లో సుమారు 15 నుంచి 18 గ్రామ పంచాయతీలు, 35 వేల నుంచి 55 వేల జనాభా ఉంటుంది. మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో తాలుకా పంచాయతీ అని, మధ్యప్రదేశ్‌లో జన్‌పథ్ పంచాయతీ, తమిళనాడులో పంచాయతీ సంఘం, అరుణాచల్ ప్రదేశ్‌లో అంచల్ కమిటీ, ఉత్తరప్రదేశ్‌లో క్షేత్ర పంచాయతీ , ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మండల పరిషత్ అని వ్యవహరిస్తారు.

మండల పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి ఓటర్లతో ప్రత్యక్షంగా ఎన్నికైన సభ్యులు(ఎంపీటీసీ).
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఆ ప్రాంతంలో రిజిస్టర్ అయిన ఎమ్మెల్సీ, రాజ్యసభ మెంబర్ సభ్యులుగా ఉంటారు.
- ఎంపీటీసీ సభ్యులు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఒకరిని కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకుంటారు.
- మండల పరిషత్ సమావేశాలకు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. వీరికి ఓటు హక్కు ఉండదు.
- 3 నుంచి 4 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక ప్రాదేశిక నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తారు.
- ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల పదవీ కాలం అయిదేళ్లు.
- కలెక్టర్, వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు మండల పరిషత్‌లో శాశ్వత ఆహ్వానితులు. వీరికి ఓటు వేసే అధికారం లేదు.
- ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986 జూన్‌లో ఏర్పాటు చేశారు. 1987 జనవరి 7న నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

విధులు

గ్రామ పంచాయతీ, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో మండల పరిషత్ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం విత్తనాలు, ఎరువుల సరఫరా, నీటి సౌకర్యం కల్పించి బీడు భూములను సాగులోకి తేవడం, అడవుల పెంపకం, పశుగణాభివృద్ధి, ఆరోగ్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రసూతి కేంద్రాలు, టీకాలు, అంటు రోగాల నివారణ, ప్రాథమిక విద్యా సౌకర్యాల కల్పన, పర్యవేక్షణ.

ఆర్థిక వనరులు

- భూమి శిస్తు, రాష్ట్రం విధించే పన్నులు, ఫీజుల నుంచి వచ్చే వాటా.
- సామాజిక అభివృద్ధికి సంబంధించిన నిధులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అఖిల భారత సంస్థలు ఇచ్చే గ్రాంట్లు.
- మండల పరిషత్ విధించే పన్నుల ద్వారా వచ్చే ఆదాయం
- దాతలు ఇచ్చే విరాళాలు
- మండల పరిషత్ కార్యనిర్వహణాధికారిగా మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌ను ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 9 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. హైదరాబాద్‌కు జిల్లా పరిషత్ లేదు.

జిల్లా పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజక వర్గాల నుంచి ఓటర్లతో ఎన్నికైన సభ్యులు (జెడ్పీటీసీలు)
- జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు.
- అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు.
- జెడ్పీటీసీ సభ్యుల నుంచి ఒకరిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ప్రతి జిల్లా పరిషత్‌లో జిల్లా మహాసభ ఉంటుంది. ఇందులో జిల్లాలోని మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారు.
- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇతడు జిల్లా పరిషత్‌కు పాలనా పరమైన అధికారిగా విధులు నిర్వహిస్తాడు.



జిల్లా పరిషత్ స్థాయి సంఘాలు

1. ప్రణాళికా, ఆర్థిక స్టాండింగ్ కమిటీ
2. గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ
3. వ్యవసాయ స్టాండింగ్ కమిటీ
4. విద్య, వైద్య సేవల స్టాండింగ్ కమిటీ
5. స్త్రీ, సంక్షేమ స్టాండింగ్ కమిటీ
6. సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ
7. పన్నుల స్టాండింగ్ కమిటీ

- ప్రతి స్థాయి కమిటీలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవీరీత్యా సభ్యుడిగా ఉంటాడు. కానీ అతడికి ఓటు వేసే అధికారం ఉండదు. ఇతర సభ్యులను నామినేట్ చేస్తాడు.
- జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశాలకు జిల్లా కలెక్టర్ హాజరు కావొచ్చు. కానీ ఓటు హక్కు ఉండదు.

జిల్లా పరిషత్ విధులు

- జిల్లా పరిషత్ జిల్లాలోని మండల పరిషత్‌ల వార్షిక బడ్జెట్లను ఆమోదిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను మండల పరిషత్‌లకు పంపిణీ చేస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల అమలు.
- గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల ఆర్థిక విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు ఇస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమయ్యే గణాంక సమాచారాన్ని అందిస్తుంది.
- జిల్లాలో సెకండరీ పాఠశాలలు, వృత్తి విద్యా పాఠశాలలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుంది.
- జిల్లాలో వైద్య సౌకర్యాల నిర్వహణ.

ఆర్థిక వనరులు

1. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు.
2. అఖిల భారత సంస్థలు అందించే గ్రాంట్లు.
3. భూమి పన్ను.
4. ఎండోమెంట్స్,ట్రస్టుల ద్వారా వచ్చే ఆదాయం
5. ఫీజులు.
6. ప్రజలు, సంస్థలు ఇచ్చే విరాళాలు.
7. మండల పరిషత్‌ల నుంచి వచ్చే కంట్రి బ్యూషన్లు.
8. లాభసాటి సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం.

- 243 (జె) అధికరణం ద్వారా పంచాయతీల ఖర్చులను రికార్డ్ చేయడం. ఆడిటింగ్‌కు సంబంధించి తగిన శాసనాన్ని శాసనసభ చేయాలి.
- 243 (జెడ్‌డీ) అధికరణం ప్రకారం జిల్లా ప్రణాళికా అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలి.
- ఎస్సీ, ఎస్టీలు నివసించే ప్రదేశాల్లో పంచాయతీ రాజ్ విధానం అమలు కోసం 1994 లో 'దిలీప్ సింగ్ బురియా' కమిటీని ఏర్పాటు చేశారు.
- దిలీప్‌సింగ్ బురియా కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేసింది. ఈ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం 1996 డిసెంబర్ 24న ఆమోదించింది.

ఈ కమిటీ ప్రతిపాదించిన మూడంచెలు

1. గ్రామసభ
2. గ్రామ పంచాయతీ
3. పంచాయతీ సమితి/ తాలుకా పంచాయతీ

మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ పీఠికలోని 'భారత ప్రజలమైన మేము' అనే పదాలు ఏ విషయాన్ని తెలియజేస్తాయి?
   ఎ) ప్రజలు స్వార్థపరులు
   బి) ప్రజలే సార్వభౌములు
   సి) ప్రజలు చేతకాని వారు
   డి) ఏదీకాదు
2. సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెబుతూ రాజ్యాంగంలో 'మౌలిక లక్షణాలు' అనే అంశాన్ని స్పష్టీకరించింది?
   ఎ) గోలక్‌నాథ్ కేసు
   బి) మినర్వా మిల్స్ కేసు
   సి) ఇందిరా సహానీ కేసు
   డి) కేశవానంద భారతి కేసు
3. భారత రాజ్యాంగం మొదట కల్పించిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
   ఎ) అయిదు బి) ఏడు
   సి) ఆరు డి) తొమ్మిది
4. ఏ తరహా ప్రభుత్వ విధానాన్ని భారత రాజ్యాంగం అవలంబించింది?
   ఎ) ఏక కేంద్ర ప్రభుత్వం
   బి) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
   సి) అధ్యక్ష తరహా ప్రభుత్వం
   డి) నియంతృత్వ ప్రభుత్వం
5. రాజ్యాంగంలో అస్పృశ్యత నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
   ఎ) 14 బి) 15
   సి) 16 డి) 17
6. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించిన ఆర్టికల్?
   ఎ) 17 బి) 16 (4)
   సి) 18 డి) 18 (2)
7. భారత రాజ్యాంగం పౌరులకు ఎన్ని రకాల స్వేచ్ఛలను కల్పించింది?
   ఎ) అయిదు బి) ఏడు
   సి) ఆరు డి) ఎనిమిది
8. ప్రస్తుతం ఆస్తి హక్కు 300-ఎ ఆర్టికల్ కింద ఏ హక్కుగా మారింది?
   ఎ) రాజకీయ హక్కు
   బి) ఆర్థిక హక్కు సి) పౌర హక్కు
   డి) నైతిక హక్కు
9. 2002లో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యను 21 (ఎ) ఆర్టికల్ కింద చేర్చారు?
   ఎ) 80 బి) 81
   సి) 87 డి) 86
10. భారత పౌరులకు రాజ్యాంగం ద్వారా లభించిన పౌరసత్వం?
   ఎ) ద్వి పౌరసత్వం బి) ఏక పౌరసత్వం
   సి) త్రి పౌరసత్వం డి) ఏదీకాదు
11. భారత రాజ్యాంగంలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులు ఎన్ని?
   ఎ) 9 బి) 10 సి) 11 డి) 12
12. ఒక వ్యక్తిని 24 గంటలకు మించి కస్టడీలో ఉంచడానికి వీలు లేదని తెలిపే ఆర్టికల్?
   ఎ) 20 బి) 21
   సి) 22 డి) 23
13. ప్రాథమిక విధులపై పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీ?
   ఎ) స్వరణ్‌సింగ్ కమిటీ
   బి) సైమన్ కమిటీ
   సి) సర్కారియా కమిటీ
   డి) వెంకటాచలయ్య కమిటీ
14. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం?
   ఎ) సిక్కిం బి) తమిళనాడు
   సి) గోవా డి) హర్యానా
15. ఏ ప్రధానమంత్రి హయాంలో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు?
   ఎ) రాజీవ్‌గాంధీ బి) ఇందిరాగాంధీ
   సి) చంద్రశేఖర్
   డి) పి.వి.నరసింహారావు
16. ప్రపంచంలో ఆదేశిక సూత్రాలను మొదటిసారిగా ఏ దేశంలో రూపొందించారు?
   ఎ) న్యూజిలాండ్ బి) స్పెయిన్
   సి) ఐర్లాండ్ డి) రష్యా
17. న్యాయవ్యవస్థ నుంచి కార్యనిర్వాహక వర్గాన్ని వేరు చేయాలని సూచించే ఆర్టికల్?
   ఎ) 49 బి) 50
   సి) 51 డి) 52
18. ఆదేశిక సూత్రాల ప్రధాన లక్ష్యం 'ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటం' అని పేర్కొన్నది ఎవరు?
   ఎ) ఎం.ఎన్.రాయ్
   బి) రాజేంద్రప్రసాద్
   సి) బి.ఆర్.అంబేద్కర్
   డి) హెచ్.జె. లాస్కీ
19. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను ఎన్నో భాగంలో పొందుపర్చారు?
   ఎ) 4 బి) 5 సి) 6 డి) 4(ఎ)
20. ప్రపంచంలో మొదటిసారిగా సమాచార స్వేచ్ఛను చట్టం చేసిన దేశం?
   ఎ) ఫ్రాన్స్ బి) స్వీడన్
   సి) అమెరికా డి) చైనా

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) బి; 5) డి; 6) బి; 7) సి; 8) సి; 9) డి; 10) బి; 11) సి; 12) సి; 13) ఎ; 14) సి; 15) బి; 16) బి; 17) బి; 18) సి; 19) డి; 20) బి.

విద్య, ఉద్యోగ సమాచారం

బీఐఎస్, న్యూఢిల్లీలో మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఒప్పంద ప్రాతిపదికన మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **వేతనం:** నెలకు రూ.1.5 లక్షలు.
» **విభాగాలు:** ఎస్ఎండీ/ఐఆర్ అండ్ టీఐఎస్‌డీ, టీఎస్ఎండీ, ఎస్ఐటీఎస్.
» **అర్హత:** ఎంబీఏ(మార్కెటింగ్), ఇంజనీరింగ్, ఎంఏ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, ఉద్యోగానుభవం , టెక్నికల్ నాలెడ్జ్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**17.01.2025
» **వెబ్‌సైట్:** www.bis.gov.in

ఆర్ఐఎన్ఎల్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో 250 అప్రెంటిస్‌లు

రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్(ఆర్ఐఎన్ఎల్)కు చెందిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో 2024 బ్యాచ్‌కు సంబంధించి గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ(జీఏటీ),టెక్నీషియన్ అప్రెంటిస్ ట్రైనీ (టీఏటీ) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 250.
» **విభాగాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ: మెకానికల్, ఎలక్ట్రికల్ /ఎలక్ట్రికల్ -ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్/ఐటీ, మెటలర్జీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, కెమికల్.
» **టెక్నీషియన్ అప్రెంటిస్ ట్రైనీ:** మెకానికల్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్, సివిల్, మైనింగ్, కంప్యూటర్ సైన్స్/మెటలర్జీ, కెమికల్.
» **అర్హత:** 2022/2023/2024 సంవత్సరాల్లో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు ఎంహెచ్ఆర్‌డీ ఎన్ఏటీఎస్ 2.0 పోర్టల్‌లో ఖచ్చితంగా రిజిస్టర్ అయి ఉండాలి.
» **స్టైపెండ్:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లకు నెలకు రూ.9000. డిప్లొమా అభ్యర్థులకు నెలకు రూ.8000.
» **శిక్షణా కాలం:** ఎంపికైన అభ్యర్థులకు ఒక ఏడాది పాటు శిక్షణ ఉంటుంది.
» **ఎంపిక విధానం:** అభ్యర్థులకు ఎలాంటి రాత పరీక్ష ఉండదు. డిప్లొమా, బీఈ/బీటెక్‌లో సాధించిన మెరిట్ మార్కులు, ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.01.2025.
» **వెబ్‌సైట్:** www.vizagsteel.com

'కనుల కొలనులో దాగిన నీ రూపం'

కావ్య సరస్వతికి శోభను చేకూర్చేవి అలంకారాలు. 'అలం' శబ్దానికి 'కృ' ధాతువు చేరి 'అలంకారం' అనే రూపం సిద్ధించింది. అలంకారమంటే భూషణం అని అర్థం. ఇవి కావ్య సౌందర్యాన్ని పెంపొందించి, శోభను కలిగిస్తాయి. అలంకారకులు వీటిని ప్రధానంగా శబ్దాలంకారాలు, అర్థాలంకారాలని రెండు రకాలుగా విభజించారు. భోజుడు 'సరస్వతీ కంఠాభరణం'లో మూడు విధాలుగా పేర్కొన్నాడు. శబ్ద, అర్థాలంకాలతో పాటు ఉభయాలంకారాలను (శబ్దార్థ మిశ్రమాలు) వివరించాడు. ఆ తర్వాత మమ్మటుడు, రుయ్యకుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు లాంటివారు మిశ్రాలంకారాల గురించి ప్రస్తావించారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు - కంటెంట్ (ఎస్ఏ)

అలంకారాలు

అలంకారాల్లో ప్రధానమైనవి శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు.

శబ్దాలంకారాలు

శబ్ద వైచిత్రీ రామణీయకత వల్ల కావ్యానికి సౌందర్యాన్ని చేకూర్చేవి శబ్దాలంకారాలు. సంగీతానుగుణ్యమైన శ్రవణ పేయతతో పాఠకులకు ఆహ్లాదం కలిగించేవి శబ్దాలంకారాలు. ఇవి ఆరు రకాలు.

1. వృత్త్యనుప్రాసం 2. ఛేకానుప్రాసం
3. లాటాను ప్రాసం 4. యమకం
5. ముక్తపదగ్రస్తం 6. అంత్యానుప్రాసం

1. **వృత్త్యనుప్రాసం:** ఒకటి లేదా రెండు మూడు వర్ణాలు పునరుక్తాలై ఆహ్లాదం కలిగిస్తే అది వృత్త్యనుప్రాసం.
   ఉదా: 'హరిహరి సిరియురమున గలహరి'
   ఇందులో 'ర' కారం పునరుక్తమై ఆహ్లాదం కలిగిస్తోంది. అందువల్ల ఇది వృత్త్యనుప్రాసం.
2. **ఛేకానుప్రాసం:** అర్థ భేదం ఉన్న రెండేసి హల్లులు అవ్యవధానంగా పునరుక్తమై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది ఛేకానుప్రాసం. ఛేకులంటే పండితులు అని అర్థం. ఛేకులకు ఆహ్లాదం కలిగించే అనుప్రాసం ఛేకానుప్రాసం.
   ఉదా: 'కందర్పదర్పములగు సందర దరహాస రుచులు'. ఈ లక్ష్యంలో దర్ప-దర అనే రెండేసి హల్లులు అర్థభేదంతో పునరుక్తమయ్యాయి. కాబట్టి ఇది ఛేకానుప్రాసం.
3. **లాటాను ప్రాసం:** తాత్పర్య భేదం ఉన్న శబ్దాలు పునరుక్తాలై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది లాటానుప్రాసం.
   ఉదా: 'కమలాక్షునర్చించు **కరములు కరములు** శ్రీనాథు వర్ణించు **జిహ్వ జిహ్వ**' 'కరములు', 'జిహ్వ' శబ్దాలు తాత్పర్య భేదంతో పునరుక్తాలైనందువల్ల ఇది లాటానుప్రాసం.
4. **యమకం:** సమాన స్వరసహితాలైన వ్యంజనాలు అర్థభేదంతో అవ్యవహితంగా పునరుక్తాలైతే అది యమకం.
   ఉదా: 'మన **సుభద్ర** మనసుభద్రమయ్యె' సుభద్ర అనే అక్షరాలు అర్థభేదంతో అవ్యవహితంగా వచ్చాయి. కాబట్టి ఇది యమకం.
5. **ముక్తపదగ్రస్తం:** మొదటి పాదం చివరి పదం రెండో పాదంలో మొదటి పదంగా రావడాన్ని ముక్తపదగ్రస్తం అంటారు. అంటే విడిచిన పదాన్ని గ్రహించడం అని అర్థం.
   ఉదా: 'సుదతీ నూతన **మదనా**
   మదనా గతురంగ పూర్ణ మణిమయసదనా'
   మొదటి పాదం చివర ఉన్న 'మదనా' పదం రెండోపాదం మొదటిపదంగా వచ్చింది. అందువల్ల ఇది ముక్తపదగ్రస్తం.
6. **అంత్యానుప్రాసం:** ప్రతి పాదం చివరన ఒకే అక్షరం లేదా పదం రావడాన్ని అంత్యాను ప్రాసం అంటారు.
   ఉదా: కమనీయశుభగాత్రు - కంజాతదళనేత్రు
   వసుధాకళత్రు - పావన చరిత్రు 'త్రు' అనే అక్షరం పాదాల చివర వచ్చినందువల్ల ఇది అంత్యానుప్రాసం.

అర్థాలంకారాలు

అర్థ సౌందర్యం వల్ల కావ్య శోభను ద్విగుణీకృతం చేసేవి అర్థాలంకారాలు. అర్థం లేని శబ్ద సౌందర్యం ఆహ్లాదకరం కాదు. అర్థ ప్రధానమైన అలంకారాలు అర్థాలం కారాలు. వీటిలో ప్రధానమైనవి..

1. **ఉపమాలంకారం:** ఉపమాన, ఉపమేయా లకు మనోహరమైన సాదృశ్యాన్ని చెప్పడాన్ని ఉపమాలంకారం అంటారు. ఇందులో ఉపమేయం (ప్రస్తుతం), ఉపమానం (అప్రస్తుతం), సమాన ధర్మం (ఉపమేయ, ఉపమానాల్లో సమానంగా ఉండేది), ఉపమావాచకం (ఉపమేయ, ఉపమానాలకు సమాన ధర్మాన్ని సూచించేది) ఉంటాయి. వలెన్, పోలెన్, ఎంతయున్, కైవడి, భంగి, అట్లు, అనంగ మొదలైనవి ఉపమావాచకాలు. పైన పేర్కొన్న నాలుగు అంశాలుంటే దాన్ని పూర్ణోపమాలంకారం అంటారు. ఏదైనా ఒక అంశం లోపిస్తే దాన్ని లుప్తోపమాలంకారం అంటారు.
   భరతుడు ఉపమాలంకారంలో ఐదు భేదాలను చెప్పాడు. మమ్మటుడు లాంటి ఆలంకారకులు 25 భేదాలను పేర్కొన్నారు. దండి 32 భేదాలను చెప్పాడు. చంద్రాలోకకర్త చెప్పిన ఏడు భేదాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.
   అలంకారాల్లో ప్రసిద్ధమైంది, ప్రాచీన మైంది ఉపమాలంకారం. దీన్ని ప్రయోగించని కవులు లేరు. కాళిదాసు లాంటి సంస్కృత కవులు విరివిగా ఉపయోగించారు. అందుకే 'ఉపమా కాళిదాసస్య' అనే నానుడి ప్రసిద్ధమైంది.
   లక్ష్యం:
   ఓ కృష్ణా! నీ కీర్తి హంసవలె ఆకాశ
   గంగయందు మునుగుచున్నది
   ఉపమేయం = కీర్తి, ఉపమానం = హంస,
   'ఆకాశగంగయందు మునుగుట' ఉపమేయ ఉపమానాలు రెండింటిలో ఉన్నందువల్ల ఇది సమాన ధర్మం. ఉపమావాచకంలా ఇందులో నాలుగు అంశాలున్నందువల్ల ఇది 'పూర్ణోపమ అలంకారం'.
2. **ఉత్ప్రేక్షాలంకారం:** జాతి, గుణ, ధర్మ సామ్యం వల్ల ఉపమేయాన్ని ఉపమానంగా ఊహిస్తే అది ఉత్ప్రేక్షాలంకారం. ఇందులో ఉపమేయ ఉపమానాలతోపాటు ఉత్ప్రేక్షా వాచకం ఉంటుంది. తలంచెదన్, ఎంచెదన్, భావించెదన్, ఊహించెదన్, అనన్ మొదలైనవి ఉత్ప్రేక్షా వాచకాలు.
   లక్ష్యం: ''ఈ చీకటిని చక్రవాక విరహాగ్ని నుండి పుట్టిన ధూమమో అని తలంతును''
   ఇందులో చీకటి ఉపమేయం, ధూమం ఉపమానం. ధూమం నల్లనిది, దృష్టిని ఆపుచేసేది. ఈ గుణసామ్యం వల్ల ఉపమేయమైన చీకటిని ఉపమానమైన ధూమంగా ఊహించారు. కాబట్టి ఇది ఉత్ప్రేక్షాలంకారం.
   రూపకాలంకారం: ఉపమేయంలో ఉపమాన ధర్మాన్ని ఆరోపించడం లేదా ఉపమేయ ఉపమానాలకు భేదం లేనట్లుగా వర్ణించడం రూపకాలంకారం. ఇందులో రూపక సమాసం కూడా ఉంటుంది.
   లక్ష్యం: రాజుపై **లతాలలనలు కుసుమాక్షతలు** చల్లిరి. ఇందులో ఉపమేయమైన లతల్లో ఉపమానమైన లలనల ధర్మం ఆరోపించారు. ఉపమేయమైన కుసుమాల్లో ఉపమానమైన అక్షతల ధర్మాన్ని ఆరోపించారు.కాబట్టి ఇది రూపకాలంకారం.
4. **అనన్వయాలంకారం:** ఒక వస్తువు సాటి లేనిది అని చెప్పడానికి అదే వస్తువుతో పోల్చడాన్ని అనన్వయాలంకారం అంటారు. ఇందులో ఉపమేయమే ఉపమానంగా ఉంటుంది.
   లక్ష్యం:
   'మేరునగానికి సాటి మేరునగమే
   సముద్రానికి సాటి సముద్రమే'
   ఇందులో ఉపమేయమైన మేరునగమే ఉపమానంగా ఉంది. ఉపమేయమైన సముద్రమే ఉపమానంగా ఉంది. అందువల్ల ఇది అనన్వయాలంకారం.
5. **స్వభావోక్తి:** జాతి, గుణక్రియాదులను సహజసిద్ధంగా, మనోహరంగా వర్ణించడాన్ని స్వభావోక్తి అలంకారం అంటారు.
   లక్ష్యం: ''ఉద్యానవనంలో జింకలు చెవులు రిక్కించి చంచల నేత్రాలతో సరోవరంలో నీళ్లు త్రాగుచున్నవి'' ఇందులో జింకల స్థితిని మనోహరంగా, సహజసిద్ధంగా వర్ణించారు. అందువల్ల ఇది స్వభావోక్తి.
6. **అర్థాంతరన్యాసాలంకారం:**
   విశేషాన్ని సామాన్యంతో లేదా సామాన్యాన్ని విశేషంతో సమర్థించి వర్ణిస్తే.. అది అర్థాంతరన్యాసాలంకారం.
   లక్ష్యం: 1
   ''ఆంజనేయుడు సముద్రాన్ని దాటాడు మహాత్ములకు అసాధ్యమైంది లేదు కదా!''
   ఆంజనేయుడు సముద్రాన్ని దాటడం విశేష విషయం. మహాత్ములకు సాధ్యం కానిది లేదు అనే సామాన్య విషయంతో సమర్థించినందువల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.
   లక్ష్యం: 2
   పూలతో కూడిన నారకు వాసన కలిగినట్లు సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి.
   పూలతో కూడిన నారకు వాసన కలగడం సామాన్య విషయం. సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి అనే విశేష విషయంతో దీన్ని సమర్థించడం వల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.
7. **అతిశయోక్తి అలంకారం:** లోకస్థితిని మించి అతిశయించి వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం.
   లక్ష్యం: ఆ పట్టణమందలి సౌధాలు చంద్ర మండలాన్ని తాకుచున్నవి. సహజస్థితిని మించి వర్ణించడం వల్ల ఇది అతిశయోక్తి.
8. **శ్లేషాలంకారం:** అనేక అర్థాలకు ఆశ్రయ మైంది శ్లేషాలంకారం. చమత్కారమైన పదా ల విరుపులతో అనేక అర్థాల వల్ల అహ్లాదం కలిగించేది శ్లేష.
   లక్ష్యం: 'రాజు కువల యానందకరుడు'
   ఇందులో రాజు శబ్దానికి పాలకుడు, చంద్రుడు అని; 'కువలయం' పదానికి భూమి, కలువ అనే అర్థాలున్నాయి. రాజు భూ ప్రజలకు సుపరిపాలనతో ఆనందం కలిగించేవాడని ఒక అర్థం. చంద్రుడు కలువలను వికసింపజేసి ఆనందం కలిగించే వాడని మరో అర్థం ఉన్నందువల్ల ఇది శ్లేషాలంకారం.
9. **సమాసోక్తి అలంకారం:** ప్రస్తుత వర్ణన వల్ల అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది సమాసోక్తి అలంకారం.
   లక్ష్యం: చంద్రుడు రక్తుడై ఐంద్రీముఖమును ముద్దిడుచున్నాడు. ప్రస్తుత వర్ణన వల్ల పరకాంతా చుంబనాభిలాషియైన కాముకుడు స్ఫురిస్తున్నందువల్ల ఇది సమాసోక్తి అలంకారం.
10. **దీపకాలంకారం:** ఉపమేయ ఉపమా నాలకు (ప్రకృత, అప్రకృతాలకు) సాధారణ ధర్మంతో ఒకే అన్వయాన్ని కలిగిస్తే అది దీపకాలంకారం.
   లక్ష్యం: ''బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం, పండిత వాక్యం వ్యర్థం కాబోవు''
   పండిత వాక్యం వ్యర్థం కాదు అనే ఉపమేయంతో బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం లాంటి ఉపమే యాలను అన్వయించి చెప్పారు. అందువల్ల ఇది దీపకాలంకారం.

డీఎస్సీ -2012లో అడిగిన ప్రశ్నలు

1. విశేషాంశం-సామాన్యం అనే రెండింటితో ప్రవర్తించే అలంకారం?
   1) రూపకం 2) వ్యాజస్తుతి
   3) ఉత్ప్రేక్ష 4) అర్థాంతరన్యాసం
2. 'రాజ బింబాస్య రుక్మిణి తేజరిల్లె సానబట్టిన మకరాంకు శస్త్రమనగ'లోని అలంకారం?
   1) ఉపమ 2) ఉత్ప్రేక్ష
   3) రూపకం 4) అర్థాంతరన్యాసం
3. 'కనుల కొలనులో దాగిన నీ రూపం' అనేది?
   1) యమకాలంకారం 2) అతిశయోక్తి
   3) రూపకాలంకారం 4) ఉత్ప్రేక్ష

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3.

మాదిరి ప్రశ్నలు

1. 'రక్షాదక్ష! విపక్ష శిక్షా' ఏ అలంకారం?
   1) ఛేకానుప్రాసం 2) వృత్త్యనుప్రాసం
   3) లాటానుప్రాసం 4) యమకం
2. 'మన సుభద్ర మనసుభద్రమయ్యె' ఇందులోని అలంకారం?
   1) ముక్తపదగ్రస్తం 2) లాటానుప్రాసం
   3) యమకం 4) అంత్యానుప్రాసం
3. 'శేషశాయికి మ్రొక్కు శిరముశిరము'లోని అలంకారం?
   1) లాటానుప్రాసం 2) యమకం
   3) ఛేకానుప్రాసం 4) వృత్త్యనుప్రాసం
4. 'కమనీయ శుభగాత్రు - కంజాత దళనేత్రు వసుధాకళత్రు - పావన చరిత్రు' లోని అలంకారం?
   1) వృత్త్యనుప్రాసం 2) లాటానుప్రాసం
   3) అంత్యానుప్రాసం 4) యమకం
5. యమకాలంకార లక్షణం?
   1) అచ్చులు మారతాయి, హల్లులు మారవు
   2) అచ్చులు మారవు, హల్లులు మారవు
   3) అచ్చులు మారకూడదు, హల్లులు మారతాయి
   4) అచ్చులు మారవచ్చు, హల్లులు మారవచ్చు
6. ఉభయాలంకారాలను మొదటగా పేర్కొన్న లాక్షణికుడు?
   1) మమ్మటుడు 2) విశ్వనాథుడు
   3) భోజుడు 4) విద్యానాథుడు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 3; 5) 2; 6) 3.

వైషమ్యాలు వదిలి.. సామరస్యం సాధించారు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

తెలంగాణలో శైవమతం

కాలాముఖ శాఖ

తెలంగాణలో మొదట 'కాలాముఖ' శైవం వ్యాప్తిలో ఉంది. వీరు శ్రీశైలాన్ని ప్రధాన కేంద్రంగా చేసుకున్నారు. కల్యాణి చాళుక్యరాజైన సోమేశ్వరుడు, కాకతీయులు ఈ మతశాఖను ఆదరించారు. ఆ తర్వాత వేములవాడ (కరీంనగర్ జిల్లా), అలంపూర్(మహబూబ్‌నగర్ జిల్లా) ప్రాంతాల్లో కాలాముఖ శైవం విస్తరించింది. ఇక్కడ వీరి మఠాలున్నాయి. వీరి క్షేత్రాల్లో 'సింహపరిషత్', 'శక్తి పరిషత్'లను ఏర్పాటు చేసి విద్య నేర్పించేవారు. వీటిని వీరశైవుల అనుభవ మండపాలు, గోళకీ మఠస్థుల విద్యా మండపాలతో పోల్చవచ్చు. వీరు మఠాలతో పాటు సత్రాలను కూడా నెలకొల్పి చదువులు చెప్పారు. అన్నదానం చేశారు. వీరి పాండిత్యం, తపఃసిద్ధి కాకతీయులను ఆకర్షించింది. వీరు కాకతీయ రాజులకు గురువులుగా శైవదీక్షలను ఇచ్చారు. శ్రీశైలంలోని మల్లికార్జున మఠాధిపతి రామేశ్వర పండితులు.. బేతరాజు దుగ్గరాజు, రెండో ప్రోలరాజుకు శివదీక్ష ఇచ్చారు. కాలాముఖాచార్యులు కూడా అనేక మందికి శివదీక్ష ఇచ్చారు. కాకతీయులు మొదట జైన మతాన్ని అనుసరించారని ప్రతీతి. ఆ తర్వాత కాలాముఖ శైవమతాన్ని ఆదరించారు.

ప్రతి కాలాముఖ మఠం ఒక గొప్ప విద్యాకేంద్రంగా వర్ధిల్లింది. ఇందులో తర్కం, వ్యాకరణం, జ్యోతిషం, మీమాంస శాస్త్రాలను బోధించేవారు. అలంపూర్‌లో 'బ్రహ్మపురి' అనే ఘటిక (వైదిక పాఠశాల) ఉన్నట్లు అక్కడ వేయించిన శాసనం ద్వారా తెలుస్తోంది. ఇది కాలాముఖ శాఖకు చెందిన ఘటికగా నిర్ధారించారు. ఈ శాసనంలో 'ఘటిక అధిపతి' అనే అర్థంతో 'గదాశశి' పదాన్ని ఉపయోగించారు. 1119 కాలం నాటి పేరూర్ శాసనంలో ప్రజలందరూ సమావేశమై చదువుకునే వారని, ప్రతి పిల్లవాడికి హెర్జుంక (నాణెం) చొప్పున దానం చేయాలని, ఆ ధనాన్ని కుప్పన భట్టోపాధ్యాయునికి చెల్లించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు.



ఘటికలో 14 రకాల విద్యలు నేర్పేవారు. వీటిలో వేద వేదాంగాలు, ధర్మసూత్రాలు, న్యాయ, వైశేషికాలు, పురాణాలు ముఖ్యమైనవి. ఈ కాలానికి చెందిన పండితులందరూ చతుర్థ కులస్థులు (శూద్రులు)గా తెలుస్తోంది. కల్యాణి చాళుక్య రాజైన మూడో సోమేశ్వరుడు, కాకతీరుద్రుడు రాజనీతి గ్రంథాలు రాశారు. బద్వేల్ ప్రాంతానికి చెందిన కాకతీయ సామంతుడు బద్దెన కూడా రాజనీతి గ్రంథం, సుమతీ శతకం రాశాడు. గోనబుద్ధారెడ్డి, భాస్కరుడు, నన్నెచోడుడు మొదలైన వారందరూ చతుర్థ కులస్థులేనని తెలుస్తోంది. భీమయ పాండ్య 'మార్గదేశి' కవితలు రాశాడు. కాలాముఖులు తెలంగాణా ప్రాంతంలో అనేక చోట్ల 'బ్రహ్మపురి' పేరుతో ఘటికలు నడిపినట్లుగా ఆధారాలున్నాయి.

కర్ణాటకలో కల్యాణి చాళుక్యుల పతనం తర్వాత కాలాముఖ శైవం ప్రాభవం కోల్పోయింది. దీని స్థానంలో బసవేశ్వరుడు వీరశైవాన్ని అభివృద్ధి చేశాడు. తెలంగాణలో కాకతీయులు బలపడిన తర్వాత గణపతి దేవుడి కాలం నుంచి 'గోళకీ మఠం' ప్రాచుర్యంలోకి వచ్చింది. 13వ శతాబ్దంలో కాలాముఖ మతం క్షీణించింది.

పాశుపత శైవం

గణపతి దేవుడి కాలంలో పాశుపతం ప్రాచుర్యంలోకి వచ్చింది. దాహాల దేశానికి చెందిన గోళకీ మఠ శైవాచార్యులు కాకతీయుల కాలంలో పాశుపత శైవం (శైవ మతంలోని ప్రాచీన శాఖ) వ్యాప్తికి పాటుపడ్డారు. ఈ మఠాధిపతి 'విశ్వేశ్వర శంభు' మొదట గణపతి దేవుడికి శివదీక్ష ఇచ్చారు. ఆ తర్వాత రుద్రమదేవి, రెండో ప్రతాపరుద్రుడు కూడా ఈయన ద్వారా శివదీక్ష తీసుకున్నారు. కాకతీయుల ఆదరణతో విశ్వేశ్వరుడు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో గోళకీ మఠాలు స్థాపించాడు. అనేక శివాలయాలు నిర్మించాడు. వీటికి అనుబంధంగా విద్యాలయాలు, సత్రాలను ఏర్పాటు చేసి పాశుపత మతాన్ని ప్రచారం చేశాడు. ఏలేశ్వరం (నల్గొండ), వేములవాడ (కరీంనగర్), కాళేశ్వరం (కరీంనగర్), శ్రీశైలం (కర్నూలు), భట్టిప్రోలు (గుంటూరు) తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు.

రుద్రమదేవి వేయించిన 'మల్కాపురం' శాసనంలో గోళకీ మఠాల చరిత్ర, ఏడు తరాల పీఠాధిపతుల గురించి పేర్కొన్నారు.

గోళకీ మఠ చరిత్ర: 'మల్కాపురం' శాసనం ప్రకారం గోళకీ మఠాధిపతులు భగీరథి, నర్మదా నదుల మధ్య ఉన్న దాహాల దేశానికి చెందినవారు. ఈ వంశానికి చెందిన సద్భావన శంభు 'శైవ సిద్ధాంతాన్ని' ప్రతిపాదించి గోళకీ మఠాన్ని స్థాపించాడు. ఇతడికి కాలాచూరి యువరాజు 'దేవుడు' మూడు లక్షల గ్రామాలున్న ఒక రాష్ట్రాన్ని బహూకరించాడు. సద్భావన శంభు గోళకీ వంశస్థుడనీ, భిక్షు మఠ సంతతికి చెందినవాడని శాసనాల ద్వారా తెలుస్తోంది. అందువల్ల ఈ మఠానికి 'గోళకీ మఠం'గా పేరు వచ్చింది. సోమ శంభు, నామ శంభు, ధర్మ శంభు అనేవారు గురువులుగా మారారు. ధర్మ శంభు కుమారుడే విశ్వేశ్వరశంభు. ఇతడు గొప్ప వేద పండితుడు. ఈ గురువులందరూ లక్ష గ్రామాలను భిక్షగా పొందిన గురువుల వారసులుగా ప్రసిద్ధి చెందారు. వీరు కాకతీయులతో పాటు చేది (ఒడిశా), మాళ్వా (మధ్యప్రదేశ్), చోళ (తమిళనాడు) వంశ రాజులకు కూడా రాజగురువులుగా ఉన్నట్లు ఆధారాలున్నాయి.

గణపతి దేవుడి కుమార్తె రుద్రమదేవి 1261 మార్చి 25న విశ్వేశ్వర శంభుకు గుంటూరు జిల్లాలోని మందడంతో పాటు కృష్ణలంకను దానం చేసి మల్కాపురం శాసనం వేయించారు. అక్కడ విశ్వేశ్వర శంభు శుద్ధ శైవ మఠం స్థాపించి శివాలయాన్ని నిర్మించాడు. దీనికి అనుబంధంగా వేదశాస్త్ర ఆగమ విద్యాలయం, సత్రం, ప్రసూతి వైద్యశాల (దేశంలోనే తొలి ప్రసూతి వైద్యకేంద్రం)ను ఏర్పాటు చేశాడు. ఇతడు గొప్ప ప్రజ్ఞాశాలి అని, పాశుపత శాఖకు చెందినవాడని 'త్రిపురాంతక శాసనం'లో పేర్కొన్నారు. ఈ మఠానికి చెందిన శైవాచార్యులు గొప్ప పండితులనీ, పవిత్ర జీవితం గడిపేవారనీ ఈ శాసనం ద్వారా తెలుస్తోంది.

గోళకీ మఠ శాఖలు: కాళేశ్వరం, త్రిపురాంతకం, శ్రీశైలం, వేములవాడ, ఏలేశ్వరం మొదలైన ప్రదేశాల్లో గోళకీ మఠ శాఖలు ఉండేవి. వీటి పోషణకు కాకతీయులు 'పాన్న' గ్రామాన్ని దానం చేశారు. గణపతి దేవుడు విశ్వేశ్వర శంభుకు గురుదక్షిణగా 'తాంద్రకోట' గ్రామాన్ని ఇచ్చాడు. కాకతీయుల పతనానంతరం తెలంగాణ తురుష్కుల వశమైంది. దీంతో గోళకీ మఠాలు పోషణకర్తలు లేక అంతరించి పోయాయి.

ఆరాధ్యశైవం

పాశుపతంతోపాటు కాకతీయుల కాలంలో తెలంగాణలో ఆరాధ్యశైవం కూడా ప్రాచుర్యంలో ఉంది. ఈ మతం అతి ప్రాచీన కాలం నుంచే ప్రచారంలో ఉన్నట్లు ఆరాధ్య శైవుల నమ్మకం. ఈ మత స్థాపకులుగా ద్వాదశాచార్యులను పేర్కొంటారు.

ద్వాదశాచార్యులు:

సిద్ధత్రయం: మరళ, ఏకోరామ, రేవణను 'సిద్ధ త్రయం' అని పిలుస్తారు.

ఆరాధ్యత్రయం: ఉద్ధటారాధ్య, వేమారాధ్య, విశ్వ ఆరాధ్య అనే ముగ్గుర్ని 'ఆరాధ్య త్రయం'గా పేర్కొంటారు.

ఆచార్యత్రయం: నీలకంఠ, హరదత్త, భాస్కరాచార్యను 'ఆచార్యత్రయం' అంటారు.

పండితత్రయం: శ్రీపతి పండితుడు, మల్లికార్జున పండితుడు, మంచెన పండితుడు 'పండిత త్రయం'గా ప్రసిద్ధి.

పైన పేర్కొన్న 12 మంది 'ద్వాదశ ఆచార్యులు' అని, ఆరాధ్య శైవాన్ని వీరే అభివృద్ధి చేశారని ఆరాధ్యశైవుల నమ్మకం.

వీరశైవం

వీరశైవాన్ని కన్నడ దేశంలో బసవేశ్వరుడు స్థాపించాడు. గణపతి దేవుడు వీరశైవులను అదుపులో పెట్టాడు. ప్రతాపరుద్రుడి కాలంలో ఇది కొద్దిగా ప్రాచుర్యం పొందింది. దీనికి కారణం ప్రతాపరుద్రుడి మంత్రి ఇందులూరి అన్నయ. ఇతడు వరంగల్‌లోని పాలకుర్తి గ్రామానికి చెందిన వాడిగా తెలుస్తోంది.

వీరశైవులు అవైదికులు. అంటే కర్మకాండలు, వర్ణ వ్యవస్థ, ఉపనయనం, బ్రాహ్మణ ఆధిక్యత లాంటివాటిని అంగీకరించరు. కానీ పండితారాధ్యుడు భక్తితోపాటు బ్రాహ్మణాన్ని అంగీకరించాడు. ఇతడు 'భక్తి మీద వలపు, బ్రాహ్మణ్యంబుతో పొత్తు వదలలేను బసవలింగా' అని చెప్పుకున్నాడు. పండితారాధ్యుడు శైవ మతాన్ని వీరశైవానికి భిన్నంగా తీర్చిదిద్దాడు. కాబట్టి దీన్ని 'స్మార్త శైవం'గా పేర్కొంటారు. బసవేశ్వరుని వీరశైవ మతాన్ని జంగాలు, సాలె, వీరబలిజ కులస్థులు ఆదరించారు.

స్మార్తశైవం

రామానుజాచార్యులు, బ్రహ్మనాయుడు వల్ల తెలంగాణలో వైష్ణవ మతం అభివృద్ధి చెందిన తర్వాత శైవ, వైష్ణవుల మధ్య సంఘర్షణ ఏర్పడింది. కానీ తిక్కన సోమయాజీ హరిహరనాథుని ఆరాధనను ప్రచారం చేసి మతసామరస్యానికి పాటుపడటం వల్ల వీరి మధ్య వైషమ్యాలు తగ్గి అద్వైత సిద్ధాంతం, స్మార్త విధానం ప్రాచుర్యంలోకి వచ్చాయి.

కాలక్రమంలో బసవేశ్వరుడి వీరశైవం, బ్రహ్మనాయుడి వీరవైష్ణం, పండితారాధ్యుడి వీరశైవ (స్మార్త) ఉద్యమం.. మూడూ పూర్తిగా అంతరించాయి. ఈ ఉద్యమాల పర్యవసానాన్ని గ్రహించిన గణపతి దేవుడు వీరశైవులనుగానీ, వీర వైష్ణవులనుగానీ ప్రత్యేకంగా ఆదరించలేదు. దీంతో తెలంగాణలో మతసామరస్యం నెలకొంది. ప్రజలు అన్ని మతాలను ఆదరిస్తూ, అన్ని క్షేత్రాలను దర్శించారు. అలంపురం, కొల్లాపురం, వేములవాడ, కొలనుపాక, హన్మకొండ గొప్ప పుణ్యక్షేత్రాలుగా వర్ధిల్లాయి. ఈ క్షేత్రాలను లక్షలాది భక్తులు దర్శించేవారు.

జైనమత పతనం..

తెలంగాణలో జైనమతం పతనం కావడానికి అనేక కారణాలున్నాయి. శైవులతో వీరికి వైషమ్యాలు పెరిగాయి. 'కాలముఖులు' కాళేశ్వరాన్ని కేంద్రంగా చేసుకున్నారు. శైవులు జైనులతో వాదన చేసి వారిని ఓడించారు. తమ మహిమలతో శైవులు సామాన్య ప్రజలను ఆకర్షించారు. వీరశైవ స్థాపకుడైన బసవేశ్వరుడు జైనమతాన్ని బాగా దెబ్బతీశాడు. జైన, శైవ సంఘర్షణల వల్ల జైనులు పతనమయ్యారు. ఈ సంఘర్షణ ఎక్కువగా కాకతీయుల కాలంలోనే జరిగింది. దేవదాసయ్య అనే శైవ నాయకుడు తన మహిమలతో పొట్ల చెరువు (పటాన్ చెరువు)లో 500 జైన కేంద్రాలను నాశనం చేసినట్లుగా కథనం ప్రచారంలో ఉంది. కాకతీయ రాజైన 'గణపతిదేవుడు' అనేక జైనపండితులను శిక్షించి వారి గ్రామాలను తగులబెట్టినట్లు గద్వాలలోని పూడూరు శాసనంలో పేర్కొన్నారు.

జైన శిల్పకళ: జైనమతం వాస్తుకళాభివృద్ధిలో ప్రముఖపాత్ర పోషించింది. వాస్తు, శిల్ప కళలకు సంబంధించి జైనమతం తెలంగాణ ప్రజలకు అమోఘమైన సేవలందించింది.

జైనమత ప్రాధాన్యం: ఇటీవల భారత ప్రభుత్వం జైనమతానికి మైనార్టీ హోదా కల్పించింది. ప్రస్తుతం దేశంలో మైనార్టీ గుర్తింపు పొందిన మతాలు ఆరు ఉన్నాయి. అవి.. ఇస్లాం, క్రైస్తవం, పార్శీ, సిక్కు, బౌద్ధం, జైనం. జైనమతం రాకతో సామాన్యులందరికీ విద్యావకాశాలు లభించాయి. వీరి ఆరాధ్య విద్యాదేవతనే హిందువులు సరస్వతీదేవిగా పూజిస్తున్నారు. అంటే విద్యాదేవతను గుర్తించింది మొదట జైనులేనని గమనించవచ్చు. ప్రతి సమావేశంలో దీపారాధన లేదా జ్యోతి ప్రజ్వలన చేయడం వీరి ఆచారం. ఇప్పటికీ భారతీయ సమాజంలో ఈ విధానం సజీవంగానే ఉంది. ప్రస్తుతం దీన్ని అనేక దేశాల్లో చూడవచ్చు.

జైనులు విదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహించడం ద్వారా వైశ్యులను తమవైపు తిప్పుకున్నారు. జంతు బలులు, జీవహింసను నిషేధించారు. శూద్రులకు యజ్ఞయాగాదులు నిష్ప్రయోజనం అని చెప్పారు. బ్రాహ్మణులకు వ్యతిరేకులయ్యారు.

మాదిరి ప్రశ్నలు

1. కింద పేర్కొన్నవారిలో 'ఆరాధ్యత్రయం' లోని వారెవరు?
   1. ఉద్దట 2. వేమా
   3. విశ్వ 4. హరదత్త
   ఎ) 1, 2, 3 బి) 1, 3, 4
   సి) 2, 3, 4 డి) 3, 4
2. హరిహరనాథుని ఆరాధనను ప్రచారం చేసి మతసామరస్యానికి పాటుపడ్డవారెవరు?
   ఎ) తిక్కన సోమయాజి
   బి) బసవేశ్వరుడు సి) బ్రహ్మనాయుడు
   డి) పాల్కురికి సోమనాథుడు
3. కిందివాటిలో సరైన జత ఏది?
   1. లకులీస - శైవమత స్థాపకుడు
   2. కొండిన్య - పాంచరాత్ర స్థాపకుడు
   3. బ్రహ్మనాయుడు - వీరవైష్ణవ స్థాపకుడు
   ఎ) 1 మాత్రమే బి) 1, 2
   సి) 1, 3 డి) 1, 2, 3
4. గణపతి దేవుడికి శైవమతం ఇప్పించిన గురువు?
   ఎ) గంగభట్టు బి) విశ్వేశ్వర శంభు
   సి) మల్లికార్జునుడు
   డి) పైన పేర్కొన్న వారందరూ

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) డి; 4) బి.

A minor is admitted to the partnership firm as?

Model Questions

1. The payment of a lost demand draft is made to the ______?
   a) Purchaser b) Payee
   c) Nominee d) Any of the above
   e) None of these
2. In the case of granting loan against a life insurance policy, the banker should see ______?
   a) The existence of insurable interest
   b) The surrender value
   c) The admission of age
   d) All of the above
   e) None of the above
3. When a debtor owes several debts to a banker and makes a payment, the right to appropriation lies with ______?
   a) The banker b) The debtor
   c) The court
   d) All of the above
   e) None of the above
4. In terms of Section 31 of the Reserve Bank of India Act, 1934 a demand draft payable to bearer may be issued only by ______?
   a) Nationalized Banks
   b) Scheduled Commercial Banks
   c) Reserve Bank of India
   d) Foreign Banks
   e) None of the Above
5. Unsigned demand draft is presented for payment, the drawee branch will ______?
   a) Honour it
   b) Dishonour it since it does not have a mandate of the drawer bank to pay it.
   c) Honour it after seeking confirmation from the collecting bank
   d) Honour it if it is for small amount
   e) None of the above
6. When was SBI established?
   a) 1st April 1935
   b) 31st July 1969
   c) 5th May 1955
   d) 1st July 1955
   e) None of the above
7. The maximum number of partners in a non-banking partnership firm is ______?
   a) 20 b) 10 c) 25 d) 11
   e) None of the above
8. Which of the following agencies /organizations has recently decided that all the Stock Exchanges would introduce physical settlement of Equity Derivatives?
   a) Reserve Bank of India
   b) Bombay Stock Exchange
   c) Registrar of Companies
   d) Securities & Exchange Board of India
   e) All of the above
9. How much bad loans was accumulated with the public sector banks as on 31st March 2015 as disclosed by the Finance Ministry on 21st July 2015?
   a) Rs. 2.76 lakh crore
   b) Rs. 2.54 lakh crore
   c) Rs. 2.67 lakh crore
   d) Rs. 2.27 lakh crore
   e) None of the above
10. In Mutual Funds, NAV is the price of ______?
    a) Entire fund value
    b) One unit of a fund
    c) Surrender value
    d) Average value of shares
    e) Dividends paid in a year
11. Presently which Indian Bank has the largest number of foreign branches?
    a) SBI
    b) Canara Bank
    c) Bank of Baroda
    d) Bank of India
    e) None of the above
12. Cash deposit ratio means____ ?
    a) The percentage of cash-in-hand-balance with the Central Bank to the aggregate deposits
    b) The percentage of total deposits received by Banks
    c) The percentage of total cash money received as deposits by banks
    d) All the above
    e) None of the above



13. Central Government has appointed Sriram Kalyanaraman as the Managing Director (MD) and Chief Executive Officer (CEO) of which of the following organisations:
    a) NABARD
    b) National Housing Bank (NHB)
    c) I.F.C d) IDRBT e) B.I.R.D
14. In case of a usance bill a grace period of........ Will be allowed to calculate due date of payment.
    a) 3 days b) 2 days
    c) 1 day d) 4 days
    e) None of the above
15. In the case of FCNR accounts the payment of interest is effected in ____?
    a) Indian Rupee
    b) Only in Pound (£)
    c) Same currency in which deposit stands
    d) Yen e) None
16. Working capital requirement depends upon ______?
    a) Level of activity
    b) Types of business carried
    c) Nature of Production cycle
    d) All the above
    e) None
17. In which of the Acts, specimen of the cheque, bill, promissory note is given?
    a) Negotiable Instruments Act
    b) Banking Regulation Act
    c) Mercantile Law
    d) All of the above e) None

BANK EXAMS
BANKING AWARENESS

18. RBI permitted CBS-enabled Co-operative Banks to issue ATM cards in tie-up with:
    a) State Bank of India
    b) Any Nationalised Bank
    c) a sponsor bank.
    d) NABARD e) b &c
19. Who headed the RBI panel that has submitted its report titled 'Data Format for Furnishing of Credit Information to Credit Information Companies'.
    a) Urjit Patel b) A.K.Sharma
    c) Aditya Puri d) R.Gandhi
    e) None of these
20. India's first post office savings bank ATM facility has been recently inaugurated in which of the following places?
    a) Chennai b) Bengaluru
    c) Mumbai d) Delhi
    e) None of these
21. The main function of an Asset Management Company is to:
    a) hold the securities of various schemes
    b) manage the funds by making investments in various types of securities
    c) hold its property for the benefit of the unit holders
    d) act on behalf of SEBI
    e) All the above
22. Which country on 30 June 2015 became the first-ever developed economy to default on a loan with the International Monetary Fund (IMF)?
    a) Afganisthan b) Australia
    c) Bangaladesh d) Greece
    e) Canada
23. The minimum period under which a term deposit under Reinvestment Plan can be issued is____?
    a) 24 months b) 12 months
    c) 6 months d) 9 months
    e) None
24. A minor is admitted to the partnership firm as ______?
    a) Agent b) Partner
    c) Minor d) Beneficiary
    e) None
25. Which bank on 4th July 2015 became the first in the country to launch the MUDRA Card, under the Pradhan Mantri MUDRA Yojana (PMMY) scheme?
    a) Andhra Bank
    b) Bank of Baroda
    c) Central Bank
    d) Corporation Bank
    e) Union Bank of India
26. Who was named as the first Chairman of the to be opened Bandhan Bank, which announced its Board of Directors on 9th July 2015?
    a) Ashok K. Lahiri
    b) Subir Gokaran
    c) S.S.Mundra
    d) Pratik Choudhary
    e) T.S.Vijayan
27. What is the limitation of the number of persons in a joint savings bank account?
    a) Two b) Four c) Five
    d) Twenty e) No limit
28. After acceptance of a bill, the primary liability on a Bill of Exchange is that of ______?
    a) Payee b) Acceptor
    c) Drawee d) Endorsee
    e) All of the above
29. The full form of SREP used in Basel framework is :
    a) Standard Review and Evaluation Process
    b) Supervisory Review and evaluation Process
    c) Standardised Revision and Evaluation Practice
    d) Supervisory Review and Electronic Process e) None
30. In order to enable private sector banks to attract and retain professional directors, the Reserve Bank has issued guidelines on compensation for non-executive Directors for implementation by private sector banks, that will reflect market realities and will be within the parameters specified in the:
    a) Banking Regulation Act, 1949
    b) The Indian Companies Act, 2013 (Amended)
    c) RBI Act 1934
    d) As per the directives of Indian Banks Association
    e) Both a&b
31. An executor of deceased account is appointed under ______?
    a) Trust b) Court c) Will
    d) Family tradition
    e) None of the above
32. Relationship between the RBI and the bank maintaining currency chest will be of ______?
    a) Trustee and beneficiary
    b) Principal and agent
    c) Licensor and licensee
    d) Creditor and debtor
    e) None of the above
33. The Reserve Bank has advised all public sector banks and select private sector and foreign banks to appoint an internal Ombudsman. The internal Ombudsman would be designated as ______:
    a) Chief Ombudsman Service Officer
    b) Chief Customer Ombudsman Officer
    c) Internal Ombudsman Customer Service Officer
    d) Chief Customer Service Officer
    e) Chief Transaction Audit Officer

Answers

1) a; 2) d; 3) b; 4) c; 5) b; 6) d; 7) a; 8) d; 9) c; 10) b; 11) a; 12) a; 13) b; 14) a; 15) c; 16) d; 17) e; 18) c; 19) c; 20) a; 21) b; 22) d; 23) c; 24) d; 25) d; 26) a; 27) e; 28) b; 29) b; 30) e; 31) c; 32) b; 33) d.